ఈనాడు

విజయవాడ 13-2-2026 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 184
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పరిశ్రమలు రావడం వైకాపాకు ఇష్టం లేదు

విశ్వసనీయత ఉన్న ఐదు కంపెనీలకు 99 పైసలకు భూములు ఇచ్చాం

మండలిలో మంత్రి లోకేశ్

6లో

గవర్నర్ ప్రసంగం వేళ కాగితాలు వెదజల్లిన వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఆర్థిక సవాళ్ల మధ్యే సంక్షేమానికి పెద్ద పీట!

శాసనసభలో రేపు 2026-27 రాష్ట్ర బడ్జెట్

2లో

మద్యంలో రూ. 3,200 కోట్లు.. చిన్న అవినీతి కాదు

- బ్యూరోక్రాట్లు, ఉన్నత హోదాల్లో ఉండేవారు, తుది నిర్ణయాలు తీసుకునేవారు కుమ్మక్కు
- అవన్నీ లేకుండా ఇంతటి అక్రమం సాధ్యం కాదు



- ఈ కేసుతో సంబంధమున్న బ్యూరోక్రాట్లను అరెస్టు చేయక పోవడం దురదృష్టకరం
- మద్యం కుంభకోణంలో రాజ్ కెసిరెడ్డికి బెయిల్ నిరాకరిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు

ఈనాడు – దిల్లీ

"బ్యూరోక్రాట్లు, రాజకీయ పలుకుబడితో ఉన్నత హోదాలు అనుభవించేవారు, తుది నిర్ణయాలు తీసుకునేవారు.. వీరందరి మధ్య నేరపూరిత కుట్ర, క్రియాశీలక సహకారం, కుమ్మక్కు లేకుండా రూ.3,200 కోట్ల భారీ అవినీతి సాధ్యం కాదు. ఇదేమీ చిన్నది కాదు. ఈ కేసులో కొందరు నిందితులు బెయిల్ మీద విడుదలైనంత మాత్రాన మిమ్మల్ని విడుదల చేయాలనేమీ లేదు. అందువల్ల బెయిల్ ఇవ్వడం కుదరదు. మీరు మరి కొంత కాలం వేచి చూడండి" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్.. మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు (ఎ-1) రాజ్ కెసిరెడ్డికి స్పష్టం చేశారు. బెయిల్ కోసం అతను దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. గత సోమవారమే ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం బెయిల్ ఇవ్వడానికి నిరాకరించినా వాదనలు వినిపించడానికి కొంత సమయం ఇవ్వాలని రాజ్ కెసిరెడ్డి న్యాయవాది చేసిన విజ్ఞప్తి మేరకు గురువారం మరోసారి దాన్ని తీసుకొంది.



రాజ్ కెసిరెడ్డి

298 రోజులుగా జైల్లోనే..

ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ "ఈ కేసులో పిటిషనర్ రాజ్ కెసిరెడ్డి 298 రోజులుగా జైల్లో ఉన్నారు. ఇప్పటికే పదిమందికి బెయిల్ ఇచ్చారు. దర్యాప్తు సంస్థ ఇప్పటికే ప్రధాన, 3 అనుబంధ ఛార్జిషీట్లు దాఖలు చేసింది. తదుపరి దర్యాప్తు అక్కర్లేదని రాష్ట్రప్రభుత్వం కౌంటర్‌లో పేర్కొంది. ఈ కేసులో మిగతా నిందితులకు బెయిల్ ఇస్తూ హైకోర్టు చెప్పిన కారణాలు పిటిషనర్‌కూ వర్తిస్తాయి" అని వాదించారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ "మీరు చలాయించిన అధికారం, అక్రమంగా వసూలు చేసిన డబ్బును దృష్టిలో (మిగతా 5లో)

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజి ప్రమాణం



ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్

బాలాజి మెడమల్లితో (ఎడమ) ప్రమాణం చేయిస్తున్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్

ఈనాడు, అమరావతి: హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజి మెడమల్లి ప్రమాణం చేశారు. మొదటి కోర్టు హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఆయనతో ప్రమాణం చేయించారు. అదనపు న్యాయమూర్తిగా బాలాజి నియామకంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (ఆర్జీ) పార్థసారథి చదివి వినిపించారు. ప్రమాణం చేసిన అనంతరం జస్టిస్ రవినాథ్ తిల్హరితో కలిసి జస్టిస్ బాలాజి కేసులను విచారించారు. జస్టిస్ బాలాజి రాకతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 33కు చేరింది. ప్రమాణ స్వీకారోత్సవానికి హైకోర్టు న్యాయమూర్తులు, జస్టిస్ బాలాజి కుటుంబసభ్యులు, రిజిస్ట్రార్లు, (మిగతా 5లో)

మరో 114 రఫేల్ యుద్ధవిమానాలు

కొనుగోలుకు డీఏసీ పచ్చజెండా

వాటిలో 96 లోహవిహంగాల ఉత్పత్తి భారత్‌లోనే..

- ఫ్రాన్స్‌తో కుదరనున్న భారీ ఒప్పందం
- రూ.2.90 లక్షల కోట్ల నుంచి రూ.3.15 లక్షల కోట్ల మధ్య అంచనా వ్యయం
- ఆరు బోయింగ్ పీ8-ఐ నిఘా విమానాల కొనుగోలుకూ డీఏసీ ఆమోదముద్ర



దిల్లీ: భారత రక్షణ రంగ చరిత్రలో అతి పెద్ద కొనుగోలు ఒప్పందానికి రంగం సిద్ధమైంది. దేశ పోరాట సామర్థ్యాలను గణనీయంగా మెరుగుపరిచేలా మరో 114 శత్రుభీకర రఫేల్ యుద్ధవిమానాలు మన వాయుసేన (ఐఏఎఫ్) అమ్ములపొదిలో చేరనున్నాయి. ఇందుకోసం ఫ్రాన్స్ సర్కారుతో కేంద్ర ప్రభుత్వం భారీస్థాయి ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ మేరకు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ప్రతిపాదనకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) గురువారం ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ.3.60 లక్షల కోట్ల విలువైన మిలిటరీ హార్డ్‌వేర్ కొనుగోళ్లకు (మిగతా 5లో)

సంక్రాంతి వసూళ్ల కేసులో అంబటికి రిమాండ్

రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు



పోలీసు వాహనంలో తగ్గేదేలే అన్నట్లు సైగ చేస్తున్న రాంబాబు

3లో

జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం

- 2023లో అమెరికాలో పోలీసు అధికారి కారు ఢీకొని మృతి చెందిన ఆదోని యువతి
- రాజీ ఒప్పందానికి వచ్చిన సియాటెల్ అధికారులు

సియాటెల్–ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యానికి ప్రాణాలు కోల్పోయిన తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమె కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.262.75 కోట్లు) పరిహారం చెల్లించేందుకు సియాటెల్ స్థానిక ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. 'జాహ్నవి కందుల మృతి అత్యంత బాధాకరం. ఈ పరిహారంతో ఆమె కుటుంబానికి కాస్తయినా ఉపశమనం లభిస్తుందని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ కేసులో పరిహార ఒప్పందం కోసం ఇరుపక్షాలూ గత వారం కోర్టులో దరఖాస్తు దాఖలు చేసినట్లు స్థానిక న్యూస్ వెబ్‌సైట్ పేర్కొంది.

100 అడుగులు ఎగిరిపడి..

కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీకాంత్, విజయలక్ష్మి దంపతులకు జాహ్నవి, మేఘన కుమార్తెలు. పెద్ద కుమార్తె జాహ్నవి(23) ఉన్నత విద్య కోసం 2021లో అమెరికా వెళ్లారు. సియాటెల్‌లోని (మిగతా 5లో)



జాహ్నవి కందుల

సీఎం చంద్రబాబును కలిసిన సినీ నిర్మాత బండ్ల గణేష్


అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో బండ్ల గణేష్

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబును అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా శ్రీవారి తీర్థప్రసాదాల్ని సీఎంకు అందజేశారు. గణేష్‌ను ఆత్మీయంగా పలకరించిన చంద్రబాబు.. ఆయన్ను ఆలింగనం చేసుకున్నారు. తిరుమలకు పాదయాత్ర పొడవునా తెదేపా కార్యకర్తలు తనకు అండగా నిలిచారని గణేష్ వివరించారు. గతంలో చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు.. ఆయన క్షేమంగా బయటకు రావాలని, సీఎం కావాలని గణేష్ మొక్కుకున్నారు. అది నెరవేరడంతో తెలంగాణలోని షాద్‌నగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి సంకల్పయాత్ర పేరుతో తిరుమలకు పాదయాత్ర పూర్తి చేశారు.

● ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌ను బండ్ల గణేష్ కలిశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ పాదయాత్ర విశేషాల్ని లోకేశ్ తెలుసుకున్నారు.

రావణ వాహనంపై రాజిల్లిన మల్లన్న


రావణ వాహనంపై స్వామి, అమ్మవార్లు

● పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవ శోభతో శ్రీశైల మహాక్షేత్రం వెలుగులీనుతోంది. ఉత్సవాల్లో ఐదో రోజైన గురువారం శ్రీభ్రమరాంబ, మల్లికార్జునస్వామి రావణ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో నిర్వహించిన గ్రామోత్సవంలో వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొన్నారు. అంతకుముందు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రభుత్వానికి ఉండాలని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, కలెక్టర్ రాజకుమారి, ఈవో ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఊరేగింపుగా పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి. చిత్రంలో ఆలయ ఛైర్మన్ రమేష్ నాయుడు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఈవో శ్రీనివాసరావు తదితరులు


సూర్యప్రభ, చప్పరంపై ఊరేగుతున్న సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక ఉత్సవర్లు

సూర్యతేజం.. సోమస్కందుని రాజసం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సూర్యప్రభపై సోమస్కందమూర్తి భక్తకోటికి దర్శనమిచ్చారు. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలో గురువారం ఉత్సవర్లకు విశేష అలంకరణలు చేపట్టారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై స్వామివారు కొలువుదీరి భక్తులను కటాక్షించారు. అలంకార మండపం నుంచి శివ పరివారమైన శ్రీవినాయకస్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరులతో కలసి సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక ఉత్సవమూర్తులు పట్టణ వీధుల్లో ఊరేగింపుగా వచ్చారు. సూర్యప్రభ, చప్పరంపై దేవతామూర్తులకు భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు.

శ్రీశైలం వచ్చే వాహనాలకు నేటి నుంచి టోల్ మినహాయింపు

● శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
● రాత్రివేళల్లోనూ అందుబాటులో రవాణా సౌకర్యం

ఈనాడు-కర్నూలు; శ్రీశైలం ఆలయం, నంద్యాల పట్టణం-న్యూస్‌టుడే: శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 13 నుంచి 16 వరకు దేవస్థానం, అటవీశాఖ టోల్‌గేట్ల వద్ద రుసుం మినహాయింపునిస్తున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. రాత్రి వేళల్లోనూ రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని చెప్పారు. శ్రీశైలంలోని దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూంలో ఎస్పీ సునీల్ షొరాణ్‌తో కలిసి గురువారం మాట్లాడారు. 'భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత స్థాయిలో సదుపాయాలు కల్పిస్తున్నాం. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 2,59,050 మంది భక్తులు దర్శనాలు చేసుకున్నారు. మహా శివరాత్రి రోజున సుమారు 1.50 లక్షల మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా అదనపు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నాం. నంద్యాల-శ్రీశైలం మార్గంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు నడుస్తోంది. ఏపీఎస్ఆర్టీసీ తరఫున 1,800, తెలంగాణ నుంచి 1,000, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కలిపి మొత్తం 3 వేల బస్సులు ఏర్పాటు చేశాం. ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు, భద్రతా ఏర్పాట్లకు భక్తులు సహకరించాలి' అని కలెక్టర్ వివరించారు.

వారి సమన్వయలోపం... నడకదారి భక్తులకు శాపం

అటవీ, దేవాదాయశాఖల మధ్య సమన్వయలోపం భక్తులకు శాపంలా మారుతోంది. శ్రీశైలానికి నడక దారిలో వచ్చే భక్తులు నల్లమల అడవిలో 46 కి.మీ. దూరం నడవాలి. అందులో ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్నా అటవీశాఖ అధికారులు మోకాలడ్డుతున్నారు. ఆ శాఖ పరిధిలో నడిచే భక్తులకు వారే అవసరమైన ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ వారు చేయకపోగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తామన్నా అనుమతులు నిరాకరిస్తున్నారు. భక్తులకు ఏర్పాట్లు చేయడానికి దేవాదాయశాఖ ఏటా రూ.5 లక్షలు ఇస్తుండగా రూ.60 లక్షలు చెల్లించాలని అటవీశాఖ అధికారులు డిమాండు చేస్తుండటం గమనార్హం. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీవారి సేవలో దర్శకుడు రాఘవేంద్రరావు



తిరుమల, న్యూస్‌టుడే: సినీ దర్శకుడు రాఘవేంద్రరావు గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో తితిదే అధికారులు స్వాగతం పలికి ఆయనకు శ్రీవారి దర్శనం చేయించారు.

ఐఐటీ లఖ్‌నవూలో బీఎస్ కృత్రిమ మేధ కోర్సు

ఈనాడు, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచి ఐఐటీ లఖ్‌నవూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ బిజినెస్ అనలిటిక్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్) కోర్సును ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా ఈ కోర్సులోని సీట్లను భర్తీ చేస్తారు. ఈకోర్సులో చేరిన విద్యార్థులు అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్+ టెక్ ఎంబీఏనూ ఎంచుకోవచ్చు.

ఆర్థిక సవాళ్ల మధ్యే సంక్షేమానికి పెద్దపీట!

● రేపు శాసనసభకు 2026-27 రాష్ట్ర బడ్జెట్
● రూ.3.38 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్ల మధ్య అంచనా!
● అభివృద్ధి పనులకూ పెద్దపీట

ఈనాడు, అమరావతి: రాష్ట్రం పునరుద్ధరణ నుంచి ప్రగతి వైపు అడుగులు వేస్తున్నా ఆర్థికంగా ఇంకా సుస్థిరం కావాల్సి ఉంది. పాత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభాల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగానే రాష్ట్రప్రభుత్వం తన మూడో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ 2026-27 బడ్జెట్‌ను శాసనసభకు శనివారం సమర్పించనున్నారు. దీనికి కసరత్తు కొలిక్కి వచ్చినా బడ్జెట్‌కు తుదిరూపు ఇచ్చే పనిలో ఆర్థికశాఖ అధికారులు ఉన్నారు. సూపర్ సిక్స్ అమలుకు ఈ బడ్జెట్ తొలి ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ పథకాలకే ఏడాదికి రూ.33వేల కోట్ల వరకు ఖర్చుచేస్తున్నారు. దీంతోపాటు సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామాల అభివృద్ధి, విద్యకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జీతాలు, పింఛన్ల చెల్లింపులకు రాష్ట్ర సొంత రాబడి సరిపోతోంది. ఇవికాక అప్పుల అసలు, వడ్డీలు కలిపి చెల్లించేందుకు ఏడాదికి రూ.60వేల కోట్ల వరకు ఖర్చవుతోంది. ఇతర రెవెన్యూ వ్యయాలు పెరిగిపోతున్నాయి. రెవెన్యూ రాబడిలోపు రెవెన్యూ వ్యయాన్ని పరిమితం చేసే పరిస్థితులు చాలా ఏళ్లుగా కనుమరుగయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రెవెన్యూ లోటు అంచనాలకు మించి ఉందని తాజా కాగ్ లెక్కలు విశదీకరిస్తున్నాయి.

శాఖల ఖర్చుకు అనుగుణంగా కేటాయింపులు

బడ్జెట్ కసరత్తుకు ముందు ఆర్థికశాఖ బడ్జెట్ మార్గదర్శకాలు విడుదల చేస్తుంది. ప్రతి ప్రభుత్వశాఖ నుంచి ఆయా ప్రధాన హెడ్‌ల పరంగా ఎంత అవసరమో ప్రతిపాదనలు స్వీకరిస్తుంది. ఆయా శాఖలు తమ అవసరాలకు అనుగుణంగా ఆర్థికశాఖకు ప్రతిపాదనలు సమర్పిస్తారు. గత సంవత్సరం ఎంత బడ్జెట్ ఇచ్చారు? ఎంత ఖర్చయింది? ఏయే విభాగాల్లో ఎక్కువ ఖర్చయింది? ఎక్కడ తక్కువ ఖర్చయిందనే అంశాల ప్రాతిపదికన కొత్త బడ్జెట్ రూపొందుతుంది. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్ని ప్రభుత్వశాఖల మంత్రులు, కార్యదర్శులతో ఇప్పటికే సమీక్షలు పూర్తిచేశారు. వారి అవసరాలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల మధ్య సమన్వయం సాధించే దిశగా బడ్జెట్ అడుగులు పడేలా ప్రయత్నిస్తున్నారు. అన్ని ప్రభుత్వశాఖలు కలిపి వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.5 లక్షల కోట్లు అవసరమని ప్రతిపాదనలు సమర్పించాయి.

పెద్దగా మారకపోవచ్చు

ఆర్థికమంత్రి శనివారం సమర్పించబోయే బడ్జెట్ స్వరూపం ఇంతకుముందుతో పోలిస్తే పెద్దగా మారే అవకాశాలు కనిపించడం లేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,22,359.33 కోట్ల అంచనాలతో బడ్జెట్ సమర్పించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.3.35 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల కోట్ల మధ్య ఉండవచ్చని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,22,359 కోట్లకు బడ్జెట్ సమర్పించినా ఇంతవరకు ఖర్చు రూ.2.40 లక్షల కోట్ల వరకే ఉందని ఆర్థికశాఖ అంచనా. జనవరి నెలాఖరు వరకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ రాబడి రూ.1,40,540 కోట్లుగా ఉందని ఆర్థికశాఖ అధికారులు అధికారికంగా వెల్లడించారు. ఇందుకు బహిరంగ మార్కెట్ రుణాలు కలిపి ప్రస్తుతం ఖర్చులు కొలిక్కి వస్తాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఖర్చు సవరించిన అంచనాల ప్రకారం రూ.2,40,509 కోట్లుగా బడ్జెట్ లెక్కలు పేర్కొంటున్నాయి. రేపటి బడ్జెట్‌లో అసలు లెక్కలు తేలతాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కిందటి ఆర్థిక సంవత్సరంలాగే ఉంది. రాబడులు 10% మించి పెరిగే అవకాశాలు లేవు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి అంచనాల ఆధారంగా బహిరంగ మార్కెట్ రుణాలకు మరికొంత ఆస్కారం ఉండొచ్చు. సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి పథకాలు దాదాపు పాత ఆర్థిక సంవత్సరం తరహాలోనే కొనసాగొచ్చు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు చూస్తే గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ స్వరూపంతో పోలిస్తే 5-10% మధ్య మాత్రమే పెరుగుదలకు ఆస్కారం ఉంటుందనేది అంచనా.

ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ అంచనాలు	ముందు ఏడాది కన్నా పెంపు
2021-22	2,29,779.27	2.21%
2022-23	2,56,256.56	11.52%
2023-24	2,79,279.27	8.98%
2024-25	2,94,427.25	5.4%
2025-26	3,22,359.33	9.48%

పెదజీయర్ స్వామిని అనేంత ధైర్యం ఎలా వచ్చింది?

● హిందూ ధర్మ వ్యతిరేకి కరుణాకరరెడ్డి..
● భాజపా నాయకుడు జయప్రకాష్ ధ్వజం

ఈనాడు, అమరావతి: వేంకటేశ్వర స్వామి వారి ప్రత్యక్ష ప్రతినిధిగా భావించే పెద జీయర్ స్వామి గురించి అనుచిత వ్యాఖ్యలు చేసే ధైర్యం ఎలా వచ్చిందని తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని భాజపా ఏపీ ముఖ్య అధికార ప్రతినిధి జయప్రకాష్ మండిపడ్డారు. జీయర్ వ్యవస్థతో పాటు హిందువులను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద జీయర్ స్వామిపై కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలు అనుచితమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ నాయుడు, ముద్దాడ రవిచంద్ర ఒత్తిడితో పెద జీయర్ స్వామి లేఖ రాశారని తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైకాపా హయాంలో తిరుమలలో చోటుచేసుకున్న అక్రమాలపై సమాధానం చెప్పుకోలేక.. ఆ పార్టీ నాయకులు అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. కరుణాకరరెడ్డి హిందూ ధర్మ వ్యతిరేకి అని, లడ్డూ అంశంలో ఆయన తప్పులను సహకరించి, చేసిన తప్పులకు లెంపలేసుకోవాలని జయప్రకాష్ డిమాండ్ చేశారు.

రైల్వే జోన్ల మధ్య స్టేషన్ల పంపకాలు

కాజీపేట, న్యూస్‌టుడే: ఏపీలోని విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడ్డ కొత్త దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు, దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్ నుంచి ఐదు రైల్వేస్టేషన్లను కేటాయిస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. గుంతకల్ డివిజన్‌కు సంబంధించిన 20 రైల్వేస్టేషన్లను సికింద్రాబాద్‌కు కేటాయించారు. కాజీపేట సబ్ డివిజన్, విజయవాడ డివిజన్ల మధ్యనున్న మధిర, తొండలగోపవరం, ఎర్రుపాలెం, గంగినేని, చెరువుమాధవరం రైల్వేస్టేషన్లను సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్‌కు మార్చారు. ప్రస్తుతం విజయవాడ, గుంతకల్ డివిజన్లు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లోకి వెళ్లాయి. విజయవాడ కేంద్రంగా లోకో పైలట్ల విధుల కేటాయింపు కేంద్రం (లాబీ) ఉంది. దక్షిణ మధ్య రైల్వే నుంచి ఈ డివిజన్ విడిపోవడంతో పైలట్లు కొత్త జోన్ పరిధిలోకి వెళ్తారు. ఒక జోన్ నుంచి మరో జోన్‌లో వీరు పనులు చేయడానికి వీలు పడదు, కనుక వరంగల్ రైల్వేస్టేషన్లో మరో లాబీని ఏర్పాటు చేయాలనే డిమాండు ఉంది.

పేర్ని నానికి నోటీసు ఇచ్చి వివరణ తీసుకోండి

● పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నానికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని మచిలీపట్నం-ఇనగుదురుపేట పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను అవమానించేలా పేర్ని నాని వ్యాఖ్యలు చేశారంటూ తెదేపా నాయకుడు పిప్పళ్ల వెంకట కాంతారావు ఫిర్యాదు చేయడంతో ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలని పేర్ని నాని హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

కాకాణి నుంచి వివరణ తీసుకోండి

ఓ బాలిక అత్యాచారానికి గురై మృతి చెందిన ఘటనపై వ్యాఖ్యల విషయంలో నమోదైన కేసులో.. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3)ని అనుసరించి వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. బాలిక మృతి ఘటన విషయంలో తాను ప్రభుత్వంపై విమర్శలు చేసినందుకు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

ఉత్తరాంధ్రలో రేర్ ఎర్త్ కారిడార్

● అమరావతిలో సెమీకండక్టర్ డిజైన్ ప్రాజెక్టులు
● సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన రేర్ ఎర్త్ కారిడార్‌ను శ్రీకాకుళం-విజయనగరం- విశాఖపట్నం జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0లో భాగంగా అమరావతిలో సెమీకండక్టర్ డిజైన్ తదితర ప్రాజెక్టుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. పల్నాడు ప్రాంతంలో మెగా టెక్స్‌టైల్ పార్క్, తిరుపతిలో స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని నిర్దేశించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులతోపాటు దేశవ్యాప్తంగా ప్రకటించిన వాటిని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

'శ్రీకాకుళం- విజయనగరం- విశాఖపట్నం జిల్లాల్లో ఏర్పాటు చేయాలి. దీనితోపాటు విలువైన ఖనిజాలకు సంబంధించిన వాల్యూ చైన్ పరిశ్రమల ఏర్పాటుపైనా దృష్టి పెట్టాలి. ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా తీరప్రాంతంలోని మూలపేట నుంచి దిగువన ఉన్న కృష్ణపట్నం వరకు ప్రతిపాదనలు రూపొందించాలి. కంటెయినర్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన ఏర్పాటయ్యేలా ప్రతిపాదనలు సమర్పించాలి.

● రాజధాని అమరావతిలో సెమీకండక్టర్ డిజైన్ ప్రాజెక్టులతోపాటు హెల్త్‌సిటీలో బయో డిజైన్, మెడ్‌టెక్ పార్క్, బయోఫార్మా శక్తి మిషన్ లాంటి ఎకోసిస్టమ్ రాబోతోంది. మెడికల్ టూరిజం- హీల్ ఇన్ ఏపీ అనే విధానంలో అమరావతిలో ప్రాజెక్టులు చేపట్టాలి.

● హిందూపురంలో ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ తయారీని ప్రతిపాదించాలి' అని సీఎం చెప్పారు.



నాలుగు మంచి మాటలు


1. మాట్లాడడం కంటే ఎక్కువ వినడం నేర్చుకోండి.
2. మీరు ఖర్చు పెట్టే డబ్బు కంటే ఎక్కువ మదుపు చేయండి.
3. టీవీ, మొబైల్ చూడటం కంటే పుస్తకాలు చదివేందుకు ఎక్కువ సమయం కేటాయించండి.
4. సమాజం మీకు ఇచ్చిన దాని కంటే మీరు ఎక్కువ తిరిగి ఇవ్వండి.

– అభిజిత్ ఛోక్సీ, కంటెంట్ క్రియేటర్

జాతీయ రహదారుల డీపీఆర్‌ల తయారీకి ఏజెన్సీల నియామకం

ఈనాడు, దిల్లీ: ఎన్‌హెచ్-765లో హైదరాబాద్-శ్రీశైలం మధ్య నాలుగు వరుసల రహదారి, ఎన్‌హెచ్-65లో హైదరాబాద్-విజయవాడల మధ్య ఆరు వరుసల రహదారుల నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి ఏజెన్సీలను నియమించినట్లు కేంద్ర రహదారి రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గురువారం లోక్‌సభలో భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. హైదరాబాద్-శ్రీశైలం రహదారి నిర్మాణానికి అయ్యే ఖర్చులో కొంత వాటా పంచుకోవడంతో పాటు, సీనరేజిపై లెవీ, ప్రాజెక్టులో ఎస్‌జీఎస్‌టీ మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడించారు.

ఇదీ సంగతి!



ఒకసారి దీనిమీద నుంచోండి సార్.. బరువు ఎంత ఉన్నారో చూస్తా..!

రాజధానిలో రూ.1,142 కోట్లతో రహదారుల విస్తరణ పనులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో రూ.1,142.25 కోట్లతో రహదారుల విస్తరణ, వర్షపు నీటి కాలువల పనులకు ఆర్థికశాఖ పరిపాలన అనుమతులిచ్చింది. ఈ మేరకు గురువారం వేర్వేరుగా జీవోలు వెలువడ్డాయి. రూ.834.66 కోట్లతో ఈ-13 రహదారిని జాతీయరహదారి-16 వరకు విస్తరణ, వర్షపు నీటి కాలువల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు. మరో రూ.307.59 కోట్లతో ఈ-15 రోడ్డును పాత జాతీయరహదారి మంగళగిరి వరకు విస్తరణ, వర్షపునీటి కాలువల నిర్మాణం పనులకు సీఆర్‌డీఏకి రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతులిచ్చింది.

లేఔట్లలో రూ.1,863 కోట్లతో మౌలిక సదుపాయాలు

రాజధానిలోని జోన్-8 ప్రాంతంలో కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లిలో భూసమీకరణలో అభివృద్ధి చేసిన లేఔట్లలో రూ.1,863 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటిలో రోడ్లు, వర్షపునీటి కాలువలు, తాగునీటి సరఫరా తదితర పనులు చేపట్టనున్నారు.

గ్రహం అనుగ్రహం

13-2-2026 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
ఏకాదశి: మ. 1-44 తదుపరి ద్వాదశి
మూల: మ. 3-52 తదుపరి పూర్వాషాఢ
వర్జ్యం: మ. 2-06 నుంచి 3-52 వరకు
తిరిగి రా. 2-19 నుంచి 4-04 వరకు
అమృత ఘడియలు: ఉ. 8-49 నుంచి 10-35 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-49 నుంచి 9-35 వరకు
తిరిగి మ. 12-37 నుంచి 1-22 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6.33; సూర్యాస్తమయం: సా.5.56
కుంభ సంక్రమణం ఉ. 7.54, శుక్రమౌఢ్య త్యాగము, మతత్రయ ఏకాదశి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	31.0
అనంతపురం	16.0	33.7
కడప	17.0	31.0
రామగుండం	17.6	31.9
విశాఖపట్నం	17.8	30.8
తాడేపల్లిగూడెం	18.0	33.0
గుంటూరు	18.0	33.0
కర్నూలు	18.0	33.8
రాజమహేంద్రవరం	18.0	36.0
హైదరాబాద్	18.3	30.4
శ్రీకాకుళం	19.0	29.0
విజయవాడ	19.0	31.2
నరసాపురం	19.0	32.5
ఒంగోలు	20.5	31.9
నెల్లూరు	21.0	31.8
సూర్యాపేట	21.5	32.0

సీఎఫ్‌టీఆర్ఐ నివేదికపై సుబ్బారెడ్డికి అప్పుడే చెప్పా

- నెయ్యి కల్తీ అయినట్లు తేలిందని వివరించా
- ఆ సమయంలో గోదాముల విభాగం డిప్యూటీ ఈవో కూడా ఉన్నారు
- సిట్ విచారణలో నాటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యం వెల్లడి
- సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక తన దృష్టికి రాలేదంటూ సుబ్బారెడ్డి చెబుతున్నవన్నీ అబద్ధాలేనని తేటతెల్లం

ఈనాడు, తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేర విభాగం)

‘తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యి కల్తీదంటూ మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ప్రయోగశాల ఇచ్చిన నివేదికను నేను తొక్కిపెట్టానని కొందరు ఆరోపిస్తున్నారు. నెయ్యి నమూనాలను సీఎఫ్‌టీఆర్ఐకి పంపించాలని ఆదేశించిందే నేను. ఆ తర్వాత అక్కడి నుంచి నివేదిక వచ్చిన విషయం అధికారులెవరూ నా దృష్టికి తేలేదు. ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సింది అధికారులే.’

– తితిదే పాలకమండలి అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇటీవల చెప్పిన మాటలివి.

అయితే, సుబ్బారెడ్డి చెబుతున్నదంతా బుకాయింపేనని తేటతెల్లమైపోయింది. భోలేబాబా, వైష్ణవి, ప్రీమియర్ డెయిరీలు సరఫరా చేస్తున్న నెయ్యి కల్తీదంటూ 2022 ఆగస్టు 3న సీఎఫ్‌టీఆర్ఐ ఇచ్చిన నివేదిక గురించి అప్పట్లోనే సుబ్బారెడ్డికి పూర్తిగా తెలుసని వెల్లడైంది. నాటి తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యం, గోదాముల విభాగం డిప్యూటీ ఈవో వెంకట నటేశ్‌బాబు.. సుబ్బారెడ్డిని కలిసి నెయ్యిలో కల్తీ ఉందంటూ సీఎఫ్‌టీఆర్ఐ ఇచ్చిన నివేదిక గురించి ఆయనకు సమగ్రంగా వివరించినట్లు తాజాగా బయటపడింది. ఈ కేసులో గతేడాది నవంబరు 27న అరెస్టైన సుబ్రహ్మణ్యం.. అప్పట్లో సిట్ అధికారుల విచారణలో ఈ వివరాలు వెల్లడించారు. అతని వాంగ్మూలం తాజాగా వెలుగులోకి వచ్చింది. దాన్ని విశ్లేషిస్తే సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక గురించి సుబ్బారెడ్డికి తెలిసినా, దాన్ని తొక్కిపెట్టి, చర్యలు తీసుకోలేదని స్పష్టమవుతోంది.

సుబ్రహ్మణ్యం వాంగ్మూలంలో ఏముందంటే?

★ సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నివేదికను మీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారా? అని సిట్ సుబ్రహ్మణ్యాన్ని ప్రశ్నించగా.. ‘నేను, గోదాముల విభాగం డిప్యూటీ ఈవో ఇద్దరం అప్పటి బోర్డు ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కలిశాం. సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌లో చేయించిన నెయ్యి నమూనాల పరీక్షల్లో బీటా సిటోస్టెరాల్ పాజిటివ్‌గా తేలిందని ఆయన దృష్టికి తీసుకెళ్లాం’ అని చెప్పారు.

★ ‘మీ ఉన్నతాధికారి ఎవరు? సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక గురించి మీరెవరికి చెప్పాలి?’ అని సిట్ అడగ్గా ‘జీఎం హోదాలో ఉన్న నేను అదనపు ఈవోకు నివేదించాలి’ అంటూ సుబ్రహ్మణ్యం సమాధానమిచ్చారు.

★ మరి అదనపు ఈవోకు చెప్పారా? అని అడగ్గా ‘లేదు’ అని బదులిచ్చారు. ‘ఎందుకు చెప్పలేదు?’ అని ప్రశ్నించగా, ‘దానికి సమాధానం చెప్పలేను’ అని దాటవేశారు.

★ ‘కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్న డెయిరీల నిర్వాహకులను హెచ్చరించారా?’ అని అడగ్గా, ‘లేదు’ అని చెప్పారు.

★ వీటిని బట్టి నెయ్యి కల్తీ అయిన సంగతి 2022లోనే సుబ్బారెడ్డికి పూర్తిగా తెలుసని, ఉద్దేశపూర్వకంగానే చర్యలు తీసుకోలేదని స్పష్టమవుతోంది.

నెయ్యి కల్తీ జరిగిందనే తెలిపా...

‘ప్రీమియర్ అగ్రిఫుడ్స్, వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, భోలేబాబా ఓర్గానిక్ డెయిరీ సంస్థలు ట్యాంకర్లు, టిన్నుల ద్వారా తితిదేకు పంపే నెయ్యిని మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌లో పరీక్షించాలని ఛైర్మన్ సుబ్బారెడ్డి 2022 మే 20న ఆదేశించారు. గోదాముల విభాగం డిప్యూటీ ఈవో వెంకట నటేశ్‌బాబు నాలుగు నమూనాలను జూన్‌లో ఆ ల్యాబ్‌కు పంపారు. నివేదిక ఆలస్యం కావడంతో ఆ ల్యాబ్‌లో మీకెవరైనా పరిచయముంటే మాట్లాడాలని డెయిరీ నిపుణుడు బత్తుల సురేంద్రనాథ్‌ను కోరాను. ఆగస్టు 3న డిప్యూటీ ఈవోకు నివేదిక వచ్చింది. అందులో ‘బీటా సిటోస్టెరాల్ పాజిటివ్’ అని ఉంది. దీనిపై అభిప్రాయం చెప్పాలని సురేంద్రనాథ్‌ను అడిగాను. ఆయన వెజిటబుల్ ఆయిల్స్ కలిశాయని, నెయ్యి కల్తీ జరిగిందని చెప్పారు. నేను, డిప్యూటీ ఈవో.. ఛైర్మన్ సుబ్బారెడ్డిని కలిసి నివేదికలో ఉన్న విషయాన్ని వివరించాం’ అని సుబ్రహ్మణ్యం సిట్ అధికారులకు వాంగ్మూలమిచ్చారు.

నివేదిక వచ్చాక కూడా సరఫరా యథాతథం

★ సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక సుబ్బారెడ్డి దృష్టికి వచ్చాక ఆయన జీఎం సుబ్రహ్మణ్యానికి ఏ ఆదేశాలిచ్చారో కానీ, ఆయా డెయిరీల నుంచి నెయ్యి సరఫరా మాత్రం ఆగలేదు. 2022 అక్టోబరు 28 వరకూ భోలేబాబా డెయిరీ 1.07 లక్షల కిలోల నెయ్యి తిరుమలకు పంపించింది. ప్రీమియర్ అగ్రిఫుడ్స్, వైష్ణవి సంస్థలు 2024 వరకు నెయ్యి సరఫరా చేశాయి.

★ సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌లో పరీక్షల కంటే ముందే తిరుమల ల్యాబ్‌లోనూ నాలుగు నమూనాలను పరీక్షించగా, ఎలాంటి కల్తీ లేదని నివేదిక వచ్చింది. సీఎఫ్‌టీఆర్ఐ నుంచి రిపోర్టు రాకముందే ఆ నెయ్యిని లడ్డూల తయారీలో వినియోగించారు. డెయిరీ నిపుణుడైన సురేంద్రనాథ్‌కు మైసూరు ల్యాబ్ నివేదికను చూపించగా.. ఆయన ఆ నాలుగు నమూనాలూ కల్తీవేనని సుబ్రహ్మణ్యానికి చెప్పారు. ‘ఈ విషయాన్ని మీరు బయటకు చెప్పొద్దు. ల్యాబ్ రిపోర్టులు ఆలస్యమైనందున అప్పటికే ఉన్న స్టాక్‌ను లడ్డూల తయారీకి వాడేశాం. మీరు తితిదేకు అధికారికంగా పంపే నివేదికలోనూ కల్తీ గురించి రాయొద్దు’ అని సుబ్రహ్మణ్యం.. సురేంద్రనాథ్‌ను కోరినట్లు సిట్ పేర్కొంది. ఇందుకు సురేంద్రనాథ్ ఇచ్చిన వాంగ్మూలాన్ని ఉటంకించింది. అయితే తాను అలా కోరలేదని సుబ్రహ్మణ్యం సిట్‌కు చెప్పారు.

★ సీఎఫ్‌టీఆర్ఐ నివేదికపై నిపుణుల అభిప్రాయం తీసుకోవాలని ఎవరైనా ఆదేశించారా అని సిట్ ప్రశ్నించగా.. తాను, డిప్యూటీ ఈవో కలిసి నిర్ణయం తీసుకున్నామని సుబ్రహ్మణ్యం బదులిచ్చారు. గతేడాది నవంబరు 27న సుబ్రహ్మణ్యంతో పాటు డెయిరీ నిపుణులు బత్తుల సురేంద్రనాథ్, డాక్టర్ మల్లం మహేందర్, వి.వెంకట సుబ్రమణియన్, కె.జయరాజ్‌రావును సిట్ అధికారులు విచారించారు. సుబ్రహ్మణ్యం విచారణకు సహకరించకపోవడంతో అరెస్టు చేశారు.

సాయిబాబాకూ.. భోలేబాబా నెయ్యి

- శిర్డీ సాయి సంస్థాన్‌కు నెలకు 90 టన్నుల కల్తీ నెయ్యి సరఫరా
- అక్కడ గుర్తించకపోవడంతో తితిదేకి వ్యాప్తి

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే- తిరుపతి (నేరవిభాగం): కల్తీలో ఆరితేరిన భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ తొలుత శిర్డీ సాయిబాబా ఆలయానికి నెయ్యి సరఫరాని సిట్ విచారణలో తేలింది. హర్ష్ ఫ్రెష్ డెయిరీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రతిరోజూ తాము 1,33,500 లీటర్ల పాలు సేకరిస్తున్నామని ఎఫ్ఎస్ఎస్ఏఐ రికార్డుల్లో తెలిపారు. ప్రతిరోజూ 4 టన్నుల నెయ్యి ఉత్పత్తి చేస్తున్నామని, శిర్డీకి నెలకు 90 టన్నుల నెయ్యి సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. మొత్తంగా శిర్డీకి 2.80 లక్షల కిలోల కల్తీ నెయ్యిని కిలోకు రూ.318.50 చొప్పున అమ్మారు. అక్కడ ఎలాంటి చిక్కులు ఎదురుకాకపోవడంతో తిరుమలపై భోలేబాబా డైరెక్టర్ల కన్ను పడింది. తితిదేలోని డెయిరీ నిపుణులు కొందరు వారికి సహకరించడంతో పంట పండింది.

ఉత్పత్తే మొదలవలేదు.. నిబంధనల ప్రకారం జరుగుతోందని నివేదిక

2012 అక్టోబరు 5న హర్ష్ ఫ్రెష్ డెయిరీని రిజిస్టర్ చేశారు. ఉత్తరాఖండ్‌లోని భగవాన్‌పూర్‌లో ఒక ప్లాంట్ నెలకొల్పారు. పలుమార్లు నెయ్యి సరఫరాకు టెండర్లు దాఖలు చేసినా సఫలీకృతం కాకపోవడంతో 2021 జులై 9న భోలేబాబా ఓర్గానిక్ డెయిరీగా పేరు మార్చారు. తితిదే పెద్ద మొత్తంలో నెయ్యి సరఫరాకు టెండర్లు పిలుస్తుండటంతో 2021 డిసెంబరులో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం పర్బపూర్‌లోని మరో డెయిరీని లీజుకు తీసుకున్నారు. జనరల్ మేనేజర్‌గా ఉన్న హరిమోహన్ రాణా పేరుతో 2022 మే 18న అధికారికంగా ఒప్పందం చేసుకున్నారు. అదే ఏడాది ఆగస్టు 1 నుంచి నెయ్యి ఉత్పత్తి మొదలుపెడతామన్నారు. అయితే 2021 డిసెంబరు 29న ఆ డెయిరీలో తనిఖీలకు వచ్చిన తితిదే కొనుగోళ్ల విభాగం జీఎం సుబ్రహ్మణ్యం, నిపుణులు బత్తుల సురేంద్రనాథ్, కలకత్తి జయరాజారావు.. అక్కడ ఉత్పత్తి జరుగుతోందని తమ నివేదికలో తెలపడం గమనార్హం. వారు భోలేబాబా నిర్వాహకుల నుంచి ఒక్కొక్కటి రూ.50 వేల విలువ చేసే మూడు సెల్‌ఫోన్లు లంచంగా తీసుకుని అనుకూలంగా వ్యవహరించారు. పాలసేకరణ గురించి అడగకుండానే తితిదే నిబంధనలకు అనుగుణంగా నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం ఆ డెయిరీకి ఉందని నివేదిక ఇచ్చారు. సిట్ అధికారులు భగవాన్‌పూర్ వెళ్లి.. స్థానికులను విచారించినప్పుడు భోలేబాబా డెయిరీ గురించే తమకు తెలియదని చెప్పడం గమనార్హం.


★ నాటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న ఒత్తిడితో భోలేబాబా డెయిరీపై కొనుగోళ్ల విభాగం అధికారులు అనర్హత వేటు వేశారు. దాంతో భోలేబాబా నిర్వాహకులు అంతకు ముందే సంప్రదింపులు జరిపిన వైష్ణవి, మాల్‌గంగా, ఏఆర్ డెయిరీలను తెరపైకి తీసుకొచ్చారు. వైష్ణవికి కిలోకు 2 శాతం కమిషన్, మాల్‌గంగాకు కిలోకు రూ.4.50 చొప్పున చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఈ రెండు డెయిరీలతో చర్చలు జరపాలని డెయిరీ నిపుణుడు విజయ భాస్కరరెడ్డి.. భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌కు సూచించారు. వారిద్దరితో ఆ కంపెనీలను కూడా ఆయన పరిశీలించారు. రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని మాల్‌గంగా, వైష్ణవి సంస్థల సరఫరా చేయడంతో పాటు ట్యాంకర్లను, నకిలీ రికార్డులను సైతం పంపేవారు. ఏఆర్ డెయిరీకి నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం లేకున్నా ఉన్నట్లు చూపి టెండర్ [illegible] దందాలో [illegible].

ఆలయాలే లక్ష్యం.. ఎందుకంటే!

భోలేబాబా డెయిరీ బహిరంగ మార్కెట్లో నెయ్యి అమ్మకాలు పెద్దగా చేయదు. కేవలం ఆలయాలనే ఆ డెయిరీ డైరెక్టర్లు లక్ష్యంగా చేసుకున్నారు. దేవుడి ప్రసాదం కాబట్టి భక్తులు పెద్దగా ఫిర్యాదు చేయరన్నది వారి భావన. రకరకాల పదార్థాలు కలిపినందువల్ల నెయ్యి నాణ్యత గురించి కూడా పట్టించుకోరని ఆలోచించారు. ఆ ధైర్యంతోనే శిర్డీ, తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి, ద్వారకా తిరుమల, తదితర దేవాలయాలకూ కల్తీ నెయ్యిని సరఫరా చేశారు. కూటమి ప్రభుత్వం అనుమానం వచ్చి ఏఆర్ డెయిరీ నమూనాలను.. గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ప్రయోగశాలకు పంపడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

ఎస్సీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభించిన మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: పేద పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్, ఇంజినీర్లు, డాక్టర్లు కావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. గురువారం తాడేపల్లిలోని కార్యాలయం నుంచి మంత్రి ఎస్సీ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ శిక్షణ అందిస్తున్నాం. వైకాపా ప్రభుత్వం స్టడీ సర్కిళ్లను నిర్వీర్యం చేసింది. వాటిని పునరుద్ధరించి ఇప్పటికే సివిల్ సర్వీసెస్‌కు ఉచితంగా ఆఫ్‌లైన్ శిక్షణ ప్రారంభించాం. విజయవాడ, విశాఖ, తిరుపతి కేంద్రాలలో ఇవి కొనసాగుతున్నాయి. ఆన్‌లైన్‌లో అందించాలని అభ్యర్థుల నుంచి అందిన విన్నపం మేరకు ఈ శిక్షణ ప్రారంభించాం. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదిగి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి’ అని సూచించారు.



పాఠశాల విద్యలో ఏఐ అమలు భేష్
కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ఈనాడు, అమరావతి: ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) విధానాలు బాగున్నాయని కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కార్యదర్శి సంజయ్‌కుమార్ అధికారులను అభినందించారు. దిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఏఐ కాంక్లేవ్‌లో ఏపీ పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ విద్య గురించి ఏపీ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు వివరించారు.



సంక్రాంతి వసూళ్ల కేసులో అంబటికి రిమాండ్

- రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు

గుంటూరు (లీగల్, కలెక్టరేట్) న్యూస్‌టుడే: సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల పేరిట పేదల పింఛను డబ్బులు వసూలు చేసిన కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు ప్రధాన సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.కుముదిని ఈ నెల 26 వరకు రిమాండ్ విధించారు. ఇప్పటికే రెండు కేసుల్లో అరెస్టయి, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న అంబటిని.. వసూళ్ల కేసులో పోలీసులు గురువారం గుంటూరు కోర్టులో హాజరు పరిచారు. అంబటి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఆయనపై నమోదైన నేరాలు స్వల్పమైనవని, ప్రభుత్వం కక్షగట్టి అరెస్టులకు పాల్పడుతోందని అన్నారు. పలు కేసుల్లో బెయిలు కూడా లభించిందని.. ఈ కేసులో రిమాండ్‌ను తిరస్కరించాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి ఆయన వాదనలను తిప్పికొట్టారు. రాంబాబు మంత్రిగా ఉన్న సమయంలోనే ఆయనపై ఈ కేసు నమోదైందని.. అధికారాన్ని అడ్డుపెట్టి పేదల పింఛను డబ్బు వసూలు చేశారని తెలిపారు. ఇరువైపులా వాదనల విన్న జడ్జి.. ఈ నెల 26 వరకు రిమాండ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం రాంబాబు తరఫున న్యాయవాదులు బెయిలు పిటిషన్ దాఖలు చేయగా.. కేసులో ఉన్న ఆర్థిక మోసాన్ని వెలికి తీసేందుకు రాంబాబును కస్టడీకి ఇవ్వాలని సత్తెనపల్లి పోలీసులు మరో పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయనను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

కోర్టు ఆవరణలో అంబటి అతి

అంబటిని కోర్టుకు తీసుకొచ్చిన సమయంలో ఆయన ప్రవర్తన చర్చనీయాంశమైంది. కోర్టు ఆవరణలో వాహనం ఆగిన అనంతరం బస్సు అద్దాన్ని తీయబోగా పోలీసులు అందుకు నిరాకరించారు. అయినా అంబటి బస్సు అద్దాన్ని తీసి గడ్డం కింద చేయి పెట్టి పుష్ప సినిమా కథానాయకుడిలా తగ్గేదేలే అంటూ పోజు పెట్టారు. అక్కడున్న వైకాపా శ్రేణులకు అభివాదం చేశారు. బస్సు దిగి వెళ్తున్న క్రమంలో ఆయనకు సమీపంగా నడుస్తున్న పోలీసులపై డోంట్ టచ్ మీ అని హూంకరించారు. రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటి వ్యవహారశైలి పట్ల పలువురు సీనియర్ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయవాదిగా ఉండి, ప్రజాప్రతినిధిగా పనిచేసిన ఆయన.. పోలీసులతో దురుసుగా ప్రవర్తించడాన్ని తప్పుబట్టారు.

12 మంది బాలికలను కరిచిన ఎలుకలు

- ఎ.కొండూరు కేజీబీవీ డార్మిటరీలో ఘటన



బాలికల నుంచి వాంగ్మూలం తీసుకుంటున్న మండల స్థాయి అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో చదువుకుంటున్న బాలికలు.. రోజూలాగే బుధవారం రాత్రి అక్కడి డార్మిటరీలో పడుకున్నారు. వారిలో ఏడో తరగతి చదువుతున్న 12 మంది బాలికలను ఎలుకలు కరిచాయి. గురువారం ఉదయమే విషయం తెలిసినా, విద్యాలయ అధికారులు గోప్యంగా ఉంచారు. బాధిత బాలికలకు చికిత్స చేయించేందుకు ఎ.కొండూరు పీహెచ్‌సీకి తరలించడంతో విషయం బయటకు వచ్చింది. సమాచారం అందగానే తహసీల్దార్ ఎస్.అరవింద్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, జీసీడీవో బి.విశ్వభారతి కేజీబీవీకి చేరుకొని బాలికల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి డార్మిటరీలో నిద్రిస్తున్న ఏడో తరగతి విద్యార్థినులు కాపూరి కళావతి, చిమటా లక్ష్మీప్రసన్న, మాల్లాది శ్యామల, కె.శ్రీవర్షిత, బి.దీవెన, టి.కీర్తి, ఎస్.నవ్యశ్రీ, పి.ప్రణతి, ఎం.రజని, వి.స్నేహ తదితర 12 మందిని ఎలుకలు కరిచాయి. విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియడంతో.. మండలస్థాయి అధికారులు అప్రమత్తమై కేజీబీవీకి చేరుకుని విచారించి స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. విద్యాలయంలో సత్వర చికిత్స అందించాల్సిన ఏఎన్ఎం పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. గతేడాది కూడా ఎలుకల సమస్య వచ్చినా.. ఇప్పటివరకు కిటికీల్లోంచి ఎలుకలు లోపలకు రాకుండా చర్యలు చేపట్టలేదు.

మెరుగైన వైద్యం అందించాలి

ఎలుకలు కరిచిన బాలికలకు అందిస్తున్న చికిత్సపై అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడారు. మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

జైలుకు వెళ్లినా అంబటి బుద్ధి మారలేదు: ఎమ్మెల్యే వేమిరెడ్డి

ఈనాడు, అమరావతి: జైలుకు వెళ్లినా అంబటి రాంబాబు బుద్ధి మారలేదని తెదేపా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధ్వజమెత్తారు. ‘తగ్గేదే లేదంటూ’.. సైగలు చేస్తూ సభ్య సమాజం తలదించుకునేలా ఆయన వ్యవహరించారని దుయ్యబట్టారు. మహిళల్ని అసభ్య పదజాలంతో దూషించడం, సామాజిక మాధ్యమాల్లో వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం వైకాపా ఎజెండాగా మారిందని ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘‘మహిళల్ని దారుణంగా కించపరిచిన వారికి పదవులిచ్చిన ఘనత వైకాపా అధినేత జగన్‌ది. ఆ పార్టీ నాయకులు ఏమాత్రం హుందా లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తూ.. దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు’’ అని పేర్కొన్నారు.



ఎల్లవేళలా తోడుండేది జ్ఞానమే

మనకు అన్నివేళలా తోడుండేది జ్ఞానమే. అది మనల్ని ఉన్నత స్థానంలో కూర్చోబెట్టగలదు. ఇతరుల కంటే మీకు ఎంత ఎక్కువ జ్ఞానం ఉంటే అంత ఎక్కువగా అవకాశాలు మిమ్మల్ని వరిస్తాయి. ప్రజ్ఞను మీ బలమైన ఆయుధంగా మలచుకోండి.

– బీఎస్ గుప్తా, యోగా శిక్షకుడు

సభకు రానివారు పోటీ చెయ్యడం మానేస్తారా?: మాధవ్

ఈనాడు, అమరావతి: ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తున్నప్పుడు వైకాపా సభ్యులు చిల్లర చేష్టలకు పాల్పడ్డారని, సభలు జరుగుతున్న తీరు ప్రజలు గమనిస్తున్నారనే స్పృహ కూడా ఆ పార్టీ నేతలకు లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మండిపడ్డారు. ‘వైకాపా నాయకులు శాసనమండలికి హాజరై, శాసనసభకు గైర్హాజరుకావడం ఏంటి? మండలికి ఒక విధానం.. శాసనసభకు ఒక విధానమా?’ అని గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. ‘శాసనసభకు హాజరు కాని వైకాపా నేతలు ఎన్నికల్లో పోటీచేయడం మానేస్తారా?’ అని మాధవ్ ప్రశ్నించారు.

ఈనాడు


అక్షరాలా విషాన్ని వడ్డిస్తున్నారు!

ఆకలి తీర్చే అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపంగా చూసే సంస్కృతి మనది. అలాంటి ఆహారాన్ని కాసుల యావతో, నేరపూరిత నిర్లక్ష్యంతో కొందరు విషతుల్యంగా మార్చేస్తున్నారు. జనం ఏమైపోయినా డబ్బే ముఖ్యమన్నట్లుగా కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, క్యాటరింగ్ సంస్థల నిర్వాహకులు బరితెగిస్తున్నారు. రోజుల తరబడి ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచడంతో పాడైపోయిన ఆహార పదార్థాలకు ప్రమాదకర రంగులు, నాణ్యతలేని దినుసులు దట్టించి విక్రయిస్తున్నారు. మిగిలిన ఆహారాన్నీ తెల్లారి వేడిచేసి వినియోగదారులకు అంటగట్టేస్తున్నారు. వాటిని తిన్నవారు క్యాన్సర్లతో పాటు రకరకాల వ్యాధుల కోరల్లో చిక్కుతున్నారు. మరోవైపు పలు ప్రభుత్వ సంక్షేమ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, వర్సిటీల హాస్టళ్లలో వడ్డిస్తున్న నాసిరకం భోజనం పిల్లల ప్రాణాలమీదికి తెస్తోంది. పెళ్లిళ్లు, ఇతర వేడుకలప్పుడు భారీ వంటపాత్రలను సరిగ్గా కడగకపోవడం ఆహారాన్ని హానికరంచేసి ఎంతోమందిని ఆస్పత్రుల పాల్జేస్తోంది. భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయ ఇటీవలి నివేదిక ప్రకారం విషాహారం మూలంగా 2023లో అస్సాం, తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఎక్కువ ప్రాణనష్టం సంభవించింది. దేశవ్యాప్తంగా అలాంటి ప్రతి ఆరు మరణాల్లో ఒకటి తెలంగాణలో వెలుగుచూడటం విచారకరం! తరతమ భేదాలతో దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆహార కల్తీ, దిగనాసి చిరుతిండ్ల విక్రయాలు పెద్దయెత్తున సాగుతూ ప్రజారోగ్యాన్ని పొట్టనపెట్టుకుంటున్నాయి!

గడిచిన అయిదేళ్లలో దేశవ్యాప్తంగా పరిశీలించిన ప్రతి అయిదు ఆహార శాంపిళ్లలో ఒకటి నాసిరకమేనని కేంద్రం కొద్ది రోజుల కిందట వెల్లడించింది. నిజానికి సిబ్బంది కొరత, అరకొరగా శాంపిళ్ల సేకరణ, తగినన్ని ల్యాబుల లేమి, కొంతమంది అధికారుల అవినీతి కారణంగా చాలామంది దుర్మార్గులు చట్టానికి దొరకట్లేదు. కలుషితాహారం, నీటి కారణంగా నిరుడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఎనిమిదివేల గ్యాస్ట్రోఎంటరైటిస్ కేసులు నమోదయ్యాయి. కానీ, ఆ ఏడాది దాదాపు పదివేల ఆహారశాలల నుంచి యంత్రాంగం సేకరించిన 3,600 నమూనాల్లో కేవలం 0.7శాతమే ప్రమాణాలకు తిలోదకాలిచ్చినట్టు తేలడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి ప్రస్తుతం ఒక్కటే ల్యాబ్ ఉండటంతో ఆహార నాణ్యతా పరీక్షలు ఆలస్యమవుతున్నాయి. దీనికి తోడు తూతూమంత్రం చర్యలు పసలేని వాదనల వల్ల ఎన్నో కేసులు కోర్టుల్లో తేలిపోతున్నాయి. లేదా అరకొర జరిమానాలతో ముగిసిపోతున్నాయి!

గడువు తీరిన లేదా చెడిపోయిన పదార్థాలు వాడటం, నిల్వలో అలక్ష్యం, కీటకాలూ ఎలుకలకు ఆలవాలాలైన అపరిశుభ్ర కిచెన్లు, వంటకు మంచినీరు వినియోగించకపోవడం లాంటివి ఆహార కాలుష్యానికి ప్రధాన కారణాలు. వీటివల్లనే హాస్టళ్లలో భీతావహ పరిస్థితులు నెలకొంటున్నాయి. వనపర్తి జిల్లా బీసీ ఇంటర్ బాలికల వసతిగృహం, ఖమ్మం జిల్లాలోని ఒక ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో ఇటీవల పలువురు విద్యార్థులు విలవిల్లాడారు. కాకినాడ, చిత్తూరు, తిరుపతి వంటి జిల్లాల్లోనూ ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. పిల్లల ఆరోగ్య భద్రత దృష్ట్యా వసతి గృహాల స్థితిగతులను మెరుగుపరచడం ప్రభుత్వాలకు ప్రాధాన్యాంశం కావాలి. నాణ్యత లేని పదార్థాలను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారికి కఠిన దండనలు పడేలా చూడాలి. ఆహార కల్తీ కారణంగా ఇప్పటికే దేశంలో ఏటా పదికోట్ల మంది జబ్బుపడుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2030 నాటికి బాధితుల సంఖ్య 17.7 కోట్ల దాకా పెరుగుతుందన్న అంచనాలు బెంబేలెత్తిస్తున్నాయి. జనజీవన హక్కు గాలిలో దీపం కాకూడదంటే- ప్రభుత్వాలు ఇకనైనా మేల్కొని తగిన కార్యాచరణకు ఉపక్రమించాలి!

ఓపెన్ ఏఐలో ఏం జరుగుతోంది?



కృత్రిమ మేధ... ప్రజల అవసరాల కోసమా, లేక కొందరి వ్యాపార ప్రయోజనాల కోసమా? ఈ సందేహాన్ని లేవనెత్తుతోంది గతేడాది విడుదలై సంచలనం సృష్టిస్తున్న పుస్తకం- ఎంపైర్ ఆఫ్ ఏఐ: డ్రీమ్స్ అండ్ నైట్‌మేర్స్ ఇన్ సామ్ ఆల్ట్‌మన్స్ ఓపెన్ ఏఐ. టెక్ జర్నలిస్ట్ కరెన్ హావ్ ఇందులో ఓపెన్ ఏఐ సంస్థ, సారథుల ప్రస్థానాన్ని విశ్లేషిస్తూ ఈ అద్భుత సాంకేతికతను అడ్డంపెట్టుకుని సాగిస్తున్న వ్యాపారాన్ని ఆధునిక సామ్రాజ్యవాదంతో పోల్చారు. ఏఐ నాణేనికి మరోవైపున జరుగుతున్న వనరుల దోపిడీ గురించి, లాభాపేక్షలేని సంస్థగా మొదలై ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్రైవేటు సంస్థగా మారడం గురించి, సంస్థ సారథి- సామ్ ఆల్ట్‌మన్ చేతిలో ఉన్న అపరిమిత అధికారం గురించి ఆలోచించమంటున్నారు.

ఏ సమాచారం కావాలన్నా గూగులమ్మను అడగడం ఓల్డ్ ఫ్యాషన్. జెన్ జీతో కలిసి నడవాలంటే సంభాషణలో ప్రతి రెండో వాక్యంలోనూ చాట్ జీపీటీ, గ్రోక్, క్లాడ్‌లలో ఏదో ఒకదాన్ని ప్రస్తావించాలి. జెమినై బెటరా కోపైలట్ బెటరా, పర్‌ప్లెక్సిటీ ప్రత్యేకత ఏంటి, డీప్‌సీక్ ఏం చేయబోతోంది... లాంటివి చర్చించగలగాలి. ఏడెనిమిదేళ్ల క్రితం మన కివేవీ తెలియవు. పైన చెప్పినవేవీ అప్పటికి పుట్టలేదు కూడా. కృత్రిమమేధ అన్న మాటొక్కటి తెలుసు, దాంతో అద్భుతాలు చేయడానికి పరిశోధనలు జరుగుతున్నాయని కాస్తో కూస్తో టెక్నాలజీ విషయాలు తెలిసినవారికి అవగాహన ఉండేది. అలాంటిది హఠాత్తుగా ఇవన్నీ నిత్య జీవితంలోకి ఎలా వచ్చేశాయి? ముఖ్యంగా గత మూడేళ్లలో ఈ రంగంలోనూ, సిలికాన్ వ్యాలీలోనూ చోటుచేసుకున్న మార్పులు సైంటిఫిక్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. కరెన్ హావ్ ఎంఐటీ టెక్నాలజీ రివ్యూ మ్యాగజీన్‌కి సీనియర్ ఏఐ ఎడిటర్‌గా, వాల్‌స్ట్రీట్ జర్నల్, ది అట్లాంటిక్ పత్రికలకు కరెస్పాండెంట్‌గా పనిచేశారు. ప్రత్యేకించి కృత్రిమమేధ, అది ప్రపంచం మీద చూపనున్న ప్రభావం గురించి ఏడేళ్ల రిపోర్టింగ్ అనుభవం ఉంది. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ‘ఓపెన్ ఏఐ’ (చాట్ జీపీటీని తయారుచేసింది ఈ సంస్థే) గురించి ఎక్కువగా రాసేవారు. ఆ సందర్భంగా సంస్థ ఆంతరంగిక విషయాలూ తెలిశాయి. ఎవరెవరు పెట్టుబడులు పెట్టిందీ, సంస్థ ఎలా ఎదుగుతున్నదీ దగ్గర నుంచి గమనించారు. అదీ ఈ పుస్తక రచనకు నేపథ్యం. తన అనుభవానికి తోడు 300లకు పైగా ఇంటర్వ్యూలు, ఈ-మెయిల్స్, వ్యక్తిగత సందేశాలను ఆధారంగా తీసుకున్నారు. ఇంటర్వ్యూలిచ్చిన వారిలో సగానికి పైగా ఓపెన్ ఏఐ సంస్థలో పనిచేసినవాళ్లే. మిగిలినవాళ్లు ఇతర టెక్ సంస్థల్లో పనిచేస్తూ సామ్ ఆల్ట్‌మన్‌కి సన్నిహితంగా ఉన్నవాళ్లు. 2023 నవంబరులో జరిగిన సామ్ ఆల్ట్‌మన్ తొలగింపు ఉదంతంతో పుస్తకాన్ని మొదలెట్టారు కరెన్. బోర్డు సభ్యులు ఎంతో మల్లగుల్లాలు పడి తీసుకున్న ఆ నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాల్సి వచ్చిందంటే ఆల్ట్‌మన్ ఎంతటి శక్తిమంతుడో ఆలోచించమంటుంది కరెన్ పుస్తకం.



ఎవరీ సామ్ ఆల్ట్‌మన్?

సిలికాన్ వ్యాలీ గోల్డెన్‌బోయ్‌గా మారిన సామ్ ఆల్ట్‌మన్ సంపన్నుల ఇంట పుట్టారు. తండ్రి మెకింతోష్ కంప్యూటర్ కొనిస్తే ఎనిమిదేళ్లకే కోడింగ్ నేర్చుకున్నారట. పందొమ్మిదో ఏట స్టాన్‌ఫర్డ్‌లో డిగ్రీ చదువు మధ్యలో ఆపేసి ‘లూప్ట్’ అనే సోషల్ నెట్‌వర్క్ ప్రారంభించారు, 30 మిలియన్ డాలర్ల పెట్టుబడులు సేకరించారు. 2012లో దాన్ని అమ్మేసి స్టార్టప్‌లకు పెట్టుబడులు పెట్టే వై కాంబినేటర్‌లో భాగస్వామిగా చేరి అధ్యక్షుడయ్యారు. 2015లో ఎలాన్ మస్క్, సామ్ ఆల్ట్‌మన్, ఇల్యా సట్‌స్కీవర్ మరికొందరు కలిసి కృత్రిమమేధ గురించి పరిశోధన చేయడానికి; సురక్షితమైన, మానవాళికి ఎంతో ఉపయోగకరమైన ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్‌ని అందరికీ అందుబాటులోకి తేవడానికి ‘ఓపెన్ ఏఐ’ అనే లాభాపేక్ష లేని సంస్థను ప్రారంభించారు. ఇతర సంస్థలతో కలిసి పనిచేస్తూ, పరిశోధనాఫలాలను అందరికీ అందుబాటులో ఉంచాలన్నది తొలినాళ్ల ఆశయం. వ్యవస్థాపకులే కాకుండా మైక్రోసాఫ్ట్‌తో సహా పలువురు ఇందులో పెట్టుబడులు పెట్టారు. 2019లో ఆల్ట్‌మన్ సంస్థ సీఈవో అయ్యారు. పోటీ, భద్రత లాంటి కారణాలు చెబుతూ క్రమంగా ఆశయాన్ని పక్కదోవ పట్టించారు. సాంకేతిక, వ్యాపార ప్రపంచాల పనితీరును బాగా అర్థం చేసుకున్న ఆల్ట్‌మన్ టాలెంట్‌తోపాటు సంపదనీ సంస్థలో కూడబెట్టారు. ఇతర కంపెనీలను స్వాధీనం చేసుకున్నారు. లాభాపేక్ష లేకుండా మొదలైన సంస్థని 500 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు.

కేసు పెట్టిన మస్క్

ఆల్ట్‌మన్ ధోరణి నచ్చక మస్క్‌తో సహా పలువురు బయటికి వెళ్లిపోయారు. ప్రజోపయోగం నుంచి లాభాపేక్ష వైపు మళ్లినందుకు 2024లో ఎలాన్ మస్క్ ఓపెన్ ఏఐ సీఈవో మీద కేసు పెట్టారు. కంపెనీ ప్రగతికి అడ్డుపడుతూ తమ ఉత్పత్తులను వ్యక్తిగత లబ్ధికి వాడుకుంటున్నారంటూ మస్క్ మీద ఎదురు కేసు నమోదైంది. కంపెనీని కొనడానికి సైతం మస్క్ ముందుకు రాగా అది అమ్మకానికి లేదని సమాధానమిచ్చారు. మస్క్ పెట్టిన కేసు విచారణ వచ్చే ఏప్రిల్‌లో మొదలవనుంది. ఆల్ట్‌మన్ మరెన్నో సంస్థల్ని ప్రారంభించారు, కొన్ని వందల కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. టాలెంట్‌నీ పెట్టుబడుల్నీ ఆకర్షించడంలో ఆల్ట్‌మన్ నైపుణ్యానికి ఎవరూ సాటిరారంటారు కరెన్. ‘నిండా నరమాంస భక్షకులున్న దీవిలో సామ్‌ని కనక వదిలేసి ఓ అయిదేళ్ల తరవాత వెళ్లి చూస్తే అతడా దీవికి రాజై ఉంటాడు...’ అన్న పాల్ గ్రాహమ్ వ్యాఖ్యకు వత్తాసు పలుకుతుంది కరెన్ వివరణ. 575 పేజీల ఈ పుస్తకం సిలికాన్ వ్యాలీ నిపుణులు ఎంత శక్తిమంతులో చెబుతుంది. పవర్ స్ట్రగుల్‌ని వివరిస్తుంది. ఓపెన్ ఏఐ సంస్థ వ్యవహారాన్ని సామ్రాజ్యవాదంతో పోలుస్తూ ముఖ్యంగా నాలుగు విధానాలను ప్రస్తావించారు కరెన్. మానవాళి శ్రేయస్సు కోసమని చెప్పడం, తమవి కాని వనరుల్ని స్వాధీనం చేసుకోవడం(డేటా, నీరు, కరెంటు), శ్రామికశక్తి దోపిడి, నిపుణ మానవ వనరులను కేంద్రీకృతం చేయడం... లాంటివాటి గురించి విస్తృతంగా చర్చించారు.

ఓపెన్ ఏఐ మాత్రమే కాకుండా కృత్రిమమేధపై పలు సంస్థలు లోతైన పరిశోధనలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమాజం మీద ఏఐ ప్రభావం ఏంటి, ఎలాంటి నష్టాలున్నాయి; వివక్ష, పౌరహక్కులకు సంబంధించి ఎలాంటి పక్షపాత వైఖరిని ఏఐ మోడల్స్‌లో నిక్షిప్తం చేస్తున్నారు... లాంటివి చర్చించాల్సిన సమయమిది. అది మరచి ఒక పక్క చాట్‌జీపీటీ మోజు, మరోపక్క సర్వరోగనివారిణిలా అన్ని సమస్యలకీ ఏఐనే పరిష్కారం అన్నట్లుగా జరుగుతున్న ప్రచారంలో కొట్టుకుపోతున్న సమాజం గురించి కరెన్ ఆవేదన అర్థవంతమైనదే.

- డి.పద్మశ్రీ



నిర్ణయం మనదే

చదువుతో మొదలెట్టి ఇష్టమైన కెరీర్‌లో కుదురుకునే వరకు రకరకాల అనుభవాలు, అవరోధాలు ఎదురవుతాయి. పరీక్ష బాగా రాయలేకపోవడం, ఇంటర్వ్యూలో వైఫల్యం, ఆఫీసులో మన ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం... పలు కారణాలు అసంతృప్తికి దారితీస్తాయి. తిరస్కరణ తీవ్ర అశాంతిని రగిలిస్తుంది. ఆ పరిస్థితిలో ఇక చేయగలిగిందేమీ లేదనుకుంటే... మన గురించి చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. అలా కాకుండా ఆ అసంతృప్తినే పట్టుదలగా మార్చుకుని కొత్త ప్రయాణం ప్రారంభిస్తే... ఒక ఫరారీ, ఒక లంబోర్ఘీనీ, ఒక పగానీ తరవాత విజయగాథ మీదే కావచ్చు!

ఎన్జో ఫరారీ రేసింగ్ డ్రైవర్‌గా తన ప్రయాణాన్ని ఆల్ఫా రోమియో అనే ప్రఖ్యాత కంపెనీలో ప్రారంభించాడు. అద్భుతమైన ప్రతిభతో రాణిస్తూ రేసింగ్ టీమ్ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. సంస్థకు ఎన్నో విజయాలు సాధించిపెట్టాడు. అయితే కొంతకాలానికి ఆ సంస్థలో అతడికి ఆశించిన స్వేచ్ఛ, గౌరవం దక్కలేదు. అసంతృప్తితో అక్కడి నుంచి బయటపడ్డాడు. ఆల్ఫా రోమియోను మించిపోయేలా ఏదైనా చేయాలనుకున్నాడు. కార్ల తయారీ రంగంలో ప్రవేశించి ఫరారీ కార్లతో ఎవరూ ఊహించని విజయాన్ని అందుకున్నాడు. ట్రాక్టర్ల కంపెనీతో అప్పటికే మంచి పేరు తెచ్చుకున్న ఫెరూచో లంబోర్ఘీనీ ఓరోజు ఫరారీ దగ్గరికి వచ్చి ‘మీ కార్ల క్లచ్ వ్యవస్థలో చిన్న సమస్య ఉంది. దాన్ని నేను పరిష్కరిస్తాను’ అన్నాడట. ‘ట్రాక్టర్లు తయారు చేసుకునే నువ్వు నా కారుకు వంక పెడతావా? అసలు నీకు కార్ల గురించి తెలుసా’ అంటూ ఫరారీ వెక్కిరించి పంపించాడని చెబుతారు. ఈ అవమానం ఫెరూచోని పెద్ద నిర్ణయమే తీసుకునేలా చేసింది. రేయింబగళ్లు కష్టపడి కొద్ది నెలల వ్యవధిలోనే లంబోర్ఘీనీ లగ్జరీ కార్లను తయారు చేశాడు. విజయం సాధించాడు. ఫెరూచో కంపెనీలోనే సాంకేతిక విభాగంలో పనిచేసేవాడు హొరేషియో పగానీ. కార్బన్ ఫైబర్‌తో కార్లను తయారుచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఫెరూచోకి సలహా ఇచ్చాడు. అది చాలా ఖరీదైన వ్యవహారమని పగానీ సలహాను తోసిపుచ్చింది లంబోర్ఘీనీ యాజమాన్యం. తన ఆలోచన పట్ల నమ్మకంతో ఆ అసంతృప్తిని అధిగమించి బయటికి వచ్చిన పగానీ సొంత కంపెనీ ప్రారంభించాడు. కార్బన్ ఫైబర్ టెక్నాలజీతో కార్లను తయారుచేసి ఆటోమొబైల్ రంగంలో ఒక మేలిమలుపునకు శ్రీకారం చుట్టి ప్రపంచ గుర్తింపు పొందాడు.

ఎన్జో ఫరారీ, ఫెరూచో లంబోర్ఘీనీ, హొరేషియో పగానీ... ఒకరి తరవాత ఒకరు అందరూ అవమానాలను, అవరోధాలను పక్కకు నెట్టి తమను తాము నిరూపించుకునేందుకు ప్రయత్నించి గెలిచినవారే. వాళ్లు తమకు దక్కాల్సిన గౌరవం దక్కలేదనో, తమ ఆలోచనకు విలువివ్వలేదనో కుంగిపోలేదు. అవమానించారని విచారిస్తూ కూర్చోలేదు. అవతలి వాళ్లమీద కోపం, అసూయ పెంచుకోలేదు. కేవలం తమ సామర్థ్యాన్ని నమ్ముకున్నారు. పట్టుదలగా పరిశ్రమించారు. విజేతలై నిలిచారు. నెపమంతా ఎదుటివాళ్ల మీద వేసి బాధితుల స్థానంలో ఉండిపోతామా... జీవితాన్ని మన చేతుల్లోకి తీసుకుని సత్తా చాటుతామా అన్న నిర్ణయం మనదే కదా!

- రమేశ్ కుమార్ నారగోని



దయతో కూడిన చిన్న మాట, కరుణతో కూడిన చిరునవ్వు, ఒక చిన్న సాయం, ప్రేమపూర్వకమైన చిన్న ఆలోచన... ఇలాంటి చిన్న చిన్న అంశాలే జీవితానికి చాలా పెద్ద మేలు చేస్తాయి.

- సరోజినీ నాయుడు

మాటే మంత్రం

తల వెనక తలంత బలగం ఉన్నా ఒక్కరూ కష్టకాలంలో ఆదుకోలేదు... అంటారు. ఈ కాలంలో ఎంతటి సంపదనైనా ఆర్జించవచ్చు కానీ కష్టంలో మనకోసం నిలబడేవారిని సంపాదించుకోవడం కష్టమే. అలా సంపాదించుకోవడం మన ప్రవర్తన, సంస్కారం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది.

కత్తికన్నా పదునైంది నాలుక. రాముణ్ని బలంతో గెలవడం కష్టం అనుకున్న రావణుడు ఆయనను మానసికంగా దుర్బలుణ్ని చేయాలనుకున్నాడట! మాయాసీతను సృష్టించి యుద్ధస్థలికి తీసుకుని వచ్చి, రాముడితో ‘ఈ సీత కోసమే కదా నువ్వు యుద్ధం చేస్తున్నది. ఇదిగో ఈమెను ఇప్పుడే చంపేస్తాను చూడు’ అని ఆయన కళ్ల ముందే మాయాసీత ప్రాణం తీశాడట. అది చూసి రాముడు ఖిన్నుడయ్యాడనే గాథ ఒకటి ప్రచారంలో ఉంది. ఆయుధం చేయలేని పని ‘మాట’ చేస్తుందన్నది ఈ కథ అంతరార్థం. భారతయుద్ధంలో శల్య సారథ్యంతో కర్ణుడు నిర్వీర్యం కావడం అందరికీ తెలిసిందే. సముద్రాన్ని దాటడం తనవల్ల కాదంటాడు హనుమంతుడు. కానీ అతడికి ఆ శక్తి ఉందని కీర్తిస్తే అవలీలగా సంద్రాన్ని దాటాడు. సత్కార్యానికైనా వినాశనానికైనా... మాటే సాధనం అవుతుంది ఎప్పుడూ!



అంతర్యామి

మాటల వల్లనే మనం మంచి స్నేహితులను, హితులను, బంధువులను, ఆత్మీయులను సంపాదించుకోగలుగుతాం. ఆ విధంగా ‘మాట’ను సద్వినియోగపరుచుకోవడం మన చేతుల్లోనే ఉంది. అందుకు నయాపైసా ఖర్చు కాదు. కానీ అదే మాటను నయవంచనకు ఉపయోగిస్తే రావణుడిలా వినాశనం తప్పదు. విభీషణుడు మొదటిసారి శరణుకోరి రాగానే, అతణ్ని క్షమించవద్దని, మాయమాటలు చెబుతున్నాడని అందరూ రాముణ్ని వారిస్తారు. కానీ రాముడు సాదరంగా ఆహ్వానిస్తాడు. దాంతో నమ్మినబంటులా విభీషణుడు సంపూర్ణ సాయం చేస్తాడు. ఇక్కడ కూడా రాముడి మృదువైన మాటే ఆయనకు అండగా నిలిచింది.

ఒకసారి నవ్వు, ఏడుపు నేను గొప్పంటే కాదు, నేను గొప్ప అని గొడవపడ్డాయట. మనిషి సంతోషంగా ఉన్నప్పుడు నవ్వుతాడు, ఎవ్వరైనా సంతోషాన్నే కోరుకుంటారు కాబట్టి నేనే గొప్పదాన్ని అంటుంది నవ్వు. ‘నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించే వారూ ఉంటారు. నిజానికి దుఃఖంలోనే ఆత్మీయుల మనోభావాలు బయటపడతాయి కాబట్టి నేనే గొప్పదాన్ని’ అంది ఏడుపు. ఈ తగవు చూసి నవ్వుకున్న దేవుడు వాటిని ఒక ఇంటికి తీసుకెళ్లి చూడమంటాడు. రోజంతా కూలిపని చేసి వచ్చిన తల్లి బిడ్డకు అన్నం తినిపిస్తూ ‘ఆకలితో ఉండి ఉంటావు తినమ్మా’ అంటుంది. బిడ్డ ఆ ముద్దను తల్లి నోట్లోనే పెడుతూ ‘నీకూ ఆకలవుతుంది కదమ్మా, నువ్వు తిను’ అంటుంది. ఆ తల్లి ముఖంలో నవ్వు, కళ్లనిండా ఆనందబాష్పాలు. ‘చూశారుగా. ఇలా మీరిద్దరూ కలిసిన క్షణాలే అపురూపం. ఆ బిడ్డ మాటే అందుకు కారణం’ అంటాడు దేవుడు.

ఆచితూచి వాడితే మాటే మంత్రమవుతుంది. అలా మాట్లాడేవాడు కాబట్టే రాముణ్ని మృదుభాషి, మధురభాషి, మందస్మితభాషి, హితభాషి... అంటారు. మాటకున్న శక్తిని గౌరవించి మంచి పనులకు దాన్ని వినియోగించే వారే చరితార్థులవుతారు.

- నామని సుజనాదేవి



ఆర్థిక పరిణతి!

కొవిడ్ గడ్డు కాలం తరవాత భారతీయ కుటుంబాలు పొదుపు, మదుపుపై మరింతగా దృష్టి సారిస్తున్నాయి. 2020లో ఈక్విటీ మార్కెట్లో 3.1 కోట్ల మంది మదుపరులు ఉంటే, నిరుడు వారి సంఖ్య 11 కోట్లకు చేరింది. సమర్థవంతమైన రుణ మార్కెట్లు మూలధన వ్యయాలను తగ్గించుకుంటూ, ప్రజల నుంచి పొదుపును సమీకరిస్తాయి. కుటుంబాలకు స్థిరమైన ఆదాయాలు లభించేలా ఉత్పత్తులను చేపడతాయి. ఈ విషయంలో ఇండియా పరిణతి సాధించడం విశేషం. ఈ క్రమంలో దేశంలో నగదుతో పాటు, డబ్బు రూపంలోకి మార్చుకోదగిన ‘ఫైనాన్షియల్ అసెట్స్’ విషయంలో చాలా మార్పు వస్తోంది. 2019తో పోలిస్తే 2025 ఆర్థిక సంవత్సరంలో ఫైనాన్షియల్ అసెట్స్ ఏ విధంగా ఉన్నాయంటే (శాతాల్లో)...

ఫైనాన్షియల్ అసెట్స్	2019	2025
నగదు	8.6	7.2
డిపాజిట్లు	46.3	39.6
బీమా, పెన్షన్ ఫండ్స్	28.6	29.6
ఈక్విటీ, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్	15.7	23

(ఆధారం: ఎన్ఎస్ఈ ఎకనామిక్ పాలసీ, రీసెర్చ్ విభాగం నివేదిక)


మహాసాగరంలో మంచి మిత్రుడు

సెషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ ప్యాట్రిక్ హెర్మినీ ఇటీవల భారతదేశంలో పర్యటించారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి యాభై ఏళ్లయిన సందర్భంగా ఆయన భారత యాత్ర చేపట్టారు. హెర్మినీ రాకతో ఇరుపక్షాల దౌత్య సంబంధాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ముఖ్యంగా హిందూ మహాసముద్రంలోని ద్వీప, తీరప్రాంత దేశాలతో భద్రత, ఆర్థికపరమైన సంబంధాలను పటిష్ఠపరచుకోవడానికి భారత్ చేపట్టిన మహాసాగర్ వ్యూహాన్ని హెర్మినీ పర్యటన మరింత ముందుకు తీసుకువెళ్లనుంది.

సెషెల్స్ అధ్యక్షుడిగా నిరుడు అక్టోబరులో బాధ్యతలు స్వీకరించిన ప్యాట్రిక్ హెర్మినీ ఇండియాకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన దిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల వృద్ధి గురించీ, ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యల గురించీ చర్చించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతోనూ భేటీ అయ్యారు. అయితే, ఈ సందర్భంగా మోదీ సెషెల్స్‌కు 17.5 కోట్ల డాలర్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. ఈ నిధులతో సెషెల్స్‌లో ప్రజలకు గృహవసతి, ఎలక్ట్రిక్ వాహనాలు, వృత్తివిద్యా శిక్షణ, రక్షణ, సముద్ర భద్రత కల్పిస్తారు. ఆరోగ్యం, వాతావరణ పరిశోధన, ఐటీ, ఎలక్ట్రానిక్స్, సుపరిపాలన రంగాల్లో రెండు దేశాల మధ్య ఏడు అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. వచ్చే అయిదేళ్లలో రెండు దేశాల మధ్య సహకార వృద్ధికి రోడ్‌మ్యాప్‌ను నిర్ణయించామని హెర్మినీ ప్రకటించారు.

సముద్ర నిఘాకు కీలకం

స్వయంగా వైద్యుడైన డాక్టర్ హెర్మినీ దిల్లీ నుంచి చెన్నై వెళ్లి, అక్కడి సిమ్స్ ఆస్పత్రి ఛైర్మన్ రవి పచ్చముత్తుతో సమావేశమయ్యారు. సెషెల్స్‌లో దీర్ఘకాలిక ప్రాతిపదికపై ఆరోగ్య వసతుల అభివృద్ధికీ, వైద్య పర్యాటకానికీ భారత్ తోడ్పడే విషయమై చర్చించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యం, ఆస్పత్రి వసతుల విస్తరణ, డిజిటల్ ఆరోగ్య సేవల్లో భారత్ సహకారాన్ని సెషెల్స్ కోరుతోంది. హెర్మినీ ముంబయిలో భారత నౌకారవాణా మంత్రి సర్బానంద సోనోవాల్‌తో సమావేశమై పెట్టుబడులు, పరస్పర సహకార విస్తరణ గురించి చర్చించారు. సెషెల్స్ హిందూ మహాసముద్రంలో కీలక రవాణా మార్గాలకు చేరువలోనే ఉంది. ఈ ద్వీప దేశానికి సముద్రంలో సువిశాల ప్రత్యేక ఆర్థిక మండలం ఉండటం విశేషం. సముద్ర దొంగలు, ఉగ్రవాదుల నుంచి సరకు రవాణా నౌకలకు భద్రత కల్పించడంలో సెషెల్స్ కీలక పాత్ర పోషించగలదు.



అందుకనే భారత్ ఈ ద్వీప దేశంతో రక్షణ బంధాన్ని పెంచుకుంటోంది. 2005, 2014 సంవత్సరాల్లో సెషెల్స్‌కు టోపాజ్, కాన్‌స్టంట్ అనే రెండు పహారా బోట్లను అందించింది. భారత తీరరక్షక దళం(కోస్ట్‌గార్డ్) సముద్ర చోరులు, ఉగ్రవాదులను వేగంగా అడ్డుకోవడానికి ఉపయోగించే హెర్మిస్ బోటునూ సెషెల్స్‌కు బహూకరించింది. సముద్రంపై నిఘాకు రెండు డార్నియర్ విమానాలను సైతం సెషెల్స్‌కు దిల్లీ అందజేసింది. తీరం నుంచి సముద్రంలో తిరిగే నౌకలు, బోట్లపై నిఘా వేయడానికి 2015లో ఆరు రాడార్లను అందజేయడమే కాకుండా, వాటికి మరమ్మతులు కూడా ఇండియానే చేస్తోంది. ఉభయ సైన్యాలు కలిసి ఇంతవరకు పదిసార్లు సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించాయి. 2021 ఏప్రిల్‌లో భారత్ జోరోయాస్టర్ అనే మరో వేగవంతమైన పహారా బోటును సెషెల్స్‌కు ఇచ్చింది. విదేశీ నేతలు వచ్చినప్పుడు, వారి గౌరవార్థం పేల్చే రెండు ఫిరంగులు, వాటి మందుగుండును అందించాల్సిందిగా సెషెల్స్ చేసిన విజ్ఞప్తిని భారత్ మన్నించింది. 2022 మేలో వాటిని బహూకరించింది. సముద్ర దొంగలు, ఉగ్రవాదులతో పాటు మాదకద్రవ్య దొంగరవాణా ముఠాల కార్యకలాపాలను అడ్డుకోవడానికి భారత్, సెషెల్స్‌లు చేతులు కలుపుతున్నాయి.

సౌర విద్యుదుత్పత్తికీ సహకారం

‘సాంకేతిక-ఆర్థిక సహకార ఒప్పందం’ కింద మిత్ర దేశాలకు ఇండియా సాంకేతిక శిక్షణ కోర్సులను అందిస్తోంది. ఇలా తర్ఫీదు పొందినవారిలో ఒక శాతం మంది సెషెల్స్‌కు చెందినవారే. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సెషెల్స్ అభివృద్ధికి రూ.19 కోట్లు కేటాయించారు. 2021 ఏప్రిల్‌లో అక్కడి సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం దిల్లీ 35 లక్షల డాలర్లు అందించింది. సెషెల్స్ ప్రభుత్వ కార్యాలయాల పైకప్పు మీద సౌర ఫలకాలు అమర్చి విద్యుదుత్పాదన చేయడానికీ, ప్రజల ఇళ్లపై 300 కిలోవాట్ల సౌర ఫలకాలు అమర్చడానికీ, నేలపై ఒక మెగావాట్ సౌర విద్యుత్కేంద్రం నిర్మాణానికీ ఈ నిధులను వెచ్చించారు. సెషెల్స్‌లో మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారికి చికిత్స అందించేందుకు 2023లో భారత్ నాలుగు మెథడోన్ వ్యాన్లను బహూకరించింది. హెర్మినీ తాజా పర్యటన వల్ల భారతదేశ మహాసాగర్ పథకంలో సెషెల్స్ ప్రత్యేక స్థానం మరింత బలపడిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద ఉభయ దేశాల మధ్య సహకారం కొత్త అధ్యాయంలోకి ప్రవేశించింది.

- అరుణిం భుయాన్

నీలాల నింగి

హాయ్ ఫ్రెండ్స్..! మనకు ఆకాశం, చందమామ, నక్షత్రాలు అంటే భలే ఇష్టం కదూ! తాతయ్య, నానమ్మ ఆకాశంలోని చందమామను చూపిస్తూ కథలు చెబితే చక్కగా వింటాం. మరి ఆ నింగి నీలి రంగులో ఎందుకు ఉంటుందన్న అనుమానం మీకు ఎప్పుడైనా వచ్చిందా?

కొన్ని సంవత్సరాల క్రితం ఈ సందేహం మన శాస్త్రవేత్తలకు వచ్చింది నేస్తాలూ! అందుకే దానికి కారణాలు కనుక్కోవడానికి ప్రయత్నించారు. అందుకు చాలా సమయమే పట్టింది. సూర్యుడి నుంచి వచ్చే కాంతి ఇంద్రధనుస్సులో ఉండే ఏడు రంగుల కలయిక అన్నమాట. వాతావరణంలో వాయువులు, ధూళి కణాలు ఉండటం వల్ల సూర్యకాంతి భూమి మీదకు ప్రవేశించేటప్పుడు అన్ని వైపులకు వ్యాపిస్తుంది. కొన్ని రంగులు చిన్న తరంగాల ద్వారా మరికొన్ని పొడవైన తరంగాల గుండా ప్రయాణిస్తాయి. నీలి రంగుకు మిగతా రంగుల కన్నా వేవ్‌లెంత్ తక్కువ ఉండటం వల్ల గాలిలోని చిన్న అణువుల ద్వారా ఎక్కువగా వ్యాపిస్తుంది. అందుకే



మనకు ఆకాశం నీలి రంగులో కనిపిస్తుంది. మరి సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో ఎందుకు ఆకాశం ఎరుపు, నారింజ రంగులో ఉంటుందనే కదా మీ సందేహం! ఆ సమయంలో సూర్యుడు మన కంటిచూపునకు చాలా దూరంగా ఉంటాడు. అప్పుడు సూర్యకాంతి వాతావరణంలో చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుంది. దానివల్ల అందులోని నీలి రంగు చెల్లాచెదురైపోతుంది. అందుకే ఉదయం, సాయంత్రం ఆకాశం మనకు ఆ రంగుల్లో కనిపిస్తుందన్నమాట. ఇతర గ్రహాలపైన ఆకాశం ఎలా ఉంటుందనేది అక్కడి వాతావరణం మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు అంగారక గ్రహంపై కార్బన్‌డయాక్సైడ్ ఎక్కువగా ఉండటం వల్ల పగలు ఆకాశం ఎరుపు లేదంటే నారింజ రంగులో ఉంటుంది. సూర్యాస్తమయం సమయంలో నీలి, బూడిద రంగుల్లో కనిపిస్తుంది.

దాగున్న పదమేది?

ఇక్కడ ఇచ్చిన ప్రతి పదంలో ఒక వస్తువు పేరు దాగుంది. అదేంటో కనిపెట్టండి.

1. NETWORK
2. CAPTAIN
3. BAGGAGE
4. PENCIL
5. KEYWORD
6. SPOT

జవాబు: 1.NET 2.CAP 3.BAG 4.PEN 5.KEY 6.POT




హృదయాలు గెలుచుకున్నారు!

నేలపై అటు ఆరుగురు.. ఇటు ఆరుగురు కూర్చున్నారు. లొంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో బాల్‌ను గాల్లో గింగిరాలు కొట్టించారు. దూసుకొస్తున్న బంతిని వేగంగా ప్రత్యర్థుల కోర్టు లోకి పంపుతూ హోరాహోరీగా తలపడ్డారు. చివరికి ఆ 12 మంది అక్కడున్న వందల హృదయాలను గెలుచుకున్నారు. గురువారం విశాఖపట్నంలోని గోపాలపట్నంలో దివ్యాంగుల సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో ప్రతి జట్టు ఆత్మవిశ్వాసంతో ఆడింది. పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈ పోటీలు నిర్వహిస్తోంది. విధి రాత కారణంగా నడవలేకపోతున్న క్రీడాకారులు పోటీలో పాల్గొని ఎంతో ఒడుపుగా ఆడారు. వారు పాయింట్లు సాధించిన ప్రతిసారి స్టేడియం చప్పట్లతో హోరెత్తింది.

- ఈనాడు, విశాఖపట్నం



మరో 114 రఫేల్ యుద్ధ విమానాలు

(మొదటి పేజీ తరువాయి)

డీఏసీ తాజాగా ఆమోదం తెలిపింది. రఫేల్ యుద్ధవిమానాలతో పాటు.. వాయుసేన కోసం క్షిపణులు, ఎయిర్-షిప్ బేస్డ్ హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ (ఏఎస్-హెచ్‌ఏపీఎస్), నౌకాదళం కోసం ఆరు అమెరికా తయారీ బోయింగ్ పీ8-ఐ నిఘా విమానాలు, సైన్యం కోసం వైభవ్ యాంటీ ట్యాంక్ మైన్ల కొనుగోలు, టీ-72 ట్యాంకుల మరమ్మతుల వంటి ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి. రూ.3.60 లక్షల కోట్లలో రఫేల్‌ల కోసం నిర్దిష్టంగా ఎంత వ్యయం చేయబోతున్నారనే విషయాన్ని రక్షణ శాఖ వెల్లడించలేదు. అయితే ఆ మొత్తం రూ.2.90 లక్షల కోట్ల నుంచి రూ.3.15 లక్షల కోట్ల మధ్య ఉంటుందని అంచనా.

18 మినహా..

రఫేల్‌లకు సంబంధించిన బహుళ ప్రయోజనకర యుద్ధవిమానాల (ఎంఆర్‌ఎఫ్‌ఏ) ప్రాజెక్టులో భాగంగా 18 యుద్ధవిమానాలను దసో ఏవియేషన్ (రఫేల్ తయారీ సంస్థ) ఫ్రాన్స్‌లోనే పూర్తిస్థాయిలో సిద్ధం చేసి (ఫ్లైఅవే కండిషన్‌లో) మన దేశానికి సరఫరా చేస్తుంది. మిగతా 96 రఫేల్‌లను భారత్‌లో తయారుచేయనున్నారు. వీటి ఉత్పత్తిలో 50 శాతానికి పైగా స్వదేశీ కంటెంట్‌ను (దశలవారీగా) ఉపయోగిస్తారు.

మెక్రాన్ పర్యటనలో ఒప్పందం!

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఈ నెల 17 నుంచి మన దేశంలో పర్యటించనున్నారు. అప్పుడే ఈ ప్రాజెక్టుపై ఇరు దేశాలు అంతర్ ప్రభుత్వ ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయి. అంతకంటే ముందు ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ రఫేల్‌ల కొనుగోలుకు ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. అయితే కొనుగోలు వ్యయం, ఇతర ఆయుధ ప్యాకేజీలపై దసో ఏవియేషన్‌తో రక్షణ శాఖ ఇంకా సంప్రదింపులు జరపాల్సి ఉంది. కాబట్టి ఈ ఏడాది ముగిసేలోపు ఈ ఒప్పందానికి సంబంధించి లాంఛనప్రాయ కాంట్రాక్టు ఖరారయ్యే అవకాశాలు తక్కువే.

దీర్ఘకాలంగా ప్రతిపాదనల్లో..

మధ్యస్థాయి బహుళ ప్రయోజనకర యుద్ధవిమానాల (ఎంఎంఆర్‌సీఏ) కొనుగోలు కోసం వాయుసేన 1990ల్లోనే వేట ప్రారంభించింది. అందులో భాగంగా 2004లో 'సమాచారం కోసం వినతి (ఆర్‌ఎఫ్‌ఐ)'ని జారీ చేసింది. ఆపై వేగం పెంచి.. ఎంఎంఆర్‌సీఏ కొనుగోలుకు దాదాపు 13 ఏళ్ల కిందట గ్రౌండ్‌వర్క్ పూర్తిచేసింది. కానీ ఆ ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. చివరకు ఫ్రాన్స్ నుంచి 36 రఫేల్‌ల కొనుగోలుకు 2016లో మోదీ సర్కారు ఒప్పందం కుదుర్చుకుంది. లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన ఎఫ్-21, బోయింగ్‌కు చెందిన ఎఫ్/ఎ-18, యూరోఫైటర్ టైఫూన్‌లను కాదని రఫేల్‌ల కొనుగోలుకు భారత్ మొగ్గుచూపింది. ఆపై- 1,800 కోట్ల డాలర్ల వ్యయంతో మరో 114 రఫేల్‌లను కొనేందుకు 2019 ఏప్రిల్‌లో వాయుసేన ఆర్‌ఎఫ్‌ఐ జారీ చేసింది. రక్షణ రంగంలో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద కొనుగోలు కార్యక్రమంగా అప్పట్లో దాన్ని అందరూ పేర్కొన్నారు.

- వాయుసేనకు అనుమతించిన ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య 42 కాగా, ప్రస్తుతం కేవలం 31 స్క్వాడ్రన్లే ఉన్నాయి.
- నౌకాదళం కోసం రూ.64 వేల కోట్లతో 26 మెరైన్ వేరియంట్ రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసేందుకు భారత్ నిరుడు ఒప్పందం కుదుర్చుకున్న సంగతి గమనార్హం.

8 డోర్నియర్‌ల కొనుగోలుకు హాల్‌తో ఒప్పందం

తీరరక్షక దళం కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) నుంచి 8 డోర్నియర్ విమానాలను కొనుగోలు చేసేందుకు రక్షణ శాఖ గురువారం రూ.2,312 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది.

మద్యంలో రూ. 3,200 కోట్లు.. చిన్న అవినీతి కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఉంచుకొని మీరు (బెయిల్ కోసం) మరో కొత్త కాలం వేచి చూడాలి" అని సూచించారు. రంజిత్‌కుమార్ స్పందిస్తూ "మద్యం సరఫరా విషయంలో పిటిషనర్ మద్యం కంపెనీలకు, ప్రభుత్వ కార్పొరేషన్‌కు మధ్య సంధానకర్తగానే వ్యవహరించారు. ఈ వ్యవహారంలో డబ్బు అందినవారిని ఎవరినీ ఇప్పటివరకూ అరెస్టు చేయలేదు. అప్పటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి (ఏ-2), ప్రత్యేకాధికారి డి.సత్యప్రసాద్ (ఏ-3), నాటి వైకాపా ఎంపీ వి.విజయసాయిరెడ్డి (ఏ-5)ను ఇంతవరకూ నిర్బంధించలేదు. ఈ కేసులో మొత్తం 51 మంది నిందితులున్నారు" అని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

ఆ పెద్దమనుషులంతా బెయిల్ మీదే

న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు కొనసాగిస్తూ రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో పిటిషనర్ ప్రతినిధిగా పనిచేసిన రూ.50-60 కోట్లను విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డిలకు అందజేసినట్లు పేర్కొన్నారని, ఇప్పుడు ఆ పెద్ద మనుషులంతా బెయిల్ మీద ఉన్నారని చెప్పారు. నిందితులందరిపై దర్యాప్తు పూర్తిచేసిన తర్వాత ఇప్పటివరకూ నాలుగు చార్జిషీట్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. పిటిషనర్ లోపలుండి ఇప్పటికే దాదాపు 300 రోజులైనందున బెయిల్ ఇవ్వాలని కోరారు. పిటిషనర్‌కు బెయిల్ ఇచ్చినట్లయితే జీవితం ఆరు నెలలు కూడా లోపల లేరని పేర్కొన్నారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అందుకు విముఖత వ్యక్తం చేశారు. మరికొంత కాలం వేచిచూడాలని సూచించారు. 'వారంతా మీ కర్మలు, దుష్కర్మల (డీడ్స్ అండ్ మిస్‌డీడ్స్) లబ్ధిదారులు" అని వ్యాఖ్యానించారు.

బ్యూరోక్రాట్లను అరెస్టు చేయకపోవడం దురదృష్టకరం

''పిటిషనర్ కాంట్రాక్ట్ మీద ఐటీ సలహాదారుగా నియమితులైన ప్రైవేటు వ్యక్తి. ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయి హోదాను అనుభవించినవారిని అరెస్టు చేయలేదు" అని రంజిత్‌కుమార్ వాదించగా సీజేఐ స్పందిస్తూ "వాళ్లను అరెస్టు చేయొద్దని మేం చెప్పలేదు. వారిని అరెస్టు చేయకపోతే అది చాలా దురదృష్టకరం. వారి పాత్ర లోతుగా ఉన్నా తప్పించుకున్నారేమో. బ్యూరోక్రాట్ల నైపుణ్యతతో కుట్ర, కుమ్మక్కు లేకుండా ఇంతటి భారీ అవినీతి చేయడం ఎలా సాధ్యం? రాజకీయ పక్షపాతం (పొలిటికల్ ఫేవరిటిజం)తో ఇలాంటి ఉన్నతస్థానాలు అనుభవిస్తున్నవారే.. తుది నిర్ణయాలు తీసుకునేవారికి సహకరిస్తున్నారు. ఇదేమీ చిన్న అవినీతి కాదు. మిగతావాళ్లు బెయిల్ మీద విడుదలైనంత మాత్రాన మిమ్మల్నీ విడుదల చేయాలనేమీ లేదు. అందువల్ల బెయిల్ ఇవ్వడం లేదు" అని స్పష్టం చేశారు. రాష్ట్రప్రభుత్వానికి కేసును నోటీసు జారీ చేయాలని న్యాయవాది చేసిన విజ్ఞప్తిని సీజేఐ తోసిపుచ్చారు. ప్రతివాది తరఫు న్యాయవాదులు ఇక్కడే ఉన్నందున నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. రంజిత్‌కుమార్ వాదనలు కొనసాగిస్తూ "ముప్పిడి అవినాష్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయని కారణంగా... పిటిషనర్‌ను జైల్లో ఉంచుతూ పోతారా?" అన్నారు. ఆ వాదనను సీజేఐ తోసిపుచ్చారు. "అవినాష్‌రెడ్డి మీ మనిషి. మీరే ఆయన్ను ప్రాసిక్యూషన్‌కు ప్రోత్సహించాలి. ముందు లొంగిపోమ్మని చెప్పండి" అని స్పష్టం చేశారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు చేయాల్సింది ఏం మిగిలింది ప్రభుత్వపక్షాన్ని అడగాలని రంజిత్‌కుమార్ కోరగా సీజేఐ అందుకు నిరాకరించారు. ప్రతివాది నుంచి ఇంకా తెలుసుకోవాల్సిన అవసరం ఏమీ లేదన్నారు. బ్యూరోక్రాట్లలోనూ కొందరు తమ ప్రత్యేకాధికారాలను ఉపయోగించి మేనేజ్ చేసుకున్నారేమో అన్నారు. మీరు అడుగుతున్న కొందరు వ్యక్తులు వాళ్లతో సన్నిహితంగా కలిసి పనిచేస్తుండొచ్చని, అది దురదృష్టకరమని పేర్కొన్నారు. అంతిమంగా రంజిత్‌కుమార్ స్పందిస్తూ ఈ కేసు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని, అందువల్ల ఉపసంహరించుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేశారు. తగిన సమయంలో బెయిల్ కోసం ట్రయల్ కోర్టు/ హైకోర్టులకు వెళ్లే స్వేచ్ఛనిస్తున్నట్లు పేర్కొంటూ విచారణ ముగించారు.

పరారీలో అవినాష్.. మీకు బెయిలివ్వలేం

జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి జోక్యం చేసుకుంటూ "ఇందులో అసలైన వ్యక్తి ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ-7). అతను మీ నీడ. మీరు తరలించిన డబ్బుకు సంబంధించిన కంపెనీకి అవినాష్‌రెడ్డి నేతృత్వం వహిస్తున్నారు. ఇప్పుడు ఆ వ్యక్తి పరారీలో ఉన్నందున ప్రస్తుత పరిస్థితుల్లో మీకు బెయిల్ మంజూరు చేయడం సరికాదు" అన్నారు. "రూ.3200 కోట్లు... చిన్న మొత్తమేమీ కాదు" అని సీజేఐ వ్యాఖ్యానించారు. న్యాయవాది రంజిత్‌కుమార్ బదులిస్తూ ఇప్పటికే ఛార్జిషీట్లు దాఖలు చేసినందున తదుపరి విచారణ కోసం నిందితుడు అవసరం ఉండదన్నారు. సీజేఐ స్పందిస్తూ "సాధారణంగా అయితే బెయిలు పరిగణనలోకి తీసుకోవాలని మీరు చెప్పిన అంశాలు పరిశీలించేవాళ్లం. కానీ మీరు ఇందులో చాలా ప్రభావవంతమైన వ్యక్తి" అని పేర్కొన్నారు. ఆ వాదనతో జోరెడ్డి న్యాయవాది విభేదించారు. అతను సంబంధిత మాత్రమేనని పేర్కొన్నారు. న్యాయమూర్తులు స్పందిస్తూ 'ఉద్యోగులే కాదు... ఆర్కిటెక్ట్' అని వ్యాఖ్యానించారు. న్యాయవాది రంజిత్‌కుమార్ స్పందిస్తూ ఈ కేసులో కుట్రదారు అయిన నాటి ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శికి బెయిల్ ఇచ్చారని పేర్కొన్నారు. సీజేఐ స్పందిస్తూ ఇందులో ఓలిక్ మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ-11), నెస్ట్ మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ-13) అన్నది షెల్ కంపెనీలని, అసలు మనుగడలోనే లేవని గుర్తుచేశారు. పిటిషనర్‌కు ముప్పిడి అవినాష్‌రెడ్డితో ఉన్న సంబంధాల గురించి హైకోర్టు తీర్పులోని పేరా 47లో స్పష్టంగా ఉందని చెప్పారు.

వైకాపా హయాంలో ఆయుష్ శాఖ నిర్వీర్యం

- గత 20 నెలల్లో రాష్ట్రానికి కేంద్రం నుంచి భారీగా నిధులు
- కొత్తగా రెండు ఆయుర్వేద, ఒక యునానీ కళాశాలలు
- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్



ఆయుష్‌శాఖ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్. చిత్రంలో ఆయుష్ డైరెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ఆయుష్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద జగన్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కేంద్రం నుంచి నిధులు రాలేదన్నారు. మూడేళ్ల పాటు కనీసం ప్రతిపాదనలు కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించకుండా ఆయుష్ శాఖను నాశనం చేశారన్నారు. గత 20 నెలల్లో ఆయుష్‌కు జవసత్వాలు అద్దేందుకు కేంద్రం నుంచి భారీగా నిధులను తీసుకొచ్చామన్నారు. విజయవాడ ఆటోనగర్‌లో ఆయుష్ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. కేంద్ర బడ్జెట్లో ప్రకటించిన మూడు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)ల్లో ఒకటి తిరుపతిలో ఏర్పాటు చేయాలని కోరగా, కేంద్రం సానుకూలంగా స్పందించినట్టు సత్యకుమార్ తెలిపారు. అమరావతి రాజధాని పరిధిలో రెండు జాతీయ సంస్థల ఏర్పాటుకు స్థలాలను ఖరారు చేసినట్టు వెల్లడించారు. రూ.750 కోట్లతో అపెక్స్ నేచురోపతి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు శాఖమూరులో 23 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. రూ.100 కోట్లతో సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి (సీఆర్‌ఐవైఎన్) ఏర్పాటుకు గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలో 12.5 ఎకరాలను కేటాయించినట్టు తెలిపారు.

ఆయుష్ మిషన్ కింద రూ.165 కోట్లు..

ఆయుష్ మిషన్ కింద రూ.165 కోట్లను రాష్ట్రానికి కేంద్రం కేటాయించిందని మంత్రి పేర్కొన్నారు. ధర్మవరం, కాకినాడల్లో ఆయుర్వేద వైద్య కళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని వైద్య కళాశాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఒక్కో కళాశాల నిర్మాణానికి రూ.70 కోట్లను వెచ్చించనున్నామన్నారు. రూ.90 కోట్లతో శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, తిరుపతుల్లో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆయుష్ శాఖలో వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న 358 పోస్టులను భర్తీ చేయనున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీని ఏప్రిల్ 1 నుంచి అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయుష్ డైరెక్టర్ కొత్తమాసు దినేష్‌కుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ ప్రభంజనం

ఈనాడు, హైదరాబాద్: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) బుధవారం విడుదల చేసిన కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ ఎకౌంటింగ్ (సీఎంఏ) ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఆల్ ఇండియా స్థాయిలో 5వ ర్యాంకుతో పాటు 50 ర్యాంకులలోపు 25 ర్యాంకులను సాధించారు. సీఎంఏ ఫైనల్‌లో మొదటి 50 ర్యాంకులలో ఆల్ ఇండియా 16, 17, 30, 31, 40 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు మాస్టర్‌మైండ్స్ విద్యా సంస్థల అడ్మిన్ అడ్వైజర్ సీఏ మట్టుపల్లి మోహన్ తెలిపారు. అలాగే సీఎంఏ ఇంటర్‌లో మొదటి 50 ర్యాంకుల్లో 20 మంది విద్యార్థులు 5వ ర్యాంకు నుంచి 49వ ర్యాంకు వరకు సాధించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

16న ఏఎస్‌ఓ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

ఈనాడు, అమరావతి: ఏపీపీఎస్సీ 2023 డిసెంబరు 7న జారీ చేసిన ప్రకటన ద్వారా ఏపీ సచివాలయం, సాధారణ పరిపాలన శాఖలో సహాయ విభాగాధికారి పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 16న ఐదో బ్లాక్ మొదటి అంతస్తులో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొంది. 1-60 ర్యాంకు వరకు ఉదయం 10గంటలు, 61-120 వరకు 11గంటలు, 121-180వరకు మధ్యాహ్నం ఒంటిగంట, 181-218వరకు మధ్యాహ్నం 2గంటలకు హాజరుకావాలని సూచించింది. వయసు ధ్రువీకరణపత్రం, విద్యార్హతల పత్రాలు, కుల ధ్రువీకరణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, ప్రతిభావంతులైన క్రీడాకారులు సంబంధిత అధికార యంత్రాంగం నుంచి పొందిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.

ఐటీ, ఐటీఈఎస్‌లకు పలు మినహాయింపులు

ఈనాడు, అమరావతి: ఐటీ, ఐటీ ఆధారిత రంగా(ఐటీఈఎస్)లకు మినహాయింపులు కల్పిస్తూ కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రిస్క్ సంస్థల పరిధి నుంచి వీటికి మినహాయింపు ఇచ్చింది. ఉద్యోగుల హాజరు, పని గంటలు, సెలవులు, వేతనాలు, ఇతర సేవా నిబంధనలకు సంబంధించిన రికార్డులను డిజిటల్ రూపంలో నిర్వహించుకోవచ్చు. అవసరమైనప్పుడు అధికారుల పరిశీలనకు ఉంచాలి. మహిళా ఉద్యోగులను రాత్రిపూట షిఫ్టుల్లోకి అనుమతించవచ్చు. వారి భద్రత, రవాణా, ఇతర సంక్షేమ చర్యలను సంస్థ తప్పనిసరిగా నిర్ధారించాల్సి ఉంటుంది. మినహాయింపులను ఎప్పుడైనా రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని కార్మిక శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఫీజుల బకాయిలు విడుదల చేసినందుకు సీఎంకు అపెక్మా కృతజ్ఞతలు

ఈనాడు, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఒకేసారి రూ.1200 కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ఏపీ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్(అపెక్మా) అధ్యక్షులు కోయే సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలతో ఇంజినీరింగ్ కళాశాలలకు ఆర్థిక కష్టాల నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది. సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్న కళాశాలలకు ప్రస్తుతం ఈ నిధులు ఆక్సిజన్ లాంటివి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా 2024-25 సంవత్సరం మొత్తం బకాయిలను చెల్లించేందుకు ఉత్తర్వులిచ్చారు. వీటితోపాటు 2023-24 సంవత్సరానికి సంబంధించి గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు, పీజీ కోర్సుల ఫీజుల డబ్బులు త్వరలో విడుదల చేయాలి. కొత్తగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియ సైతం త్వరగా పూర్తి చేయాలి" అని కోరారు.

ఆరోగ్యం..ఆనందం లక్ష్యంగా 'హ్యాపీ సండే'!

- ఈ కార్యక్రమం పునరుద్ధరణకు ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, అమరావతి: ప్రజల్లో ఆరోగ్యం, ఆనందాలను పెంచే 'హ్యాపీ సండే' కార్యక్రమం రాష్ట్రంలో మళ్లీ ప్రారంభం కానుంది. ప్రతి నెలా రెండు, నాలుగో ఆదివారాల్లో అన్ని నగరాలు, పట్టణాల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు గురువారం విడుదల చేశారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో నిర్వహించిన 'హ్యాపీ సండే' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. వైకాపా ప్రభుత్వంలో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు. 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

ఫీజు లేదు...ఆనందమే హద్దు

- ప్రతి నెలా 2, 4వ ఆదివారాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల మధ్య పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- స్థానిక పరిస్థితులను బట్టి ఈ సమయంలో అధికారులు మార్పులు చేయొచ్చు.
- కార్యక్రమం పూర్తిగా ఉచితం.
- ఈ నెల 22న మొదటి హ్యాపీ సండే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లో నిర్వహించనున్నారు.

కార్యక్రమం లక్ష్యాలివి...!

- యోగా, ధ్యానం, నడక, సైక్లింగ్ ద్వారా ఆరోగ్యంపై అవగాహన కల్పించి ప్రోత్సహించడం.
- ఆటలు, కథలు, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించనున్నారు.
- మొక్కలు నాటడం, వీధులు శుభ్రం చేయడం వంటి కార్యక్రమంతో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం కల్పించడం.
- సంగీతం, నృత్యం, కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో నూతనోత్సాహాన్ని నింపడం.
- తేలికపాటి వ్యాయామాలతో వృద్ధుల్లో కార్యక్రమాల పట్ల ఆసక్తి కల్పించడం.




మెడమల్లి బాలాజి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన కుటుంబ సభ్యులు, న్యాయవాదులు

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజి ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాదులు, ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పీపీ మెండ లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఇన్‌ఛార్జి అధ్యక్షుడు రఘువీర్, కోర్టు సిబ్బంది హాజరయ్యారు. జస్టిస్ బాలాజిని పలువురు న్యాయవాదులు, బంధువులు, శ్రేయోభిలాషులు కలిసి అభినందనలు తెలిపారు.

కీలక కేసుల్లో వాదనలు వినిపించిన అనుభవం: జస్టిస్ బాలాజిది వ్యవసాయ కుటుంబం. 1972 మే 29న వైఎస్సార్ కడప జిల్లా రాజంపేట మండలం శేషన్నగారిపల్లి గ్రామంలో లక్ష్మీనరసమ్మ, సుబ్బయ్యనాయుడు దంపతులకు బాలాజి జన్మించారు. పాఠశాల విద్య రాజంపేటలో, డిగ్రీ తిరుపతి శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని పడాల రామారెడ్డి న్యాయ కళాశాలలో న్యాయవిద్యను అభ్యసించారు. వీరి కుటుంబంలో ఆయనే మొదటి తరం న్యాయవాది. 1997లో అప్రెంటిస్ చేశారు. 1998 ఏప్రిల్ 9న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వద్ద ప్రాక్టీసు ప్రారంభించారు. జస్టిస్ బాలాజికి భార్య కల్యాణి, కుమారుడు సుచంద్రహాస్, కుమార్తె లక్ష్మీశ్వేత ఉన్నారు. రాజ్యాంగ సంబంధ అంశాలతోపాటు సివిల్, క్రిమినల్, సర్వీసు, కమర్షియల్ కేసుల విషయంలో ఆయనకు అపార అనుభవం ఉంది. ఎన్నో కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. 2004 నుంచి 2006 వరకు అప్పటి ఏజీ కార్యాలయానికి ఎటాచ్ అయి ఏజీపీగా పనిచేశారు. 2018-19 మధ్య విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సెల్‌గా సేవలందించారు. వివిధ బ్యాంకులు, పలు ప్రతిష్ఠాత్మక సంస్థలకు స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేసిన అనుభవం జస్టిస్ బాలాజికి ఉంది.

బంగారం కోసం ఆటో డ్రైవర్ ఘాతుకం

ఉపాధ్యాయురాలిపై కత్తితో దాడి.. నగలతో పరారీ

గంటల వ్యవధిలో నిందితుడి అరెస్టు



తీవ్రగాయాలైన ఉపాధ్యాయురాలిని 108లోకి ఎక్కిస్తున్న సిబ్బంది, స్థానికులు

గూడూరు పట్టణం, నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: బంగారం కోసం ఉపాధ్యాయురాలిపై ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు మండలం చెమిర్తి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గూడూరులోని అశోక్‌నగర్‌కు చెందిన ఉపాధ్యాయురాలు హరిత.. తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం గొట్టికాడు ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. రోజులాగే ఉదయం గూడూరులోని వాటర్‌ట్యాంకు వద్ద వెంకటగిరి వెళుతున్న ఆటో ఎక్కారు. అందులోని మిగిలిన ప్రయాణికులు మార్గంమధ్యలో చెన్నూరు, తిప్పవరప్పాడు వద్ద దిగేశారు. ఆమె ఒక్కరే ఉండడంతో చెమిర్తి సమీపంలో ఆటో డ్రైవర్ వాహనాన్ని ఆపి ఒక్కసారిగా ఉపాధ్యాయురాలి గొంతుపై, చేతిపైన కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఆమె మెడలో ఒకటిన్నర సవర్ల బంగారం లాక్కొని, రోడ్డు పక్కన తోసేసి పరారయ్యాడు. రక్తగాయాలతో ఉన్న ఆమెను స్థానికులు గమనించి 108లో గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. డీఎస్పీ గీతాకుమారి ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించిన తర్వాత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయురాలిపై దాడి చేసిన నిందితుడిని గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ప్రకటించారు. నిందితుడిని అరెస్టు చేసి, ఆటో స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

జాహ్నవి కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీలో చేరారు. 2023 జనవరి 23న రాత్రి ఆమె రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన జాహ్నవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవే 'ఆమె ఓ సాధారణ వ్యక్తి.. ఈ మరణానికి విలువ లేదు' అంటూ అపహాస్యం చేసిన వ్యాఖ్యలు బాడీ కెమెరాలో రికార్డయ్యాయి. దీనిపై అప్పట్లో ఇరు దేశాల్లోనూ తీవ్ర విమర్శలు రావడంతో ఆయనను విధుల నుంచి తొలగించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో వేగ పరిమితి గంటకు 40 కి.మీ. కాగా కెవిన్ 119 కి.మీ. వేగంతో వాహనం నడిపాడని దర్యాప్తులో తేలింది. జాహ్నవిని కారు ఢీకొట్టినప్పుడు ఆమె 100 అడుగుల దూరం ఎగిరిపడినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి.



జాహ్నవి మృతిపై గతంలో అమెరికాలో నిరసన తెలుపుతున్న స్థానికులు

మూడు రోజుల క్రితమే ఆగిన తండ్రి గుండె

జాహ్నవి మృతితో ఆమె కుటుంబం తీవ్ర వేదనలో ఉండిపోయింది. గుంతకల్లులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆమె తండ్రి శ్రీకాంత్ ఆ ఆవేదనతోనే మూడు రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం ఆదోనిలో అంత్యక్రియలు నిర్వహించారు. పరిహారం విషయాన్ని జాహ్నవి కుటుంబ సభ్యుల వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. వారు సమాధానం ఇచ్చేందుకు నిరాకరించారు. జాహ్నవి కుటుంబ సభ్యులకు అమెరికా అధికారులు ఫోన్‌చేసి మార్చిలో అక్కడకు రావాలని సమాచారం ఇచ్చారని, పరిహారం విషయం తమకు సామాజిక మాధ్యమాల ద్వారానే తెలిసిందని వారి దగ్గరి బంధువు ఒకరు పేర్కొన్నారు.

17 జూనియర్ లెక్చరర్ పోస్టులకు సంబంధించిన ఫలితాలను ఏపీ పీఎస్సీ త్వరలో ప్రకటించనుంది. గతే దాది డిసెంబర్ 16, 17 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన, కంప్యూటర్ నైపుణ్య పరీక్షను కమిషన్ నిర్వహించింది.



రాష్ట్రానికి పరిశ్రమలు రావడం వైకాపాకు ఇష్టం లేదు

విశ్వసనీయత ఉన్న ఐదు కంపెనీలకు 99 పైసలకు భూములు ఇచ్చాం

- వారి నుంచి కప్పు టీ మాత్రమే తీసుకున్నా
- ఉర్సాకు 99 పైసలకే భూములు ఇవ్వలేదు
- నిరూపిస్తే.. రాజీనామా చేస్తా
- మండలిలో మంత్రి లోకేశ్ సవాల్



ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఐటీ కంపెనీలకు 99 పైసలకే భూములు కేటాయించే అంశం మండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సవాళ్లు.. ప్రతిసవాళ్లకు దారితీసింది. భూముల కేటాయింపు వెనుక లాలూచీ ఏంటో చెప్పాలని వైకాపా ఆరోపించింది. దీనిపై మంత్రి లోకేశ్ ఘాటుగా స్పందించారు. 'భూముల కేటాయింపులో లాలూచీ పడాల్సిన అవసరం మాకు లేదు. యువతకు ఉపాధి కల్పించాలనే ఇదంతా చేశాం. నన్ను విమర్శించాలనుకుంటే ఒక్క విషయం ఉంది. నేను బాంబేహౌస్‌కు వెళ్లి.. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిశా. వారు కప్పు టీ ఇచ్చారు. కాగ్నిజెంట్ కార్యాలయానికి వెళ్లినప్పుడు వాళ్లు నాకు ఒక కప్ కేక్ ఇచ్చారు. దావోస్‌లో వారి కార్యాలయానికి నా పుట్టినరోజున వెళ్లాను. వారు కప్ కేక్‌లో.. క్యాండిల్ పెట్టి నాతో బ్లో చేయించారు. ఇంతకుమించి నేను లబ్ధి పొందినట్లు వైకాపా నిరూపిస్తే రాజీనామా చేస్తా' అని ఘాటుగా సమాధానమిచ్చారు. విశ్వసనీయత ఉన్న ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించామని.. వాటిద్వారా 65వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుపై వైకాపా ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. మంత్రి సమాధానం ఇస్తుండగా వైకాపా ఎమ్మెల్సీలు అరుపులతో సభలో గందరగోళం సృష్టించారు. నేడు దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో.. 25.3% ఏపీకి వస్తున్నాయని లోకేశ్ చెబుతుంటే.. వైకాపా ఎమ్మెల్సీలు '23' అంటూ (గతంలో తెదేపా గెలుపొందిన స్థానాల సంఖ్య) నినాదాలు చేశారు. లెక్కల్లోకి వెళ్తే 151 కాస్తా 11 అయ్యింది. దీనిపైనా చర్చిద్దామా? అంటూ మంత్రి విమర్శించారు. మంత్రి వివరణ ఇస్తున్నా పట్టించుకోకుండా వైకాపా సభ్యులు వాకౌట్ చేశారు.

ఆరో కంపెనీకి ఎక్కడ ఇచ్చామో నిరూపించాలి

'ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూములు ఇచ్చామని వైకాపా ఎమ్మెల్సీలు ఆరోపిస్తున్నారు. దీన్ని నిరూపించాలి. టీసీఎస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకే 99పైసలకు భూములిచ్చాం. ఆరోపణలు చేసి బయటకు వెళ్లడం కాదు. ఆరోపణలు ఉపసంహరించుకోవాలి' అని లోకేశ్ ఘాటుగా స్పందించారు.

ఉపాధి కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం

'ఎన్నికల హామీ ప్రకారం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ విధానం. ఐదు కంపెనీలకు భూ కేటాయింపులు అడ్డుకునేందుకు వైకాపా కోర్టులో పిల్ వేయించింది. 2019-24 మధ్య రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచింది. వైకాపా ప్రభుత్వం అమరరాజా బ్యాటరీస్‌ను రాష్ట్రం నుంచి తరిమేసింది' అని మంత్రి వివరించారు.

ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలా.. వద్దా?

సత్వా గ్రూప్‌నకు ఎందుకు భూములిచ్చారని అడుగుతున్నారు. ఒక్కసారి హైదరాబాద్‌కు వెళ్లి చూడండి. గ్రేడ్ 'ఎ' ఐటీ కార్యాలయాలు ఆ సంస్థ నిర్మించింది. దీంతో ఎకోసిస్టమ్ ఏర్పడుతుంది. విశాఖలో గ్రేడ్-ఎ ఐటీ స్పేస్ లేదు.

■ రహేజా మైండ్‌స్పేస్‌కు ఆనాడు హైదరాబాద్‌లో 97 ఎకరాలు చంద్రబాబు కేటాయిస్తే.. అందులో నిర్మించిన భవనాల ద్వారా 10 మిలియన్ చదరపు అడుగులు అందుబాటులోకి వచ్చింది. అందులో ఒక్క ఐటీ రంగంలోనే లక్షమంది ఉపాధి పొందుతున్నారు.

■ బెంగళూరులో ఏఎన్ఎస్ఆర్ సంస్థ నిర్మించిన జీసీసీని నేను చూశా. ఈ కంపెనీ 150 జీసీసీలను నిర్మించింది. వాటిలో 1.40 లక్షల మంది పనిచేస్తున్నారు.

■ ఉమ్మడి రాష్ట్ర సీఎంగా చంద్రబాబు 1994-2004 మధ్య అతి తక్కువ ధరకు హైదరాబాద్‌లో సంస్థలకు భూములు కేటాయించారు. ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టీసీఎస్ నేడు హైదరాబాద్‌లో పనిచేస్తున్నాయి. హైదరాబాద్ జీసీసీ రాజధాని అయ్యిందంటే అక్కడి ఎకోసిస్టమ్ అభివృద్ధే కారణం.

ఉత్తరాంధ్ర యువతకు ఉద్యోగాలు వద్దా

– అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి



'ఉత్తరాంధ్ర ఎంతో వెనుకబడిన ప్రాంతం. అక్కడి యువత ఉపాధి లేక వలస వెళ్తున్నారు. అలాంటి ప్రాంతానికి భారీ పెట్టుబడులతో కూటమి ప్రభుత్వం కంపెనీలు తీసుకొస్తుంటే.. వైకాపా ఎందుకు బాధ పడుతోంది? ఉత్తరాంధ్ర అభివృద్ధి వారికి ఇష్టం లేదా? 99 పైసలకు భూములు మా చుట్టాలకు ఇచ్చామా? భూమి ఇవ్వడం వల్ల యువతకు ఉపాధి వస్తుంది' అని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ స్ఫూర్తి

'ప్రధాని నరేంద్రమోదీ నాకు స్ఫూర్తి. టాటా సంస్థ నానో కార్ల తయారీ కేంద్రం తొలుత పశ్చిమబెంగాల్‌లో ఏర్పాటుచేయాలని భావించింది. రాష్ట్రప్రభుత్వం భూమిలిచ్చేందుకు ఆసక్తి చూపలేదు. ఆనాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీ ఫోన్లో టాటా సంస్థ ప్రతినిధులతో మాట్లాడి.. 99 పైసలకే భూమిలిస్తామని చెప్పి పరిశ్రమను గుజరాత్‌కు తీసుకెళ్లారు. దీంతో అక్కడ మొత్తం ఎకోసిస్టమ్ ఏర్పడింది. దాన్ని ఆదర్శంగా తీసుకుని విశాఖను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం' అని పేర్కొన్నారు.

మాధవరావుకు బీపీ పెరిగింది

'వైకాపా ఎమ్మెల్సీ మాధవరావు గతంలో బాగానే ఉండేవారు. ఆయనకు ఇప్పుడు బీపీ పెరిగినట్లుంది. ఆయనకు బీపీ బిళ్లలు ఇవ్వండి. అప్పుడు చెప్పింది ఓపికగా వింటారు' అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు.


రియల్ ఎస్టేట్ కంపెనీకి 99 పైసలకేనా..

– బొత్స సత్యనారాయణ, మండలిలో ప్రతిపక్ష నేత

'రియల్ ఎస్టేట్ కంపెనీకి 99 పైసలకే భూములు ఎలా ఇస్తారని మేం అడుగుతున్నాం. హైదరాబాద్, బెంగళూరుల్లో పారదర్శకతతో బిడ్డింగ్ ద్వారా ఆయా సంస్థలు భూములు కొంటున్నాయి. విశాఖలో గీతం యూనివర్సిటీకి రూ.5,000 కోట్ల విలువైన భూములను ఎలా కట్టబెడతారు? గీతం ఎంతమందికి ఉద్యోగాలు ఇస్తుంది?' అని నిలదీశారు. ఈ ప్రభుత్వ భూదోపిడీకి నిరసనగా వాకౌట్ చేస్తున్నట్లు బొత్స పేర్కొన్నారు.

గవర్నర్ ప్రసంగం వేళ

కాగితాలు వెదజల్లిన వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి: స్పీకర్



ఈనాడు, అమరావతి: గవర్నర్ ప్రసంగానికి నినాదాలతో అడ్డుతగిలి, కాగితాలు చించి వెదజల్లిన వారు ఆత్మ విమర్శ చేసుకోవాలని, సభా గౌరవాన్ని పెంచకపోయినా ఫర్వాలేదుకానీ, దిగజార్చే హక్కు మనకు లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గురువారం ప్రశ్నోత్తరాల అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. బుధవారం గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిన ఘటన తనకు బాధ కలిగించిందని అన్నారు. 'విద్యార్థుల్లో చట్టసభలపై అవగాహన కల్పించేందుకు వారిని సభా కార్యక్రమాలు చూసేందుకు ఆహ్వానించాను. వారికి రాజకీయాలు, చట్టసభలు, ప్రజాప్రతినిధులపై సానుకూల అభిప్రాయం కలగాలనేది దీని ఉద్దేశం. 200 పాఠశాలలు, కళాశాలలు ముందుకొచ్చాయి. అందరికీ అవకాశం ఇస్తున్నాం. కానీ గవర్నర్ ప్రసంగాన్ని నినాదాలతో అడ్డుకొని, కాగితాలు చించి వెదజల్లితే.. ఆ విద్యార్థులు ఏం నేర్చుకుంటారు? మన గురించి వాళ్లు ఏమనుకుంటారు? పసిపిల్లల మనసులో చట్టసభలంటే చులకనభావం ఒకసారి ఏర్పడితే దానిని తొలగించలేం. ఈ ఆలోచన నన్ను కలచివేసింది' అని స్పీకర్ పేర్కొన్నారు. వేల మంది పోటీపడితే 175 మందికే ఇక్కడ కూర్చునే గౌరవం దక్కిందన్నారు. మనం ఏ పనిచేస్తున్నా, ఈ విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మన నడవడికను నిత్యం ప్రజలు చూస్తుంటారని, అవకాశం దొరికినప్పుడు బుద్ధిచెప్పడానికి వెనకాడరని పేర్కొన్నారు.

సమావేశాలను వీక్షించిన విద్యార్థులు



అసెంబ్లీ సమావేశాలను చూసేందుకు వచ్చిన విద్యార్థులు

వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు గురువారం అసెంబ్లీలో సందడి చేశారు. ప్రతిరోజూ కొంతమంది విద్యార్థులు సభా వ్యవహారాలను గ్యాలరీ నుంచి ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏర్పాట్లు చేయించారు. ఇందులో భాగంగా పలువురు విద్యార్థులు సభకు వచ్చి, చర్చా కార్యక్రమాలను తిలకించారు. సభ విరామ సమయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు విద్యార్థులతో ముచ్చటించారు.

విధ్వంసం నుంచి వికాసం దిశగా..

- రాష్ట్ర ప్రతిష్ఠను నిలబెట్టేలా ప్రభుత్వ చర్యలు
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో చర్చ

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కూటమి ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. వైకాపా పాలనలో జరిగిన విధ్వంసాన్ని రూపుమాపి, రాష్ట్ర ప్రతిష్ఠను తిరిగి నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పెట్టుబడులు సాధించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వర్గాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం శాసనసభలో చర్చ సందర్భంగా కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడారు.

పోలవరం-నల్లమలసాగర్‌తో సీమకు నీళ్లు

–కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం

ఈ ప్రభుత్వం రాయలసీమలో అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఏటా సముద్రంలో కలుస్తున్న 3 వేల టీఎంసీల గోదావరి నీరు సద్వినియోగమయ్యేలా చేపడుతున్న పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుతో సీమకు మేలు జరగనుంది. రాయలసీమలో అప్పటికే నిర్మాణంలో 120 ప్రాజెక్టులను 2019లో జగన్ సీఎం అయ్యాక రద్దు చేయించారు. అంతటి దుర్మార్గానికి పాల్పడిన జగన్‌కు.. సీమ గురించి మాట్లాడే హక్కులేదు.

జంగిల్‌రాజ్ నుంచి రాష్ట్రానికి విముక్తి

–మద్దిపాటి వెంకటరాజు, గోపాలపురం

వైకాపా జంగిల్‌రాజ్ విధానాల కారణంగా రాష్ట్రం అరాచక, విధ్వంసక, ఆటవిక పాలనకు బలైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజధాని అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల సృష్టితో స్పష్టమైన పురోభివృద్ధి కనిపిస్తోంది. విద్యా ప్రమాణాలు బాగా పెరిగాయి.

ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం తీర్మానం చేయాలి

–కొణతాల రామకృష్ణ, అనకాపల్లి

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. ప్రధాని మోదీని సీఎం, డిప్యూటీ సీఎం కలిసి ఈ ప్రతిపాదనను వివరించాలి. రూ.5 వేల కోట్లు కేటాయిస్తే ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తై, ప్రతి ఎకరాకూ సాగునీరు అందుతుంది. నేడు విశాఖపట్నం విభిన్న రంగాల్లో పురోగమిస్తోంది. కొమ్మాది నుంచి భోగాపురం మధ్య మెట్రో రైల్ కారిడార్ పనులు తొలిదశలోనే చేపట్టాలి.

గవర్నర్‌ను అవమానించిన జగన్

–యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం

జగన్ తన ఐదేళ్ల పదవీ కాలంలో ఉన్నన్ని రోజుల కంటే.. ప్రస్తుత సీఎం చంద్రబాబు తొలి వంద రోజుల్లోనే ఎక్కువ రోజులు సచివాలయంలో ఉన్నారు. పాలకుడి నిబద్ధతకు ఇది నిదర్శనం. గురువారం అసెంబ్లీకి వచ్చిన జగన్.. గవర్నర్ ప్రసంగం పూర్తిగా వినకుండానే వెళ్లిపోయి, ఆ పదవిని అవమానించారు.

మహిళా పక్షపాతి సీఎం చంద్రబాబు

– మాధవీరెడ్డి, కడప

డ్వాక్రా సంఘాలకు కూటమి ప్రభుత్వం తిరిగి ప్రాణం పోసింది. ప్రతి సభ్యురాలు వ్యాపారవేత్త కావాలన్న ధ్యేయంతో సీఎం ప్రోత్సాహం అందిస్తున్నారు. మహిళల శక్తి సామర్థ్యాల పట్ల ముఖ్యమంత్రికి అపార నమ్మకముంది. సురక్ష కార్యక్రమం ద్వారా లక్ష మంది మహిళలకు వైద్య పరీక్షలు చేయించి, చికిత్స అవసరమైన వారిని ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నారు.

దళితులు తలెత్తుకునేలా పాలన

–ఎంఎస్ రాజు, మడకశిర

గవర్నర్ ప్రసంగం దళితులు తలెత్తుకునేలా ఉంది. వైకాపా పాలనలో ఎస్సీల సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలను రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం వసతి గృహాల్లో మౌలిక వసతులకు రూ.315 కోట్లు వెచ్చించింది. 130 గురుకులాల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటుచేసింది. ఎస్సీ వర్గీకరణతో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తోంది. ఇంటి నిర్మాణానికి రూ.50 వేలు అదనంగా ఇస్తోంది.

ప్రజల జీవితాల్లో మార్పు సుస్పష్టం

–వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు

సూపర్ సిక్స్ పథకాలు కాగితాలపై రాసిన హామీలు కావు, ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న మార్పులు. తల్లికి వందనం.. ప్రతి తల్లి ముఖంలో చిరునవ్వులు తెప్పించింది. ఉచిత బస్సు ప్రయాణం మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది. కూటమి ప్రభుత్వం ఆడపడచుల భద్రత, భవిష్యత్తుకు భరోసానిస్తోంది. ప్రధాని మోదీ సహకారంతో ఏపీని మళ్లీ నిలబెట్టే దిశగా ముందుకెళ్తోంది.

వాస్తవాలకు దగ్గరగా గవర్నర్ ప్రసంగం

–గౌతు శిరీష, పలాస

గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు దగ్గరగా ఉంది. అమరావతిని దెబ్బతీసేలా వైకాపా నాయకులు చేసిన కుట్రను సామాన్యులకు అర్థమయ్యేలా వివరించింది. అమరావతి, పోలవరం సాకారం దిశగా ఈ ప్రభుత్వ కృషిని తెలియజేసింది.

గీతంకు భూముల క్రమబద్ధీకరణపై.. రాజకీయ రాద్ధాంతం

- ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించేందుకు ఆ సంస్థ సిద్ధంగా ఉంది
- వైకాపాపై విశాఖ జిల్లా ఎమ్మెల్యేల ధ్వజం



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, గణబాబు, గంటా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: విశాఖలోని గీతం విశ్వవిద్యాలయానికి భూముల క్రమబద్ధీకరణను రాజకీయ దురుద్దేశంతోనే వైకాపా నాయకులు అడ్డుకుంటున్నారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించడానికి గీతం యాజమాన్యం సిద్ధంగా ఉన్నప్పుడు వైకాపా వాళ్లకు వచ్చిన నష్టమేంటని నిలదీశారు. భూ కేటాయింపు కోరుతూ 20 ఏళ్లుగా ఆ సంస్థ ప్రభుత్వానికి బహిరంగంగానే దరఖాస్తు చేస్తోందని పేర్కొన్నారు. భూముల కేటాయింపునకు 2010 సెప్టెంబరులో అప్పటి విశాఖ నగరపాలక సంస్థ పాలకవర్గం కూడా ఆమోదం తెలిపిందని వివరించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ(పశ్చిమం) ఎమ్మెల్యే గణబాబు, భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజులతో కలిసి గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. "గీతం అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ. ఆ సంస్థకు భూములు కేటాయిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది" అని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

ఒక్క గీతం విషయంలోనే ఎందుకు?

"ఎన్నో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు అమరావతి, విశాఖ, తిరుపతి తదితర ప్రాంతాల్లో గతంలోనూ, ఇప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం ఒక ధర నిర్ణయించి భూములు కేటాయించింది. వాటిపై లేని అభ్యంతరం, రాజకీయం కేవలం గీతం విశ్వవిద్యాలయం విషయంలోనే ఎందుకు? గీతం వ్యవస్థాపకులు ఎంవీవీఎస్ మూర్తి తెదేపా ఎంపీగా పనిచేశారు. ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్న వ్యక్తి విశాఖపట్నం తెదేపా ఎంపీగా ఉన్నారు. ఆయన లోకేశ్‌కు తోడల్లుడు అవుతారు. ఇదే సాకుతో భూములు ధారాదత్తం చేస్తున్నారంటూ వైకాపా వాళ్లు దిగజారుడు రాజకీయం చేయడం సరికాదు."

– గంటా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

లోకేశ్ తోడల్లుడు కావడం వల్లే

"గీతం విశ్వవిద్యాలయం ఛైర్మన్, విశాఖ ఎంపీ భరత్... మంత్రి లోకేశ్ తోడల్లుడు, బాలకృష్ణ అల్లుడు కావడం వల్లే గీతం భూముల క్రమబద్ధీకరణను వైకాపా వాళ్లు వ్యతిరేకిస్తున్నారు. గతంలో కక్ష సాధింపుతో విశ్వవిద్యాలయం గోడలు కూలగొట్టారు."

– విష్ణుకుమార్‌రాజు, భాజపా శాసన సభాపక్ష నేత

తెదేపా ఆవిర్భావానికి ముందు నుంచే గీతం ఉంది

"తెదేపా ఆవిర్భావానికి ముందు నుంచే గీతం విశ్వవిద్యాలయం ఉంది. ఆ విశ్వవిద్యాలయంలో చదువుకున్న వారు దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వారంతా జే గ్యాంగ్‌లా చుక్క పాలు లేకుండా లక్షల కేజీల నెయ్యి తయారు చేసే వాళ్లు కాదు."

– గణబాబు, విశాఖ(పశ్చిమం) ఎమ్మెల్యే

బొత్స వర్సెస్ మంత్రి పార్థసారథి

- 15% మందికి తల్లికి వందనం అందడం లేదు: బొత్స
- తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ అందరికీ ఇస్తున్నాం
- ఎవరికైనా రాకుంటే.. అప్పీల్ చేసుకోవచ్చు
- శాసనమండలిలో మంత్రి పార్థసారథి వెల్లడి





ఈనాడు, అమరావతి: గవర్నర్ ప్రసంగంలో లేని అంశాలను వైకాపా సభ్యులు ప్రస్తావిస్తున్నారని మంత్రి కె.పార్థసారథి శాసనమండలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా ఎమ్మెల్సీలు తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాల లబ్ధి అందరికీ అందడం లేదని చెప్పడం ఇరు పార్టీల సభ్యుల మధ్య వాదోపవాదాలకు దారితీసింది. తల్లికి వందనం పథకం అందరికీ ఇవ్వలేదని, 15 శాతం మందికి ఇంకా అందాల్సి ఉందని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఒకవేళ ఇందులో తప్పుంటే తన ప్రకటనను ఉపసంహరించుకుని, సభకు క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలందరికీ గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని ఇస్తామని ఎన్నికల హామీలో చెప్పి, అధికారంలోకి వచ్చాక కుటుంబంలో ఒక్కరికే ఇచ్చింది వాస్తవం కాదా? మాట తప్పం, మడమ తిప్పం అని ప్రకటించి, ఇలా చేయలేదా? గత ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద 43 లక్షల మంది పిల్లలకు సాయం చేయగా, ఈ ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని 67.27 లక్షల మందికి వర్తింపజేస్తోంది. ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలున్నా, వారందరికీ ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తున్నాం. ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్నట్లు రూ.7 వేలు ఇవ్వడం లేదు. అర్హుల్లో ఎవరికైనా బ్యాంకు ఖాతాలు లింకు కాకుండా పథకం వర్తించకపోతే.. మళ్లీ అప్పీల్ చేసుకునే అవకాశమిచ్చాం. అన్నదాతా సుఖీభవ కింద కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి.. రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తున్నాం. నాడు వైకాపా ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రూ.7 వేలు మాత్రమే ఇచ్చింది. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి రూ.1,627 కోట్లు వైకాపా ప్రభుత్వం ఎగ్గొడితే.. కూటమి ప్రభుత్వం చెల్లించింది. రైతుకు ధాన్యం డబ్బులను 24 గంటల్లోనే వారి ఖాతాలో జమ చేస్తున్నాం. రైతుకు సొమ్ములు ఎగ్గొట్టిన వైకాపా సభ్యులే సిగ్గు పడాలి' అని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.



శాసనసభలో మంత్రి పయ్యావుల కేశవ్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



శాసనసభలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే బాలకృష్ణ

కొత్త పింఛను ఒక్కటైనా ఇచ్చారా..?: బొత్స

ఈనాడు, అమరావతి: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలైనా ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చెయ్యలేదు. అర్హతగల వృద్ధులు, వితంతువులకు ఒక్క కొత్త పింఛనైనా ఇచ్చారా అని మండలిలో ప్రశ్నిస్తే సమాధానం లేదు' అని శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. మండలి సమావేశం చర్చల అనంతరం మీడియా పాయింట్‌లో విలేకర్లతో గురువారం మాట్లాడారు. 'తల్లికి వందనం రూ.15వేలు అందరికీ అందలేదు. లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయని చెబితే.. అబద్ధం అంటున్నారు. మేమడిగే ఏ ప్రశ్నకూ సరైన సమాధానాలు చెప్పట్లేదు. ఈ ఒంటెత్తు పోకడలు మంచిది కాదు' అని బొత్స వ్యాఖ్యానించారు.

భూముల ధారాదత్తంపై మోదీ, పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలి

వైకాపా ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, బొమ్మి ఇజ్రాయిల్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో రూ.వేల కోట్ల విలువైన భూములు 99 పైసలకే ధారాదత్తం చేస్తున్నారు. రాష్ట్రంలో భూదాహంపై కూటమి పక్ష నేతలు మోదీ, పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలి. ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. ఉన్న పింఛన్లు తొలగించింది. ప్రభుత్వోద్యోగులకు బకాయిలు చెల్లించాలి' అని డిమాండు చేశారు.

ఒక్కరికీ తొలగించలేదు

మంత్రి కొండపల్లి

ఈనాడు, అమరావతి: సామాజిక భద్రత పింఛన్లపై మండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చ జరిగింది. వైకాపా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ.. 2024లో పింఛన్లు పొందుతున్నవారి సంఖ్య 66.34 లక్షలు కాగా, వాటిలో సుమారు 5 లక్షల పింఛన్లు తగ్గించారని ఆరోపించారు. దీనికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానమిచ్చారు. 'గత 20 నెలలుగా ఒక్కరికీ పింఛను తొలగించలేదు. వైకాపా ప్రభుత్వం నిలిపేసిన స్పౌజ్ పింఛన్ల విధానాన్ని పునరుద్ధరించాం. భర్త చనిపోయిన మరుసటి నెలలోనే భార్యకు వృద్ధాప్య పింఛను అందిస్తున్నాం. ఇలా 2.5 లక్షల మందికి లబ్ధి చేకూర్చాం. గత 20 నెలల్లో 4.70 లక్షల మంది చనిపోగా, వారి పింఛన్లే తొలగించాం. ఎవరైనా ఒక నెలలో పింఛను తీసుకోలేకపోయినా.. మరుసటి నెలలో రెండు నెలలది తీసుకునే వీలు కల్పించాం. వైకాపా ప్రభుత్వమే 6 స్టెప్ వాలిడేషన్ పేరుతో పింఛన్లను తొలగించింది. దివ్యాంగులకు ఇచ్చే 8 లక్షల పింఛన్లలో అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయని.. వాటిని మళ్లీ పరిశీలిస్తున్నాం. 1.40 లక్షల మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించి.. వారికి నోటీసులు ఇచ్చాం. ఇప్పటికీ వారికీ పింఛన్లు అందుతున్నాయి. కొందరి నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిశీలించే ప్రక్రియ మళ్లీ చేపట్టాం. వితంతు, వృద్ధాప్య పింఛన్లు కొత్తవి ఇచ్చేందుకు విధివిధానాలు రూపొందించాం. త్వరలోనే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తాం' అని మంత్రి పేర్కొన్నారు.



శాసనసభలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌తో ఎమ్మెల్సీ నాగబాబు

జీవన సూత్రాలు



- ధనవంతుడిగా ఉండు కానీ డబ్బు గురించి ఎక్కువగా మాట్లాడొద్దు.
- శారీరక దారుఢ్యాన్ని సాధించు తప్ప వ్యాయామాన్ని తరచూ ప్రస్తావించొద్దు.
- శక్తిమంతుడుగా ఉండు తప్ప ఎప్పుడూ గొంతు చించుకోవద్దు.
- అపరిపక్వంగా ప్రకటనలు చేయొద్దు.

– సమీర్ ప్రధాన్, ఇన్‌ఫ్లుయెన్సర్

బతికే దారేది.. బతికించే వారేరి?

ఎన్‌హెచ్‌లపై బలితీసుకుంటున్న బ్లాక్‌స్పాట్లు ✪ దిద్దుబాటు చర్యలు లేక వందల ప్రాణాలు గాల్లోకి..

జాతీయ రహదారుల్లో బ్లాక్‌స్పాట్లు హడలెత్తిస్తున్నాయి. తరచూ ప్రమాదాలతో నెత్తురోడుతున్నాయి. వీటి పరిధిలో ప్రమాదకర మలుపులు.. రద్దీ కూడళ్లు.. దారి నిర్మాణ లోపాలు.. కారణాలు ఏవైనా మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. శాఖల సమన్వయం కొరవడిన వేళ.. ప్రాణాలు గాలిలో దీపాల్లా మారాయి.



మూడేళ్లలో 29 మంది...

ఇదీ ఎన్‌హెచ్-16పై రామవరప్పాడు రింగ్ కూడలి... బ్లాక్ స్పాట్. గన్నవరం నుంచి బెంజ్‌సర్కిల్ వెళ్లే వాహనాలు రింగ్ వద్ద ఆగకుండా పోలీసులు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేశారు. ఫ్రీ లెఫ్ట్ వెడల్పు తక్కువగా ఉండడంతో గన్నవరం వైపు వెళ్లే భారీ వాహనాలకు పల్లంగా ఉండటంతో వేగాన్ని నియంత్రించలేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచికలు, సిబ్బంది అరకొరగా ఉండడంతో వాహనాలు అడ్డదిడ్డంగా వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. గత మూడేళ్లలో 50కి పైగా ప్రమాదాలు జరిగితే 29 మంది ప్రాణాలు వదలగా.. 53 మంది గాయాలపాలయ్యారు.



ఏడాదిలో 6 గురు దుర్మరణం

-- ఇదీ మోపిదేవి మండలం కస్తానుపాలెం బ్లాక్‌స్పాట్. నిరుడు ఇక్కడ ఆరు ప్రమాదాలు జరిగి ఆరుగురు మృతి చెందగా.. 9 మందికి గాయాలయ్యాయి.. ఇంత జరుగుతున్నా ప్రమాదాలు నియంత్రించేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

2025లో ప్రమాదాల తీవ్రత ఇలా..

రహదారి	బ్లాక్ స్పాట్లు	జరిగిన ప్రమాదాలు	మృతులు	గాయ పడినవారు
ఎన్‌హెచ్16	21	264	109	197
ఎన్‌హెచ్216	9	100	22	76
ఎన్‌హెచ్65	39	270	120	249
మొత్తం	69	634	251	522

పోలీసులు కనిపించరు..సూచిక బోర్డులూ ఉండవు

ప్రమాద ప్రాంతాలను గుర్తించి... బ్లాక్‌స్పాట్లు అని పేరుపెట్టేశామని.. అధికారులు అనుకోవడమే తప్ప ఎలాంటి కార్యాచరణ ఉండటం లేదు. కొన్ని చోట్ల అది బ్లాక్ స్పాట్ అని కూడా తెలియని దైన్యం. అక్కడ సూచిక బోర్డులూ ఉండవు. కొన్నిచోట్ల డ్రమ్ములు పెట్టినా వాటిపై రేడియం స్టిక్కర్లు కూడా కనిపించవు.. ప్రధాన బ్లాక్ స్పాట్లలోనూ పోలీసులు కనిపించరు. పెట్రోలింగ్ సవ్యంగా జరగదు.

అధికారులకు ఆదేశాలిస్తాం..

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీలు మాట్లాడుతూ, రహదారి భద్రత సమావేశాల్లో బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణపై అధికారులకు ఆదేశాలిస్తాం. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులు వెంటనే పట్టాలెక్కిస్తామన్నారు

ప్రచారం.. ప్రాణసంకటం..

✪ పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ఆలయాల సమీపంలో చాలాచోట్ల స్పీడ్ బ్రేకర్లు లేవు. బెంజ్ సర్కిల్ నుంచి పెనమలూరు వరకు సెంట్రల్ డివైడర్‌పై నాయకుల ఫ్లెక్సీలు పెట్టడంతో యూటర్న్ తీసుకునేటప్పుడు వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

✪ ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్, రవాణా, పోలీసులు, స్థానిక సంస్థలు సమన్వయంగా శ్రమించాలి. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే రహదారి భద్రత సమావేశాల నిర్ణయాల అమలూ అంతంతే..

✪ బాపులపాడు మండలం వీరవల్లి-తేలప్రోలు మధ్య మూడు ఫ్లైఓవర్లపై నిత్యం ప్రమాదాలే. వీరవల్లి దగ్గర కొత్తగా పెళ్లైన జంట కుటుంబంతో దుర్గగుడికి వెళుతుండగా జంక్షన్ వైపు వెళుతున్న కారు డివైడర్‌ను దాటి వచ్చి ఢీకొట్టింది. దంపతులు, మరొకరు బలవగా ఆరుగురు గాయాలపాలయ్యారు.

✪ జగ్గయ్యపేట పరిధిలో 3 బ్లాక్ స్పాట్లు ఉన్నాయి. ఇక్కడ ఏడాదిలో 9 ప్రమాదాలు జరిగి నలుగురు ప్రాణాలు వదిలారు. ఏడుగురు గాయాలపాలయ్యారు.

✪ నందిగామ నియోజకవర్గంలో 20 బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. ప్రమాదాల నియంత్రణకు చర్యల్లేవు. ✪ గొల్లపూడి పరిధిలో 3 బ్లాక్ స్పాట్లు ప్రమాదాలకు కేంద్రంగా ఉన్నాయి. నగరంలో కలిసినా అరకొర పోలీసులే ఉంటున్నారు.

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట, హనుమాన్ జంక్షన్, పటమట

పుడమికి బలం ప్రకృతి ఫలం

సేంద్రియ సాగుతో రైతుల ఇంట సిరులు

రసాయన ఎరువుల వినియోగానికి దూరంగా.. పర్యావరణ పరిరక్షణకు దగ్గరగా జిల్లా రైతులు అడుగులు వేస్తున్నారు. విత్తనం నుంచి కోత దశ వరకు పురుగు మందులు వినియోగించకుండా మంచి దిగుబడులు సాధిస్తున్నారు. - ఈనాడు, అమరావతి

పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుకు చెందిన రైతు గోవర్ధన్ ఎకరన్నరలో సేంద్రియ విధానంలో యాపిల్‌బేర్, కాకర, పొట్ల పండిస్తున్నారు. దుమ్ములోనే ఎకరానికి 400 కేజీల ఘన జీవామృతం, చేప, బెల్లం కలిపిన కషాయం, కోడిగుడ్ల నిమ్మరసంతో తయారు చేసిన కషాయం, పచ్చిమిర్చి, వెల్లుల్లి కషాయం స్వయంగా తయారు చేసుకుని సాగు చేస్తున్నారు. సాధారణంగా యాపిల్‌బేర్ సాగుకు ఎకరానికి రూ.1.5లక్షల వరకు అవుతుంది. గోవర్ధన్ రూ.50వేల ఖర్చుతో 60 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. క్వింటా రూ.7వేలు పలుకుతోంది. ఏడాదికి రావాల్సిన పంట సేంద్రియ సాగుతో 11 నెలలకే వస్తోంది.



రేగు పండ్లతో లాభాల బాట..



పండు మిర్చిలో అధిక దిగుబడి..

పెనుగంచిప్రోలు మండలం శివాపురానికి చెందిన నాగమల్లేశ్వరి ప్రకృతి సాగుతో పండు మిర్చిలో లాభాలు పండిస్తున్నారు. తానే స్వయంగా సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. సాధారణంగా మిర్చి 10-12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సేంద్రియ సాగుతో 20 క్వింటాళ్లకు పైగా దిగుబడి పొందుతున్నారు. సాధారణ పంట క్వింటాకు రూ.20వేలు ఉంటే గొప్ప. మహిళా రైతు మాత్రం క్వింటాల్ మిర్చి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు అమ్ముతున్నారు. సాధారణంగా మిర్చికి తెగుళ్ల బెడద ఎక్కువ. ఎకరానికి రూ.1.5లక్షల పెట్టుబడి అవుతుంది. ఇక్కడ రూ.50వేలతో అద్భుతాలు చేస్తున్నారు.

30వేల మంది రైతులను తయారు చేయడమే లక్ష్యం..

ప్రభుత్వ సేంద్రియ సాగు ప్రగతి సూత్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శంకర్ నాయక్ ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి రైతు సాధికార సంస్థ ద్వారా ఎరువుల తయారీ, సాగు పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. ✪ జిల్లాలోని 288 పంచాయతీల్లో 30వేల మంది రైతులను తయారు చేయడమే లక్ష్యం. ఇప్పటివరకు 20,618 మంది రైతులను సేంద్రియ సాగు వైపు మళ్లించారు. వీరు 20,291 ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ✪ సేంద్రియ పంటలను గుర్తించే విధంగా రైతుల దగ్గర ట్రేసబిలిటీ క్యూఆర్‌కోడ్ విధానం పెట్టారు. ✪ కొనుగోలు చేసే ముందు స్కాన్ చేస్తే ఆ పంట విత్తనం దశ నుంచి ఇప్పటివరకు వాడిన రసాయనాలు, ఎరువులు అన్ని వివరాలు కనిపిస్తాయి.

కదం తొక్కిన కార్మికలోకం



లెనిన్ సెంటర్‌లో సభకు హాజరైన కార్మిక సంఘాల ప్రతినిధులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కార్మిక ఉద్యోగ రైతు, పేద వర్గాల సమస్యలను పట్టించుకోని కూటమి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు ఈశ్వరయ్య, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న వామపక్షాలు, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడంలో భాగంగా రథం సెంటరు నుంచి లెనిన్ సెంటరు వరకు భారీ ర్యాలీని గురువారం నిర్వహించారు. వివిధ సంఘాల నుంచి భారీగా ప్రదర్శనలో పాల్గొన్నారు. పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు జి.కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్, దోనేపూడి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ ఎన్నికలు నేడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు 2,936 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దీని కోసం మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ గ్రంథాలయం, ఏఎస్ రామారావు హాలు, డాక్టర్ కె.ఎల్.రావుభవన్‌లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది న్యాయవాదులను బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకుంటారు. రాష్ట్రంలోని వివిధ బార్ అసోసియేషన్ల నుంచి మొత్తం 143 మంది న్యాయవాదులు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తుండగా బెజవాడ బార్ నుంచి 18 మంది పోటీ చేస్తున్నారు. వీరిలో 5గురు మహిళా న్యాయవాదులు ఉన్నారు. సాధారణ ఎన్నికలను తలపించేలా న్యాయవాదుల ఎన్నికలు పోటాపోటీగా సాగుతున్నాయి.

ఈ దారి కనబడలేదా..
గోడు వినపడలేదా!



ఈ రోడ్డు చూశారా ఎంత దారుణంగా ఉందో. రహదారి మధ్యలో రోడ్డు కోసుకుపోయి భారీ గుంతలు పడ్డాయి. రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై ఎటువెళ్లినా టైర్లు జారి పక్కనే ఉన్న కాలువలో పడిపోవడం ఖాయం. కంచికచర్ల ప్రధాన రహదారి నుంచి నక్కలంపేటకు వెళ్లే మార్గమిది. రాత్రి సమయాల్లో ప్రయాణం చాలా ఇబ్బందిగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు తక్షణమే చేపట్టాలని కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు 19 వరకు గడువు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని అంబేడ్కర్ (సాంఘిక సంక్షేమ శాఖ) గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8, 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (జనరల్/ఐఐటీ-నీట్ విభాగాల్లో) ప్రవేశాలకు బాల, బాలికల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 19వ వరకు గడువు ఉన్నట్టు గురుకులాల విజయవాడ సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గత నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. 5వ తరగతిలో 1,040 ఖాళీలకు 1,013 మంది, ఇంటర్‌లో 960 ఖాళీలకు 1,660 మంది, 6 నుంచి 9 తరగతులకు 858 మంది దరఖాస్తు చేసినట్టు వెల్లడించారు. ఇంకా అర్హత కలిగినవారు, దరఖాస్తు చేసుకోని విద్యార్థులు వెబ్‌సైట్ https:///apbragcet.apcfss.in ద్వారా తెలుసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 0866-2481698లో లేదా సమీపంలోని గురుకుల పాఠశాలల్లో సంప్రదించవచ్చని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పొదుపు ఖాతాకు రూ.4 వేలు
కరెంటు ఖాతాకు రూ.15 వేలు

వెలుగు చూస్తున్న నయాదందా

కరెంట్ ఖాతాలకు లావాదేవీలు, ఉపసంహరణకు పరిమితులు లేకపోవడంతో వీటిని అనామకులతో కూడా నిందితులు తెరిపించారు. డబ్బు ఆశచూపించి పని కానిచ్చారు.. రవికుమార్, స్టీవెన్ సోదరులు. ఒక్కో పొదుపు ఖాతాకు రూ.4 వేలు, కరెంట్ ఖాతాకు రూ.15 వేలు ఇచ్చారు. కరెంటు ఖాతాల విషయంలో బ్యాంకర్లు నిబంధనలు పాటించక పోవడంతో వీరి పని సులువైంది. కనీస తనిఖీలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న చరవాణులు, బ్యాంకు పాస్‌పుస్తకాలు

లేకుండా వీటిని తెరిచేందుకు అనుమతించారు. ఫలితంగా ఈ ఖాతాలతో రూ.కోట్లలో చట్టవిరుద్ధ లావాదేవీలు సాగాయి. తాజాగా అద్దె ఖాతాల వ్యవహారంలో అనేక అంశాలు తేలగా.. ఈఖాతాల వివరాలు కోరుతూనే.. ఫ్రీజ్ చేసేందుకు బ్యాంకులకు పోలీసులు లేఖలు రాశారు.

షాపు బాడుగకని.. బాజీ (ఏ3)తో ప్రధాన నిందితులు కరెంట్ ఖాతా తెరిపించారు. అర్హత లేకపోయినా, సరిగా పరిశీలించకనే బ్యాంకరు ఆమోదించారు. రామలింగేశ్వరనగర్ కట్టపై మూతపడిన ఓ పండ్ల దుకాణం వద్దకు వెళ్లి రవికుమార్, బాజీ వాకబు చేశారు. యజమాని గురించి తెలుసుకుని.. అతని వద్దకు వెళ్లి తాము దుకాణాన్ని అద్దెకు తీసుకుంటామని చెప్పి తాళాలు తెరిపించారు. అక్కడ బాజీ ఫొటోలు దిగాడు. మీసేవా కేంద్రం నుంచి వర్తక లైసెన్సు తీసుకుని బ్యాంకుకు వెళ్లి ఏఎస్‌కే ఫ్రూట్స్ పేరుతో కరెంట్ ఖాతా తెరిచారు.

నిందితులు స్థానికంగా పలువురితో 36 ఖాతాలు తెరిపించారు. ఖాతాలు తెరిచినప్పుడే వారితో సిమ్ కార్డుకూ దరఖాస్తు చేయించి దానినీ తీసుకున్నారు. బ్యాంకు ఖాతాకు అనుసంధాన

13 ఖాతాల్లో లావాదేవీలు..

సిమ్‌ను లావాదేవీలకు ఉపయోగించారు. చెన్నైలో అసలు సూత్రధారి అందజేసిన ఖాతాలనూ కలిపి సుమారు 100 ఎకౌంట్లలో లావాదేవీలు చేశారు. నిందితులు దొరికేవేళకు మూసేసినవిపోగా 13 ఖాతాలు యాక్టివ్‌గా ఉన్నాయి. వీటిలో నాలుగు కరెంట్, 9 పొదుపు ఖాతాలు ఉన్నాయి. వీటికి అనుసంధానమైన 13 సిమ్‌లను ఫోన్లలో వేసి ఓటీపీలు, లావాదేవీలను పర్యవేక్షిస్తున్నారు.

సమస్త సమాచారం నిక్షిప్తం...

వీరు ఖాతాల వివరాలు ల్యాప్‌టాప్‌లో నమోదు చేశారు. ఖాతాల నంబర్లు, పేర్లు, ఫోన్ నంబర్లు, పాస్‌వర్డ్, డెబిట్ కార్డుల నంబర్లు, వాటి పిన్‌లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఐడీ, పాస్‌వర్డ్‌లున్నాయి. ఏబీ వెజిటెబుల్స్ పేరున తెరిచిన ఖాతాలో ఒక్క నెలలోనే రూ.16 లక్షల లావాదేవీలు సాగాయి. ల్యాప్‌టాప్‌లోనే గూగుల్ షీట్‌లో ఏరోజుకారోజు వివరాలను నిందితులు నమోదు చేసేవారు. ఈడేటా క్లౌడ్‌లో స్టోర్ అవుతుంది. ఈ ఫైల్‌కు చెన్నైలోని వ్యక్తికి కూడా రిమోట్ యాక్సెస్ ఉంది. పోలీసులు ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకోగానే గూగుల్‌షీట్‌ను అసలు సూత్రధారులు డిలీట్ చేశారు. - ఈనాడు, అమరావతి

ఆపితే బండి.. బాదుడేనండి..!

పార్కింగ్ పేరుతో విచ్చలవిడి దోపిడీ ✪ పర్యవేక్షణ లేక రెచ్చిపోయి వసూళ్లు

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరపాలక అధికారుల తీరుతో.. దుర్గమ్మ దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. దుర్గగుడి సమీపంలో.. కెనాల్‌రోడ్డు నుంచి బొడ్డుబొమ్మ సెంటర్ వరకు రహదారిపైనే పెయిడ్ పార్కింగ్ పేరుతో ప్రైవేటు గుత్తేదారులకు నగరపాలక సంస్థ కట్టబెట్టింది. ఈ పార్కింగ్‌లో ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వాహనాలను ఆపేందుకు



పార్కింగ్ ప్రదేశం కాకపోయినా.. బెంగళూరు బస్సు డ్రైవరు వద్ద వసూలు

గుత్తేదారుకు అనుమతి ఇచ్చారు? ఏ వాహనానికి ఎంత వసూలు చేయాలి? ఎంత సమయానికి ఎంత? అనే ఏ నిబంధనా ఇక్కడ అమలవడం లేదు. కనీసం ఏది పెయిడ్ పార్కింగ్ ప్రాంతం? ఏది కాదు? ఎంత రుసుం అనే బోర్డులు పెట్టినా.. ప్రైవేటు వసూళ్ల దందా నుంచి భక్తులను కాపాడొచ్చు.

రూ.200 ఇస్తేనే... బెంగళూరు నుంచి 'కె.ఎ.01.ఎస్2444' నంబరు బస్సులో యాత్రికులు తాజాగా దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. ఈ బస్సును కొండ దిగువన ఖాళీ ప్రదేశంలో ఆపారు. వెంటనే ఓ వ్యక్తి వచ్చి.. డ్రైవర్ చేతిలో చీటీ పెట్టి రూ.200 పార్కింగ్ రుసుం కట్టించుకున్నాడు. వాస్తవంగా ఆ బస్సు ఆపిన ప్రదేశం గుత్తేదారుకు సంబంధం లేదు. అయినా.. వచ్చి డబ్బులు కట్టించుకున్నాడు. చీటీపై మూడు గంటలకు రూ.30 అని ఉంటే.. ఏకంగా రూ.200 తీసుకున్నాడు. ఇలాగే.. నిత్యం విచ్చలవిడిగా వసూళ్లు చేస్తున్నారు.

అడిగేవారు లేక..

ఈ పార్కింగ్‌ను దక్కించుకునేందుకు గుత్తేదారులు ఏటా పోటీపడతారు. ఆలయానికి పక్కనే ఉన్నా.. దేవాదాయ సిబ్బంది పర్యవేక్షణ ఉండదు. నగరపాలక సిబ్బంది వచ్చి చూసే పరిస్థితి లేదు. అందుకే.. విచ్చలవిడిగా భక్తుల నుంచి బాదేయవచ్చని పార్కింగ్ దక్కించుకుంటున్నారు.

దుర్గగుడికి అప్పగిస్తే రక్ష.. ఇంద్రకీలాద్రికి పక్కనే ఉండే ఈ పార్కింగ్‌తో భక్తులు తరచూ ఇబ్బంది పడుతూ.. దుర్గగుడి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అది తమ పార్కింగ్ కాదని అధికారులు చెబితే.. భక్తులు గొడవ పడుతున్నారు. ఈ తలనొప్పులన్నీ ఎందుకు.. ఈ పార్కింగ్‌ను మాకే అప్పగించండి.. ఏడాదికి ప్రైవేటు వాళ్లిచ్చే డబ్బు లేవో.. మేమే ఇచ్చేస్తామని ఇటీవల ఆలయ అధికారులు.. నగరపాలికకు ప్రతిపాదించారు. ఆలయానికి అప్పగిస్తే.. పర్యవేక్షణ పెరిగి దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. కానీ.. దీనిపై పాలిక నుంచి ఎలాంటి స్పందనా లేదు.

పంట కాలువలకు 2,892 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్: బ్యారేజీ నుంచి పంట కాలువలకు ఈ నెలాఖరు వరకు సాగు నీటిని విడుదల చేయనున్నారు. రైవస్, ఏలూరు కాలువకు ఇప్పటికే నీటి విడుదలను నిలిపి వేశారు. కేఈబీ, బందరు కాలువలకు మాత్రం కొనసాగుతోంది. బ్యారేజీ నుంచి గురువారం 2,892 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 2,304, కృష్ణా తూర్పు కాలువకు 502, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కులను విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి కేఈబీ కాలువకు 302, బందరు కాలువకు 200 క్యూసెక్కులు ఇస్తున్నారు.

అద్విక మోసం కేసులో ఛార్జిషీట్ సిద్ధం

ఈ నెలాఖరులోగా న్యాయస్థానంలో దాఖలు...

ఈనాడు - అమరావతి: అద్విక ట్రేడింగ్ కేసులో పోలీసులు అభియోగ పత్రం దాఖలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈనెలాఖరులోగా కోర్టులో దాఖలు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఛార్జిషీట్‌ను రూపొందిస్తున్నారు. ఈ కేసులో ఎక్కువ లబ్ధి పొందిన ఏజెంట్లు, డిపాజిటర్లను టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పిలిపించి మాట్లాడుతున్నారు. ఇంకా చెల్లించాల్సిన మొత్తం వివరాలను వారికి తెలియజేస్తున్నారు. తిరిగి చెల్లించాలని లేదంటే నిందితులుగా చేర్చి అరెస్టు చేస్తామని హెచ్చరిస్తున్నారు. వీరి నుంచి వచ్చిన డబ్బును డిపాజిట్ చేసేందుకు కోర్టు అనుమతితో సెంట్రల్ ఏసీపీ దామోదర్ పేరున ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరిచారు. మొత్తం 62 మంది ఏజెంట్లలో 32 మంది అధిక ప్రయోజనం పొందారు. స్పందించని కొందరిని అరెస్టు చేశారు. కొందరు తిరిగి చెల్లించారు. ఆ సొమ్మును ప్రత్యేక ఖాతాలో డిపాజిట్ చేశారు.

ఆస్తుల అటాచ్‌కు లేఖ..

32 మంది ఏజెంట్లు రూ.54 కోట్లు పెట్టుబడి పెట్టి, రూ.105 కోట్లు లబ్ధి పొందారు. వారికి దక్కాల్సిన దాని కంటే రూ.49 కోట్లు పొందారు. వీరితోపాటు కొందరు డిపాజిటర్లకు కూడా ప్రయోజనం దక్కింది. 204 మంది డిపాజిటర్లు రూ.35 కోట్లు పెట్టుబడి పెట్టగా.. రూ.56 కోట్లు వచ్చింది. ఈ రెండు వర్గాల నుంచి అదనంగా రూ.70 కోట్లు వరకు అనుచితంగా ప్రయోజనం పొందారు. ఏజెంట్లు, వారి కుటుంబ సభ్యుల పేరున ఉన్న ఆస్తులను గుర్తించి అటాచ్ చేసేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి పోలీసులు తీసుకున్నారు. ఆస్తులను అటాచ్ చేసేందుకు ప్రభుత్వానికి లేఖ వెళ్లింది.

సైబరాసురుల వల..
వయోపౌరుల విలవిల

డిజిటల్ అరెస్టు, పెట్టుబడుల పేరుతో మోసం



"ఆన్‌లైన్‌లో, వాట్సప్ కాల్స్ చేసి ఏ పోలీసు అధికారి అరెస్టు చేయరు. సీబీఐ, ఈడీ, ముంబై పోలీస్, ఇన్‌కంట్యాక్స్.. రకరకాల పేర్లతో అరెస్టు చేస్తామని బెదిరిస్తుంటే అది సైబర్ నేరగాళ్ల పనే.."

"సామాజిక మాధ్యమాల్లో పెట్టుబడుల పేరుతో ప్రకటనలు ఇస్తే వాటిని నమ్మవద్దు. వారం, పది రోజుల వ్యవధిలో చిన్న పెట్టుబడికి రూ.లక్షల్లో ఆదాయం చూపిస్తుంటే అసలే నమ్మవద్దు. అది సైబర్ నేరగాళ్ల వలే.."

- న్యూస్‌టుడే, విజయవాడ నేరవార్తలు

సైబర్ నేరాలు జరిగే తీరు తెన్నులపై పోలీసులు చేస్తున్న విస్తృత ప్రచారం ఇది. అయినప్పటికీ ప్రజలు మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రధానంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు తెగబడుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎన్టీఆర్ జిల్లాలో సైబర్ నేరాలపై 7 కేసులు నమోదు కాగా వాటిలో మూడు కేసులు వృద్ధులవే. ఈ మూడు కేసుల్లోనే రూ.39.7లక్షలు కొట్టేశారు.

భయపెట్టి... ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వృద్ధులనే సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. విశ్రాంత ఉద్యోగులుగా వీరి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు ఉండటంతో సైబర్ నేరగాళ్ల పని సులువుగా మారుతోంది. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో ఉండే ఒక విశ్రాంత ఉద్యోగి (72) మనీ లాండరింగ్ కేసులో ఇరుక్కున్నారని భయపెట్టి అతని నుంచి రూ.10.7లక్షలు గుంజేశారు. ఒక విశ్రాంత ఉపాధ్యాయురాలిని (70)ను ఇదే తరహాలో మనీ లాండరింగ్ కేసంటూ భయపెట్టి రూ.5లక్షలు తమ ఖాతాల్లో జమ చేయించుకున్నారు.

ఖాతాలో రూ.లక్షలు.. విత్‌డ్రా కుదరదు

పెట్టుబడుల పేరుతో ఆకర్షణీయంగా వల వేస్తారు. తమ వద్ద పెట్టుబడులు పెట్టిన వారికి బోలెడంత ఆదాయం వచ్చిందని చూపిస్తారు. తమ ముఠాలోని వారితోనే ఛాటింగ్‌లు సృష్టిస్తారు. వాటిని చూసి పెట్టుబడులు పెట్టిన వారికి ఒక ప్రత్యేకమైన ఖాతా ఇస్తారు. ఊహించని విధంగా తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభం చూపిస్తారు. ఆ తరవాత మరింత ఆశ చూపి రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టించి రూ.కోట్లలో లాభం చూపిస్తారు. దాన్ని విత్‌డ్రా చేసుకుందామంటే వీలుకాదు. ఇదే విధంగా ఒక వృద్ధుడిని రూ.24లక్షల మేర మోసం చేశారు.

అప్రమత్తతే మందు...

డిజిటల్ అరెస్టు, సామాజిక మాధ్యమాల్లో పెట్టుబడుల పేరుతో వచ్చే ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. టెలిగ్రామ్, వాట్సప్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు నమ్మవద్దని హెచ్చరిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇలాంటి ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దని, అప్రమత్తతతో వ్యవహరించాలని పోలీసులు సూచిస్తున్నారు. పిల్లలు విదేశాల్లో స్థిరపడి ఇక్కడ ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, పెద్దలు ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టు అని ఎవరు ఫోన్ చేసినా పట్టించుకోవద్దని సూచిస్తున్నారు.

'కేసరపల్లిలో కస్టమ్స్ కార్యాలయం'

గన్నవరం గ్రామీణం: గన్నవరం మండలం కేసరపల్లిలో కస్టమ్స్ కార్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ, గుంటూరుల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ కార్యాలయాలకు సొంత భవనాల నిమిత్తం ప్రభుత్వం 3.84 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని చెప్పారు. తన చొరవతోనే ఇది సాకారమైందని చెప్పారు. సర్వే నం:29/8లో సదరు భూమిని కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు ఆయన వెల్లడించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో చొ॥ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

మహాశివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు



వీసీ నిర్వహిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ.. అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. నగరం, పరిసరాల్లోని కృష్ణా నదీ తీరంలో దుర్గా, పున్నమి, భవానీ ఘాట్, పవిత్ర సంగమం వంటి ప్రాంతాల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించనున్న నేపథ్యంలో ఈనెల 14, 15 తేదీల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్యూ లైన్లు, ఘాట్ల వద్ద నిరంతరం పహారా ఉండాలన్నారు. శివరాత్రి ఏర్పాట్లపై నగరంలోని విడిది కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ దుర్గగుడితో పాటు, జిల్లాలోని శివాలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారన్నారు. ఈ నేపథ్యంలో ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బారికేడింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, సంచార టాయిలెట్ల సౌకర్యం తదితరాలపై సమీక్షించి, సూచనలు చేశారు.

తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా ..

విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. ఆలయాల వద్ద రద్దీ సమయాల్లో తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని, ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా..

ఎక్కడైనా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసినట్లయితే వాటికి తప్పనిసరిగా రోజువారీ ఫిట్‌నెస్ చెకింగ్ రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీటీవీ, డ్రోన్లను వినియోగించాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తిరువూరు, నందిగామ ఆర్డీవోలు కె.మాధురి, కె.బాలకృష్ణ, జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎన్.షణ్ముగం, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టెమ్ సెల్ డొనేషన్‌కు విశేష స్పందన



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు, పక్కన శివప్రసాద్ తదితరులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాల అలూమ్ని, ధాత్రి సంస్థ సంయుక్త సారథ్యంలో నిర్వహించిన మూలకణం(స్టెమ్ సెల్) దానంపై అవగాహన, నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. గురువారం సిద్ధార్థ వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 300 మందికి పైగా విద్యార్థులు పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు, ధాత్రి సంస్థ ప్రతినిధి డా.శివప్రసాద్ మాట్లాడుతూ.. 2009లో స్థాపితమైన ధాత్రి దేశంలోని అతిపెద్ద స్వచ్ఛంద రక్త స్టెమ్ సెల్ దాతల రిజిస్ట్రీలలో ఒకటని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆరు లక్షలకు పైగా స్వచ్ఛంద దాతలు నమోదయ్యారని వివరించారు. లుకేమియా, తలసీమియా, అప్లాస్టిక్ అనీమియా, ఇతర తీవ్రమైన రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారికి స్టెమ్ సెల్ మార్పిడి ఒక్కటే ప్రాణాలను రక్షించే చికిత్సా విధానమని వివరించారు. 1700 మందికి పైగా రోగులకు ధాత్రి విజయవంతంగా స్టెమ్ సెల్ మార్పిడి సౌకర్యం కల్పించిందని వివరించారు. స్టెమ్ సెల్ దానం ప్రాముఖ్యత, దానం విధానం, సురక్షితమైన, సులభమైన ప్రక్రియలను విద్యార్థులకు వెల్లడించారు. కార్యక్రమంలో ధాత్రి సంస్థ సభ్యులు విజయ, చావా రవీంద్రనాథ్, వాలంటీర్లు గోకుల్ కృష్ణ, సూర్య, పాల్గొన్నారు.

14న ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ స్నాతకోత్సవం ఈనెల 14న మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమానికి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. గౌరవ అతిథిగా డీఆర్‌డీవో ఛైర్మన్ డా.ఎస్.వి.కామత్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో ఛైర్మన్ డా.కామత్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడుగురు రిసెర్చి స్కాలర్లకు పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో వర్సిటీ వ్యవస్థాపక కులపతి డా.టి.ఆర్.పారివేందర్, ఉపకులపతి సతీష్‌కుమార్ పాల్గొననున్నారు.

21న జిల్లా స్థాయి సేంద్రియ మేళా

ఎ.కొండూరు: మండలంలోని కృష్ణారావుపాలెంలో ఈ నెల 21న జిల్లా స్థాయి సేంద్రియ మేళా నిర్వహించేందుకు కలెక్టర్ జి.లక్ష్మీశ గురువారం స్థల పరిశీలన చేశారు. నాగసింధు స్పిన్నింగ్ మిల్లును సందర్శించి అక్కడ దూది తయారీని పరిశీలించారు. సమీపంలోని మామిడి తోటకు వెళ్లి అక్కడ సేంద్రియ మేళా సదస్సు నిర్వహించేందుకు స్థలం చూశారు. 21న జరిగే సదస్సులో సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు సామర్థ్యాభివృద్ధి శిక్షణ, సాగుదారులకు అనుకూలమైన మౌలిక వనరులు కల్పించడం, సేంద్రియ పద్ధతిలో పండించిన పంటల ప్రదర్శన, మార్కెటింగ్ లింకేజీ సమాచారం, ఉత్పత్తుల విక్రయం, నిపుణులైన రైతులతో పరస్పరం చర్చ నిర్వహిస్తారు. సాగులో ఎరువులు, పురుగు మందులు తగ్గించి సేంద్రియ విధానం పాటిస్తున్న, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే రైతులను సన్మానిస్తారు.

వృత్తి పన్ను వసూలు సరికాదు: వక్కలగడ్డ

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: వ్యాపారుల నుంచి వారి రిజిస్ట్రేషన్ తేదీ నుంచి వృత్తిపరమైన పన్ను వసూలు చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వానికి లేఖ రాశారు. గత 8 సంవత్సరాలుగా వ్యాపారులకు ఎలాంటి వృత్తిపన్ను నోటీసులు జారీ చేయలేదని, వ్యాపారులు చెల్లించినట్లయితే రసీదులు చూపించమని అలాగే జీఎస్టీ వెబ్‌సైట్‌కి వెళ్లి చెల్లించాల్సిన మొత్తాన్ని తనిఖీ చేసి ఇప్పుడే చెల్లించమని అధికారులు అడగడం సరైంది కాదని చెప్పారు. ఎంఎస్ఎంఈ పథకాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం వృత్తిపరమైన పన్నును పూర్తిగా మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గత 6 ఏళ్లుగా వ్యాపారాలు దెబ్బతిన్నాయని వాణిజ్య సముదాయాల అద్దెలు బయట కంటే ఎక్కువగా ఉండడం వల్ల వ్యాపారం చేయలేకపోతున్నారని చెప్పారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఒకసారి నోటీసులు మాత్రమే పంపించారని డీలర్లకు డిపార్టుమెంటు నుంచి వచ్చే ఈ-మెయిల్ సమాచారం కూడా తెలియదని చెప్పారు. ప్రొఫెషనల్ ట్యాక్స్ పోర్టల్ కూడా సరిగా పనిచేయడం లేదని గడువులోగా పన్ను చెల్లించడానికి సిద్ధంగా ఉన్నా డీలర్లకు అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. వ్యాపారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని భాస్కరరావు విజ్ఞప్తి చేశారు.



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధులు

మేనేజ్‌మెంట్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మేనేజ్‌మెంట్ కోర్సులు చేసే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం అమేయ పేరుతో ప్రారంభమైన బిజినెస్ ఫెస్ట్ గురువారం సాయంత్రం ముగిసింది. వర్సిటీలోని పారీ స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు ఏటా బిజినెస్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన మేనేజ్‌మెంట్ విద్యార్థులు 29 జట్లుగా ఏర్పడి నూతన వ్యాపార సంస్థల ఏర్పాటుకు ఆలోచనలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ బిజినెస్ స్టాళ్లను పరిశీలించిన నిర్వాహకులు ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎన్.పల్లవి, ధీరజ్‌లు విన్నర్ టైటిల్ దక్కించుకోగా, మానస్, ధనేష్‌కుమార్‌లు రన్నర్స్‌గా నిలిచారు. ద బెస్ట్ మేనేజర్ టైటిల్‌ను లయోలా కళాశాల విజయవాడ విద్యార్థి శశాంక్ దక్కించుకున్నాడు. కార్యక్రమాన్ని పారీ స్కూల్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.వి.రమణరావు పర్యవేక్షించారు. ప్రారంభ కార్యక్రమంలో కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా, ప్రొఫెసర్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా భవన నిర్మాణ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని, బిల్డర్లకు అనుకూలంగా, సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు నూతన జీవోలను ప్రభుత్వం ఇచ్చిందని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో క్రెడాయ్ అమరావతి చాప్టర్, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన సమగ్ర సమాచార క్రెడాయ్ ఏపీ- 2026 డైరీని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. క్రెడాయ్ అమరావతి చాప్టర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. క్రెడాయ్ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్‌రెడ్డి మాట్లాడారు. క్రెడాయ్ ఏపీ ఛైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షుడు బయిరెడ్డి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి దాసరి రాంబాబు, ఈసీ మెంబర్ తుమ్మల వంశీతో పాటు రాష్ట్రంలోని 22 చాప్టర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం: క్రెడాయ్ అమరావతి చాప్టర్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఛైర్మన్‌గా ఎ.నాగమల్లేశ్వరరావు, ప్రెసిడెంట్‌గా ఆర్.కొండల రావు, జనరల్ సెక్రటరీగా ఎస్.ప్రశాంత్ ఎంపికయ్యారు.

25 నుంచి 'లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్'

విజయవాడ క్రీడలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 27 వరకు 'లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్'ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ స్టేడియంలోని శాప్ ఛైర్మన్ కార్యాలయంలో గురువారం శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో శాసనసభ, శాసనమండలి సభ్యులతో విస్తృత సమావేశం నిర్వహించారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. శాప్ ఎండీ ఎస్.భరణి, ప్రభుత్వ విప్ గణబాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ఐకాస ఉద్యోగుల మద్దతు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ సార్వత్రిక సమ్మెకు ఏపీ ఐకాస అమరావతి మద్దతు తెలిపిన క్రమంలో ఐకాసకు చెందిన ఉద్యోగులు జిల్లా/నగరంలోని కార్యాలయాల్లో గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నగరంలోని ఎంజీ(బందరు) రోడ్డులోని కలెక్టరేట్, గాంధీనగర్‌లోని జిల్లా పౌరసరఫరాలు తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు.



కలెక్టరేట్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

జోగి సోదరులకు కోర్టు ద్వారా నోటీసులు

బెయిళ్ల రద్దు పిటిషన్లపై న్యాయస్థానం నిర్ణయం

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో బెయిల్ రద్దు పిటిషన్లపై నోటీసులు తీసుకునేందుకు జోగి సోదరులు అందుబాటులో లేరు. దీంతో వీరికి కోర్టు ద్వారా నోటీసులు అందించనున్నారు. షరతులను ఉల్లంఘించినందున వీరి బెయిళ్లను రద్దు చేయాలని ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్ గురువారం 8వ ఏడీజే కోర్టులో విచారణకు వచ్చింది. నోటీసులు తీసుకునేందుకు నిందితులు అందుబాటులో లేరని ఎక్సైజ్ అధికారులు కోర్టుకు విన్నవించారు. వీరికి కోర్టు ద్వారా అందించేందుకు వీలుగా ఈనెల 23కు న్యాయాధికారి వాయిదా వేశారు.

సెంథిల్ కస్టడీ కోసం ఎక్సైజ్ కోర్టులో పిటిషన్: ఇదే కేసులో నిందితుడు సెంథిల్ కస్టడీ కోసం సిట్ అధికారులు గురువారం ఎక్సైజ్ కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. నిందితుడిని వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. నోటీసుల నిమిత్తం ఈనెల 18కి వాయిదా వేశారు. నిందితుడు రమేష్‌బాబు (ఏ15) దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై ఎక్సైజ్ అధికారులు గురువారం కౌంటరు వేశారు. నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని కౌంటర్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం 17కు వాయిదా పడింది.

నకిలీ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ కేసులో..

బెయిల్ పిటిషన్ డిస్మిస్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: నకిలీ ఆధార్‌కార్డు ఉపయోగించి భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లు కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితులైన తల్లీకుమారులు పైడిపాముల లక్ష్మీకుమారి, సందీప్‌లకు బెయిల్ నిరాకరిస్తూ న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన పైడిపాముల లక్ష్మీకుమారి, సందీప్‌లు 2025 జూన్‌లో జయలక్ష్మి అనే వృద్ధురాలి ఆధార్‌కార్డుకు నకిలీది సృష్టించారు. దాని సాయంతో వేరే మహిళను జయలక్ష్మిగా చూపించి 82 సెంట్ల వ్యవసాయ భూమిని వేరే వారికి రిజిస్టర్ చేశారు. ఆ తరువాత సదరు భూమిని రాజేష్ అనే అతనికి జీపీఏ చేశారు. దీనిపై జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేసి లక్ష్మీకుమారి, సందీప్‌లను ఈ ఏడాది జనవరిలో అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుల తరఫున బెయిల్ పిటిషన్ దాఖలు కాగా ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రాధిక వాదించారు. ఈ కేసులో ఫిర్యాది జయలక్ష్మి ఇంప్లీడ్ అయి నిందితులకు బెయిల్ ఇవ్వొద్దంటూ తన తరఫున న్యాయవాదితో వాదనలు వినిపించారు. అనంతరం నిందితులిద్దరి బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేస్తూ అయిదో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అన్నపూర్ణశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో తమకు బెయిళ్లు మంజూరు చేయాలని నిందితులు కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఇవి గురువారం విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చాయి. ఈ పిటిషన్లపై కౌంటర్లు దాఖలు చేయాలని న్యాయాధికారి భాస్కరరావు సిట్‌ను ఆదేశించారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ఈనెల 19కి వాయిదా వేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: వెలగలేరు ఎస్సీ ఏరియాలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సరోజ సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

★ రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని వెంపటి గూడెంలో మురుగు కాల్వలో పూడిక పేరుకుందని స్థానికులు 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.నాగబాబు స్పందించి పంచాయతీ సిబ్బందితో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

★ విస్సన్నపేట మండలంలోని నరసాపురం పంచాయతీ పరిధి ముత్తరాసిపాలెంలో వీధి దీపాలు లేక చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారులకు తెలిపారు. ఈవో జి.స్వాతి స్పందించి దాత గొట్టేటి సుబ్రహ్మణ్యం(బుడ్డయ్య) వితరణతో సిబ్బందితో వంద దీపాలను స్తంభాలకు ఏర్పాటు చేయించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

పాఠశాలకు బీరువాల వితరణ

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్వీఆర్ జీఎన్నార్ జడ్పీ హైస్కూల్లో గణిత ఉపకరణాల భద్రత కోసం ప్రవాస భారతీయ వైద్యుడు కుడుముల అనిల్‌కుమార్‌రెడ్డి రెండు బీరువాలను ఉచితంగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సతీష్‌కు వాటిని అందించి, గణిత ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మైలవరం లయన్స్ క్లబ్ నాయకులు నాగభూషణం, శ్రీధర్, జాస్తి వెంకటేశ్వరరావు, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల ఆధ్వర్యంలో..

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు మండలం ఎరుకోపాడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తిరువూరు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఉద్యోగులు కంప్యూటర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ దాసరి.నాగన్న, నగదు అధికారి బి.ఎల్.హెచ్ ప్రసాద్‌కు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఉపాధ్యాయుడు రాంప్రదీప్ బ్యాంకు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు టౌన్ విద్యుత్తు అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని పీటీ.కొత్తూరు ప్రాంతంలో 11 కేవీ విద్యుత్తు లైన్ల మరమ్మతుల నేపథ్యంలో తాత్కాలికంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మండల పరిషత్ సమావేశం నేడు

విస్సన్నపేట: విస్సన్నపేట మండల ప్రజా పరిషత్ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో ఈ నెల 13న ఉదయం 11 గంటలకు ఎంపీపీ గద్దల మల్లయ్య అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం జరుగుతుందని ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని చెప్పారు.

మందుబాబుల వీరంగంతో హడలు

న్యూస్‌టుడే, కొండపల్లి, ఇబ్రహీంపట్నం

★ ఇబ్రహీంపట్నం కూడలిలోని కొండపల్లి బస్‌స్టాప్ వద్ద గత ఆదివారం మధ్యాహ్నం మందుబాబుల మధ్య పెద్ద వివాదం చెలరేగింది. వాళ్ల అరుపులకు అక్కడ ఉన్న ప్రయాణికులు హడలెత్తిపోయారు.

★ కొండపల్లి అఫ్మెల్ బస్‌స్టాప్ పాయింట్ పక్కనున్న మద్యం దుకాణం నుంచి ఇద్దరు వ్యక్తులు ఒకరిపై మరొకరు దాడి చేసుకొంటూ బస్‌స్టాప్‌కు వచ్చారు. వారిద్దరు ఎవరిపై పడతారోనని మిగిలిన వారు భయభ్రాంతులకు గురయ్యారు.

బస్‌స్టాప్‌ల సమీపాన మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మందుబాబుల హడావుడికి బస్సుల కోసం వేచి ఉంటున్న మహిళలు, చిన్న పిల్లలు భయపడుతున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారుల వెంట 12 దుకాణాలు ఉండగా వాటిల్లో నాలుగు బస్‌స్టాప్‌ల పక్కనే ఉన్నాయి. మరో నాలుగు కూతవేటు దూరంలో ఉన్నాయి. మందుబాబుల వీరంగంతో రాత్రి వేళ బస్సుల్లో దిగేవారు, వేచి ఉండేవారు భయంతో వణికిపోతున్నారు. ముఖ్యంగా మహిళలు ఆయా సమయాల్లో రాకపోకలు సాగించాలంటే కష్టంగా ఉంటోంది. ఇబ్రహీంపట్నంలోని కొండపల్లి బస్‌స్టాప్ వద్ద పరిస్థితి ఘోరంగా తయారైంది. ఇప్పటికే అక్కడ పలు వివాదాలు చోటు చేసుకోగా మహిళా సంఘాలు ఆయా దుకాణాలపై చర్యలు తీసుకోవాలని పోలీసు, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాయి.

వినతిపత్రాలు ఇచ్చాం

ఇబ్రహీంపట్నం కూడలిలోని మద్యం దుకాణం వల్ల అక్కడికి వచ్చిన ప్రయాణికులు అభద్రతా భావానికి గురవుతున్నారు. మహిళలు ఎంతో భయపడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు వినతిపత్రాలు కూడా అందించాం. నిరసన దీక్ష చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.
- పార్వతి, ఐద్వా నాయకురాలు

చర్యలు తీసుకొంటున్నాం: వివాదాల సమయంలో సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నాం. అనుమతులతోనే వాటిని ఏర్పాటు చేసినందున నిబంధనలు ఉల్లంఘించకుండా దుకాణాలు నడుపుకోవాలని సంబంధిత వ్యక్తులను హెచ్చరించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. **- చంద్రశేఖర్, సీఐ**

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



శిబిరానికి హాజరైన ప్రజలు

విస్సన్నపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో గురువారం క్లబ్ కార్యాలయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సేవకుడు, దాత, డా.ఎన్టీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ సేవలను ప్రశంసించారు. తొలుత క్యాంపును డా.బి.రామిరెడ్డి ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షురాలు రాయల అరుణ కుమారి, టి.వెంకటరెడ్డి, జాన్‌బాబు, ఆర్.వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సాగునీటి ఇబ్బందులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే : నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలోని మూడో జోన్‌లో ఆరుతడి పంటలకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ అసెంబ్లీలో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీటి విడుదలపై మాట్లాడుతూ వసంత నీటి విడుదల విషయంలో ఎగువ రాష్ట్ర అధికారులు వ్యవహరిస్తున్న తీరును సభ దృష్టికి తెచ్చారు. ఏటా 14 టీఎంసీల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1.6 టీఎంసీలు మాత్రమే విడుదల చేశారన్నారు. నీటి విడుదల విషయంలో తక్షణం చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఎమ్మెల్యే కోరారు.


విశ్రాంత విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



జగన్నాథరావు దంపతులకు జ్ఞాపిక అందిస్తూ..

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యుత్తు సంస్థ విశ్రాంత ఉద్యోగుల ప్రధాన సమస్యలను త్వరలోనే పరిష్కారానికి అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విద్యుత్తు సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు పేర్కొన్నారు. సంఘ సర్వసభ్య సమావేశంతో పాటు ద్వితీయ వార్షికోత్సవ సభ గురువారం ఇబ్రహీంపట్నం ఏ కాలనీలోని కార్యాలయంలో జరిగింది. ప్రధాన సమస్యలతో పాటు ఆరోగ్య కార్డుల వినియోగంలో సభ్యుల సందేహాల నివారణపై యాజమాన్యంతో సంప్రదిస్తున్నట్లు వివరించారు. సమావేశానికి సంఘ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ అజీం అధ్యక్షత వహించారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్టీటీపీఎస్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ పి.నవీన్ గౌతం ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్ అజీంను గౌరవ సలహాదారుడిగా నియమించారు. విద్యుత్తు శాఖ మంత్రి కార్యాలయ ఓఎస్‌డీ సాంబశివరావు, విశ్రాంత సీఈ శ్రీరాములు, సంఘ కోశాధికారి జగన్నాథరావు తదితర నాయకులు పాల్గొన్నారు. 75 సంవత్సరాలు నిండిన విశ్రాంత ఉద్యోగుల దంపతులను సత్కరించి జ్ఞాపికలు అందించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గురువారం వినతి పత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలు వివరించగా పరిష్కరించేందుకు ఆయన హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రధానంగా గంపలగూడెం మండలం కట్లేరుపై హైలెవల్ వంతెన నిర్మాణం గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లగా అక్కడ ఉన్న పీపీపీ వంతెన నిర్మాణానికి నిధుల మంజూరును ప్రాధాన్యత జాబితా ఉంచాలని ఆదేశించినట్లు వివరించారు. తిరువూరు, గంపలగూడెం మండలాల్లో ఎస్సీ, బీసీ బాలికలకు వసతి గృహాల ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో పలు సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వినతి చేశారన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్, సీఈఓ త్వరలో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చిస్తామని సీఎం తెలిపారన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో రాజకీయ పరమైన సమస్యలుంటే తనతో మాట్లాడాలని చెప్పారన్నారు.

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధుల అసహనం



మాట్లాడుతున్న శ్రీలక్ష్మి, వేదికపై శామ్యూల్, సరస్వతి, రాజకుమారి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిషత్ సమావేశాలకు అధికారులు గైర్హాజరవుతుండంపై ఎంపీపీ జి.శ్రీలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్ గురువారం నిర్వహించిన సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టీ.సరస్వతి మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం మేరకు మండల పరిషత్ సమావేశాలకు అధికారులు హాజరవ్వాలని, వారు రాకుంటే ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఎలా తెలుస్తాయన్నారు. తహసీల్దార్ వి.రాజకుమారి మాట్లాడుతూ భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో ఒక్క తప్పు దొర్లకుండా రాజముద్రతో భూహక్కు పత్రాలను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్అండ్‌బీ ఏఈ ఒ.అచ్చారావు, గృహ నిర్మాణ సంస్థ ఏఈ ఎస్.కిశోర్, డిస్కం ఏఈ శ్రీనివాసరావు, ఎన్నెస్పీ ఏఈ మహేష్ బాబు తదితరులు పలు విషయాలపై మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో రైతులు.. వినియోగదారులకు మేలు



మామిడి కాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను అవలంబించడం ద్వారా అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. రెడ్డిగూడెం మండలం రంగాపురం పంచాయతీ రెడ్డికుంట గ్రామంలోని మైలవరం ఏఎంసీ వైస్ ఛైర్మన్ చేబ్రోలు రాజు బ్రదర్స్ మామిడి తోటల్లో ముందుగా కాపు వచ్చిన తోటల్లో కవర్లు కట్టిన తోటలను గురువారం లక్ష్మీశ పరిశీలించారు. మామిడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫ్రూట్ కవర్ల వల్ల ఎలాంటి మచ్చలు లేకుండా మంచి రంగు, పరిమాణంతో దిగుబడి ఉంటుందన్నారు. హెక్టారుకు 15 వేల కవర్లు 50 శాతం రాయితీతో అందిస్తోందన్నారు. తిరువూరు ఆర్డీవో మాధురి, జిల్లా ఉద్యానాధికారి బాలాజీ కుమార్, తహసీల్దార్ సుశీలాదేవి, ఎంపీడీవో టి.వి.కె.వి.రమణ, ఉద్యానాధికారి నరేంద్ర కుమార్, తెదేపా మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, తెదేపా నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, చేబ్రోలు కొండ తదితరులు పాల్గొన్నారు.

కొండపర్వ తిరునాళ్లకు సర్వం సిద్ధం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాధురి, గిరిబాబు తదితరులు

విస్సన్నపేట: కొండపర్వ శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి గట్టు తిరునాళ్లకు సర్వం సిద్ధమైనట్లు తిరువూరు ఆర్డీవో కె.మాధురి, తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి, సీఐ గిరిబాబు తెలిపారు. గురువారం కొండపర్వలో వారు పర్యటించి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఉత్సవ కమిటీ, ట్రస్ట్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానికులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తిరునాళ్లు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు, ఎస్సై యం.అర్జున్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల రాకపోకలకు ఆటోలు..

గంపలగూడెం, ఎ.కొండూరు : గంపలగూడెం మండలం కొత్తపల్లి సమీప గోపాల స్వామి మడుగు ఒడ్డునున్న ఉమాగౌరీశంకరుని ఆలయం వద్ద భక్తుల పుణ్య స్నానాలకు గ్రామస్థులు చేస్తున్న ఏర్పాట్లను ఎంపీడీవో టి.సరస్వతి గురువారం పరిశీలించారు. ప్రధాన రహదారి నుంచి పుణ్య స్నానాలు చేసే గుడి వద్దకు భక్తులు రాకపోకలు సాగించేందుకు ఉచిత ఆటోలు ఏర్పాటు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

రైతులకు గుర్తింపు నమోదు తప్పనిసరి

జి.కొండూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందాలంటే ప్రతి రైతుకు యూనిక్ ఐడీ నమోదు తప్పనిసరి అని ఏవో సూరిబాబు తెలిపారు. నెలాఖరులోగా సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్, పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌తో లింకైన ఫోన్ నంబర్‌తో ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్, పంటల బీమా, పెట్టుబడి సాయం, రాయితీలు, వ్యవసాయ పరికరాలు, బ్యాంకు రుణాలు, పంటలు విక్రయం సులభమవుతుందన్నారు.

మూగ జీవాలను.. జాగ్రత్తగా చూసుకుందాం!

న్యూస్‌టుడే(గుంటుపల్లి), ఇబ్రహీంపట్నం గ్రామీణం

★ రెండు రోజుల కిందట గుంటుపల్లి సమీపంలో విజయవాడ బైపాస్ రోడ్డులో వస్తున్న గేదెలను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పాడి గేదె, దూడ మృతి చెందగా మరో మూడు పశువులు గాయాలపాలయ్యాయి.

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పశు పోషకులు, జీవాల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే వారికి తీరని నష్టం, జీవనోపాధి కోల్పోయే పరిస్థితి దాపురించనుంది. గొల్లపూడి నుంచి దొనబండ వరకు 35 కి.మీ మేర విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి ఉండటంతో రోజూ వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. వేగంగా ప్రయాణించే ఇవి రోడ్డుపై పశువులు, జీవాలను ఢీకొడుతుండడంతో ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండలంతో పాటు గొల్లపూడి పరిధిలో సుమారు పది వేల పైచిలుకు జీవాలు, గేదెలు ఉన్నాయి. పాల ఉత్పత్తిని బట్టి ఒక్కో పాడి గేదె రూ.70 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ధర పలుకుతున్నాయి. చాలా మంది పెంపకందారులు మేత కోసం వీటిని పచ్చిక బయళ్లకు వదిలేందుకు జాతీయ రహదారి వద్దకు తీసుకొచ్చి వదిలేస్తుంటారు. అవి జాతీయ రహదారిపై డివైడర్ల వద్ద ఉన్న చెత్తను మేసేందుకు తిరుగుతూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

రెండేళ్లలో 15 ప్రమాదాలు

రెండేళ్లలో ఈ రహదారిలో జరిగిన 15 ప్రమాదాల్లో తొమ్మిది పాడి పశువులు, మరో 20పైగా జీవాలు చనిపోయాయి. మరికొన్ని గాయపడ్డాయి. పోలీసు, పశుసంవర్ధక శాఖ వద్ద నమోదైనవి కొన్ని మాత్రమే. ఎక్కువ మంది రైతులు బ్యాంకు రుణాలు, స్వయం సహాయక సంఘాల్లో రుణాలు తెచ్చుకొని పాడి పోషణ, జీవాల పెంపకంపై జీవనాధారం సాగిస్తున్న వారే. ఇవి ప్రమాదాల్లో మరణిస్తుండడంతో చాలా మంది ఆర్థికంగా నష్టపోతున్నారు. గ్రామ శివారుల వద్ద జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ సబ్‌వేలను ఏర్పాటు చేసింది. ఉదయం పశు పోషకులు తమ పశువులను వీటి వద్ద జాతీయ రహదారి దాటిస్తే మేలని పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వ్యర్థ జలాలతో పంట కాలువ నీరు కలుషితం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరులో పంట కాలువలో నీరు కలుషితమై పచ్చగా దర్శనమిస్తున్నాయి. ఈ జలాలు పంటలకు పెడితే దిగుబడి తగ్గుతోందని, పశువులు తాగితే వ్యాధుల బారిన పడతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండపల్లి పారిశ్రామిక వాడ నుంచి వచ్చే వ్యర్థ జలాలు, కవులూరులో చేపల చెరువుల నుంచి వచ్చే వ్యర్థ జలాలను పంట కాలువలోకి వదలడంతో నీరంతా పచ్చగా మారిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు పంటలు పండించుకునేందుకు ఉపయోగపడదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వ్యర్థ జలాలు కలవకుండా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శిరస్త్రాణం ధరించకుంటే కఠిన చర్యలు



ప్రసంగిస్తున్న ఏసీపీ దుర్గారావు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం నుంచి శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాన్ని నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నగర ఏసీపీ దుర్గారావు హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని గుంటుపల్లి, మూలపాడు, కేతనకొండ, కొండపల్లి గ్రామాల్లో గురువారం నగర ట్రాఫిక్ పోలీసులు గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. పోలీసు బృందాలు నేటి నుంచి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తాయని తెలిపారు. ఏసీపీ రామచంద్రరావు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై కలెక్టర్‌కు నివేదిక

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్‌కు నివేదించామని సబ్ కలెక్టర్ చైతన్య అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరును సబ్ కలెక్టర్ చైతన్య, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కీర్తిలు గురువారం పరిశీలించారు. వంట ఏజెన్సీల వివరాలు సేకరించారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక 13వ వార్డులో రూ.40 లక్షల సీఆర్‌డీఏ నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి ఛైర్మన్ చిట్టిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. పురపాలిక అభివృద్ధికి ప్రభుత్వం వివిధ నిధులను కేటాయిస్తూ ప్రణాళికా బద్ధంగా సహకరిస్తుందని పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం, సహాయక ఇంజినీర్ మౌస్మీ, కౌన్సిలర్ నారాయణలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిశీలన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: పశ్చిమ ఇబ్రహీంపట్నం ముస్లిం శ్మశానవాటికను పురపాలిక ఛైర్మన్, అధికారులు గురువారం పరిశీలించారు. వాటికలో మౌలిక వసతులు కల్పించాలన్న స్థానికుల విజ్ఞప్తులను పరిశీలించామని ఛైర్మన్ చిట్టిబాబు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న తాడేపల్లిలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని రజక వృత్తిదారుల రాష్ట్ర కార్యదర్శి చిక్కవరపు వెంకట రెడ్డియ్య విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం రెడ్డిగూడెం రజక కాలనీలో సంఘం నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు లచ్చారావు, ప్రభాకరరావు, సర్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటం ఆపం.. వెనుకడుగు వేయం



రెడ్డిగూడెంలో సీఐటీయూ, రైతు సంఘాల నాయకుల ఆందోళన



ఇబ్రహీంపట్నం కూడలిలో ర్యాలీ



జి.కొండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట..



తోటమూలలో నినాదాలు చేస్తూ..



మైలవరంలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారీ వర్గాలకు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పులు ఉన్నా అమలు చేయడం లేదన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**



తిరువూరులో..



కంభంపాడులో ప్రదర్శన



విస్సన్నపేటలో..

ఆయుర్వేద ఆసుపత్రికి సొంత భవనం



హద్దులు ఏర్పాటు చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం అధికారులు

కొండపల్లి, న్యూస్‌టుడే: భారతదేశ వారసత్వ వైద్య విధానమైన ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి కొండపల్లిలో పునాది పడనుంది. మూడు దశాబ్దాల క్రితం ఓ అద్దె ఇంటిలో ఆయుర్వేద వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. నాటి నుంచి నేటి వరకూ ఆసుపత్రికి సొంత భవనం లేకపోవడం గమనార్హం. ఈ క్రమంలో స్థానికులు ఆసుపత్రి భవన నిర్మాణం కోసం ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన చొరవతో భవన నిర్మాణానికి రూ.30 లక్షలను ఆయుష్ శాఖ కేటాయించగా.. కలెక్టర్ కలెక్టర్ లక్ష్మీశ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం కేటాయించేలా పురపాలికను ఆదేశించారు. దీంతో కొండపల్లి పురపాలిక సభ్యులు కౌన్సిల్‌లో తీర్మానం చేసి స్థానిక బి.కాలనీ వద్ద 5 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఈక్రమంలో ఆయుష్ శాఖ ఇంజినీరింగ్ విభాగాధికారులు గురువారం కొలతలు నిర్వహించి హద్దులు ఏర్పరిచారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించి భవన నిర్మాణాన్ని ఆయుష్ ప్రారంభించనుందని వైద్యులు ఎండీ జునీద్ తెలిపారు.

ఖోఖో విజేతలకు అభినందన



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

కొండపల్లి, న్యూస్‌టుడే: జాతీయ క్రీడల్లో సత్తా చాటేందుకు దయానంద్ ఆంగ్లో వేదిక్ (డీఏవీ) పాఠశాలల నుంచి మరింత మంది క్రీడాకారులు సిద్ధం కావాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఖోఖోలో ప్రతిభ కనబరచిన కొండపల్లి డీఏవీ విద్యార్థులు బాంధవిక, నిహారికలను గురువారం అభినందించి మాట్లాడారు. క్రీడల విభాగంలో డీఏవీ విద్యార్థులు కొన్ని సంవత్సరాలుగా సత్తా చాటుతూనే ఉన్నారన్నారు. ఈ విజయ పరంపర కొనసాగించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీటీపీఎస్ సీఈ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్కూల్ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన జి.కొండూరు శివారులోని గొల్లగూడెం సమీపంలో గురువారం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు మునగపాడుకి చెందిన బత్తుల గిరీష్ అదే గ్రామానికి చెందిన గంజి స్వామి ద్విచక్ర వాహనంపై ఎక్కి వెళ్తున్నాడు. సాయంత్రం 5 గంటలకు జి.కొండూరు శివారు గొల్లగూడెం సమీపంలో స్కూల్ బస్సును దాటే క్రమంలో వీరి వాహనం బస్సును ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయి స్వామి, గిరీష్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న జి.కొండూరు పోలీసులు వచ్చి క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గిరీష్‌ను విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మైనర్లు నడిపే వాహనాలకు ఆయిల్ బంద్

ఇబ్రహీంపట్నం: ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకొచ్చిన నిబంధనలను పెట్రోల్ బంకుల యాజమాన్యాలు పక్కాగా అమలు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాల్లో వచ్చిన మైనర్లకు గురువారం నుంచి పెట్రోల్ కొట్టడం గాని, బాటిల్‌లోగాని పోయడం లేదు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ చంద్రశేఖర్ ఈసందర్భంగా హెచ్చరించారు.

తండ్రి ఫుట్‌పాత్‌పై దర్జీ.. కుమార్తెకు నెట్‌లో 94%



ఛత్తీస్‌గఢ్‌లోని సర్గుజా పట్టణంలో రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై కుట్టుమిషను పెట్టుకొని, పాత దుస్తులకు కుట్లు వేసే దర్జీ రాజ్‌దేవ్ కుమార్తె ప్రీతి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)లో 93.71 శాతం మార్కులు సాధించారు. అయిదుగురు కుటుంబసభ్యుల బాధ్యత తన భుజాలపై ఉన్న రాజ్‌దేవ్‌కు గత 27 ఏళ్లుగా ఇదే జీవనాధారం. పేదరికం కారణంగా ఇంటర్‌తో చదువుకు స్వస్తి చెప్పి దర్జీ పని ప్రారంభించిన రాజ్‌దేవ్ తన ముగ్గురు పిల్లలను బాగా చదివిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్‌లో పీజీ చేసిన ప్రీతి ఫిబ్రవరి 2న యూజీసీ - నెట్ పరీక్షను రాశారు. ఫలితాల్లో 93.71 శాతం స్కోరును సాధించిన ఆమె ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రొఫెసర్ అయ్యే అర్హతను సాధించారు. చిన్నప్పటి నుంచీ చూస్తున్న నాన్న కష్టం తనను లక్ష్యం వైపు నడిపిందని, సర్గుజా జిల్లా వాస్తవ్యురాలే అయిన 'చాయ్‌వాలీ దీదీ' కథనాన్ని 'ఈటీవీ భారత్'లో చూసి స్ఫూర్తి పొందానని ప్రీతి తెలిపారు. ఈ దీదీ చాయ్ అమ్మి కొడుకును చదివించిన తీరు తనను కదిలించిందని చెప్పారు.

టిక్ టాక్ వ్యూస్ కోసం డెవిల్ క్రాబ్ తిని మృత్యువాత



మనీలా: ఫిలిప్పీన్స్‌లో మహిళా ఫుడ్ ఇన్‌ఫ్లుయెన్సర్ (51) ఒకరు సామాజిక మాధ్యమాల్లో వ్యూస్ కోసం విషపూరితమైన 'డెవిల్ క్రాబ్' అనే పీత తిని మృత్యువాతపడ్డారు. ఎమ్మా అమిట్ అనే మహిళ తన స్నేహితులతో కలిసి పలావన్ ప్రావిన్సులోని ప్వెటో ప్రిన్సెసాలో గల మడ అడవులకు వెళ్లారు. అక్కడ కొబ్బరిపాలు వేసి గుల్ల చేపలు వండిన తీరును, వాటిని ఆస్వాదిస్తూ తినడాన్ని ఎమ్మా తన టిక్‌టాక్ ఫాలోవర్ల కోసం చిత్రీకరించారు. ఆ మరుసటి రోజు ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్పృహ కోల్పోయి, పెదవులు ముదురు నీలం రంగులోకి మారాయి. హుటాహుటిన ఆమెను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఫిబ్రవరి 6న ఎమ్మా మృతిచెందింది. అధికారుల దర్యాప్తులో ఆమె విషపూరితమైన 'డెవిల్ క్రాబ్' అనే పీతలను తిన్నట్టుగా తేలింది. ఈ పీతలను 'టాక్సిక్ రీఫ్ క్రాబ్స్' అని కూడా అంటారు. వీటిలోని విషపదార్థాలు.. వంట ప్రక్రియలో నాశనం కావు. తిన్న కొన్ని గంటల్లోనే పక్షవాతం లేదా మరణానికి ఇవి కారణమవుతాయి.


మూడో తరగతి నుంచే విద్యార్థులకు ఏఐ!

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

దిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ)ను దేశంలోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. మూడో తరగతి నుంచి మొదలుపెట్టి అధునాతన పరిశోధనలు నిర్వహించే దశ వరకు వారికి ఏఐ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. దిల్లీలో రెండు రోజుల పాటు జరిగే 'భారత్ బోధన్ ఏఐ కాంక్లేవ్- 2026' సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. "ఏఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోంది. కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయి. భారత్‌లోని కృత్రిమ మేధ.. రూపకల్పనలో సమగ్రతతో, నిర్మాణంలో పరస్పర అనుకూలతతో, సామర్థ్యంలో సార్వభౌమత్వంతో ఉంటుంది. ప్రస్తుతం ఏఐ యాంత్రిక మేధస్సుతో పాటు మనుషుల భావోద్వేగాలనూ అర్థం చేసుకుంటోంది. విద్యార్థులను శక్తిమంతులను చేసేందుకు, ఉపాధ్యాయులకు మద్దతునిచ్చేందుకు విద్యలో ఏఐని చేర్చాల్సిన అవసరం ఉంది. వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా స్వదేశీ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కంపెనీలు నైతికబద్ధమైన, బాధ్యతాయుతమైన ఏఐని సృష్టించాలి" అని ధర్మేంద్ర వ్యాఖ్యానించారు.

రాహుల్ సభ్యత్వ రద్దుకు నోటీసు

- జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా చూడండి
- సభాపతికి భాజపా ఎంపీ దుబె వినతి
- అన్నయ్యను ఎవరూ బెదిరించలేరు: ప్రియాంక



దిల్లీ: లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలని భాజపా ఎంపీ నిశికాంత్ దుబె డిమాండ్ చేశారు. ఎంపీగా ఆయన్ని తొలగించడంతోపాటు జీవితంలో ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేకుండా వేటువేయాలని కోరుతూ నోటీసు సమర్పించారు. ప్రాధాన్యమున్న అంశాలపై సభ చర్చ తీసుకునేందుకు ప్రతిపాదించే 'సబ్‌స్టాంటివ్ మోషన్'ను తాను కోరుతున్నట్లు దుబె తెలిపారు. రాహుల్ తరచూ థాయ్‌లాండ్, వియత్నాం, కంబోడియా వంటి దేశాలకు వెళ్తూ సారోస్ ఫౌండేషన్, యూఎస్‌ఎయిడ్, ఫోర్డ్ ఫౌండేషన్ వంటి సంస్థలతో చేతులు కలిపి.. భారత్ వ్యతిరేక శక్తులతో కుమ్మక్కు అవుతున్నారని ఆరోపించారు. అందువల్ల ఎంపీగా ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని శూన్యగంటలో డిమాండ్ చేశారు. అంతకుముందు పీటీఐ వార్తాసంస్థకు దీనిపై ఇంటర్వ్యూ ఇచ్చారు. "రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు? ప్రచురితం కాని ఆత్మకథ పుస్తకం ఆయన చేతికి ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయనకున్న సంబంధాల గురించి నేను నోటీసులో ప్రస్తావించాను" అని దుబె స్పష్టం చేశారు. దుబె వ్యాఖ్యలపై విపక్ష నిరసనల నడుమ సభ శుక్రవారానికి వాయిదా పడింది. 'పారిశ్రామిక సంబంధాల కోడ్ (సవరణ) బిల్లు- 2026'ను పార్లమెంటు ఉభయసభలు గురువారం ఆమోదించాయి. బడ్జెట్ సమావేశాల తొలివిడతలో ఆమోదం పొందిన మొదటి బిల్లు ఇది.


పోరాటం ఆపను..

రాహుల్ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ తనపై తీర్మానం పెట్టినా, కేసు పెట్టినా, ఇంకేం చేసినా కూడా రైతుల పక్షాన బలంగా పోరాడతానని స్పష్టంచేశారు. రాహుల్‌ను ఎవరూ బెదిరించలేరని ఆయన సోదరి, ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా చెప్పారు.

- రాహుల్‌గాంధీ పెద్ద "అబద్ధాలకోరు" అని కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. దేశంలో అంతర్యుద్ధాన్ని ఆయన కోరుకుంటున్నారని చెప్పారు. 'రాహుల్ ఓ నకిలీ రైతు. బార్లీ-గోధుమ, పెయ్య-పడ్డ మధ్య తేడాలు కూడా ఆయనకు తెలియవు' అని విమర్శించారు.

రెరాల పనితీరు పేలవం.. విచారకరం

- రద్దు చేసినా మాకు అభ్యంతరం లేదు
- హిమాచల్‌ప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య



దిల్లీ: ప్రజల కోసం ఏర్పడిన స్థిరాస్తి నియంత్రణ ప్రాధికార సంస్థ (రెరా)లు వారికి చేస్తున్నదేమీ లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. డిఫాల్టర్లయిన బిల్డర్లకు ఉపయోగపడటం మినహా ప్రజలకు మేలు కలగడం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం పేర్కొంది. 'రెరాల పనితీరు పేలవం, నిరాశావహం, విచారకరం. వాటిని రద్దు చేసినా మాకు అభ్యంతరంలేదు' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ సంస్థలపై అన్ని రాష్ట్రాలు పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. రెరా ప్రధాన కార్యాలయాన్ని శిమ్లా నుంచి ధర్మశాలకు తరలించేందుకు హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం అనుమతివ్వగా దానిని సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. తరలింపును నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలివ్వటంతో రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రజలకు ఉపయోగపడని రెరా కార్యాలయం ఎక్కడుంటే ఏమిటని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. కార్యాలయం తరలింపు నిర్ణయం పూర్తిగా పాలనాంశమని, న్యాయస్థానాల జోక్యం పరిధిలోకి రాదని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. హైకోర్టు స్టే ఉత్తర్వును నిలిపివేసింది.

పేగు ఆరోగ్యం కాపాడుకోండిలా



పేగు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మందులపై ఆధారపడొద్దు. బదులుగా ఇలా ప్రయత్నించండి.
- ✦ పీచు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోండి
- ✦ చురుగ్గా ఉండండి
- ✦ తగినంత నీటిని తాగండి
- ✦ ఒత్తిడిని దూరం చేసుకోండి

ఈ పద్ధతులను క్రమం తప్పక పాటిస్తే ఆశ్చర్యకరమైన ఫలితాలు చూస్తారు.

– క్రిస్టీ లియాంగ్, వైద్యురాలు



అమృత్‌సర్‌లో కార్మిక సంఘాల ఆందోళన

కార్మిక సమ్మెకు మిశ్రమ స్పందన

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తూ గురువారం కార్మిక సంఘాల సంయుక్త ఫోరం నిర్వహించిన దేశవ్యాప్త సమ్మెకు మిశ్రమ స్పందన లభించింది. ప్రజా జీవనానికి పెద్దగా ఇబ్బంది కలగలేదు. కార్మిక సంఘాలు గేట్ మీటింగ్‌లు, ప్రదర్శనలు నిర్వహించాయి. కొన్నిచోట్ల సమ్మెకు సంఘీభావంగా విధులకు ఆలస్యంగా హాజరయ్యారు. ఒడిశా, కేరళ, తమిళనాడు, గోవా, ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, హరియాణా, పంజాబ్‌లలో సమ్మెకు మిశ్రమ స్పందన లభించింది. కేరళలో సమ్మెవల్ల జనజీవనం స్తంభించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని యాపిల్ రైతులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. మధ్యప్రదేశ్‌లో 25వేల మంది రక్షణ సంస్థల పౌర ఉద్యోగులు గంట ఆలస్యంగా విధులకు హాజరయ్యారు.

ఇప్పుడైనా మోదీ వింటారా..

కార్మిక సంఘాల సమ్మెకు కాంగ్రెస్, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ నుంచి మద్దతు లభించింది. "నాలుగు కార్మిక చట్టాలు తమ హక్కులను బలహీనపరుస్తాయని కార్మికులు భయపడుతున్నారు. వాణిజ్య ఒప్పందం (అమెరికాతో) తమ జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రధాని మోదీ ఇప్పుడైనా వారి ఆవేదనను వింటారా.. అలాగే ఉంటారా.. నేను కార్మికులు, రైతుల పోరాటానికి మద్దతునిస్తున్నా" అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

భారత్‌తో వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకం

- ఆ దేశానికి భారీగా బొగ్గు సరఫరా చేయబోతున్నాం
- ట్రంప్ స్పష్టీకరణ



వాషింగ్టన్: భారత్‌తో వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దీనివల్ల ఆ దేశానికి బొగ్గు సరఫరా పెరుగుతుందని వెల్లడించారు. 'మన నాయకత్వంలో అమెరికా అతి పెద్ద ఇంధన ఎగుమతిదారుగా అవతరిస్తోంది. గడచిన కొన్ని నెలల్లో భారత్, జపాన్, కొరియాలతో చరిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకున్నాం. దీనివల్ల మన బొగ్గు ఎగుమతులు నాటకీయ రీతిలో పెరుగుతున్నాయి' అని వివరించారు. బుధవారం 'ఛాంపియన్ ఆఫ్ కోల్' పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం మనం ప్రపంచం మొత్తానికి బొగ్గును ఎగుమతి చేస్తున్నాం. మన బొగ్గు నాణ్యత ప్రపంచంలోనే గొప్పది' అని ట్రంప్ పేర్కొన్నారు.

ట్రంప్‌నకు ప్రతినిధుల సభలో షాక్

అమెరికా ప్రతినిధుల సభలో అధ్యక్షుడు ట్రంప్‌నకు షాక్ తగిలింది. సభలో రిపబ్లికన్ పార్టీకి మెజారిటీ ఉన్నా కెనడాపై అధ్యక్షుడు విధించిన సుంకాలను వ్యతిరేకిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆమోదం లభించింది. దీంతో ట్రంప్ సుంకాలపై సంతకాల ఎజెండాను రిపబ్లికన్ పార్టీ సభ్యులు కొందరు తొలిసారిగా వ్యతిరేకించినట్లయింది. బుధవారం జరిగిన ఓటింగ్‌లో 219-211 ఓట్ల తేడాతో తీర్మానం ఆమోదం పొందింది. దీంతో పాటు సుంకాలను విధించేందుకు ట్రంప్ ప్రకటించిన జాతీయ అత్యవసర స్థితినీ ఈ తీర్మానం ఎత్తివేయాలని కోరింది. తదుపరి ఇది సెనెట్‌కు వెళ్లనుంది. అక్కడా ఓటింగ్ జరుగుతుంది. అయితే దీనికి ట్రంప్ మద్దతు తప్పనిసరి. అందువల్ల అది ఆమోదం పొందకపోవచ్చు.

బంగ్లాదేశ్‌లో భారీ ఆధిక్యం దిశగా బీఎన్‌పీ



ఓటు వేస్తున్న యూనస్

ఢాకా: బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. గురువారం అర్ధరాత్రి సమయానికి ఆ పార్టీ 175కుపైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. జమాత్-ఏ-ఇస్లామీ పార్టీ కేవలం 30 చోట్లే ఆధిక్యంలో ఉంది. బీఎన్‌పీ ఛైర్‌పర్సన్ ఖాలిదా జియా కుమారుడైన తారిఖ్ రహ్మాన్ పోటీ చేసిన రెండు చోట్లా గెలిచారని సమాచారం. ఆయనే ప్రధాని అయ్యే అవకాశాలున్నాయి. అంతకుముందు 13వ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉదయం 7.30 గంటలకు 299 పార్లమెంటు స్థానాల్లో పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగింది. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్నారు. 50శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల స్వల్పంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌ను బహిష్కరించడంతో ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ, జమాత్ మధ్య నెలకొంది. ఈ ఎన్నికలతో పాటు 84 అంశాలతో కూడిన సంస్కరణల ప్యాకేజీపైనా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మహమ్మద్ యూనస్ ప్రభుత్వం రూపొందించిన నేషనల్ చార్టర్ 2025 పత్రంపై ప్రజాభిప్రాయం కోరారు.

మరో హిందువు హత్య

బంగ్లాదేశ్‌లో మరో హిందువు బలయ్యాడు. మౌల్విబజార్ ప్రాంతంలో తేయాకు తోటలో కార్మికుడిగా పనిచేస్తున్న 28 ఏళ్ల యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. చేతులు, కాళ్లు కట్టేసి రక్తపు మడుగులో పడి ఉన్న మృతుడిని రతన్ షుహోకర్‌గా గుర్తించారు.

అసెంబ్లీ లాబీలో ఎమ్మెల్యే బాలకృష్ణ సందడి

వాళ్లు రాలేదా అంటూ జగన్ గురించి ఆరా

ఈనాడు, అమరావతి: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ గురువారం అసెంబ్లీ లాబీలో సందడి చేశారు. తెదేపా శాసనసభాపక్ష కార్యాలయంలోకి రాగానే అక్కడున్న కొందరు ఎమ్మెల్యేలు, సిబ్బందితో 'వాళ్లు సభకు రాలేదా?' అని జగన్ గురించి ఆరా తీశారు. ఆ 11 మంది బుధవారం గవర్నర్ ప్రసంగానికి వచ్చి 11 నిమిషాల్లోనే వెళ్లిపోయారని ఎమ్మెల్యేలు ఆయనకు చెప్పారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బొజ్జల సుధీర్, ఎంఎస్ రాజులతో బాలకృష్ణ సరదాగా ముచ్చటించారు. 'ఏం డాకూ మహారాజ్.. మా హిందూపురానికి కాదని, హంద్రీనీవా నీళ్లను మడకశిరకు తీసుకుపోయావ్' అని మడకశిర ఎమ్మెల్యే రాజుతో బాలకృష్ణ అనగా.. వెనుకబడిన ప్రాంతం వాళ్లం. . పెద్ద మనసు చేసుకోండని రాజు సమాధానమిచ్చారు. కొత్తగా ఏ సినిమా చేయనున్నారని ఎమ్మెల్యేలు అడగ్గా.. మలినేని గోపీచంద్ తీసుకువచ్చిన కథ బాగుంది, త్వరలోనే ఆ ప్రాజెక్టు ప్రారంభమవుతుందని బాలకృష్ణ చెప్పారు. లాబీల్లో బాలకృష్ణతో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. అంతకుముందు బాలకృష్ణ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయానికి వెళ్లి ఆయనను కలిశారు.

అగ్రిగోల్డ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి ఊరట

జప్తు నుంచి మినహాయించే ఉత్తర్వుల పునరుద్ధరణ

ఈనాడు, అమరావతి: అగ్రిగోల్డ్‌పై క్రిమినల్ కేసులు నమోదు కాకముందు ఆ సంస్థ వేసిన లేఔట్లలో ప్లాట్లు కొనుక్కొని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వారి స్థలాల్ని జప్తు నుంచి మినహాయిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం యథాతథంగా పునరుద్ధరించింది. ఆ ప్లాట్ల యజమానులకు వైకాపా ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దింది. అగ్రిగోల్డ్‌కు చెందిన 16,857.81 ఎకరాల భూమి, 82,207.08 చదరపు గజాల స్థలాలను జప్తు చేస్తూ 2015 ఫిబ్రవరి 20న అప్పటి తెదేపా ప్రభుత్వం జీవో 23 జారీ చేసింది. ఆ భూముల్లో పలు చోట్ల అగ్రిగోల్డ్ లేఔట్లు ఉన్నాయి. వాటిల్లో ప్లాట్ల కొనుగోలు కోసం పలువురు చందాదారులు అగ్రిగోల్డ్‌పై కేసులు నమోదు కాక మునుపే పూర్తిగా డబ్బులు చెల్లించి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అలాంటి ప్లాట్లను జప్తు నుంచి మినహాయిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లోనే ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే వైకాపా అధికారం చేపట్టాక ఆ మినహాయింపును తొలగిస్తూ 2021 ఫిబ్రవరి 9న జీవో 19లో సవరణ ఉత్తర్వులిచ్చింది. దీంతో బాధితులైన ప్లాట్ల యజమానులు తమ సమస్యను ఇటీవల సీఐడీ అధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లటంతో వారు స్పందించారు. తాజాగా జప్తు నుంచి మినహాయింపు లభించడంతో ప్లాట్ల యజమానులకు ఊరట దక్కనుంది.

2029లో జమిలి ఎన్నికలు ఖాయం

- దిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఈనాడు, దిల్లీ: తెలంగాణ అసెంబ్లీకి 2028లో ఎన్నికలు రావని.. దేశవ్యాప్తంగా 2029లో జరిగే జమిలి ఎన్నికలతోపాటే ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. అందువల్ల తన పదవీ కాలం ఐదేళ్లు కాకుండా ఐదున్నరేళ్లు ఉంటుందని, ఆ తర్వాత మరో ఐదేళ్లు కొనసాగుతానని ధీమా వ్యక్తంచేశారు. ఆయన గురువారం దిల్లీలోని తన అధికార నివాసంలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. "కేంద్ర ప్రభుత్వం 2027 మార్చి 1 నాటికి జనగణన పూర్తిచేసి, ఆ తర్వాత అరవై రోజుల్లో జనాభా లెక్కలను ప్రచురిస్తుంది. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి జనాభా లెక్కలు ప్రచురించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన కోసం కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది. అది సంవత్సరంలోపు నియోజకవర్గాల విభజన, సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్లను ఖరారు చేస్తుంది. అందువల్ల 2029లో కచ్చితంగా కొత్త నియోజకవర్గాల ప్రకారం జమిలి ఎన్నికలు జరుగుతాయి.

ఒక్కో నదికి ఒక్కో విధానం మేం అంగీకరించం

ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న జల వివాదాలను పరిష్కరించుకోవడానికి మాకేమీ అభ్యంతరం లేదు. కృష్ణా, గోదావరి ట్రైబ్యునళ్లు ఇచ్చిన వాటా ప్రకారం తెలంగాణ ప్రాజెక్టులు కట్టుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ఎన్‌వోసీ ఇస్తే వారు వరద జలాలు వాడుకోవడానికి మేం అంగీకరిస్తాం. విభజన చట్టం ప్రకారం పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా.. ఇవన్నీ కొనసాగుతున్న ప్రాజెక్టులు. వాటన్నింటికీ అనుమతులున్నట్లే లెక్క. అయినప్పటికీ వాటికి వ్యతిరేకంగా కేంద్రానికి ఏపీ ఫిర్యాదులు చేయడం ఎంతవరకు సబబు? గోదావరిపై ఉన్న సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు కూడా అభ్యంతరం చెబుతున్నారు. గోదావరిలో 3వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చెబుతోంది. అలాంటప్పుడు గోదావరి ట్రైబ్యునల్ తెలంగాణకు కేటాయించిన 960 టీఎంసీలు వాడుకొనేందుకు అభ్యంతరం లేదని ఎన్‌వోసీ ఇవ్వాలి. అప్పుడు వరద జలాల్లో చెరి 300 టీఎంసీలు వాడుకోవడానికి మాకేమీ అభ్యంతరం ఉండదు. నికర జలాలు మేం వాడుకొనేందుకు పూర్తి స్వేచ్ఛ ఇస్తేనే మిగులు జలాలు ఇద్దరం పంచుకోవడానికి అంగీకరిస్తాం. కృష్ణా, గోదావరి రెండింటికీ ఒకే సూత్రం వర్తింపజేయాలి. ఒక్కో నదికి ఒక్కో విధానం మేం అంగీకరించం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి జలాలను కృష్ణాబేసిన్‌కు తరలించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు రెండు బేసిన్లను వేర్వేరుగా చూడాలని ఎలా అడుగుతుంది? మేమైతే గోదావరి జలాల పునఃపంపిణీ కోసం కొత్తగా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరుకోవడం లేదు.

- జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ఇచ్చిన హామీ ప్రకారం అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం తప్పకుండా ఏర్పాటుచేస్తాం. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలన్న డిమాండ్‌ను నేను కూడా సమర్థిస్తున్నా. ప్రస్తుతానికి ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. అవసరమైతే పార్టీలోకూడా చర్చిస్తా" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.



మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కుటుంబ సభ్యులకు ఉండవల్లి నివాసంలో విందు ఇస్తున్న మంత్రి లోకేశ్

కూటమి ప్రజాప్రతినిధులకు కుటుంబ సమేతంగా.. మంత్రి లోకేశ్ ఆత్మీయ విందు

- మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గంతో శ్రీకారం

ఈనాడు, అమరావతి: లోక్‌సభ నియోజకవర్గాల వారీగా కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను కుటుంబ సభ్యులతో సహా ఇంటికి ఆహ్వానించి విందుతో గౌరవించే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.. మంత్రి నారా లోకేశ్. మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో గురువారం రాత్రి ఆయన విందు సమావేశంలో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులందరినీ లోకేశ్ పేరుపేరునా పలకరించారు. వారితో కలసి భోజనం చేశారు. రాజకీయ చర్చలకు తావులేకుండా కుటుంబ ఆత్మీయ సమ్మేళనంలా దీన్ని నిర్వహించారు. ఇంటికి వచ్చిన ఆడపడుచులకు మంగళగిరి చేనేత పట్టుచీరలు బహూకరించారు. ప్రజాప్రతినిధులు వారి నియోజకవర్గాల పనులకు సంబంధించి ఇప్పటిదాకా తనకు ఇచ్చిన వినతుల్లో ఎన్ని పరిష్కరించారు, మిగతావి ఏ దశలో ఉన్నాయి, పరిష్కరించలేకపోతే అందుకు కారణాలేంటి? తదితర వివరాలతో లోకేశ్ వారికి నివేదికలు అందజేశారు. ఈ సమ్మేళనంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్‌రాజా, బోడే ప్రసాద్, జీవీ ఆంజనేయులు కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతుండటంతో ఎంపీ బాలశౌరి, అమెరికా పర్యటనలో ఉన్నందున గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హాజరు కాలేదు.

గీత దాటి ప్రవర్తిస్తుంటే ఎలా?

- పార్టీ లేకపోతే జీరోలమని గుర్తుంచుకోవాలి
- ఎమ్మెల్యే కొలికిపూడికి పల్లా శ్రీనివాస్ స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: 'ఒకటికి రెండు సార్లు చెప్పినా ఇంకా పద్ధతి మార్చుకోకుండా పార్టీ గీతను దాటి ప్రవర్తిస్తూనే ఉంటా అంటే ఎలా? ఇలాగే చేస్తానంటే చూస్తూ ఊరుకునేందుకు అధిష్ఠానం సిద్ధంగా లేదు' అని తెదేపా ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్‌కు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీ లాబీలో కనిపించిన పల్లాను చూసి మీతో మాట్లాడాలి అని శ్రీనివాస్ అడిగారు. ఇద్దరూ పక్కకు వెళ్లి కాసేపు మాట్లాడుకున్నారు. 'ఎందుకిలా చేస్తున్నారు? ఎన్నిసార్లు మందలించినా తీరు మార్చుకోకుండా వాట్సప్ స్టేటస్‌లలో ఏవేవో పెడుతూ ఎవరిమీద మీ పోరాటం? నేను మా ఇంట్లో రెండోతరం రాజకీయ నాయకుణ్ని. నాకు ఎక్కువ ఓట్లు వచ్చినా అది వ్యక్తిగతం కాదు. పార్టీ వల్లే వచ్చాయి. పార్టీనే సుప్రీం. పార్టీ లేకపోతే మనం వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి' అని శ్రీనివాస్‌కు పల్లా చెప్పారు.

మండలిలో 20 వరకు బడ్జెట్‌పై చర్చ

- 23న శాంతిభద్రతలపై
- బీఏసీ భేటీలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై ఈ నెల 23న శాసనమండలిలో స్వల్పకాలిక చర్చ చేపట్టాలని శాసనమండలి వ్యవహారాల సలహా మండలి (బీఏసీ)లో నిర్ణయించారు. శుక్రవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, 14న బడ్జెట్ ఉంటుంది. దాంతో ఆ తర్వాత నుంచి ఈ నెల 20 వరకు మండలిలో బడ్జెట్‌పై చర్చ చేపట్టాలని గురువారం జరిగిన బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. 24 నుంచి సమావేశాలకు సంబంధించిన ఎజెండాను 23న సమావేశమై ఖరారు చేద్దామని బీఏసీ భేటీలో నిర్ణయించారు.



వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్. చిత్రంలో మహీంద్ర అండ్ మహీంద్ర ఆటోమోటివ్ టెక్నాలజీ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ప్రెసిడెంట్ వేలుసామి, ఓమ్రాన్ హెల్త్‌కేర్ ఇండియా ఎండీ టాకుటో ఇవానక, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ.ఆర్.బి.రాజా, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎల్ల, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్ (ఎడమ నుంచి కుడికి)

కొత్త ప్రాజెక్టులు తమిళనాడులో చేపట్టండి

- ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ పిలుపు

చెన్నై, న్యూస్‌టుడే: కొత్త ప్రాజెక్టుల ఆలోచన ఉంటే తమిళనాడులో చేపట్టాలని, ఇక్కడ అనువైన అన్ని అంశాలూ ఉన్నాయని పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో చెన్నైలో గురువారం నిర్వహించిన అవగాహన ఒప్పందాల అమలు సదస్సులో ఆయన పాల్గొన్నారు. రూ.36,968 కోట్ల పెట్టుబడులతో.. 60,823 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా.. 71 కొత్త ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.31,934 కోట్ల పెట్టుబడులతో 82,664 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే 52 ప్రాజెక్టులను ప్రారంభించారు. రూ.ఐదు వేల కోట్ల పెట్టుబడి, ఐదు వేల మందికి ఉద్యోగావకాశాల లక్ష్యంతో భారత్ బయోటెక్‌తో, ఏడు వేల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించే ప్రాజెక్టు కోసం హ్యుందాయ్ మోటార్ ఇండియా ఫౌండేషన్‌తో ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. స్టాలిన్ ప్రసంగిస్తూ.. ఐదేళ్ల పాలనలో తాము నెలకొల్పిన పెట్టుబడుల రికార్డును మళ్లీ తామే అధికారంలోకి వచ్చి బద్దలు కొడతామని ధీమా వ్యక్తం చేశారు.

మండలిలోనే మనకు బలం ఉంది

- అక్కడే మీరు ప్రభుత్వాన్ని ఎండగట్టాలి
- కల్తీ నెయ్యిపై చంద్రబాబును నిలదీయండి
- వైకాపా ఎమ్మెల్సీలతో జగన్

ఈనాడు, అమరావతి: 'శాసనమండలిలోనే మనకు బలం ఉంది. కాబట్టి, మీరు ఇప్పుడు ఎంత గట్టిగా పనిచేస్తే మీకంత గుర్తింపు ఉంటుంది. మీ పదవులు మీకు మళ్లీ వస్తాయి. అంతకంటే మంచి పదవులూ దక్కుతాయి' అని వైకాపా ఎమ్మెల్సీలకు ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలను వినిపించడంతోపాటు ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వైకాపా శాసనసభాపక్ష సమావేశంలో జగన్ మాట్లాడారు. 'తిరుమల లడ్డూకు కల్తీ నెయ్యి సరఫరాతో వైకాపాకు ఎలాంటి సంబంధం లేదు. 2024 మే 13న ఎన్నికలు జరిగాయి. మే 15న తితిదేలో నెయ్యి సరఫరాకు సంబంధించిన టెండర్లను ఏఆర్ డెయిరీకి ఖరారు చేశారు. చంద్రబాబు సీఎం అయ్యాకనే జులై 6, 12 తేదీల్లో ఆ డెయిరీ నుంచి వచ్చిన నాలుగు ట్యాంకర్ల నెయ్యి నాణ్యత పరీక్షలో ఫెయిలవడంతో వెనక్కి పంపారు. తర్వాత అవే ట్యాంకర్లు మరో డెయిరీ పేరుతో తితిదేలోకి వచ్చాయి. వాటిలో వచ్చిన నెయ్యినే లడ్డూలో వాడారని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. దీనికి సమాధానం చెప్పాల్సింది, అనవసర ఆరోపణలు చేసినందుకు క్షమాపణలు అడగాల్సిందీ చంద్రబాబే కదా! సీబీఐ ఛార్జిషీట్‌లో అభియోగాలు ఎదుర్కొంటున్న కంపెనీలు 2014-19 మధ్య కూడా నెయ్యి సరఫరా చేశాయి. ఈ అంశాలన్నింటిపై సభలో గట్టిగా పోరాడాలి' అని ఎమ్మెల్సీలకు చెప్పారు. 'శాసనసభలో వైకాపాకు ప్రతిపక్ష హోదా ఇస్తే ముఖ్యమంత్రికిచ్చినంత సమయం నాకూ ఇవ్వాల్సి వస్తుంది. అలా అయితే మనం ప్రశ్నిస్తామనే హోదా ఇవ్వడం లేదు. కాబట్టే సభలో కాకుండా బయట మీడియా ముందు మాట్లాడుతున్నా' అని జగన్ వారికి చెప్పారు. కూటమి ప్రభుత్వం కుంభకోణాలమయంగా మారిందని ఆరోపించారు.



తాడేపల్లిలోని వైకాపా కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో సమావేశమైన జగన్

వసుంధర

vasundhara@eenadu.in

కడుపులో బిడ్డ... మెడలో పతకం!



కడుపులో బిడ్డ పెరుగుతోంటే... ఆట పక్కన పెట్టు. పాపాయి ముఖ్యం అనే చెబుతారంతా. అందుకే అమ్మతనాన్ని కెరియర్‌కి అవరోధంగా భావి స్తుంటారు. కానీ మేఘన సజ్జనార్ రెండూ కావాలనుకుంది. కా బట్టే, గెలిచింది. అందరి మన్న నలూ అందుకుంటోంది.



'ప్రెగ్నెన్సీ అనగానే 'ఇక ఆటనుంచి విరామం తీసుకో' అన్న సలహాలే వచ్చాయి. కానీ నేను బాగా ఆలోచించా. 'సెరెనా విలియమ్స్ ఎనిమిది వారాల గర్భిణిగా ఉండి, ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచింది. గత ఒలింపిక్స్‌లోనూ కడుపులో బిడ్డతో పోటీపడ్డ వాళ్లు చాలామందే. అలాంటప్పుడు నేను మాత్రం ఎందుకు ఆగిపోవాలి అనిపించింది' అంటుంది మేఘన. ఈమెది బెంగళూరు. 10ఎం రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించింది. ఈ పట్టుదలతోనే తాజాగా ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్యం, బృంద విభాగంలో బంగారు పతకాలు గెలుచుకుంది. అప్పట్లో తనకి ఎనిమిదో నెల. అయినా పట్టుదలగా ప్రయత్నించి, గెలిచింది. కాబట్టే, తోటి క్రీడాకారులతోపాటు నెటిజన్ల మన్ననలూ పొందుతోంది మేఘన.

పాపాయితో మాట్లాడా...

మిగతా క్రీడలతో పోలిస్తే షూటింగ్‌కి పెద్దగా శారీరక శ్రమ అవసరం లేదు... చాలామంది అనుకునే మాటే! కానీ 10ఎం ఎయిర్ రైఫిల్‌లో కచ్చితత్వం అవసరమైన క్రీడగా చెబుతారు. బ్యాలెన్సింగ్, పోశ్చర్ స్టెబిలిటీ, శరీరంపై పట్టు... ఇలా చాలానే అవసరమవుతాయి. కొద్దిపాటి శరీర మార్పులు కూడా ప్రదర్శనపై ప్రభావం చూపుతాయి. అలాంటిది ప్రెగ్నెన్సీ కారణంగా పెరిగే బరువు, మారే శరీరం, బ్యాలెన్సింగ్ కూడా మారుతూ ఉంటుంది. వాటన్నింటిపై పట్టు సాధించి... విజయాన్ని దక్కించుకుంది మేఘన. అయితే కడుపులో బిడ్డతో తను అంతర్జాతీయ పోటీలో పాల్గొనడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది విమెన్స్ వరల్డ్ కప్‌లోనూ కాంస్యం సాధించింది. అప్పటికి తనకు ఐదో నెల. 'క్వాలిఫికేషన్ రౌండ్‌లో కడుపులో పాపాయి తెగ కదులుతోంది. అప్పుడు నాకు నేనే ప్రశాంతంగా ఉండాలి అని చెప్పుకొన్నా. మనసులోనే పాపాయితో నువ్వు క్షేమంగా ఉన్నావంటూ మాట్లాడా. అది మాటల్లో చెప్పలేని అనుభూతి' అంటుంది మేఘన.

'నేను ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనాలనుకుంటున్నా' అని ఆరో నెల గర్భిణిగా ఉన్నప్పుడు కోచ్‌తో చెబితే ఆయనా పెద్దగా ఆలోచించలేదట. కానీ పోటీల నాటికి ప్రసవానికి దగ్గరపడుతుంది అనిపించినప్పుడు ఆయన రిస్కేమో అన్నారట. కానీ మేఘన చేయగలననే చెప్పిందట. నిజానికి రైఫిల్ సాధనకి గంటలకొద్దీ నిల్చోవాలి. ఓపికకి పరీక్ష, నిలకడగా నిల్చోవడం, కోర్ స్ట్రెంత్, శ్వాసమీద పట్టు ఇలా ఎన్నో ఉంటాయి. వీటన్నింటినీ కొత్తగా సాధన చేసింది. రైఫిల్ జాకెట్, ట్రౌజర్లను ఎన్నిసార్లు మార్పులు చేయించుకుందో లెక్కేలేదు. 'రోజూ కొత్త సవాలు ఎదురయ్యేది. నిల్చోవడం, నడక, శ్వాస తీసుకోవడం... ఇలా అన్నింట్లోనూ ఇబ్బందే. అందుకే తక్కువ సేపు సాధన చేసినా, టెక్నిక్స్ మీదే ఎక్కువ దృష్టిపెట్టా. నిపుణుల సూచనలు, సలహాలు తీసుకున్నా. ప్రెగ్నెన్సీలో తీసుకునే మందులు డోపింగ్ కిందకి వస్తాయా అన్నదీ చూసుకున్నా. ఎలాగైతేనేం, నా ప్రయత్నం ఫలించింది. వ్యక్తిగత విభాగంలో తృటిలో రజతం కోల్పోయినా కాంస్యం సాధించగలిగా' అనే మేఘన... 'ప్రెగ్నెన్సీ జీవితంలో ఒక భాగం. ఇదో జబ్బు, వైకల్యం కాదు. కడుపులో బిడ్డతోనూ మీరు అనుకున్నది సాధించొచ్చు' అని చెబుతోంది. ఛాంపియన్‌షిప్ పూర్తయ్యింది కాబట్టి, ఇప్పుడు విరామం తీసుకుంటుందట. ప్రసవమయ్యాక త్వరగా కోలుకుని, తిరిగి సాధన మొదలుపెడతానంటోంది. ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా!

కలయికలో నొప్పి!

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

నాకు పెళ్లై నాలుగు నెలలు. కలయికలో పాల్గొన్నాక పొత్తికడుపులో బాగా నొప్పి వస్తోంది. ఎందుకిలా? తగ్గాలంటే ఏం చేయాలి? – ఓ సోదరి

తొలిరోజుల్లో నొప్పి మామూలే. అప్పటివరకూ యోని మార్గం అంటే 'హైమన్' సాధారణంగానే బిగుతుగా ఉంటుంది. దీంతో కలయిక సమయంలో అది తెరుచుకునేప్పుడు నొప్పి, కొన్నిసార్లు రక్తం రావడం జరుగుతుంటుంది. కొంతమందికి విపరీతమైన రక్తస్రావం అవుతుంది. అయితే కాలం గడిచేకొద్దీ నొప్పి తగ్గిపోతుంది. నిజానికి ఈ నొప్పికి రెండు కారణాలు. యోని మీ భర్త జననాంగాలకు అనుకూలంగా లేకపోయినా, ఆ మార్గం మరీ చిన్నగా ఉన్నా వస్తుంది. ఇక రెండోది... మానసికంగా ఇంటర్‌కోర్స్‌కి సిద్ధంగా లేకపోవడం. అప్పుడు యోని వద్ద తేమ ఉండదు. దీనివల్లా విపరీతమైన నొప్పి వస్తుంది. అయితే ఇది చాలామందికి తొలిరోజుల్లోనే వస్తుంది. కొన్నిసార్లు... కొంతమందికి కొన్నేళ్ల తరవాత అయిష్టత ఏర్పడుతుంది. మనస్పర్థలు, మానసికంగా విముఖంగా ఉండటం వంటి కారణాల వల్ల కలయిక సమయంలో నొప్పి ఎదుర్కొంటారు. కాబట్టి, ముందు ప్రశాంతంగా ఉండండి. ఎందుకు మీకీ సమస్య వస్తోందో ఆలోచించండి. మీరు సిద్ధంగా ఉన్నారా లేరా అన్నది గమనించుకోండి. ఆపై ఆ ప్రాంతంలో ఏమైనా ఇన్‌ఫెక్షన్ లేదా అల్సర్లు, ఎరోజన్స్ ఉన్నాయేమో చెక్ చేయించుకోండి. ఈ సమస్యతో వచ్చే వాళ్లు మాకు తెల్లబట్ట ఎక్కువగా, పెరుగులా చిక్కగా అవుతోంది అంటుంటారు. ఇందుకు కాండియాడిడ్ లేదా ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ కారణం. ఈమధ్య ఇలాంటివి చాలా చూస్తున్నాం. ఇది తెల్లబట్టే అనుకుంటారు కానీ... శ్లేష్మ పొర దెబ్బతిని ఇలా బయటికి వస్తుంది. ఫలితమే నొప్పి. కాబట్టి, ఇలాంటిదేమైనా ఉందేమో కూడా చెక్ చేసుకోవాలి. ఒకసారి వైద్యులను కలవండి. మీ సమస్యేంటో చెప్పి, తగ్గ చికిత్స అందిస్తారు.

పైలట్లకు 'దృష్టి'ని ఇచ్చారు!



చలికాలంలో మంచు దట్టంగా ఉన్నప్పుడు... ఎదురుగా ఎవరున్నారో కూడా సరిగా గుర్తించలేం. మరి ఆకాశం నుంచి భూమిపైకి దిగే విమానాల పరిస్థితి ఏంటి అని ఎప్పుడైనా ఆలోచించారా? శాస్త్రవేత్త డా. శుభ వి అయ్యంగార్ ఆలోచించడమే కాదు... దశాబ్దాల పాటు శోధించి... దానికి మేలైన పరిష్కారం చూపించారు. దాని ఫలితంగానే ఉత్తర భారతదేశంలోని చాలా విమానాశ్రయాల్లో ఇప్పుడు విమానాలు సురక్షితంగా దిగగలుగుతున్నాయి. ఈ కృషికి గుర్తింపుగానే... ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారం ఆమెను వరించింది.

శుభది మధ్యతరగతి కుటుంబం. ఈమె తల్లిదండ్రులకు తొమ్మిది మంది సంతానం కాగా శుభ చివరి అమ్మాయి. ఆడపిల్లలు సైన్స్ విద్యలోకి అడుగుపెట్టాలనే ఆలోచన కూడా చేయని కాలంలోనే ఆమె ఈ రంగంపై మక్కువ పెంచుకున్నారు. బెంగళూరులోని సెంట్రల్ కాలేజీలో బీఎస్సీ ఆనర్స్(ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్), ఎంఎస్సీ చదివారు. టాపర్‌గా నిలిచారు. ఆమె తండ్రి ఆడపిల్లలు ఉన్నత విద్య చదవాలని కోరుకునే వారు. కానీ, దురదృష్టవశాత్తు శుభ ఎంఎస్సీ చదివే రోజుల్లోనే ఆయన మరణించారు. అయినా పట్టు విడవకుండా చదివి ఆమె తన తండ్రి కోరికను నెరవేర్చారు. చదువయ్యాక బెంగళూరులోని సీఎస్ఐఆర్-నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్ (ఎన్ఏఎల్)లో చేరారామె. తర్వాత ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో పక్క పీహెచ్‌డీ కూడా పూర్తిచేశారు.

తొలి స్వదేశీ పరిజ్ఞానంతో...

ఎన్ఏఎల్‌లో వివిధ హోదాల్లో 40 ఏళ్లకు పైగా సేవలందించారు శుభ. డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్‌గా పదవీ విరమణ చేశారు. ఆమె నేతృత్వంలో రూపొందిన 'దృష్టి' ట్రాన్స్‌మిస్సోమీటర్ భారతదేశం అభివృద్ధి చేసిన తొలి స్వదేశీ రన్‌వే విజిబిలిటీని కొలిచే పరికరం. ఇది భారతదేశంలో విమానాలు సురక్షితంగా ఎగరడానికీ, ల్యాండ్ అవడానికీ సహాయపడుతుంది. పదవీ విరమణ చేసినా... ఈనాటికీ సంస్థ పురోగతికి ఆమె సేవలందిస్తున్నారు. 'కొత్త విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తి, అనుకున్నది పూర్తి చేయాలనే పట్టుదల, నిరంతరం శ్రమించే తత్వం నన్ను ముందుకు నడిపించాయని' అంటారు శుభ.

ఏంటీ 'దృష్టి'...

మంచు, పొగమంచు, భారీ వర్షాల్లో విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ చేసేటప్పుడు రన్‌వే ఎంత స్పష్టంగా కనిపిస్తుందో కొలిచే సాధనమే 'దృష్టి'. గతంలో ఫిన్‌లాండ్, ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకునే పరికరాలు ఖరీదైనవి, మరమ్మతులూ కష్టం, స్పేర్ పార్ట్స్ కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. ఎన్ఏఎల్, భారత వాతావరణ శాఖ సహకారంతో డా. శుభ 'దృష్టి'ని అభివృద్ధి చేశారు. ఈ పరికరం పొగమంచు, వర్షం, ధూళి వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రన్‌వే దృశ్యమాన దూరాన్ని కచ్చితంగా కొలిచి పైలట్లకు సమాచారం అందిస్తుంది. దీని వల్ల విమానాలు సురక్షితంగా ల్యాండింగ్, టేకాఫ్ చేయగలుగుతాయి. ఉత్తర భారతంలో శీతకాలంలో దిల్లీ, లఖ్‌నవూ వంటి విమానాశ్రయాల్లో జరిగే ఆలస్యాలు, డైవర్షన్లు గణనీయంగా తగ్గాయి. ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాలతో పాటు భారత వైమానిక దళంలో కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. ఒక్క దిల్లీ విమానశ్రయంలోనే 10కి పైగా పరికరాలు అమర్చారంటేనే దీని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. ఈ సాంకేతికత వల్ల లక్షలాది ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణిస్తున్నారు. శుభ అసాధారణ ప్రతిభనీ, అవిరళ కృషినీ తాజాగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీని అందించింది. ఇటీవల ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్ర సైతం శుభను తన మండే మోటివేషన్‌గా పేర్కొంటూ ట్వీట్ చేశారు.

ఇది... సముద్ర పట్టు కథ!

మనకి మల్బరీ, ఎరి, టస్సర్, ముగ పట్టు దారాలు తెలుసు. కానీ ప్రపంచంలోనే అరుదైన ఖరీదైన సముద్ర పట్టు గురించి విన్నారా? పూర్వం రోమన్ చక్రవర్తులు ఎక్కువగా ధరించేవారట. రెండువేల ఏళ్ల క్రితమే తెరమరుగైంది. అయితే ఆనాటి సముద్ర పట్టును తాజాగా కొరియన్ శాస్త్రవేత్తలు పునరుద్ధరించారు. అంతే కాదు, వీళ్ల పరిశోధన భవిష్యత్తులో సస్టెయినబిలిటీ ఫ్యాషన్‌కు తెరతీయనుంది.







మధ్యధరా జలాల్లో పెరిగే పిన్నా నోబిలిస్ అనే మొలస్కస్లు సముద్రంలోని రాళ్లకు అతుక్కుని ఉండేందుకు బైసస్‌గా పిలిచే పీచు పదార్థాన్ని స్రవిస్తాయి. దాన్ని సేకరించి దుస్తులుగా మలిచేవారు. ఈ గోల్డెన్ ఫ్యాబ్రిక్ అత్యంత తేలికగానూ దృఢంగానూ ఉంటుంది. దీన్ని లెజండరీ సిల్క్ లేదా పిన్నా ఉన్ని అనీ పిలిచేవారు.

ఎలా అదృశ్యమైంది?

చేపల వేట, కాలుష్యం వల్ల ఆ మొలస్కస్లు అంతరించే దశలో ఉండటంతో ఈ సిల్క్ వేట, తయారీపై యూరోపియన్ యూనియన్ నిషేధం విధించింది. దాంతో అది ప్రాచీన సిల్క్‌గా మిగిలిపోయింది. ఈ సిల్క్‌తో వస్త్రాల్ని రూపొందించే కళాకారులూ కనుమరుగయ్యారు. ఇటలీలోని సార్డినియా, టరాంటోల్లో ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం వరకూ దీన్ని ఉత్పత్తి చేశారట. ఇప్పటికీ సార్డినియాలోని శాంట్ ఆంటియోకోలో ఇద్దరు ముగ్గురు మహిళలు ఉన్నారట. కానీ ఈ కళలో ప్రావీణ్యం ఉన్న ఏకైక వ్యక్తి చియారా విగో అని చెబుతారు.

మళ్లీ ఇప్పుడెలా?

ఆహారంకోసం పెంచే పెన్ షెల్స్(అట్రినా పెక్టినాటా)కూడా బైసస్ దారాల్ని పోలినవే ఉత్పత్తి చేస్తున్నాయనీ, ఇవీ సాగర పట్టుని పోలి ఉన్నాయనీ గుర్తించారు కొరియాలోని ఎన్విరాన్‌మెంటల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు. ఈ గోల్డెన్ ఫైబర్ మెరుపు వెనకున్న శాస్త్రీయ కారణాన్నీ కనుగొన్నారు. దారాల్లోని ప్రొటీన్ల అమరిక వల్లే దానికా మెరుపు వస్తుందట. అంటే... సబ్బు బుడగలు, సీతాకోకచిలుక రెక్కలమీద కాంతి ప్రసరించినప్పుడు అవి ఎలాగైతే రంగుల్లో మెరుస్తాయో అదేమాదిరిగా ఈ ప్రొటీన్ కణాలూ కాంతిని ప్రతిఫలింపజేస్తాయి. అందుకే ఈ దారాల రంగు ఎప్పటికీ వెలవదు సరికదా కాంతి పడినప్పుడు బంగారు వర్ణంలో మెరుస్తుంటుంది. అందువల్లే సముద్ర పట్టు దారాలకు సాధారణంగా రంగుల్ని అద్దరు.

ఈ పరిశోధన ఆధారంగా సరికొత్త బయోమిమిటెక్ మెటీరియల్స్ డిజైన్లనీ, రంగులద్దకుండా అడ్వాన్స్‌డ్ సస్టెయినబుల్ దారాల్ని రూపొందించవచ్చనీ భావిస్తున్నారు. ఈ దారాల్లోని ప్రొటీన్లను శస్త్రచికిత్సల్లో వాడే ఇంప్లాంట్లలో ఉపయోగించే దిశగానూ ఆలోచిస్తున్నారట.

ఆ ప్రాచీన కళకి ఆమె అంకితం!

సంప్రదాయ కళల్ని ప్రేమించేవాళ్లు ఎందరో. కానీ పైసా ఆశించకుండా అదే జీవితంగా ఉండేవాళ్లూ అరుదే. ఆ కోవకే చెందుతారు చియారా విగో. ఈమెది సార్డినియాలోని శాంట్ ఆంటియాకో. ఈ పట్టును సేకరించి వడికి, నేసే ఏకైక చివరి మహిళను నేనే అని ఆమె చెబుతుంటారు.



'సీ సిల్క్ కళ గొప్ప సంప్రదాయం. మా కుటుంబం వెయ్యి సంవత్సరాలుగా దీన్ని బతికిస్తోంది. నేను 24వ తరం. తరానికి ఒక్కరికి అంటే- కూతురు, కోడలు లేదా మనవరాలికి నేర్పిస్తారు. వాళ్లు ఆ సముద్రానికి కృతజ్ఞతలు చెప్పి ఈ పట్టుని ఎవరికీ విక్రయించమనీ, కళను కాపాడతామనీ ప్రతిజ్ఞ చేయాలి. నేనూ అలాగే చేశా. కాదని దీన్ని మీరితే ఆ సాగరం శపిస్తుంది. నా తరవాత చిన్న కూతురికి నేర్పా. కానీ తను ఎంతవరకూ దీన్ని బతికిస్తుందో తెలియదు. నాకు అమ్మమ్మ నేర్పింది. నా మూడో ఏట నుంచీ తనతోపాటు సముద్రంలోకి తీసుకెళ్లింది. పన్నెండో ఏట నుంచీ పట్టుని నేస్తున్నా. నిజానికిది క్లిష్టమైన ప్రక్రియ. 100 సార్లు సముద్రంలోకి వెళ్తే దొరికే పట్టు 30గ్రాములే. అదీ మొలస్కస్లకు హాని కలగకుండా సేకరిస్తా. దాన్ని 25 రోజుల పాటు మంచినీటిలో ముంచి ప్రతి మూడుగంటకోసారి నీటిని మారుస్తూ దానికి పట్టిన ఉప్పుని తొలగించి, బ్రష్‌తో శుభ్రం చేస్తా. ఆపై ఓ ప్రత్యేక మిశ్రమంలో ముంచి తీసి, ఎండబెట్టాక అసలైన పట్టు వస్తుంది. దీన్ని వడికి, నేయడం లేదా కుట్టడం చేస్తా. ఈ సహజ పట్టుదారాలమీద కాంతి ప్రసరించినప్పుడు అది బంగారంలా మెరుస్తుంది. సాగరానికి ఇచ్చిన మాట ప్రకారం దీన్నుంచి పైసా సంపాదించలేదు. ఎందుకంటే ఈ సంపద అందరిదీ. అందుకే ఈ పట్టు ఉత్పత్తుల్ని మ్యూజియాలకే ఇస్తాను. మా ఇంట్లోనూ ఉండవు. ఈ సముద్ర పట్టుతో ఎక్కువగా చేతి గ్లోవ్స్, ఎంబ్రాయిడరీ చేస్తుంటా. వధూవరులకీ గర్భిణులకీ పసిపిల్లలకీ కానుకలుగా ఇస్తా. పోప్ బెనెడిక్ట్‌కీ డెన్మార్క్ రాణికీ కొన్ని కళాఖండాలను బహూకరించా' అంటారీమె.

రాత్రి సందర్శనలకే ఓటు..!

ఇదివరకూ పర్యటనలు అంటే... ప్రయాణం రాత్రయితే బాగుంటుంది అనుకునేవారు. బస్సో, రైలో ఎక్కి నిద్రపోయామంటే చాలు... వేకువజామున అనుకున్న గమ్యాన్ని చేరిపోయి మనసారా ప్రకృతి అందాల్ని ఆస్వాదించొచ్చని భావించేవారు. అందుకు తగ్గట్లే ఏర్పాట్లు కూడా చేసుకునేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్, ట్రావెల్ కల్చర్ రెండూ మారాయి. మహిళా ప్రయాణికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. గజిబిజి జీవనశైలి నుంచి దూరంగా, ఒత్తిడి నుంచి ఉపశమనంగా, పనులన్నింటినీ పక్కన పెట్టేసి ఓ మంచి ప్రదేశానికి వెళ్లొస్తే చాలు... మనసు, మెదడు రెండూ విశ్రాంతి తీసుకుంటాయన్న ఆలోచనే కారణం. అయితే వీళ్లంతా అరవిరిసిన పూల అందాల్నీ, సూర్యోదయాన్నీ, గలగలపారే జలపాతాల్నీ చూడటానికి అంతగా ఆసక్తి చూపించడం లేదట. బదులుగా కాంతులీనే నక్షత్రాల్నీ వాటితో పోటీపడుతూ మిణుకు మిణుకుమనే మిణుగురుల్నీ, పున్నమి చంద్రుడినీ చూడటానికి ఇష్టపడుతున్నారట. అంటే పగటి అందాలకు బదులు... నిశిలో వెలుగుల్ని కనుగొనే పనిలో పడ్డారట. దీన్నే 'నాక్టోటూరిజం' అంటున్నారు. ఇటీవల ఓ అధ్యయనంలో వెల్లడైన విషయమిది. దాదాపు 67శాతం మంది అమ్మాయిలు ఈ తరహా పర్యటనలకు ఓటేశారు. ఎందుకంటే... 'సూర్యుడు చూపించే రంగుల అందం కన్నా... చంద్రుడు ఇచ్చే నిశ్శబ్దపు వాతావరణమే ఎన్నో కథల్ని చెబుతుంది మాకు' అంటున్నారట. అంతే కాదు 'వాహనాలు, జనసందోహం మధ్య ఓ పట్టణం, ప్రాంతం సందర్శించడం కన్నా... నిశి వేళల్లో, శశి వెలుగుల్లోనే కొన్ని కట్టడాలు, ప్రాంతాల అందాల్ని ఎక్కువగా చూడగలం అంటున్నారట. మీరేం అంటారు మరి!



అతి వద్దు సుమీ!

అమ్మాయిలకు అందంపైనా, ఆరోగ్యంపైనా స్పృహ రోజు రోజుకీ పెరుగుతోంది. దీంతో తక్కువ సమయంలోనే బరువు తగ్గాలని కొందరు... దృఢంగా మారిపోవాలని మరికొందరు అతిగా వ్యాయామాలు చేస్తున్నారు. ఇలా చేస్తే ప్రయోజనాల సంగతి దేవుడెరుగు... దుష్ప్రభావాలు తప్పవంటున్నారు నిపుణులు. అది ఎలాంటి పరిస్థితికి దారితీస్తుందో తెలుసా?



ఒత్తిడి పెరుగుతుంది...

వ్యాయామం చేయడం వల్ల ఫీల్ గుడ్ హార్మోన్లు విడుదలై ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తాయి. అయితే, మితిమీరి వర్కవుట్స్ చేయడం వల్ల కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ కూడా ఎక్కువగా విడుదలవుతుంది. దీంతో శరీరమే కాదు... మనసూ అలసిపోతుంది. కాబట్టి తీసుకునే ఆహారాన్ని బట్టి రోజూ 45 నిమిషాల నుంచి గంట వరకూ కసరత్తులకు కేటాయించుకుంటే సరిపోతుంది.

ఎక్కువ తినేలా చేస్తుంది...

అధిక వ్యాయామం వల్ల గ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. దీంతో కసరత్తులతో కరిగించిన కెలోరీలు కంటే ఎక్కువగా ఆహారం తీసుకునేలా చేస్తాయి. దీంతో నాజూగ్గా మారాలన్న లక్ష్యం పక్కకెళ్లి... మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంది.

హార్మోన్ల హెచ్చుతగ్గులు...

మితంగా చేసే వ్యాయామం... హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. అదే విశ్రాంతి లేకుండా అతిగా చేస్తే శరీరంపై ఒత్తిడి పెరిగి అవి హెచ్చుతగ్గులకు గురవుతాయి. ముఖ్యంగా కార్టిసాల్ ఎక్కువగా ఉత్పత్తి అయ్యి ఇతర హార్మోన్లను దెబ్బతీస్తుంది. ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ తగ్గుతాయి. నెలసరిని క్రమం తప్పిస్తాయి. భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల బారిన పడేలానూ చేస్తాయి. కాబట్టి ఆ సమయం గంట దాటకుండా ఉంటే మేలు.

బంగారం - వెండి

12న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,60,530	1,45,600	2,67,210
విజయవాడ	1,55,790	1,46,200	2,76,000
ప్రొద్దుటూరు	1,59,100	1,46,370	2,67,500
రాజమహేంద్రవరం	1,58,400	1,45,200	3,00,000
విశాఖపట్నం	1,58,400	1,45,200	2,71,000
తమిళనాడు	-----	1,46,000	3,00,000

వీటిది... కనిపించని కనికట్టు!

సందర్భమేదైనా అందంగా కనిపించాలనేదే ఏ అమ్మాయి ప్రయత్నమైనా! అందుకు వాళ్లు ఎంచుకునేది మేకప్‌నే. అయితే అది మరీ గుర్తించేలా ఉండొద్దు అంటోంది ఈ తరం. కాబట్టే, వాళ్లకోసమే కనిపించకుండా కనికట్టు చేయడానికి వచ్చాయివి.



సహజ వర్ణాల్లో...

మేకప్ వేసినా వేయకపోయినా... తమ లుక్ మారిపోవాలంటే అమ్మాయిలకు మొదట కనిపించేది లిప్‌స్టిక్‌లే. కొన్నిసార్లు ముచ్చటపడి ఎంచుకున్న రంగు నప్పకపోవచ్చు. ఒకవేళ నప్పినా వీటిలోని రసాయనాలు త్వరగా పెదాలు పొడిబారేలా చేస్తాయి. ఇంకొన్నిసార్లు వేసుకోవాలని ఉన్నా కొట్టొచ్చినట్లు కనిపించే రంగులు వెనకడుగు వేసేలా చేయొచ్చు. అలాంటివాళ్లకోసం వచ్చినవే... ట్రాన్స్‌పరెంట్ లిప్‌స్టిక్‌లు. కొన్ని పెదాల పీహెచ్‌ని బట్టి రంగు మారతాయి. అదీ మరీ ముదురు రంగులో కాకుండా లేత వర్ణంలో సహజ లుక్‌ని ఇస్తాయి. కొన్నిసార్లు ఆ రంగునీ ఎంచుకోవచ్చు. పైగా ఇవి పెదాలను పొడిబారనీయవు. దీంతో ఆరోగ్యంగా మెరుపులీనుతాయి.





నో మేకప్ కావాలంటే...

మేకప్ వేయాలంటే ఫౌండేషన్ నుంచే మొదలుపెట్టాలి. కానీ దీన్ని ఎంచుకోవడమే పెద్ద సవాలు. చర్మానికి తగ్గట్టుగా ఎంచుకోకపోతే మొదటికే మోసం వస్తుంది. పైగా ఇప్పుడు చాలామంది అమ్మాయిల ఎంపిక 'నో మేకప్ లుక్'. ఇది మరీ కష్టం. దాన్నీ సులువు చేయాలంటే ట్రాన్స్‌పరెంట్ మేకప్ ఫౌండేషన్ ఎంచుకోవడం మేలు. దీన్ని సీరమ్ బేస్‌డ్ ఫౌండేషన్‌గా కూడా చెబుతారు. చర్మమంతా ఒకే రంగులో మెరుస్తూ కనిపించేలా చేయడం దీని ప్రత్యేకత. మాయిశ్చరైజర్ని అందిస్తూనే మెరిసేలా చేస్తుంది. పైగా మామూలు వాటిలా ముద్దగా కనిపించడం, పగుళ్ల వంటివి ఉండవు కాబట్టి, చక్కగా మెరిసిపోవచ్చు.



ఎలాగైనా మెరిపించొచ్చు

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మెరిసే పెదాలు తెచ్చే అందమే వేరు కదూ! కాబట్టే... చాలామంది అమ్మాయిల ఎంపిక లిప్ గ్లాస్‌లే. రంగుకి రంగూ మెరుపునకి మెరుపూ. వీటిలోనూ మళ్లీ సమస్యే! ఒక్కోసారి రంగు లేకుండా మెరవాలి అనిపిస్తుంది. కొన్నిసార్లు లిప్‌స్టిక్ రంగుని హైలైట్ చేయాలి అనిపిస్తుంది. రెండింటికీ పరిష్కారం ట్రాన్స్‌పరెంట్ లిప్ గ్లాస్‌లే. లిప్‌బామ్‌కి మించిన మెరుపు కావాలన్నా... లిప్‌స్టిక్‌కి జోడీగా వేసుకోవాలన్నా ఇవి మంచి పరిష్కారం. పైగా పెదాలను ఎక్కువసేపు తేమగానూ ఉంచుతాయి. కాబట్టే, వీటికే ఎక్కువమంది ఓటు. మీ సంగతేంటి? మారిపోతారా ఈ ట్రాన్స్‌పరెంట్ అందాల మాయలోకి?



టాయ్ ట్రైన్‌కు తొలి మహిళా టికెట్ కలెక్టర్...

పర్యటక రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రైల్వే మార్గాల్లో డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే ఒకటి. న్యూ జల్పాయ్‌గురి నుంచి డార్జిలింగ్ వరకూ నడిచే ఈ రైలుకి టాయ్ ట్రైన్‌గా పేరు. యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఈ రైలుది 145 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర. తాజాగా ఓ మహిళను దీనికి టీటీఈగా నియమించడంతో మరో మైలురాయిని చేరుకుంది. ఈ ఘనత సాధించిన సరితా యోల్మో స్థానికురాలే కావడం విశేషం. డార్జిలింగ్ జిల్లాలోని సోనాడాలోని గూర్ఖా కుటుంబంలో పుట్టిపెరిగారామె. ఈశాన్య సరిహద్దు రైల్వే(ఎన్ఎఫ్ఆర్)లోని న్యూ జల్పాయ్‌గురి స్టేషన్‌లో సీనియర్ టికెట్ కలెక్టర్‌గా, రాజధాని ఎక్స్‌ప్రెస్, అమృత్ భారత్ వంటి రైళ్లలో టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. తాజాగా ఈ హెరిటేజ్ టాయ్ ట్రైన్‌లో సీనియర్ టికెట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 'మొదట కాస్త భయపడ్డాను. ఎందుకంటే వేరే రైళ్లలో నాతో పాటు ఇతర సహోద్యోగులు ఉండేవారు. కానీ ఈ టాయ్ ట్రైన్‌లో నేను ఒంటరిగా ఉండాలి. ప్రయాణికులు, పర్యటకుల బాధ్యత మొత్తం నాదే. నా భర్త దావా యోల్మో నాకు ధైర్యం చెప్పారు. ఆయన కూడా డార్జిలింగ్ హిమాలయన్ రైల్వేలో పనిచేసి ఏడాది క్రితమే రిటైర్ అయ్యారు. ఆయన స్ఫూర్తితోనే నేను ఈ అడుగు వేశాను. తొలిరోజు ప్రయాణం పూర్తయ్యాక నాకు చాలా సంతోషంగా అనిపించింది. తొలి మహిళా టీసీని అని గుర్తించి నాతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఇవన్నీ నా జీవితంలో వెలకట్టలేని సంపద. నేను సాధించిన ఈ గుర్తింపు మరెంతో మంది మహిళలకు స్ఫూర్తినిస్తుంది' అని చెబుతారామె.



\- ఈటీవీ భారత్

ఈనాడు బిజినెస్

ఇళ్ల విక్రయాలు తగ్గాయ్

ద్వితీయ శ్రేణి నగరాలపై ప్రాప్‌ఈక్విటీ నివేదిక

దిల్లీ: దేశంలోని 15 రెండో అంచె నగరాల్లో, ఇళ్ల విక్రయాలు గతేడాది 10% తగ్గి 1.56 లక్షలకు పరిమితమయ్యాయని స్థిరాస్తి డేటా అనలిటిక్ ప్లాట్‌ఫామ్ ప్రాప్ ఈక్విటీ వెల్లడించింది. విలువ పరంగా మాత్రం.. రూ.1.48 లక్షల కోట్ల వద్ద స్థిరంగా ఉన్నాయి. 'గత రెండు సంవత్సరాలుగా ఇళ్ల విక్రయాలు నెమ్మదించాయి. రూ.కోటి కంటే తక్కువ ధర కలిగిన ఇళ్ల సరఫరా తగ్గడం ప్రభావం చూపింది. ద్వితీయ శ్రేణి నగరాల్లో రూ.కోటి లోపు విలువ కలిగిన ఇళ్లకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. భూమి ధర, నిర్మాణ ఖర్చులు పెరగడంతో పాటు కొనుగోలుదార్ల ఆకాంక్షల్లో మార్పులు వచ్చాయి. దీంతో కొత్త ఇళ్ల అధిక ధరల విభాగాలలోకి వెళ్తున్నాయి. ఫలితంగా ప్రథమ శ్రేణి నగరాలకు సమానంగా ద్వితీయ శ్రేణి మార్కెట్లు మారిపోతున్నాయి. ధరలు పెరుగుతుంటే, అమ్ముడుపోతున్న ఇళ్ల సంఖ్య తగ్గుతోంద'ని ప్రాప్ ఈక్విటీ సీఈఓ, వ్యవస్థాపకుడు సమీర్ జసూజా తెలిపారు. రూ.కోటి కంటే ఎక్కువ ధర కలిగిన ఇళ్ల అమ్మకాలు 9% పెరిగాయి. మొత్తం అమ్ముడైన ఇళ్లలో ఈ విభాగం వాటా 2024లో 23% కాగా, 2025లో 28 శాతానికి పెరిగింది.

నాట్కో ఫార్మా లాభం రూ.151 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఔషధ తయారీ సంస్థ నాట్కో ఫార్మా, డిసెంబరు త్రైమాసికంలో రూ.151.3 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.రూ.132.4 కోట్ల కంటే ఇది 14% అధికం. ఇదే సమయంలో ఆదాయం రూ.474.8 కోట్ల నుంచి రూ.647.3 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసిక ఈపీఎస్ రూ.8.46గా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.1.50 చొప్పున మూడో మధ్యంతర డివిడెండును బోర్డు ప్రకటించింది. చిలీలో పూర్తిస్థాయి అనుబంధ సంస్థ నాట్కో ఫార్మా ఎస్‌పీఏ పేరుతో ఏర్పాటు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.2.71 కోట్లు (3 లక్షల డాలర్లు) పెట్టుబడి పెట్టనుంది. సంస్థ సీఎండీగా వెంకయ్య చౌదరి నన్నపనేనిని మరో ఏడాది కాలానికి పునర్నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది.

బయోలాజికల్ ఇ పోలియో వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్ఓ రెండో దశ అనుమతి



ఈనాడు, హైదరాబాద్: బయోలాజికల్ ఇ తయారు చేసిన 'నావెల్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ టైప్-2 (ఎన్ఓపీవీ2)'కు, ఫేజ్-2 ప్రీ-క్వాలిఫికేషన్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మంజూరు చేసింది. పోలియో నిర్మూలనలో ఇదొక మైలురాయి అవుతుందని బయోలాజికల్ ఇ పేర్కొంది. తాజా అనుమతితో, వ్యాక్సిన్ తయారీకి అవసరమైన ముడి పదార్థం, తుది ఉత్పత్తి రెండూ సంస్థలో పూర్తిస్థాయిలో తయారు చేసుకునే వెసులుబాటు లభించినట్లయిందని వివరించింది. పోలియో వ్యాప్తి చెందుతున్నప్పుడు, దాన్ని అడ్డుకోవడంలో వ్యాక్సిన్ లభ్యత, స్పందించే సమయం చాలా కీలకమని బయోలాజికల్ ఇ ఎండీ మహిమ దాట్ల పేర్కొన్నారు.

పెట్టుబడులకు కొత్త బంగారు లోకం



- స్టాక్స్, ఫండ్ల కంటే పసిడి వైపే యువత మొగ్గు
- తక్కువ పరిమాణంలో కొనుగోళ్లు
- వ్యక్తిగతంగానే నిర్ణయాలు

జెన్ జీ, మిలీనియల్స్‌లో (18 నుంచి 45 ఏళ్ల వయసున్న) అత్యధికులు (62% మంది) స్టాక్స్, మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్) కంటే పసిడినే అత్యంత సురక్షిత పెట్టుబడి మార్గంగా భావిస్తున్నారని ఓ సర్వే తెలిపింది. కుటుంబం పెట్టుబడి నిర్ణయాలతో సంబంధం లేకుండా, సొంతంగానే తక్కువ పరిమాణంలో, పసిడి కొనుగోలు నిర్ణయాలను యువత తీసుకుంటున్నారని వివరించింది. దేశవ్యాప్తంగా 5,000 మంది యువత నుంచి సేకరించిన అభిప్రాయాలతో ఈ నివేదిక రూపొందించినట్లు 'స్మైటెన్ పల్స్‌పిప' తెలిపింది. దీని ప్రకారం..

✦ ప్రస్తుతం 66.7% వరకు పసిడి కొనుగోళ్లు, వ్యక్తిగత నిర్ణయాల ఆధారంగానే జరుగుతున్నాయి. ఇటీవల తమ కుటుంబం చేసిన పసిడి కొనుగోళ్ల విషయంలో, తామే నిర్ణయం తీసుకున్నామని 42.3% మంది యువత తెలపగా.. తల్లిదండ్రులు లేదా కుటుంబంలో పెద్దవాళ్ల నిర్ణయమని 40% మంది వెల్లడించారు. 5 గ్రాముల లోపే పసిడి కొన్నామని 61.90% మంది వెల్లడించారు. 2 గ్రాముల లోపు కొనుగోలు చేసిన వాళ్లు 27.5% మంది కాగా.. 2-5 గ్రాముల మధ్య కొనుగోలు చేసిన వాళ్లు 34.4% మంది ఉన్నారు.

✦ రూ.25,000 నిడివిలోపే, పసిడి కొంటామని 61.9% మంది పేర్కొన్నారు. దీంతో పోలిస్తే ఎంఎఫ్ (16.6%), డిపాజిట్లు (13%), షేర్లు (6.6%), క్రిప్టో (1.9%) వైపు ఆసక్తి చూపిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది.

✦ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పుడు బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం, ఎంఎఫ్‌లు, షేర్ల కొనుగోలు కంటే పసిడిలో పెట్టుబడి ఉత్తమమని 65.7% మంది తెలిపారు.

✦ మొదటి జీతంతో తొలిసారి పసిడి కొనుగోలు చేసినట్లు 24.3% మంది తెలపగా.. పెట్టుబడిగా పసిడిని కొనుగోలు చేసినట్లు 23.9% మంది వెల్లడించారు.


ఆన్‌లైన్‌లో 5% మందే

ఆన్నీ ఆన్‌లైన్‌లో కొనే యువత, బంగారం విషయంలో మాత్రం అందుకు దూరంగా ఉంటోంది. దిగ్గజ ఆభరణాల సంస్థల్లో కొనుగోళ్లకు 38.3% మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక విక్రయశాలలపై 34.7% మంది మొగ్గుచూపారు. 5.2% మంది మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరుపుతున్నారు.

తగ్గిన బంగారం, వెండి ధరలు

ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి ధరలు గురువారం భారీగా పతనం అయ్యాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 11.55 గంటలకు ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 155 డాలర్లు తగ్గి, 4918 డాలర్లకు, ఔన్సు వెండి ధర 8 డాలర్లు పతనమై 75 డాలర్లకు దిగివచ్చాయి. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,56,650, కిలో వెండి ధర రూ.2,49,760 వద్ద స్థిరపడ్డాయి.

భారత్‌లో రోల్స్ రాయిస్ భారీ ప్రణాళికలు



దిల్లీ: మనదేశంలో రక్షణ, ఇంధన, పౌర విమానయాన రంగాల్లో తన కార్యకలాపాలు పెంచుతామని బ్రిటన్ దిగ్గజ సంస్థ రోల్స్ రాయిస్ వెల్లడించింది. భారత తదుపరి తరం యుద్ధ విమానాల కోసం అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంసీఏ) ప్రోగ్రామ్ కింద ఏరో-ఇంజిన్‌ను కూడా అభివృద్ధి చేయనున్నట్లు కంపెనీ సీఈఓ తుఫాన్ ఎర్గిన్‌బిల్గిక్ తెలిపారు. అది కూడా పూర్తిగా మేధోసంపత్తి హక్కులు బదిలీతో చేపట్టనున్నట్లు వివరించారు. ప్రస్తుతం 1,400కు పైగా రోల్స్‌రాయిస్ ఇంజిన్లు భారత త్రివిధ దళాల్లోని వివిధ రక్షణ ప్లాట్‌ఫామ్‌లలో సేవలందిస్తున్నాయని తెలిపారు.

సిబ్బంది సంఖ్య రెట్టింపు..: దేశంలో కంపెనీకి ఉన్న సిబ్బందిని రెట్టింపు చేసి 10,000కు చేర్చాలనీ సంస్థ భావిస్తోంది.

డేటా సెంటర్లకు హరిత విద్యుత్

ఈనాడు, హైదరాబాద్: హరిత విద్యుత్తుతో నడిచే డేటా సెంటర్ల అభివృద్ధి కోసం హైదరాబాద్ సంస్థ బొండాడ ఇంజినీరింగ్, దుబాయ్‌కు చెందిన బ్రయన్‌స్టన్ రెన్యూవబుల్స్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. భారత్‌తో పాటు, ఎంపిక చేసిన అంతర్జాతీయ మార్కెట్లలో పర్యావరణహిత డేటా సెంటర్ ప్యాకేజీలను సంయుక్తంగా అభివృద్ధి చేయడం ఈ ఒప్పంద లక్ష్యం. వేగంగా పెరుగుతున్న దేశీయ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, డేటా స్టోరేజీ అవసరాలకు అనుగుణంగా ఇంధన సామర్థ్యం కలిగిన మౌలిక వసతులు కల్పించనున్నట్లు బొండాడ ఇంజినీరింగ్ గ్రూపు ఛైర్మన్, ఎండీ బొండాడ రాఘవేంద్రరావు తెలిపారు.

విప్రో ఉద్యోగులకు 1 నుంచి వేతన పెంపు

విప్రో, మార్చి 1 నుంచి తమ ఉద్యోగులందరికీ వేతన పెంపును అమలు చేయనుంది. గత సెప్టెంబరులోనే వేతనాలు పెంచాల్సి ఉన్నా, వాయిదా వేసింది. వచ్చే నెల నుంచి వేతన పెంపు అమలవుతుందని ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో సంస్థ తెలిపింది. ఎంతమేర పెరిగేదీ వెల్లడికాలేదు.

కోడి గుడ్లు

13న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	500	తూ/ప గోదావరి	495
వరంగల్	502	విశాఖపట్నం	490
విజయవాడ	525	చిత్తూరు	583

ఏడాదిలోనే రూ.8 లక్షల కోట్ల వాణిజ్య మిగులు

అమెరికాతో ఒప్పందం ప్రభావంపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక



అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల మన ఎగుమతులు భారీగా పెరుగుతాయని.. దిగుమతులు రాణించినా కూడా, ఏడాది వ్యవధిలోనే మనకు వాణిజ్య మిగులు 90 బిలియన్ డాలర్లు (రూ.8.19 లక్షల కోట్లు)గా ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదికలో పేర్కొంది. ఏడాది వ్యవధిలో అగ్రగామి 15 వస్తువుల ఎగుమతులే 97 బి. డాలర్లకు చేరతాయని, మిగతా వస్తువులూ కలిపితే ఏటా 100 బి. డాలర్ల మార్కును చేరొచ్చని వివరించింది.

జీడీపీపై 1.1% ప్రభావం: 2024-25లో అమెరికాతో మనకు 40.9 బి.డాలర్ల మిగులు ఉండగా, 2025-26లో ఏప్రిల్-డిసెంబరు కాలానికి 26 బి.డాలర్లుగా ఉంది. అదనపు ఎగుమతుల వల్ల ఏడాదికి ఇది 90 బి.డాలర్లకు చేరగలదని నివేదిక అంచనా వేసింది. జీడీపీపై నికరంగా 1.1% సానుకూల ప్రభావం పడుతుందనీ తెలిపింది.

మన మార్కెట్‌కు అవకాశాలు..: భారత ఎగుమతుల్లో అమెరికా వాటా 20% కాగా, మన దిగుమతుల్లో అమెరికా వాటా 7 శాతంగానే ఉంది. సేవల దిగుమతుల్లో అమెరికాకు 15% వాటానే ఉండడంతో, భారత్ మంచి మార్కెట్‌గా ఆ దేశానికి మారే అవకాశం కనిపిస్తోంది.

జనవరిలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 2.75%

కొత్త సిరీస్‌లో గణాంకాల విడుదల



దిల్లీ: 2024 ఆధార సంవత్సరంగా (బేస్ ఇయర్) కొత్త సిరీస్‌లో వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసింది. దీని ప్రకారం.. జనవరిలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 2.75 శాతంగా నమోదైంది. 2012 ఆధార సంవత్సరంతో ఉన్న పాత సిరీస్ ప్రకారం 2025 జనవరిలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.26 శాతంగా, డిసెంబరులో 1.33 శాతంగా నమోదైంది. ✦ 2026 జనవరిలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణ రేటు 2.13%, గృహ విభాగం ద్రవ్యోల్బణం 2.05% చొప్పున నమోదయ్యాయి.

✦ గ్రామీణ ప్రాంతాల్లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 2.73% కాగా... పట్టణ ప్రాంతాల్లో 2.77%.

తెలంగాణలో అధికం: తెలంగాణలో అత్యధికంగా 4.92% ద్రవ్యోల్బణ రేటు నమోదైంది. ఆ తర్వాతి స్థానాల్లో కేరళ, తమిళనాడు ఉన్నాయి. ✦ అల్లం, ఉల్లిపాయలు, కందిపప్పు, బంగాళాదుంపల ద్రవ్యోల్బణ రేటు తక్కువగా ఉండగా.. వెండి ఆభరణాలు, టమాటా, పసిడి, వజ్రాలు, ప్లాటినమ్ ఆభరణాలు, కొబ్బరి నూనెల్లో అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైంది.

విమానం స్ఫూర్తితో 'ఉడో'

ఒక ఛార్జింగ్‌తో 200 కి.మీ. ప్రయాణం



హైదరాబాద్ (రాయదుర్గం), న్యూస్‌టుడే: మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ (ఎంఎల్ఎంఎంఎల్), విమాన డిజైన్ స్ఫూర్తితో రూపొందించిన సరికొత్త విద్యుత్తు ఆటో 'ఉడో'ను గురువారం హైదరాబాద్ నుంచి దేశీయ విపణిలోకి విడుదల చేసింది. దీని పరిచయ ధర రూ.3,58,999 (ఎక్స్‌షోరూం). తొలిసారిగా పూర్తి మోనోకాక్ నిర్మాణంతో ఈ ఆటోను తీసుకొచ్చినట్లు సంస్థ వెల్లడించింది. ఈ ఆటోకు అమర్చిన బ్యాటరీ సామర్థ్యం 11.7 కిలోవాట్స్. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 200 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని తెలిపింది. డ్రైవర్లకు సౌకర్యంగా ఉండేలా ఫైలట్ సీటు, గతుకుల రోడ్డుపైనా సాఫీగా ప్రయాణించేలా డ్యూయల్ ఫోర్క్ ఫ్రంట్ సస్పెన్షన్, రివర్స్ థ్రాటిల్, హిల్ హోల్డ్ అసిస్ట్‌లాంటివి పొందుపర్చారు. 6 ఏళ్లు లేదా 1.5 లక్షల కిలోమీటర్ల వారంటీని అందిస్తున్నట్లు సంస్థ ఎండీ, సీఈఓ సుమన్ మిశ్రా తెలిపారు. ఈ వాహనాన్ని జహీరాబాద్‌లోని ప్లాంట్‌లో అత్యాధునిక రోబోటిక్ పరిజ్ఞానంతో తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2 లక్షల యూనిట్లని, రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టామని తెలిపారు.

కిసాన్ క్రెడిట్ కార్డ్ కింద అధిక కవరేజీ!

పథక సవరణకు ముసాయిదా మార్గదర్శకాల జారీ

ముంబయి: కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) పథక నిబంధనలను సవరించే నిమిత్తం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం ముసాయిదా మార్గదర్శకాలు జారీ చేసింది. కవరేజీ పెంచడంతో పాటు, వ్యవసాయ రంగ అవసరాలను తీర్చడమే వీటి లక్ష్యం. రుణ మంజూరు, చెల్లింపు షెడ్యూళ్లలో ఏకరూపత తీసుకురావడం కోసం పంట సీజన్లను ప్రామాణీకరించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. 12 నెలల్లోపు దిగుబడి ఇచ్చే వాటిని స్వల్ప కాల పంటలుగా, 18 నెలల్లోపు దిగుబడులు అందించే వాటిని దీర్ఘకాల పంటలుగా నిర్వచించింది. దీని ద్వారా పంట కాలాన్ని బట్టి రుణాల షెడ్యూలు ఉండేలా చూడనున్నారు. ఇందుకోసం కేసీసీ గడువును ఆరేళ్లకు పెంచింది. ప్రతి పంట కాలానికి ఆర్థిక మద్దతు ఉండేలా, కేసీసీ కింద ఉపసంహరణ పరిమితులను సైతం సవరించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. తద్వారా సాగు వ్యయాలకు తగ్గట్లుగా రుణ సహాయం అందించాలని భావిస్తోంది. నేల పరీక్షలు, రియల్ టైం వాతావరణ అంచనాలు, సేంద్రియ వ్యవసాయానికి ధ్రువీకరణలు.. తదితరాలను అర్హత కలిగిన అంశాల కింద చేర్చనున్నారు. వ్యవసాయ సామగ్రి మరమ్మతులు, నిర్వహణ కింద ప్రస్తుతం అనుమతిస్తున్న 20% అదనపు అంశాల కింద వీటిని చేర్చనున్నారు.

✦ ఈ మార్గదర్శకాలపై నియంత్రిత సంస్థలు, ప్రజలు, ఇతర భాగస్వాములు మార్చి 6లోగా స్పందించాలని ఆర్‌బీఐ కోరింది.

బంగ్లాదేశ్ తరహాలో మన జౌళికీ ప్రయోజనాలు

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై గోయల్

దిల్లీ: అమెరికా పత్తి, దారం వినియోగించి మనదగ్గర తయారు చేసే దుస్తులకు, వాణిజ్య ఒప్పందం కింద సుంకం మినహాయింపులు లభించనున్నట్లు వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌కు అమెరికా అందిస్తున్న ప్రయోజనాల తరహాలోనే, మనకూ లభిస్తాయని తెలిపారు. బంగ్లాదేశ్ వస్తువులపై టారిఫ్‌లను అమెరికా 19 శాతానికి తగ్గించనుంది. అమెరికా నూలుతో తయారయ్యే దుస్తులపై మాత్రం సున్నా సుంకాన్ని వర్తింపజేయనుంది. బంగ్లాదేశ్ నుంచి వెళ్లే దుస్తులపై ప్రస్తుతం 31% సుంకం ఉండగా, అమెరికా ఫైబర్ వాడితే మాత్రం 12 శాతానికి తగ్గనుంది. బంగ్లాదేశ్ ఏ ప్రయోజనం పొందుతుందో.. భారత్ సైతం తుది ఒప్పందంలో అదే పొందగలదని గోయల్ పేర్కొన్నారు. ఒక వేళ ఏదైనా భారత కంపెనీ.. అమెరికా నుంచి నూలు, పత్తి తెప్పించుకుని దుస్తులు తయారు చేసి, తిరిగి యూఎస్‌కే ఎగుమతి చేస్తే బంగ్లాదేశ్ కంపెనీలకు వర్తించేలా మనకూ సున్నా సుంకం వర్తిస్తుందన్నారు.

మార్కెట్ విలువలో టీసీఎస్‌ను అధిగమించిన ఐసీఐసీఐ బ్యాంక్



మార్కెట్ విలువ పరంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)ను ఐసీఐసీఐ బ్యాంక్ అధిగమించింది. 2009 జూన్ తర్వాత మళ్లీ ఇలా జరగడం ఇప్పుడే. దేశంలో మార్కెట్ విలువ పరంగా అగ్రగామి సంస్థల జాబితాలో అయిదో స్థానానికి ఐసీఐసీఐ బ్యాంకు చేరగా, టీసీఎస్ ఆరో స్థానానికి పడింది. టీసీఎస్ మార్కెట్ విలువను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ).. అధిగమించిన ఒక రోజు వ్యవధిలోనే, ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఈ ఘనత సొంతం చేసుకుంది. గురువారం బీఎస్ఈలో టీసీఎస్ షేరు 5.41% నష్టంతో రూ.2,751.90 వద్ద ముగియగా, ఐసీఐసీఐ బ్యాంక్ షేరు 1.86% పెరిగి రూ.1,432 వద్ద స్థిరపడటం ఇందుకు కారణం.

రెండేళ్లలో రూ.5 లక్షల కోట్ల నష్టం: టీసీఎస్ మార్కెట్ విలువ రూ.10 లక్షల కోట్ల కంటే తగ్గడం కూడా 2020 డిసెంబరు తరవాత ఇప్పుడే. 2024 ఆరంభంలో సంస్థ మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లకు పైగా చేరి, గరిష్ఠస్థాయిని నమోదు చేసింది. రెండేళ్లలో రూ.5 లక్షల కోట్ల మేర మార్కెట్ విలువ ఆవిరైంది.

ఐటీ సూచీ నేలచూపులు: ఆంథ్రోపిక్ ఏఐ టూల్స్ వల్ల సాఫ్ట్‌వేర్ సంస్థలకు ఇబ్బంది ఏర్పడుతుందనే భయాలు కొనసాగుతున్నాయి. దీంతో పాటు అమెరికాలో జనవరి ఉద్యోగ గణాంకాలు మెరుగ్గా నమోదు కావడంతో, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశం ఉండదని మదుపర్లు భావించారు. వడ్డీ రేట్లు తగ్గకపోతే కంపెనీలు వ్యయాలు తగ్గించుకుంటాయి. ఇందువల్ల మన ఐటీ కంపెనీలకు ప్రాజెక్టులు తగ్గుతాయని, వీటి లాభాదాయాలపై ప్రతికూల ప్రభావం పడొచ్చనే అంచనాలు పెరిగాయి. ఫలితంగా ఐటీ షేర్లలో అమ్మకాలు కొనసాగడంతో, ఐటీ సూచీ 5 శాతానికి పైగా నష్టపోయింది.

✦ బీఎస్ఈలో కోఫోర్జ్ షేరు 6.48%, టెక్ మహీంద్రా 5.99%, ఇన్ఫోసిస్ 5.79%, ఎల్‌టీఎం 5.5%, టీసీఎస్ 5.41%, హెచ్‌సీఎల్ టెక్ 4.84%, విప్రో 4.72% చొప్పున తగ్గాయి. టీసీఎస్, విప్రో షేర్లు తాజాగా 52 వారాల కనిష్ఠస్థాయులకు చేరాయి.

మార్కెట్ విలువ పరంగా అగ్రగామి కంపెనీలు

కంపెనీ	మార్కెట్ విలువ (రూ.లక్షల కోట్లలో)
రిలయన్స్ ఇండస్ట్రీస్	19.62
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	14.16
భారతీ ఎయిర్‌టెల్	11.68
ఎస్‌బీఐ	11.00
ఐసీఐసీఐ బ్యాంక్	10.24
టీసీఎస్	9.95

రెట్టింపునకు మించిన హెచ్‌యూఎల్ లాభం

దిల్లీ: ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్), డిసెంబరు త్రైమాసికంలో రూ.6,603 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే త్రైమాసిక లాభం రూ.2,989 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే అధికం. ఐస్ క్రీమ్ వ్యాపారాన్ని విభజించి, క్వాలిటీ వాల్స్ (ఇండియా)గా ఏర్పాటు చేయడంతో వచ్చిన ఏకకాల లాభం ఇందుకు దోహదపడింది. ఇది మినహాయిస్తే, త్రైమాసిక లాభం 1% పెరిగి రూ.2,562 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో కొత్త కార్మిక చట్టాలను అమలు చేయడం వల్ల, కంపెనీ రూ.576 కోట్ల అసాధారణ నష్టాన్ని నమోదుచేసింది. మొత్తం విక్రయాలు రూ.15,322 కోట్ల నుంచి 5.71% పెరిగి 16,197 కోట్లకు వృద్ధి చెందాయి. ఈ త్రైమాసికంలో కంపెనీ ఉత్పత్తుల అమ్మకాలు పరిమాణ పరంగా 4% పెరిగాయి. మొత్తం వ్యయాలు 6.37% అధికమై రూ.13,078 కోట్లకు చేరాయి. మొత్తం ఆదాయం (ఇతరాదాయంతో కలిపి) 5.01% వృద్ధితో రూ.16,580 కోట్లుగా నమోదైంది.

✦ 'డిసెంబరు త్రైమాసికంలో గిరాకీలో రికవరీ సంకేతాలు కనిపించాయని, సానుకూల విధాన చర్యలు ఇందుకు దోహదపడుతున్నాయ'ని హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీ ప్రియా నాయర్ పేర్కొన్నారు. పోటీ పరిస్థితుల్లోనూ 6% ఆదాయ వృద్ధి, 4% పరిమాణ వృద్ధి నమోదుచేశామన్నారు.

✦ **డిటర్జెంట్ల ధరలు పెరిగే అవకాశం:** గిరాకీ పుంజుకుంటున్న నేపథ్యంలో, వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో కంపెనీ మెరుగ్గా రాణించొచ్చని హెచ్‌యూఎల్ సీఎఫ్ఓ నిరంజన్ గుప్తా అంచనా వేశారు. డిటర్జెంట్‌లు, డిష్‌వాషర్లు, ఫ్లోర్ క్లీనర్ల వంటి గృహ సంరక్షణ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయన్నారు. ముడిచమురు ధరలు పెరగడం, రూపాయి క్షీణత ఇందుకు నేపథ్యమని తెలిపారు.

ఆరోగ్య బీమా సంస్థలపై ఫిర్యాదులు పెరిగిపోతున్నాయ్!

- మొదటి 3 స్థానాల్లో స్టార్, కేర్, నివా
- ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్ వార్షిక నివేదిక



దేశంలో ఆరోగ్య బీమా సంస్థలపై, పాలసీదార్ల ఫిర్యాదులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న సంస్థల జాబితాలో స్టార్ హెల్త్ అగ్రస్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో కేర్ హెల్త్, నివా బుపా నిలిచాయి. ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల విషయంలో, పాలసీదార్ల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. 'తప్పుగా పాలసీలను విక్రయించడం, ఆమోదయోగ్యం కాని రీతిలో సేవలు అందించడం, క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌లో జాప్యం, తక్కువ మొత్తం చెల్లింపులు, క్లెయిమ్‌ను పూర్తిగా తిరస్కరించడం' వంటి కారణాలతో సంస్థల మీద ఫిర్యాదులు అందుతున్నాయి. బీమా సంస్థల నుంచి పరిష్కారాలను పొందడంలో విఫలమయ్యాకే, ఏటా వేల మంది పాలసీదార్లు బీమా అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు.

స్టార్ హెల్త్‌పై ఫిర్యాదుల వెల్లువ: ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్ వార్షిక నివేదిక ప్రకారం 2024-25లో స్టార్ హెల్త్‌పై మొత్తం 12,186 ఫిర్యాదులు అందాయి. అంతకుముందు నుంచీ పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, ఏడాదిలో కొత్తగా అందిన ఫిర్యాదులు ఇందులో ఉన్నాయి. కేర్ హెల్త్ (4,423 ఫిర్యాదులు), నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ (3,983 ఫిర్యాదులు) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వ రంగ బీమా సంస్థల్లో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ (1,890 ఫిర్యాదులు) 5వ స్థానంలో ఉంది.

కంపెనీ	ఫిర్యాదుల సంఖ్య
స్టార్ హెల్త్	12,186
కేర్ హెల్త్	4423
నివా బుపా	3983
ఆదిత్య బిర్లా హెల్త్	2354
నేషనల్ ఇన్సూరెన్స్	1890
న్యూ ఇండియా అసూరెన్స్	1706
హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో	1542
ఓరియంటల్ ఇన్సూరెన్స్	1456
ఐసీఐసీఐ లాంబార్డ్	974
యునైటెడ్ ఇండియా	876

ఆగని ఐటీ భయాలు

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.108.42 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.276.85 కోట్లు

సెన్సెక్స్ ▼ 559 — 83675
నిఫ్టీ ▼ 147 — 25807

ఐటీ షేర్లకు తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురవడంతో, దేశీయ సూచీలు నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 17 పైసలు లాభపడి 90.61 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు ధర 0.27% తగ్గి 69.21 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై సూచీలు సానుకూలంగా ముగిశాయి. హాంకాంగ్ సూచీ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.51 లక్షల కోట్లు తగ్గి, రూ.472.48 లక్షల కోట్ల (5.22 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 83,968.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,233.64) ప్రతికూలంగా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగిన సూచీ 84,061.62 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 83,516.67 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 558.72 పాయింట్ల నష్టంతో 83,674.92 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 146.65 పాయింట్లు కోల్పోయి 25,807.20 పాయింట్ల వద్ద స్థిరపడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 17 నష్టపోయాయి. టెక్ మహీంద్రా 5.99%, ఇన్ఫోసిస్ 5.79%, టీసీఎస్ 5.41%, హెచ్‌సీఎల్ టెక్ 4.84%, ఎం అండ్ ఎం 2.23%, హెచ్‌యూఎల్ 2.13%, రిలయన్స్ 1.27% చొప్పున తగ్గాయి. బజాజ్ ఫైనాన్స్ 3.17%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.73%, ట్రెంట్ 1.52%, బీఈఎల్ 1.43%, ఎస్‌బీఐ 0.8% లాభపడ్డాయి.

✦ భెల్ ఓఎఫ్ఎస్‌లో 5% వాటా విక్రయానికి రిటెయిల్, సంస్థాగత మదుపర్ల నుంచి 1.34 రెట్ల స్పందన లభించినట్లు దీపమ్ కార్యదర్శి అరుణిష్ చావ్లా వెల్లడించారు.



ఇంటెల్‌కు రూ.27 కోట్ల జరిమానా

తన బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్ల (బీఎంపీల) విషయంలో, మనదేశ నిర్దిష్ట వారంటీ పద్ధతులకు వ్యతిరేకంగా, అనైతికంగా వ్యవహరించినందుకు ఇంటెల్ కార్ప్‌పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రూ.27.38 కోట్ల జరిమానా విధించింది.

ఇన్ఫోసిస్, ఎగ్జాన్ మొబిల్ జట్టు

ఎగ్జాన్ మొబిల్‌తో తన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించి, డేటా సెంటర్ ఇమ్మర్షన్ ఫ్లూయిడ్స్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఐటీ సేవల దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఇది ఇంధన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అందుబాటులో ఉన్న విద్యుత్ వినియోగాన్ని పెంచుతుందని తెలిపింది.

రామ్‌కో సిస్టమ్స్ నుంచి ఏఐ ఏజెంట్ చియా

గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ రామ్‌కో సిస్టమ్స్ .. సంభాషణాత్మక ఏఐ ఏజెంట్ ప్లాట్‌ఫామ్ 'చియా'ను ప్రారంభించింది. మెరుగైన వినియోగదారు అనుభవాన్ని అందించే లక్ష్యంతో, ఏజెంటిక్ ఏఐ ఉత్పత్తి విభాగంలోకి ప్రవేశించినట్లు సంస్థ తెలిపింది. కస్టమర్ సపోర్ట్ కార్యకలాపాల్లో ఉద్యోగుల వినియోగాన్ని తగ్గించేందుకు చియా ఉపయోగ పడుతుందని వివరించింది.

పౌల్ట్రీలో జర్మనీ సంస్థ రూ.200 కోట్ల పెట్టుబడి

జర్మనీకి చెందిన వ్యవసాయ వ్యాపార సంస్థ ఈడబ్ల్యూ గ్రూప్, కొత్తగా ఏర్పాటు చేసిన అనుబంధ సంస్థ లోహ్మన్ లేయర్స్ ఇండియా ద్వారా వచ్చే మూడేళ్లలో మన దేశ కోళ్ల పరిశ్రమ రంగంలో రూ.200 కోట్ల పెట్టుబడి పెట్టాలనుకుంటోంది.

యూఎస్‌వీ చేతికి వెల్ బీయింగ్ న్యూట్రిషన్

భారత్, యూఏఈ, ఐరోపాల్లో న్యూట్రిషన్ ఉత్పత్తులు విక్రయిస్తున్న వెల్ బీయింగ్ న్యూట్రిషన్‌లో 79% వాటాను రూ.1,583 కోటతో ఫార్మాస్యూటికల్-బయోటెక్నాలజీ సంస్థ యూఎస్‌వీ కొనుగోలు చేయబోతోంది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
కోల్ఇండియా	7157	8506	30818	32359
హిండాల్కో	2049	3735	66521	58390
ఐజీఎల్	359	286	4465	4130
అబాట్	376	361	1724	1614
భారత్‌ఫోర్జ్	273	213	4343	3475
గార్‌వార్ టెక్నికల్	56	48	387	351
బ్లాక్‌బాక్స్	50	56	1660	1502

చాంపియన్



టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ జోరందుకుంది. ముంబయిలో కాస్త కష్టపడ్డ టీమ్‌ఇండియా.. దిల్లీలో చెలరేగిపోయింది. అటు బ్యాటుతో, ఇటు బంతితో సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ పసికూన నమీబియాను చిత్తుగా ఓడించింది. ఇషాన్ కిషన్, హార్దిక్‌ల విధ్వంసంతో భారీ స్కోరు చేసిన భారత్.. వరుణ్ చక్రవర్తి మాయాజాలంతో ప్రత్యర్థిని అలవోకగా చుట్టేసింది. తొలి మ్యాచ్‌తో పోలిస్తే భారత్‌కు ఇది కచ్చితంగా మెరుగైన ప్రదర్శనే. జట్టు పుంజుకుందనడంలో, పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు ముందు మంచి లయను అందుకుందనడంలో సందేహం లేదు. కానీ బ్యాటింగ్‌లో ఆఖర్లో అనవసరంగా తడబడి, చాలా పెద్ద స్కోరును చేసే అవకాశం చేజార్చుకోవడం కాస్త నిరాశ కలిగించే విషయమే.

హార్దిక్, ఇషాన్ ధనాధన్

- విజృంభించిన వరుణ్
- నమీబియాపై భారత్ ఘనవిజయం





దిల్లీ

తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన భారత్.. టీ20 ప్రపంచకప్‌లో రెండో విజయాన్నందుకుంది. ఇషాన్ కిషన్ (61; 24 బంతుల్లో 6×4, 5×6), హార్దిక్ పాండ్య (52; 28 బంతుల్లో 4×4, 4×6)ల విధ్వంసక బ్యాటింగ్‌కు వరుణ్ చక్రవర్తి (3/7), అక్షర్ పటేల్ (2/20)ల స్పిన్ మాయాజాలం తోడవడంతో గురువారం అత్యంత ఏకపక్షంగా సాగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నమీబియాను మట్టికరిపించింది. హార్దిక్ (2/21) బంతితో కూడా రాణించాడు. హార్దిక్, ఇషాన్‌ల జోరుతో మొదట భారత్ 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఎరాస్మస్ (4/20) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఛేదనలో నమీబియా చేతులెత్తేసింది. భారత బౌలర్ల ధాటికి 18.2 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. స్టీన్‌క్యాంప్ (29; 20 బంతుల్లో 3×4, 1×6) టాప్ స్కోరర్. హార్దిక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. టీ20 ప్రపంచకప్‌లో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం. సూర్య బృందం తన తర్వాతి మ్యాచ్‌లో ఆదివారం పాకిస్థాన్‌ను ఢీకొంటుంది.

కూన తేలిపోయిందిలా..: 3.3 ఓవర్లలో 33/0, 7 ఓవర్లలో 67/1, 9 ఓవర్లలో 85/2. ఈ స్కోరుతో ఛేదన ఆరంభంలో భారత్‌కు నమీబియా గట్టి సవాలు విసిరిందనే చెప్పాలి. ఓపెనర్లు స్టీన్‌క్యాంప్, ఫ్రైలింక్ (22) ధాటిగా ఆడారు. నాలుగో ఓవర్లో ఫ్రైలింక్‌ను ఔట్ చేయడం ద్వారా అర్ష్‌దీప్.. నమీబియా పతనాన్ని ఆరంభించాడు. ఎనిమిదో ఓవర్లో స్టీన్‌క్యాంప్‌ను వరుణ్ బౌల్డ్ చేశాడు. అయితే ఆ తర్వాతి ఓవర్లో అక్షర్ బౌలింగ్‌లో కెప్టెన్ ఎరాస్మస్ (18) రెండు సిక్స్‌లు బాది, ఇన్నింగ్స్ జోరును కొనసాగించే ప్రయత్నం చేశాడు. నమీబియా అంత తేలికగా తలవంచదేమో అనిపించింది. కానీ కొన్ని బంతుల్లోనే మ్యాచ్ స్వరూపం మారిపోయింది. నమీబియా పోటీలో లేకుండా పోయింది. స్పిన్నర్లు ఆ జట్టును తిప్పేశారు. గొప్పగా బౌలింగ్ చేసిన వరుణ్.. పదో ఓవర్లో ఈటన్, స్మిట్ (0)లను ఔట్ చేయగా.. తర్వాతి ఓవర్లో ఎరాస్మస్‌ను అక్షర్ పెవిలియన్ చేర్చాడు. అక్షర్ తన తర్వాతి ఓవర్లో క్రూగర్ (5)ను ఔట్ చేశాడు. 94/6తో నమీబియా ఓటమి ఖాయమైపోయింది. తర్వాతి ఆట కేవలం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే. నమీబియా 30 పరుగుల వ్యవధిలో తన చివరి ఎనిమిది వికెట్లు కోల్పోయింది.

పెద్ద స్కోరే కానీ..: 209/9. మొదట భారత్ చేసిన ఈ స్కోరు పెద్దదిగానే అనిపించవచ్చు. కానీ అనుకున్నదాని కన్నా, చేయాల్సిన దాని కన్నా తక్కువే. రెండొందలపై స్కోరు చేసినా, ఆఖర్లో అనూహ్య తడబాటుతో చాలా పరుగులు పోగొట్టుకున్న టీమ్‌ఇండియా కాస్త అసంతృప్తిగానే ఇన్నింగ్స్‌ను ముగించింది. అయితే పసికూన ముందు నిలిచింది మాత్రం భారీ లక్ష్యమే. బ్యాటర్లు తలో చేయి వేయడం వల్ల భారత జట్టు ఆ స్కోరు సాధించింది. అయితే ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యల విధ్వంసమే ఇన్నింగ్స్‌కు హైలైట్. వీళ్లిద్దరు కళ్లు చెదిరే షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. సిక్స్‌లు, ఫోర్లతో అభిమానులను అలరించారు. సంజు శాంసన్ (22; 8 బంతుల్లో 1×4, 3×6), తిలక్ వర్మ (25; 21 బంతుల్లో 3×4), శివమ్ దూబె (23; 16 బంతుల్లో 1×4, 1×6) తమ ఆరంభాలను పెద్ద స్కోర్లుగా మలచలేకపోయారు. ఆఖర్లో నమీబియా బంతితో అద్భుతంగా పుంజుకుంది.

దంచేశారు: 7 ఓవర్లకు 104/1. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు లభించిన అదిరే ఆరంభమిది. అందుకు ప్రధాన కారణం ఇషాన్ కిషన్. గత మ్యాచ్‌లో త్వరగా నిష్క్రమించిన ఈ ఓపెనర్ ఈసారి రెచ్చిపోయి ఆడాడు. అయితే మొదట ఎదురుదాడికి దిగింది మాత్రం సంజు శాంసనే. అభిషేక్ శర్మ అనారోగ్యంతో దూరం కావడంతో తుది జట్టులోకి వచ్చిన అతడు.. తొలి ఓవర్లో ఓ సిక్స్, తర్వాతి ఓవర్లో వరుసగా 6, 6, 4తో చెలరేగిపోయాడు. కానీ ఊపుమీదున్న దశలో శాంసన్ క్యాచౌటై వెనుదిరిగాడు. కానీ నమీబియాకు ఉపశమనమేమీ దక్కలేదు. ఇషాన్ జోరందుకున్నాడు. భారీ షాట్లతో విరుచుకుపడ్డ అతడు.. స్మిట్, ట్రంపుల్‌మ్యాన్ ఓవర్లలో రెండేసి ఫోర్లు బాదాడు. స్మిట్ వేసిన మరో ఓవర్లో అతడి విధ్వంసం పరాకాష్ఠకు చేరింది. ఆ ఓవర్లో ఇషాన్ వరుసగా 6, 6, 6, 6, 4తో అభిమానులను అలరించాడు. 20 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు తిలక్ కూడా ధాటిగా బ్యాటింగ్ చేశాడు. ముచ్చటైన షాట్లతో బౌండరీలు సాధించాడు. అయితే 300 చేయడం కూడా సాధ్యమే అనిపించిన దశలో భారత్ ఇన్నింగ్స్ కుదుపునకు గురైంది. 20 పరుగుల వ్యవధిలో ఇషాన్, సూర్యకుమార్ (12)), తిలక్ వెనుదిరిగారు. ఎరాస్మస్ భారత్‌ను దెబ్బతీశాడు. 12 ఓవర్లకు స్కోరు 124/4. ఆ దశలో హార్దిక్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో భారత్‌ను నిలబెట్టాడు. మరోవైపు దూబె అండగా నిలవగా.. హార్దిక్ బ్యాట్ ఝళిపించాడు. సిక్స్‌లతో స్కోరు పెంచాడు.. షికాంగో ఓవర్లో వరుసగా 6, 4, 4 దంచేశాడు. 16 ఓవర్లకు స్కోరు 184/4. కానీ జోరుగా సాగిన ఇన్నింగ్స్ అత్యంత పేలవంగా ముగిసింది. చివరి నాలుగు ఓవర్లలో భారత్ కేవలం 25 పరుగులే చేయగలిగింది.

నాలుగుకే 5

నమీబియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 17, 18 ఓవర్లలో కలిపి 15 పరుగులే వచ్చాయి. అయినా 19వ ఓవర్లో తొలి బంతికి హార్దిక్ సిక్స్ బాదడంతో స్కోరు 205కు చేరుకుంది. అలవోకగా మరో 30 పరుగులైనా వస్తాయని పించింది. కానీ భారత్ అనూహ్యంగా ఇంకో 4 పరుగులే చేసి అయిదు వికెట్లు కోల్పోయింది. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో హార్దిక్ క్యాచ్ ఔట్ కాగా.. రింకుతో సమన్వయ లోపంతో దూబె రనౌటయ్యాడు. అక్షర్, రింకు విఫలమయ్యారు. దూబెతో అయిదో వికెట్‌కు హార్దిక్ 39 బంతుల్లోనే 81 పరుగులు జోడించాడు.



పాయింట్ల పట్టిక (గ్రూప్-ఎ)

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
భారత్	2	2	0	0	4	3.050
పాకిస్థాన్	2	2	0	0	4	0.932
నెదర్లాండ్స్	2	1	1	0	2	0.356
అమెరికా	2	0	2	0	0	-1.525
నమీబియా	2	0	2	0	0	-2.884

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

భారత్ ఇన్నింగ్స్: కిషన్ (సి) షికాంగో (బి) ఎరాస్మస్ 61; శాంసన్ (సి) స్టీన్‌క్యాంప్ (బి) షికాంగో 22; తిలక్ (సి) స్మిట్ (బి) ఎరాస్మస్ 25; సూర్యకుమార్ (స్టంప్డ్) గ్రీన్ (బి) షాల్జ్ 12; హార్దిక్ (సి) లీచర్ (బి) ఎరాస్మస్ 52; దూబె రనౌట్ 23; రింకు (సి) ఎరాస్మస్ (బి) స్మిట్ 1; అక్షర్ (బి) ఎరాస్మస్ 0; వరుణ్ చక్రవర్తి నాటౌట్ 1; అర్ష్‌దీప్ సింగ్ రనౌట్ 2; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **209; వికెట్ల పతనం:** 1-25, 2-104, 3-120, 4-124, 5-205 6-205, 7-206, 8-206, 9-209; **బౌలింగ్:** ట్రంపుల్‌మ్యాన్ 4-0-38-0; బెన్ షికాంగో 3-0-41-1; జేజే స్మిట్ 4-0-50-1; హెయింగో 1-0-18-0; ఎరాస్మస్ 4-0-20-4; బెర్నార్డ్ షాల్జ్ 4-0-41-1.

నమీబియా ఇన్నింగ్స్: స్టీన్‌క్యాంప్ (బి) వరుణ్ 29; ఫ్రైలింక్ (సి) దూబె (బి) అర్ష్‌దీప్ 22; లాఫ్టీ ఈటన్ (సి) అక్షర్ (బి) వరుణ్ 13; ఎరాస్మస్ (సి) తిలక్ (బి) అక్షర్ 18; జేజే స్మిట్ (బి) వరుణ్ 0; జేన్ గ్రీన్ హిట్‌వికెట్ (బి) దూబె 11; క్రూగర్ (సి) బుమ్రా (బి) అక్షర్ 5; ట్రంపుల్‌మ్యాన్ (బి) బుమ్రా 6; బెర్నార్డ్ షాల్జ్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 4; షికాంగో ఎల్బీ (బి) హార్దిక్ 0; హెయింగో నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (18.2 ఓవర్లలో ఆలౌట్) **116; వికెట్ల పతనం:** 1-33, 2-67, 3-86, 4-86, 5-88, 6-94, 7-111, 8-116, 9-116; **బౌలింగ్:** హార్దిక్ 4-0-21-2; అర్ష్‌దీప్ 3-0-36-1; దూబె 2.2-0-11-1; బుమ్రా 4-0-20-1; వరుణ్ 2-0-7-3; అక్షర్ 3-1-20-2

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

మ్యాచ్	వేదిక
ఆస్ట్రేలియా × జింబాబ్వే	వేదిక: కొలంబో, ఉ॥ 11.00
కెనడా × యూఏఈ	వేదిక: దిల్లీ, మ॥ 3.00
అమెరికా × నెదర్లాండ్స్	వేదిక: చెన్నై, రా॥ 7.00

ఐశ్వరీ పసిడి గురి

ఆసియా షూటింగ్



దిల్లీ: ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ సత్తా చాటాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో అతడు స్వర్ణంతో మెరిశాడు. గురువారం ఫైనల్లో ఐశ్వరీ ప్రతాప్ (362) ప్రపంచ రికార్డు సృష్టిస్తూ అగ్రస్థానంలో నిలిచాడు. ఈ ఈవెంట్లో మిగతా రెండు పతకాలు భారత్‌కే దక్కాయి. నీరజ్ కుమార్ (361.8), అఖిల్ షెరాన్ (343.5) వరుసగా రజత, కాంస్య పతకాలు గెలుచుకున్నారు. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో టీమ్ స్వర్ణం కూడా భారత్‌కే లభించింది. ఐశ్వరీ ప్రతాప్, నీరజ్, అఖిల్‌లతో కూడిన భారత బృందం (1769) అగ్రస్థానంలో నిలిచింది. జపాన్ (1764), కజకిస్థాన్ (1748) తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి. జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో అడ్రియన్ కర్మాకర్ (353.2) స్వర్ణం కైవసం చేసుకున్నాడు. దిమిత్రి కిమ్ (కజకిస్థాన్, 348.5), మన్వేంద్ర సింగ్ (338.6) రజత, కాంస్య పతకాలు నెగ్గారు.

బ్రదర్స్ బాదేశారు

- నేపాల్‌పై ఇటలీ గెలుపు

మెరిసిన జస్టిన్, ఆంథోని మోస్కా





ముంబయి: ఫుట్‌బాల్ దిగ్గజం ఇటలీ క్రికెట్లో దుమ్మురేపింది. తొలిసారి టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న ఈ ఐరోపా జట్టు తొలి విజయాన్ని అందుకుంది. తన తొలి మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌కు చెమటలు పట్టించిన నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. అన్నదమ్ములు ఆంథోని మోస్కా, జస్టిన్ మోస్కా మెరుపులతో గురువారం గ్రూప్-సి మ్యాచ్‌లో ఇటలీ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకే ఆలౌటైంది. ఆరిఫ్ షేక్ (27), రోహిత్ పౌడెల్ (23), ఆసిఫ్ షేక్ (20) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. క్రిషాన్ కలుగమాగె (3/18), బెన్ మానెంటి (2/9) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. ఆంథోని మోస్కా (62 నాటౌట్; 32 బంతుల్లో 3×4, 6×6), జస్టిన్ మోస్కా (60 నాటౌట్; 44 బంతుల్లో 5×4, 3×6) సత్తా చాటడంతో ఇటలీ 12.4 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని అందుకుంది.

ఇటలీ దూకుడుగా..: నేపాల్ చాలా కష్టపడి 120 దాటితే.. ఛేదనలో ఇటలీ చాలా స్వేచ్ఛగా ఆడింది. అన్నదమ్ములు జస్టిన్ మోస్కా, ఆంథోని మోస్కా.. ప్రత్యర్థి బౌలర్లను లెక్క చేయలేదు. తొలి ఓవర్లో సిక్స్‌తో ఆంథోని మొదలుపెడితే.. తర్వాత జస్టిన్ అందుకున్నాడు. కరణ్ వేసిన మూడో ఓవర్లో జస్టిన్ సిక్స్, రెండు ఫోర్లు కొట్టడంతో 14 పరుగులొచ్చాయి. బ్రదర్స్ జోరు కొనసాగడంతో పవర్ ప్లే చివరికి ఇటలీ 68/0తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఎప్పుడు మ్యాచ్‌ను పూర్తి చేద్దామా అన్నట్లుగా ఎడాపెడా షాట్లు కొట్టిన ఆంథోని, జస్టిన్.. స్కోరును వేగంగా కరిగించేశారు. 11వ ఓవర్లోనే ఇటలీ స్కోరు 100 పరుగులు దాటింది. ఈ క్రమంలోనే 37 బంతుల్లో జస్టిన్.. 28 బంతుల్లో ఆంథోని 50 పరుగులు అందుకున్నారు. ఆ తర్వాతా ఇద్దరు దూకుడు కొనసాగించడంతో 44 బంతులు ఉండగానే ఇటలీ ఛేదన పూర్తయింది. అభేద్యమైన తొలి వికెట్‌కు జస్టిన్-ఆంథోని జంట 124 పరుగులు జత చేసింది. అంతకుముందు క్రిషాన్, బెన్ మానెంటి విజృంభించడంతో నేపాల్ నిలవలేకపోయింది. రోహిత్, ఆసిఫ్ మెరుగ్గా ఆడడంతో 6 ఓవర్లకు 46/1తో మెరుగ్గానే కనపించిన నేపాల్.. ఆ తర్వాత తడబడింది. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. చివర్లో కరణ్ (18 నాటౌట్) ధాటిగా ఆడడంతో నేపాల్ స్కోరు 120 దాటింది.

సంక్షిప్త స్కోర్లు... నేపాల్: 19.3 ఓవర్లలో 123 (ఆరిఫ్ 27, రోహిత్ పౌడెల్ 23, ఆసిఫ్ 20; క్రిషాన్ 3/18, బెన్ మానెంటి 2/9); **ఇటలీ:** 12.4 ఓవర్లలో 124/0 (జస్టిన్ 60 నాటౌట్, ఆంథోని 62 నాటౌట్)

ఫైనల్లో ప్రేమ్- అల్ఫియా జోడీ

మనామా (బహ్రెయిన్): ప్రపంచ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ప్రేమ్‌కుమార్ ఆలె- అల్ఫియా జేమ్స్ జోడీ అదరగొడుతోంది. ప్రపంచ పారా టోర్నీలో ఫైనల్ చేరుకున్న భారత తొలి జోడీగా రికార్డు సృష్టించింది. గురువారం డబ్ల్యూహెచ్1- డబ్ల్యూహెచ్2 మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో ప్రేమ్ కుమార్- అల్ఫియా జోడీ 21-15, 21-14తో ప్రపంచ నంబర్‌వన్ జైమ్ అరంగ్వెజ్ (చిలీ)- మాన్ కీ (బెల్జియం) జంటపై విజయం సాధించింది.

నార్వే చెస్ బరిలో హంపి

స్టావెంజర్: భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి.. ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ మహిళల టోర్నీలో బరిలో దిగనుంది. ఈ టోర్నీలో ఆమె పాల్గొనడం ఇది మూడోసారి. "ఈ టోర్నీలో పాల్గొనడాన్ని నేనెప్పుడూ ఆస్వాదిస్తాను. పోటీ పరంగానే కాకుండా చక్కటి వాతావరణం ఉంటుంది. ప్రపంచలోనే ఉత్తమ గ్రాండ్‌మాస్టర్లతో పోటీకి సిద్ధంగా ఉన్నా" అని హంపి చెప్పింది. నార్వే చెస్ టోర్నీ మే 25న ఆరంభం కానుంది.

శ్రీలంక 105 పరుగుల తేడాతో..

ఒమన్‌పై గెలుపు

కుశాల్, రత్నాయకే, శానక విధ్వంసం



పల్లెకెలె: శ్రీలంక దంచేసింది. పల్లెకెలెలో పరుగుల వరదపారించిన ఆ జట్టు.. టీ20 ప్రపంచకప్‌లో రెండో విజయాన్నందుకుంది. కుశాల్ మెండిస్ (61; 45 బంతుల్లో 7×4), పవన్ రత్నాయకే (60; 28 బంతుల్లో 8×4, 1×6), దసున్ శానక (50; 20 బంతుల్లో 2×4, 5×6) విధ్వంసం సృష్టించడంతో గురువారం గ్రూప్-బి మ్యాచ్‌లో శ్రీలంక 105 పరుగుల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. మ్యాచ్ పూర్తి ఏకపక్షంగా సాగింది. పసికూన ఒమన్ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. బ్యాటర్ల జోరుతో మొదట లంక 5 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. శ్రీలంక టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు నిశాంక (13), కమిల్ మిషార (8) త్వరగానే నిష్క్రమించినా.. కుశాల్ మెండిస్, పవన్ రత్నాయకేలు చక్కని బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించారు. మూడో వికెట్‌కు 52 బంతుల్లోనే 94 పరుగులు జోడించారు. రత్నాయకే ఔటయ్యాక.. కెప్టెన్ శానకతో కలిసి కుశాల్ మరోసారి విలువైన భాగస్వామ్యాన్ని (63) నమోదు చేశాడు. సిక్స్‌లతో విరుచుకుపడ్డ శానక, 19వ ఓవర్లో ఔటయ్యాడు. కుశాల్ కూడా అదే ఓవర్లో వెనుదిరిగాడు. కమిందు మెండిస్ (19 నాటౌట్; 7 బంతుల్లో 1×4, 2×6) రెచ్చిపోవడంతో ఆఖరి ఓవర్లో లంకకు 17 పరుగులు వచ్చాయి. అనంతరం ఆ జట్టు బంతితోనూ విజృంభించింది. లక్ష్య ఛేదనలో ఒమన్ తేలిపోయింది. 9 వికెట్లకు 120 పరుగులే చేయగలిగింది. నదీమ్ (53 నాటౌట్; 56 బంతుల్లో 3×4, 1×6) టాప్ స్కోరర్. ఒమన్ బ్యాటర్లలో అతడు కాకుండా వసీమ్ అలీ (27) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగాడు. 12 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన ఒమన్.. ఏ దశలోనూ పోటీలో లేదు. ఆ జట్టు ఆట ఓటమి అంతరాన్ని తగ్గించుకోవడానికి మాత్రమే. చమీర (2/19), తీక్షణ (2/11) ఒమన్‌ను దెబ్బతీశారు. వెల్లలాగె, కమిందు మెండిస్, హేమంత తలో వికెట్ పడగొట్టారు. ఒమన్‌కు టోర్నీలో ఇది వరుసగా రెండో ఓటమి. రత్నాయకేకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది

సంక్షిప్త స్కోర్లు... శ్రీలంక: 225/5 (కుశాల్ మెండిస్ 61, రత్నాయకే 60, శానక 50; జితెన్ 2/41, ఒదేద్ర 1/14); **ఒమన్:** 120/9 (నదీమ్ 53 నాటౌట్, వసీమ్ అలీ 27; చమీర 2/19, తీక్షణ 2/11)

భారత్ పరాజయం

రవూర్కెలా: హాకీ ప్రొ లీగ్‌లో భారత్ తీవ్రంగా నిరాశ పరిచింది. వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడింది. గురువారం రవూర్కెలాలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 0-8 గోల్స్ తేడాతో అర్జెంటీనా చేతిలో చిత్తయింది. ప్రత్యర్థి జట్టులో డొమీన్ నాలుగు గోల్స్ (15, 20, 26, 60 నిమిషాలు)తో మెరిశాడు. రూయిజ్ (14), మెండెజ్ (22), ఇబారా (25), టోరి (30) తలో గోల్ చేశారు. తొలి మ్యాచ్‌లో భారత్ 1-3తో బెల్జియం చేతిలో ఓడింది.

డబ్బుల్లేక పాక్ హాకీ జట్టు రోడ్డున

కరాచి: పాకిస్థాన్ జాతీయ క్రీడ హాకీ అత్యంత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది. నిధుల కొరత కారణంగా పాకిస్థాన్ హాకీ సమాఖ్య (పీహెచ్‌ఎఫ్) హోటల్ బిల్లులు చెల్లించలేని దుస్థితికి చేరుకుంది. దీంతో గత వారం ఆ జట్టు ఆటగాళ్లు గంటల తరబడి రోడ్లపైనే గడపాల్సి వచ్చింది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ రెండో దశలో భాగంగా హోబర్ట్‌లో జరిగే మ్యాచ్‌ల కోసం ఆస్ట్రేలియా వెళ్లిన పాక్ జట్టుకు ఈ ఘోర అవమానం ఎదురైంది. ఆటగాళ్లు, అధికారుల కోసం కాన్‌బెర్రాలో నాలుగు నక్షత్రాల హోటల్‌లో గదులను బుక్ చేసినట్లు, దానికి సంబంధించిన ముందస్తు చెల్లింపుల్ని పాకిస్థాన్ స్పోర్ట్స్ బోర్డు (పీఎస్‌బీ), పీహెచ్‌ఎఫ్ పూర్తిచేసినట్లు జట్టుకు సమాచారం ఇచ్చారు. అయితే చెల్లింపులు చేయని కారణంగా హోటల్ బుకింగ్‌లు రద్దయినట్లు తెలియడంతో ఆటగాళ్లు షాక్‌కు గురయ్యారు. గదులు లేక క్రీడాకారులు రోడ్లపై తిరగాల్సి వచ్చిందని.. స్థానిక పాకిస్థానీలు కొందరు స్పందించి హోటల్ యాజమాన్యంతో మాట్లాడటంతో ఆటగాళ్లకు గదులు లభించాయని పాక్ జట్టు వర్గాలు తెలిపాయి.

గోడ నిర్మాణాన్ని అడ్డుకోని అధికారులపై హైకోర్టు ఆగ్రహం

- వారిని రక్షించేందుకు జీవీఎంసీ కమిషనర్ ప్రయత్నిస్తున్నారని ఆక్షేపణ
- బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోండి
- పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శికి ఆదేశం

ఈనాడు, అమరావతి: విశాఖ జిల్లా భీమిలి బీచ్ సమీపంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి చెందిన అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ సంస్థ సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా కాంక్రీట్ గోడ నిర్మిస్తున్నా.. అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై హైకోర్టు ధర్మాసనం గురువారం మండిపడింది. వారిపై చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టింది. "బాధ్యులైన అధికారులను రక్షించేందుకు జీవీఎంసీ కమిషనర్ ప్రయత్నిస్తున్నారు. వారికి కవచంగా నిలుస్తున్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ 2025 జూన్ 18న జాబితా ఇచ్చినా కమిషనర్ మౌనం వహించారు. ఆ అధికారుల పేర్లు ఇవ్వాలని మేం ఆదేశించినా కమిషనర్‌లో చలనం లేదు. బాధ్యులైన అధికారులపై పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. అక్రమ నిర్మాణం చేసి యజమానులు ఎంత తప్పుచేశారో.. ఆ నిర్మాణం జరుగుతున్నా మౌనం వహించిన అధికారులు సైతం అలాంటి తప్పు చేసినట్లే. కాంక్రీటు గోడ వ్యర్థాలను పర్యావరణానికి హాని జరగని ప్రదేశానికి మూడువారాల్లో తరలించాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నాం. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తున్నాం. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెస్టోబార్లను తొలగించాలంటూ దాఖలైన వ్యాజ్యాలపై లోతైన విచారణ జరుపుతాం" అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులిచ్చింది.

◆ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ బీచ్‌కు అతి సమీపంలో నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తియాదవ్ 2024లో హైకోర్టులో పిల్ వేశారు. భీమిలి సీఆర్‌జడ్ జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా శాశ్వత రెస్టోబార్లు ఏర్పాటుచేశారని, దీంతో తాబేళ్ల ఉనికికి ప్రమాదం పొంచి ఉందని పేర్కొంటూ గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు మరో పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది.

రాష్ట్ర హోదా కోసం ఎన్నికల బహిష్కరణకు సిద్ధం

పుదుచ్చేరి సీఎం రంగసామి

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కోసం అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం రంగసామి తెలిపారు. గురువారం శాసనసభ సమావేశంలో ప్రతిపక్షనేత శివ అడిగిన ప్రశ్నకు రంగసామి సమాధానమిచ్చారు. పథకాలు ఇబ్బంది లేకుండా, త్వరగా అమలు చేయడానికి రాష్ట్ర హోదా అవసరమని తెలిపారు. దిల్లీ వెళ్లి పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

సముద్ర గర్భ సూక్ష్మజీవులపై శోధన

- చిట్టేడులో ఎన్ఐఓటీ తొలి పరిశోధన కేంద్రం





చిట్టేడులోని ఎన్ఐఓటీ క్యాంపస్ (ఉపగ్రహ చిత్రం) ◆ డీప్ సీ మెరైన్ మైక్రోబ్ రెపోజిటరీ కేంద్రం నమూనా

ఈనాడు, చెన్నై: సముద్ర గర్భంలో అత్యంత క్లిష్ట వాతావరణంలో మనుగడ సాగించే సూక్ష్మజీవులపై పరిశోధనలు చేసేందుకు, వాటిని నిల్వ చేసేందుకు ప్రపంచంలోనే తొలి 'డీప్ సీ మెరైన్ మైక్రోబ్ రెపోజిటరీ'ని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) ఏర్పాటు చేయనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిట్టేడు ఎన్ఐఓటీ క్యాంపస్‌లో ఈ ల్యాబొరేటరీ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇతర దేశాల్లో సూక్ష్మజీవులపై పరిశోధనలకు ల్యాబొరేటరీలున్నా.. సముద్రగర్భ సూక్ష్మజీవుల కోసమే ప్రత్యేకంగా లేవు. దీన్ని తొలిసారిగా ఎన్ఐఓటీ తీసుకొస్తోంది.

ఎలా మనుగడ సాగిస్తున్నాయి?

సముద్ర గర్భంలో పీడనం తీవ్రత భారీగా ఉంటుంది. భూ ఉపరితలంతో పోల్చితే 600 రెట్లు ఎక్కువ ప్రభావం ఉంటుంది. పైగా అతి తక్కువ ఉష్ణోగ్రతలు.. అంటే 1, 2 డిగ్రీల సెల్సియస్ మేర నమోదవుతుంటాయి. ఇలాంటి క్లిష్ట వాతావరణంలోనూ సూక్ష్మజీవులు మనుగడ సాగిస్తుండటం వెనక రహస్యాల్ని తెలుసుకునేందుకు మెరుగైన పరిశోధనల అవసరముంది. చిట్టేడు పరిశోధన కేంద్రంలో వీటిపై సమగ్ర అధ్యయనాలకు అవకాశం ఉంటుంది.

నమూనాల్ని ఒడ్డుకు తెచ్చి..

ఇప్పటికే చెన్నైలోని ఎన్ఐఓటీ ద్వారా 'మత్స్య 6000' ప్రాజెక్టు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పరిశోధకుల్ని సముద్ర గర్భంలోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహనాన్ని తయారు చేశారు. ప్రస్తుతం దీని సామర్థ్యంపై పరీక్షలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే సముద్ర గర్భంలో 6,000 మీటర్ల లోతు నుంచి అరుదైన సూక్ష్మజీవుల నమూనాల్ని ఒడ్డుకు తెచ్చి సేకరించే వీలుంటుంది. వాటిని మైక్రోబ్ రెపోజిటరీలో నిల్వ చేసి పరిశోధించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

అధ్యయనాల వేగం పుంజుకుంటుంది..

సముద్ర గర్భంలో 20 లక్షల రకాల సూక్ష్మజీవులున్నట్లు అంచనా. ప్రత్యేకించి ఎన్ఐఓటీ శాస్త్రవేత్తలు బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రంలో 1300 రకాల సూక్ష్మజీవుల్ని సేకరించి పరిశోధిస్తున్నారు. ఇందులో కీలకమైంది.. బాసిల్లస్ సబ్టిలస్ అనే సూక్ష్మజీవి. సముద్ర కాలుష్యాన్ని వేగంగా దూరం చేయడంలో దీని పాత్ర కీలకమని ఎన్ఐఓటీ గుర్తించింది. ఎంఆర్ఎస్ఏ అనే సూక్ష్మజీవి ద్వారా యాంటీబయాటిక్స్ తయారు చేయొచ్చని కూడా గుర్తించారు. చిట్టేడు పరిశోధన కేంద్రం అందుబాటులోకి వస్తే.. ఈ తరహా అధ్యయనాల వేగం పుంజుకుంటుందని ఎన్ఐఓటీ అధికారులు వెల్లడిస్తున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాటం

కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు • దేశవ్యాప్త సమ్మెలో విజయవాడలో నిరసనలు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను కాలరాసే కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.30 వేలు ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం విజయవాడలో సమ్మె నిర్వహించారు. వన్‌టౌన్ రథం సెంటరు నుంచి లెనిన్ సెంటరు వరకు కార్మిక నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు మాట్లాడారు. మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తహతహలాడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి కల్తీ నెయ్యిపైనే చర్చంతా జరుగుతోందని ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మార్చి కొత్తగా లేబర్ కోడ్‌లు తెచ్చారని మండిపడ్డారు. దేశభక్తి ముసుగులో కార్మికులను మోసం చేస్తూ కార్పొరేట్లకు ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయని ఆరోపించారు. కార్మికులకు మేలు జరగాలంటే మోదీ ప్రభుత్వం గద్దె దిగాల్సిందేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఏవీ నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, కాశీనాథ్, కె.దుర్గారావు, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ సెంటర్ బహిరంగ సభలో సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు



విజయవాడ రథం సెంటర్ నుంచి లెనిన్ సెంటర్‌కు ప్రదర్శనగా వెళ్తున్న కార్మిక సంఘాల నేతలు

◆ తిరుపతిలోనూ సీపీఐ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం దారుణమని సీపీఐ జాతీయ నేతలు నారాయణ, ప్రకాష్‌బాబు విమర్శించారు.

సీడీని టెక్ట్స్ రూపంలో మార్చేందుకు ధోని రూ.10 లక్షలు చెల్లించాలి

మద్రాసు హైకోర్టు

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: పరువు నష్టం దావా కేసులో సీడీని టెక్ట్స్ రూపంలోకి మార్చేందుకు క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని రూ.10 లక్షలు చెల్లించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. 2013 ఐపీఎల్‌పై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు రాగా.. నిందితులతో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు అప్పటి కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనికి సంబంధం ఉందని కేసు దర్యాప్తు అధికారి సంపత్‌కుమార్ ఓ టీవీ ఛానెల్‌లో తెలిపారు. దీనిపై ధోని 2014లో దావా వేశారు. సంపత్ కుమార్ వ్యాఖ్యలతో తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని, ఆయన రూ.100 కోట్ల పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. అప్పట్లో కేసు విచారించిన న్యాయస్థానం.. చర్చా కార్యక్రమ సీడీలోని అంశాలను టెక్ట్స్‌లోకి మార్చాలంటే రుసుము చెల్లించాల్సి ఉంటుందని ధోనికి సూచించింది. గురువారం చేపట్టిన విచారణలో ఆ మొత్తాన్ని రూ.10 లక్షలుగా నిర్దేశిస్తూ న్యాయమూర్తి జస్టిస్ మంజుల ఉత్తర్వులు ఇచ్చారు. టెక్ట్స్ రూపంలో మార్చేందుకు అనువాదకుడు, టైపిస్ట్ పూర్తి సమయాన్ని కేటాయించాల్సి ఉందని, పత్రాలను కాపీ చేసేందుకు అదనపు ఖర్చవుతుందని అందుకు ఈ మొత్తాన్ని మార్చి 12లోపు ప్రధాన న్యాయమూర్తి రిలీఫ్ ఫండ్‌కు చెల్లించాలని పేర్కొన్నారు. అనువాద పనులను మార్చి మూడో వారంలోపు పూర్తి చేయాలంటూ విచారణను మార్చి 12కు వాయిదా వేశారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ హాల్ టికెట్ల జారీ

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్‌బాషా తెలిపారు. విద్యార్థులు https://bie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్‌టికెట్లు పొందొచ్చన్నారు. మొదటి సంవత్సరం వారు పదో తరగతి హాల్ టికెట్ నంబరు, ద్వితీయ సంవత్సరం వారు మొదటి సంవత్సరం హాల్ టికెట్ నంబరు లేదా ఆధార్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మనమిత్ర వాట్సప్ నంబరు 955230 0009కు హాయ్ అని మెసేజ్ పెట్టి, హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. హాల్ టికెట్లపై కళాశాల ప్రిన్సిపల్, కళాశాల స్టాంప్ అవసరం లేదని తెలిపారు.

ఐసీఏఐ అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్ బాధ్యతల స్వీకరణ



ఈనాడు, విశాఖపట్నం: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షుడిగా విశాఖకు చెందిన ఛార్టర్డ్ అకౌంటెంట్ డి.ప్రసన్నకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. దిల్లీలోని ఇంద్రప్రస్థ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు ఐసీఏఐ అధ్యక్షుడిగా ఉన్న చరణ్‌జోత్ సింగ్ నందా.. ప్రసన్నకుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ప్రసన్నకుమార్ ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఐసీఏఐ కార్యవర్గం, సభ్యులు ఆయన్ను అభినందించారు.

నేటి నుంచి ఏపీ పీసెట్ దరఖాస్తుల స్వీకరణ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీసెట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)కు ఈ నెల 13 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని కన్వీనర్ ఆచార్య పాల్‌కుమార్ గురువారం తెలిపారు. ఏప్రిల్ 30 వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. రూ.1,000 అపరాధ రుసుంతో మే 15 వరకు, రూ.2,000 అపరాధ రుసుంతో మే 25 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మే 24 నుంచి 26 వరకు తప్పుల సవరణకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. అదే నెల 28 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

పూజారి వేషంలో వచ్చి.. జైన మందిరాల్లో చోరీలు

మహారాష్ట్రలో పట్టుబడ్డ ఘరానా దొంగ



నిందితుడు జీవన్‌సింగ్

చెన్నై (అన్నానగర్), న్యూస్‌టుడే: ఎవరికీ అనుమానం రాకుండా పూజారి వేషంలో వచ్చి.. జైన మందిరాల్లో పెద్ద ఎత్తున చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను తమిళనాడు పోలీసులు మహారాష్ట్రలో అరెస్టు చేసి, చెన్నై తీసుకొచ్చారు. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది ఫిబ్రవరి 14న చెన్నై యానైకవుని మింట్ వీధిలోని శ్రీచంద్రప్రభు జైన మందిరంలో భారీ చోరీ జరిగింది. 10 కిలోల వెండి కిరీటాలు, 600 గ్రాముల బంగారు పలకలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా.. ముఖం కనిపించకుండా వస్త్రం కప్పుకుని, పూజారి వేషంలో ఓ వ్యక్తి ఆలయం నుంచి బయటకొచ్చి.. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. రైలెక్కి ఎక్కడకు వెళ్లాడో తెలియకపోవడంతో పోలీసులు ఇతర రాష్ట్రాలకు ఆ దొంగ సమాచారాన్ని అందించారు. తరువాత హైదరాబాద్ కాచిగూడలోని జైన మందిరంలోనూ చెన్నై తరహా చోరీ జరిగింది. రెండు కేసులూ ఒకేలా ఉండటంతో చెన్నై పోలీసులు.. అక్కడి ఆధారాలతో కలిపి దర్యాప్తు చేసి, నిందితుడు పుణెకి చెందిన జీవన్‌సింగ్‌గా గుర్తించారు. పుణెలో జీవన్‌సింగ్‌ను అదుపులోకి తీసుకొని, అతన్నుంచి నగలు కొనుగోలు చేసిన వ్యాపారి రాజ్‌బహు రాథోర్‌ను సైతం అరెస్టు చేసి నవీ ముంబయిలోని బేలాపూర్ కోర్టులో హాజరుపరిచారు. జీవన్‌సింగ్‌ను బుధవారం చెన్నైకి తీసుకొచ్చారు. ఇతను తమిళనాడులోని సేలం, చెంగల్పట్టుతో పాటు కర్ణాటకలోని పలు జైన మందిరాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలింది. పూజారి వేషంలో వెళ్లి దొంగతనాలు చేసేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని చెన్నై కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

EENADU Vol: 52, Issue: 184 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

'చేతిలో కాస్త డబ్బు ఉంటే, ముందు అప్పు తీర్చేయాలి' అనేది పెద్దలు చెప్పే మాట. సాధారణ అప్పుల విషయంలో ఇది నిజమే. గృహ రుణం విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుందా? ఈ ప్రశ్నకు సమాధానం అంత సులభం కాదు. చాలామంది గృహ రుణాన్ని పెద్ద భారంగా భావిస్తారు. చేతిలో డబ్బు ఉండగానే ముందస్తుగా చెల్లించాలని అనుకుంటారు. మరి, ఇందులో ఉండే లాభనష్టాలేమిటో చూద్దామా..



'అప్పు లేకపోతే ప్రశాంతంగా ఉంటుంది' ఈ భావనే చాలా మందిని గృహరుణం తొందరగా తీర్చాలని ఆలోచించేలా చేస్తుంది. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కేవలం భావోద్వేగాలే కాకుండా, దీర్ఘకాలిక లెక్కలు, సానుకూలతలనూ పరిగణనలోకి తీసుకోవాలి.

గృహ రుణం తీర్చేయాలా? కొనసాగించాలా?

అసలు తరగడం లేదనే అపోహ వద్దు

'ఏళ్లుగా ఈఎంఐ కడుతున్నాం, కానీ అసలు మాత్రం తగ్గడం లేదు' అని రుణ గ్రహీతలు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. ఇది కేవలం అపోహ మాత్రమే. గృహ రుణం తీసుకున్న మొదటి కొన్నేళ్లలో, మీరు కట్టే ఈఎంఐలో ఎక్కువ భాగం వడ్డీకి జమ అవుతుంది, అసలుకు తక్కువ వెళ్తుంది. అందుకే మొదట్లో అసలు తగ్గదు. కాలక్రమేణా, అసలు తగ్గేకొద్దీ వడ్డీ భారం తగ్గి, ఈఎంఐలో ఎక్కువ మొత్తం అసలుకే జమ అవుతుంది. మీరు నిరంతరంగా ఈఎంఐ కడుతూ ఉంటే, నిర్ణీత గడువులోపు రుణం తప్పక తీరిపోతుంది. దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

తక్కువ వడ్డీ

క్రెడిట్ కార్డులపై 30 శాతానికి పైగా, వ్యక్తిగత రుణాలపై 12 నుంచి 18 శాతం వరకు వడ్డీ ఉంటుంది. గృహ రుణం వడ్డీ రేటు వీటితో పోల్చితే చాలా తక్కువ. సాధారణంగా 20-30 ఏళ్ల వ్యవధితో ఉండే ఈ రుణం, మన జీవితంలో లభించే అత్యంత చౌకైన అప్పు అని చెప్పొచ్చు. ఇంత తక్కువ ఖర్చుతో కూడిన రుణాన్ని తీర్చేయడానికి తొందరపడటం కంటే, ఆ డబ్బును అత్యవసరాల కోసం దాచుకోవడం మేలు. అప్పు తీరిపోతుందనే తొందరలో చేతిలో ఉన్న డబ్బు మొత్తం కట్టేస్తే, ఆ తర్వాత వచ్చే ఆర్థిక అవసరాలకు చేతిలో చిల్లిగవ్వ ఉండకపోవచ్చు.

కాలక్రమేణా తగ్గే భారం

ఈ రోజు మీరు చెల్లిస్తున్న ఈఎంఐ పెద్ద భారంగా అనిపించవచ్చు. కానీ, కాలం గడిచేకొద్దీ ద్రవ్యోల్బణం, మీ ఆదాయం పెరగడం వల్ల ఆ భారం తగ్గుతుంది. ఉదాహరణకు ఇరవై ఏళ్ల క్రితం రూ.20లక్షల గృహరుణం అంటే ఎంతో పెద్ద మొత్తం. అప్పటి వేతనాలతో పోలిస్తే, ఈఎంఐ అధికమే. కానీ, ఇప్పుడు పెరిగిన ఆదాయంలో అది చాలా చిన్న మొత్తమే కావొచ్చు. అలాగే, 7-8 ఏళ్ల తర్వాత, ఇప్పుడు మీరు కడుతున్న ఈఎంఐ మొత్తం మీ జీతంలో చాలా చిన్న భాగంగా మారిపోతుంది. కాబట్టి, ఈఎంఐ భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పుడే పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. డబ్బు విలువ కాలక్రమేణా తగ్గుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

టాప్-అప్ సౌకర్యం

క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లించే వారికి బ్యాంకులు టాప్-అప్ రుణాలను అందిస్తాయి. దీని వడ్డీ రేటు గృహ రుణం కంటే కాస్త ఎక్కువగా ఉన్నప్పటికీ, పర్సనల్ లోన్ల కంటే తక్కువగా ఉంటుంది. అంటే, గృహ రుణం కొనసాగడం వల్ల తక్కువ వడ్డీకి అదనపు నిధులు లభించే అవకాశం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది.

క్రెడిట్ స్కోర్

పిల్లల విదేశీ విద్య వంటి వాటికి రుణం కావాల్సి వచ్చినప్పుడు, ఇప్పటికే ఉన్న గృహ రుణం మీకు సహాయపడుతుంది. కొత్త రుణ ప్రక్రియ వేగంగా, సులభంగా జరుగుతుంది. గృహ రుణం 'సెక్యూర్డ్ లోన్'. దీని ఈఎంఐలు సక్రమంగా చెల్లించడం వల్ల మీ క్రెడిట్ స్కోర్ గణనీయంగా పెరుగుతుంది. ఇది భవిష్యత్తులో తీసుకునే ఇతర రుణాలకు తక్కువ వడ్డీ రేట్లు పొందడానికి ఉపకరిస్తుంది.

డబ్బు ఉంటేనే ధైర్యం

జీవితం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేం. ఆరోగ్య అత్యవసరాలు.. పిల్లల ఉన్నత చదువులు, విదేశీ విద్య, ఇంటి మరమ్మతులు లేదా ఏదైనా వ్యాపార అవకాశం... ఇలాంటివి ఎప్పుడైనా రావచ్చు. ఈ సమయంలో చేతిలో నగదు నిల్వలు ఉండటం పెద్ద ఆర్థిక భద్రత. మీ దగ్గరున్న డబ్బునంతా గృహ రుణం తీర్చడానికే వాడేస్తే, భవిష్యత్తులో వచ్చే అత్యవసరాల కోసం మళ్లీ అధిక వడ్డీకి అప్పు చేయాల్సి వస్తుంది. అంటే, తక్కువ వడ్డీ ఉన్న గృహ రుణాన్ని తీర్చేసి, అధిక వడ్డీ ఉన్న కొత్త అప్పుల ఊబిలో చిక్కుకున్నట్లవుతుంది.

పెట్టుబడులతో

మీ దగ్గర ఉన్న అదనపు డబ్బును కేవలం గృహ రుణం తీర్చడానికే వాడాల్సిన అవసరం లేదు. దానికి బదులుగా, ఆ మొత్తాన్ని మంచి రాబడినిచ్చే పథకాల్లో పెట్టుబడి పెట్టవచ్చు. దీర్ఘకాలిక లక్ష్యాలు ఉన్నవారు, తమ నష్టభయ సామర్థ్యాన్ని బట్టి మ్యూచువల్ ఫండ్లు లేదా ఇతర సాధనాల్లో మదుపు చేయొచ్చు. దీర్ఘకాలంలో, ఇలాంటి పెట్టుబడుల ద్వారా వచ్చే రాబడి, మీరు గృహ రుణానికి చెల్లించే వడ్డీ కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. తద్వారా, ఒకవైపు రుణం కొనసాగుతున్నప్పటికీ, మరోవైపు మీ సంపద వృద్ధి చెందుతుంది. అవసరమైనప్పుడు ఈ పెట్టుబడులను వెనక్కి తీసుకునే వెసులుబాటూ ఉంటుంది.

ఎప్పుడు తీర్చేయాలి?

అలాగని గృహ రుణాన్ని ఎప్పటికీ తీర్చకూడదని కాదు. పదవీ విరమణ దగ్గర పడుతున్నప్పుడు, ఉద్యోగ భద్రత లేనప్పుడు, ఇతర అధిక వడ్డీ రుణాలు తీసుకోకపోతే గృహ రుణాన్ని ముందస్తుగా తీర్చేయడం మంచిది. గృహ రుణం అనేది ఒక బరువు కాదు.. దాన్ని తెలివిగా వాడుకుంటే, అది మన ఆర్థిక ప్రగతికి నిచ్చెనలు వేస్తుంది.

కుటుంబానికి ఇద్దాం నిజమైన భరోసా

siri@eenadu.net

పిల్లల చదువులు, పెళ్లి, ఇల్లు కొనుగోలు తదితరాల గురించి మనం కొన్నేళ్ల ముందుగానే ఆలోచిస్తుంటాం. స్థిరాస్తి ధరలు, పదవీ విరమణ ప్రణాళికలపైనా చర్చిస్తుంటాం. కానీ, 'మనం లేనప్పుడు మనవాళ్ల పరిస్థితి ఏమిటి?' అనే విషయాన్ని విస్మరిస్తుంటాం. చాలామంది తమకు పెట్టుబడులు, బీమా, పొదుపు ఉన్నాయి కదా.. ఇబ్బందేమీ లేదనుకుంటారు. కానీ, అనుకోని ఆపద వచ్చినప్పుడు ఆ ఆర్థిక సమాచారం తెలియక, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంఘటనలు ఎన్నో ఉంటున్నాయని ఎడెల్‌వైజ్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అనూప్ సేథ్ వివరిస్తున్నారు.

కుటుంబ పెద్దను కోల్పోయిన బాధతో ఉన్న కుటుంబ సభ్యులకు.. బ్యాంకు ఖాతాలు, ఆస్తి పత్రాలు వెతుక్కోవడం చాలా కష్టంతో కూడిన పని. చాలా మందికి ఆస్తులున్నప్పటికీ, వాటిపై స్పష్టత లేకపోవడంతోనే చిక్కులు వస్తున్నాయి. అందుకే, కుటుంబం ఆర్థిక కష్టాల పాలు కాకుండా ఉండాలంటే ఈ అయిదు విషయాలూ వారికి కచ్చితంగా తెలియాలని సూచిస్తున్నారు.

1 డబ్బు ఎక్కడుందో తెలియాలి

ఇది చాలా ప్రాథమిక విషయం. అయినప్పటికీ చాలామంది విస్మరించే అంశం. మీకు ఏయే బ్యాంకుల్లో ఖాతాలున్నాయి? ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు? తీర్చాల్సిన రుణాలు ఏమైనా ఉన్నాయా? అనే వివరాలు కుటుంబానికి తెలియాలి. ఈ సమాచారాన్ని ఒకేచోట (డైరీ లేదా డిజిటల్ రూపంలో) భద్రపర్చాలి. క్లిష్ట సమయంలో మెయిల్స్, మెసేజ్‌లు వెతుక్కునే పని కుటుంబ సభ్యులకు ఉండకూడదు. అవసరమైనప్పుడు ఎవరిని సంప్రదించాలి? అనే వివరాలూ అందుబాటులో పెట్టాలి.



2 పెట్టుబడుల ఉద్దేశం ఏమిటి?

కేవలం పెట్టుబడులు ఉన్నాయని తెలిస్తే సరిపోదు. అవి ఎందుకు చేశారో తెలియాలి.. అది పిల్లల చదువు కోసమా? దీర్ఘకాలిక వృద్ధి కోసమా? లేదా నెలవారీ ఆదాయం కోసమా? అనే స్పష్టత ఉండాలి. ఏది ఎప్పుడు అమ్మాలి? ఏది అట్టిపెట్టుకోవాలి? అనే అవగాహన లేకపోతే.. దశాబ్దాలుగా మీరు కష్టపడి కూడబెట్టిన సంపదను, తప్పుడు సమయంలో అమ్మేసి నష్టపోయే ప్రమాదముంది. కుటుంబ సభ్యులు నిపుణులు కాకపోయినా, కనీసం నష్టపోకుండా, ఉండేంత అవగాహన వారికి కల్పించాలి.

3 బీమా వివరాలపై స్పష్టత

చాలామంది బీమా పాలసీలను కేవలం ఒక పథకంలాగా చూస్తుంటారు. కానీ, అది మీ కుటుంబానికి ఆదాయ భర్తీ చేసేది. మీకు ఏ పాలసీలున్నాయి? ఏ కంపెనీవి? ఎంత కవరేజీ ఉంది? క్లెయిం ఎలా చేయాలి? అనే విషయాలు ఇంట్లో వారికి తెలియాలి. ముఖ్యంగా టర్మ్ ఇన్సూరెన్స్ విషయంలో ఇది చాలా ముఖ్యం. సరైన సమాచారం లేకపోతే క్లెయిం ఆలస్యమై, కుటుంబం ఆర్థికంగా చిక్కుల్లో పడే అవకాశం ఉంది.

4 వీలునామా

మీ ఆస్తులు ఎవరికి చెందాలనే విషయంలో గందరగోళం లేకుండా 'వీలునామా' తప్పనిసరి. ఇది న్యాయపరమైన చిక్కులను తగ్గిస్తుంది. అలాగే నామినేషన్లు సరిగ్గా ఉన్నాయా లేదో ఎప్పటికప్పుడు చూసుకోవాలి. కుటుంబ పరిస్థితులకు అనుగుణంగా నామినీ పేర్లను మార్చుకుంటూ ఉండాలి. బాండ్ పేపర్లు, స్టేట్‌మెంట్లు వంటి రికార్డులను కాగితం రూపంలోనూ, డిజిటల్‌గానూ భద్రపర్చాలి. ఉమ్మడి ఖాతాలు నిర్వహించడం మంచిదే. కానీ, వీటివల్ల చట్టపరమైన ఇబ్బందులనూ గమనించాలి.

5 నిర్వహణ-కొనసాగింపు

డబ్బు చేతికి అందిన తర్వాత దాన్ని నిర్వహించడం ఎంతో కీలకం. బీమా లేదా ఇతరత్రా పెద్ద మొత్తంలో డబ్బు వచ్చినప్పుడు, ఏదైనా తప్పుడు పథకాల్లో మదుపు చేసే ప్రమాదం పొంచి ఉంటుంది. పెట్టుబడుల నిర్వహణ తెలియని వారు ఆ సమయంలో మోసపోయే అవకాశం ఉంది. అందుకే, మీరు నమ్మే ఆర్థిక సలహాదారును మీ కుటుంబ సభ్యులకు (జీవిత భాగస్వామికి) ముందుగానే పరిచయం చేయాలి. ఆ నమ్మకం కొనసాగేలా ఏర్పాటు చేయాలి.

ఎప్పటికప్పుడు కొత్త ఖాతాలు, పెట్టుబడుల వివరాలు కుటుంబ సభ్యులకు చెబుతూ ఉండాలి. మీ ఆర్థిక ప్రణాళిక ఎలా ఉందో వివరిస్తూ, మార్గదర్శకాలు రాసి పెట్టడమూ చేయొచ్చు. అది కష్టకాలంలో కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలుస్తుంది. ఈ రోజే ఓ గంట కేటాయించి, మీ ముఖ్యమైన పాలసీలు, ఖాతాల వివరాలను ఒక చోట రాయండి. అదే మీరు మీ కుటుంబానికి ఇచ్చే నిజమైన భరోసా!

పాన్ నిబంధనలు మారనున్నాయ్

ఆదాయ పన్ను చెల్లింపుదారులకు, అధిక విలువ కలిగిన లావాదేవీలు నిర్వహించే వారికి ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం 'ఆదాయ పన్ను ముసాయిదా నిబంధనలు-2026'లో కీలక ప్రతిపాదనలు చేసింది. శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) తప్పనిసరిగా సమర్పించాల్సిన అంశాలను తగ్గించింది. ముఖ్యంగా నగదు డిపాజిట్లు, వాహన కొనుగోళ్లు, స్థిరాస్తి లావాదేవీల విషయంలో సామాన్యులకు ఇబ్బంది లేకుండా నిబంధనలను సడలించింది.



ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం చిన్న మొత్తాలకే పాన్ కార్డు ఇవ్వాల్సి వస్తోంది. కొత్తగా రాబోతున్న ఆదాయపు పన్ను చట్టం-2025కు అనుగుణంగా రూపొందించిన ఈ ముసాయిదాలో ఈ పరిమితులను పెంచారు. బ్యాంకులో నగదు లావాదేవీల పరిమితిని రోజువారీ కాకుండా, వార్షిక ప్రాతిపదికన లెక్కించడం, వాహన కొనుగోలు పరిమితిని రూ.5లక్షలకు పెంచడంలాంటివి ఇందులో ఉన్నాయి. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ప్రతిపాదించిన ముసాయిదా నిబంధనల ప్రకారం పాన్ కార్డు వినియోగంలో రాబోతున్న ప్రధాన మార్పులను ఒకసారి పరిశీలిస్తే..

✦ **నగదు డిపాజిట్, ఉపసంహరణ:** ప్రస్తుతం బ్యాంకులో ఒక రోజులో రూ.50,000 కంటే ఎక్కువ నగదు జమ చేస్తే, పాన్ కార్డు తప్పనిసరి. కొత్త నిబంధనల ప్రకారం ఈ విధానం మారబోతోంది.

ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలో కలిపి మొత్తం రూ.10లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు డిపాజిట్ చేసినా, లేదా వెనక్కి తీసుకున్నా పాన్ కార్డు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. రోజువారీ పరిమితి స్థానంలో వార్షిక పరిమితిని తెచ్చారు.

✦ **మోటార్ వాహనాల కొనుగోలు:** ఇప్పుడు ద్విచక్ర వాహనాలు మినహా, మిగతా ఏ వాహనం కొనుగోలు చేసినా పాన్ తప్పనిసరి.

వాహనం ధర రూ.5లక్షలు దాటితేనే పాన్‌కార్డు తప్పనిసరి. ఇందులో ద్విచక్రవాహనాలూ ఉన్నాయి. అంటే, రూ.5లక్షల లోపు విలువైన బైకులు, కార్లు కొనుగోలు చేసినప్పుడు పాన్ ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

✦ **హోటల్, ఈవెంట్ ఖర్చులు:** అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం హోటల్ లేదా రెస్టరెంట్ బిల్లు రూ.50,000 దాటితే పాన్ అడుగుతున్నారు.

ఈ పరిమితిని రూ.1లక్షకు పెంచాలని ప్రతిపాదించించారు. హోటళ్లు, రెస్టరెంట్లు, బ్యాంక్వెట్ హాళ్లు లేదా ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు రూ.1లక్షకు మించి చెల్లింపులు చేసినప్పుడు మాత్రమే పాన్ వివరాలు అందించాల్సి ఉంటుంది.

✦ **స్థిరాస్తి లావాదేవీలు:** ప్రస్తుతం రూ.10లక్షలు దాటిన స్థిరాస్తి లావాదేవీలకు పాన్ ఉండాల్సిందే.

ప్రతిపాదిత మార్పు ప్రకారం ఈ పరిమితిని రూ.20లక్షలకు పెంచారు. స్థలం, ఇల్లు కొనుగోలు, అమ్మకం లేదా ఉమ్మడి అభివృద్ధి ఒప్పందాల విలువ రూ.20లక్షలు దాటితేనే పాన్ అవసరమవుతుంది.

✦ **బీమా పాలసీలు:** మిగతా అంశాల్లో వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం, బీమా రంగంలో మాత్రం నిబంధనలను కఠినతరం చేసింది. ప్రస్తుతం ప్రీమియం రూ.50,000 దాటితేనే పాన్ అడుగుతున్నారు.

బీమా సంస్థల నుంచి ఏ తరహా పాలసీ తీసుకోవాలన్నా.. ఇక ముందు పాన్ తప్పనిసరి. అంటే, ప్రీమియం మొత్తంతో సంబంధం లేకుండా, కొత్తగా పాలసీ తీసుకునేటప్పుడు పాన్ ఇవ్వాల్సిందే.

ఈ ముసాయిదా నిబంధనలపై సలహాలు స్వీకరించిన తర్వాత, మార్చి మొదటి వారంలో తుది నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయ పన్ను చట్టం-2025కు అనుగుణంగా ఈ మార్పులను ప్రతిపాదించారు.

దీర్ఘకాలిక పెట్టుబడి కోసం

సాధారణంగా విదేశీ మదుపరులు మన దేశంలో మదుపు చేసేందుకు ఎంఎస్‌సీఐ ఇండియా ఇండెక్స్ అనే బెంచ్‌మార్క్‌ను ఆధారంగా తీసుకుంటారు. ఇందులో దేశీయ మదుపరులకూ పెట్టుబడి పెట్టే అవకాశాన్ని కల్పిస్తూ ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఎంఎస్‌సీఐ ఈటీఎఫ్‌ను తీసుకొచ్చింది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5,000. ఈ నెల 16 వరకూ ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుంది. దేశంలోని పెద్ద కంపెనీలు, మిడ్ క్యాప్ కంపెనీల్లో ఇది పెట్టుబడి పెడుతుంది. ఎంఎస్‌సీఐ ఇండియా ఇండెక్స్‌లో ఉన్న కంపెనీల్లో, అదే నిష్పత్తిలో మదుపు చేస్తుంది. ఫలితంగా, ఖర్చుల నిష్పత్తి తక్కువగా ఉంటుంది. ఇది పూర్తిగా ఈక్విటీ పథకం కాబట్టి, నష్టభయం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు అనుకూలం. ఈటీఎఫ్ కాబట్టి, డీమ్యాట్ ద్వారానే మదుపు చేయాలి.

వైద్య రంగంలో

కొత్త పథకం

దేశంలో పెరుగుతున్న ఆరోగ్య అవసరాలు, బీమా వ్యాప్తి వల్ల ఆసుపత్రుల రంగం పనితీరు బాగుంటుందని నమ్మే వారికోసం గ్రో మ్యూచువల్ ఫండ్ తాజాగా గ్రో బీఎస్ఈ హాస్పిటల్స్ ఈటీఎఫ్‌ను తీసుకొచ్చింది. ఈ నెల 25 వరకూ అందుబాటులో ఉండే ఈ ఫండ్‌లో కనీస పెట్టుబడి రూ.5,000. డీమ్యాట్ లేని వారికోసం ఫండ్ ఆఫ్ ఫండ్ ఉంది. ఇందులో కేవలం రూ.500లతోనే మదుపు చేయొచ్చు. ప్రధానంగా ఆసుపత్రుల్లో ఈ ఫండ్ మదుపు చేస్తుంది. ఒకే రంగంపై ఆధారపడుతుంది కాబట్టి, డైవర్సిఫైడ్ ఫండ్లతో పోలిస్తే, ఇందులో నష్టభయం కాస్త అధికంగా ఉంటుంది.

బంగారం.. వెండి.. ఏం చేయాలి?



బంగారం, వెండి ధరలు ప్రస్తుతం ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇవి కేవలం తాత్కాలిక మెరుపులా? ఇంకా పెరుగుతాయా? అనే సందేహం సామాన్యుల నుంచి మదుపరుల వరకూ అందరిలోనూ ఉంది. రాబోయే మూడు నుంచి అయిదేళ్లపాటు ఈ లోహాల ధరల్లో వృద్ధి నమోదవుతూనే ఉంటుందని పలు విశ్లేషణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడి దృష్టితో ఉన్నవారు ఏం చేయాలన్నది ఒకసారి పరిశీలిద్దాం.

మదుపరులు బంగారం, వెండిని స్వల్పకాలిక లాభాల కోసమే చూడటం లేదు. వీటిని దీర్ఘకాలిక ఆస్తిగా పరిగణిస్తున్నారు. అంతర్జాతీయంగానూ పెట్టుబడుల వైవిధ్యీకరణలో ఈ లోహాలకు ప్రాధాన్యం పెరిగింది. మరోవైపు.. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతోపాటు, కరెన్సీ మారకం విలువ కూడా భారతీయ మదుపరులకు కలిసొస్తోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణించడం వల్ల, దేశీయంగా బంగారం ధరలు మరింత పెరిగి, మదుపరులకు అధిక రాబడిని అందించే వీలుంది. కాకపోతే.. గరిష్ఠ స్థాయి నుంచి పసిడి, వెండి ధరలు ఇప్పుడు కాస్త దిగి వచ్చాయన్న సంగతి ఇక్కడ గమనించాలి. ధరల్లో కాస్త హెచ్చుతగ్గులు కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో మదుపరులు ఎలాంటి వ్యూహాన్ని పాటించాలంటే..

కొత్త మదుపరులు..

◆ క్రమశిక్షణ ముఖ్యం. మీ మొత్తం పెట్టుబడిలో 10-15 శాతం వరకూ బంగారం, వెండికి కేటాయించడం సురక్షితం.

◆ మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకునేందుకు ఒకేసారి కాకుండా, క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) పద్ధతిలో లేదా విడతల వారీగా పెట్టుబడి పెట్టండి.

◆ నేరుగా బంగారాన్ని కొనడం, గోల్డ్/సిల్వర్ ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్లు, మల్టీ అసెట్ ఫండ్ల ద్వారా మదుపు చేయొచ్చు.

ఇప్పటికే మదుపు చేస్తే

◆ మీ పోర్ట్‌ఫోలియోలో బంగారం వాటాను కొనసాగించండి. మార్కెట్ కొంత తగ్గినప్పుడు మరింత జోడించేందుకు ప్రయత్నించండి.

◆ ఒకవేళ ధరల పెరుగుదల వల్ల మీ మొత్తం బంగారం, వెండి వాటా 30 శాతానికి మించితే, సమతౌల్యం కోసం కొంత మేర లాభాలు స్వీకరించి, ఆ మొత్తాన్ని డైవర్సిఫైడ్ ఫండ్లకు మళ్లించవచ్చు.

ఎప్పుడూ ధరలు పెరుగుతాయనే ఆలోచించకూడదు. కొన్ని పరిస్థితులు మారినప్పుడు ఈ లోహాల ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తాయి. అందుకూ సిద్ధంగా ఉండాలి.

పదవీ విరమణ నిధి తరిగిపోవద్దు

పదవీ విరమణ అనేది ఆర్థిక జీవితంలో ఎంతో కీలకమైన ఘట్టం. చాలామంది ఈ దశను నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ, నెలవారీ ఆదాయం ఆగిపోయే ఈ సమయంలో చేసే చిన్న పొరపాటూ భవిష్యత్తును గందరగోళంగా మార్చేస్తుంది. ఒకసారి ఉద్యోగం లేదా వృత్తి నుంచి వైదొలిగాక, మన దగ్గరున్న పొదుపు మొత్తమే మనకు ఆధారం. పెరిగే ఖర్చులు, ద్రవ్యోల్బణం లెక్కలేస్తే.. రూ.కోటిన్నర ఉన్నా చాలకపోవచ్చు. అందుకే, పదవీ విరమణ నిధిని చివరి వరకూ కాపాడుకోవాలి.

వచ్చే ఏడాది కుమార్ పదవీ విరమణ చేయనున్నారు. ఆయన దగ్గర షేర్లు, ఫండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం రూపంలో దాదాపు రూ.1.5 కోట్ల నిధి ఉంది. ఇంకా రూ.14లక్షల గృహరుణం మిగిలి ఉంది. ప్రస్తుతం నెలవారీ ఖర్చులు రూ.90,000. దంపతులిద్దరికీ కలిపి రూ.10 లక్షల జీవిత బీమా పాలసీ ఉంది. టర్మ్ పాలసీ లేదు. ఈ పరిస్థితుల్లో వారి పదవీ విరమణ నిధి చివరి వరకూ సరిపోతుందా?

చేతిలో ఉన్న రూ.1.50 కోట్ల నిధి వారి జీవిత కాలం మొత్తం సరిపోయేలా లేదు. 5 శాతం ద్రవ్యోల్బణం, పెట్టుబడుల మీద 10 శాతం రాబడిని అంచనా వేసినా.. ఈ డబ్బు కేవలం 18 ఏళ్లలోనే ఖాళీ అయిపోతుంది. సగటున 85 ఏళ్ల వరకూ జీవిత కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇంకా 25 ఏళ్లపాటు డబ్బు అవసరం ఉంది. అంటే, చివరి 7-8 ఏళ్లకు డబ్బు సరిపోని పరిస్థితి తలెత్తవచ్చు.

ఈ ప్రమాదాన్ని నివారించి, విశ్రాంత జీవితాన్ని సాఫీగా మార్చుకోవడానికి నిపుణులు సూచిస్తున్న జాగ్రత్తలు ఒకసారి చూద్దాం..

ఖర్చుల్లో కోత తప్పనిసరి: పదవీ విరమణ తర్వాత ఖర్చులు పెరుగుతాయే తప్ప తగ్గవు. వైద్య ఖర్చులు, అనుకోని అవసరాల కోసం ఎప్పుడూ కొంత అదనపు మొత్తం ఉండాలి. ప్రస్తుతం ఉన్న కార్పస్ సరిపోదు కాబట్టి, పదవీ విరమణ తర్వాత కనీసం 20 శాతం ఖర్చులను తగ్గించుకోవాలి. అనవసరపు ఖర్చులకు కత్తెర వేస్తేనే, చేతిలో ఉన్న డబ్బు ఎక్కువ కాలం వస్తుంది.



రాబడి అంచనాల్లో వాస్తవం: గత అయిదేళ్లలో మార్కెట్లు 14 శాతం పైగా రాబడిని ఇచ్చాయని, భవిష్యత్తులోనూ అంతే వస్తుందని ఆశించడం అత్యాశే అవుతుంది. పదవీ విరమణ ప్రణాళిక వేసుకునేటప్పుడు 10 శాతం రాబడిని లక్ష్యంగా పెట్టుకోవడం సురక్షితం.

టాపప్: వృద్ధాప్యంలో ఆస్తిని కరిగించేది ఆసుపత్రి ఖర్చులే. ఇప్పుడు రూ.10లక్షల పాలసీలున్నప్పటికీ.. చికిత్సకు సరిపోవడం లేదు. కాబట్టి, పదవీ విరమణ చేసిన వారు రూ.10లక్షల ప్రాథమిక పాలసీతోపాటు, తప్పనిసరిగా రూ.25 లక్షల వరకూ టాపప్ పాలసీని తీసుకోవడమూ మర్చిపోవద్దు. మంచి జీవన శైలిని పాటిస్తూ వైద్య ఖర్చులను చాలా వరకూ తగ్గించుకోవచ్చు.

సంక్లిష్టమైన పథకాలకు దూరం: పదవీ విరమణ వయసులో పెట్టుబడులు ఎంత సరళంగా ఉంటే అంత మంచిది. లాకిన్ వ్యవధి (డబ్బు వెనక్కి తీసుకోలేని సమయం) ఉండే పథకాలు, మనీ బ్యాక్ పాలసీలు, అధిక రాబడి ఆశచూపే అర్థం కాని పథకాలకు దూరంగా ఉండాలి. ఇండెక్స్ ఫండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డెట్ ఫండ్లు, బాండ్లతో కూడిన మిశ్రమ పోర్ట్‌ఫోలియోను ఎంచుకోవాలి. ఇది మీకు స్థిరంగా 10 శాతం రాబడిని ఇస్తూనే, అవసరమైనప్పుడు డబ్బు వెనక్కి తీసుకునే వెసులుబాటును కల్పిస్తుంది.

అదనపు ఆదాయం: కేవలం పొదుపు మీదే ఆధారపడకుండా, ఏదైనా చిన్నపాటి ఉద్యోగం, సలహాదారు సేవలను అందించడంలాంటి పనులనూ చేయొచ్చు. దీనివల్ల రెండు లాభాలున్నాయి. ఒకటి మీకు అదనపు ఆదాయం సమకూరుతుంది. తద్వారా మీ నిధి నుంచి ఎక్కువ డబ్బు తీయాల్సిన పని ఉండదు. మానసికంగా చురుగ్గా ఉండేందుకూ ఇది తోడ్పడుతుంది.

అత్యవసర నిధి: ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే వెంటనే వాడుకోవడానికి వీలుగా, కనీసం 12 నెలల ఖర్చులకు సరిపోయే డబ్బును లిక్విడ్ ఫండ్లు లేదా పొదుపు ఖాతాలో ఉంచుకోవాలి. మార్కెట్ హెచ్చుతగ్గులకు ప్రభావితం కాకుండా ఈ డబ్బును దాచుకోవాలి.

సరైన ప్రణాళిక, కాస్త ముందుచూపుతో ఉంటే పదవీ విరమణ జీవితాన్ని ఆనందంగా సాగించవచ్చు. పొదుపు మొత్తాన్ని ఆరంభంలోనే ఖర్చు చేయకుండా, చక్రవడ్డీ ప్రారంభమయ్యేలా చూసుకుంటే, చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తవు.

ఈనాడు సినిమా

ఓటీటీలో కాదు.. నేరుగా వెండితెరపైనే



గతేడాది ఈటీవీ విన్ నుంచి వచ్చిన 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాలు బాక్సాఫీస్ బరిలో మంచి విజయాల్ని అందుకున్నాయి. దీంతో ఇప్పుడే జైత్ర యాత్రను 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'తో కొనసాగించేందుకు ఈటీవీ విన్ సిద్ధమైంది. శివాజీ హీరోగా నటిస్తూ, స్వయంగా నిర్మించిన ఈ చిత్రాన్ని సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. లయ, రోహన్ కీలక పాత్రలు పోషించారు. ఈటీవీ విన్ ఒరిజినల్ మూవీగా రూపొందిన ఈ సినిమా గురువారం ఓటీటీలోకి రావాల్సి ఉండగా.. ప్రేక్షకుల డిమాండ్ మేరకు మార్చి 6న నేరుగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని చిత్ర వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఈ చిత్రానికి సంగీతం: రంజిన్ రాజ్, ఛాయాగ్రహణం: రిత్విక్ రెడ్డి.

జడల్ రాక ఆగస్టులో



నాని

కథానాయకుడు నాని 'ది ప్యారడైజ్' సినిమా వాయిదా పడింది. మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని.. ఆగస్టు 21న థియేటర్లలోకి తీసుకు రానున్నట్టు గురువారం అధికారికంగా ప్రకటించారు. 'దసరా' విజయం తర్వాత నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయిక నుంచి వస్తున్న కొత్త సినిమా ఇది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా హైదరాబాద్‌లో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. నాని ఇందులో జడల్ అనే రా రస్టిక్ పాత్రలో మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో అలరించనున్నారు. ఇది ఎనిమిది భాషల్లో పాన్ వరల్డ్ స్థాయిలో తెరకెక్కి రానున్నట్టు చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, ఛాయాగ్రహణం: సీహెచ్ సాయి.

మహాశివరాత్రి సందర్భంగా...



'నాగబంధం'లో జగపతిబాబు



మహేశ్ బాబు

పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న యువ కథానాయకుల చిత్రాల్లో 'నాగబంధం' ఒకటి. విరాట్ కర్ణ కథానాయకుడిగా నటిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్య మేనన్ కథానాయికలు. జగపతిబాబు ముఖ్యభూమిక పోషిస్తున్నారు. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది చిత్రం. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15న అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు చేతులమీదుగా టీజర్ విడుదల కానుందని చిత్రబృందం ఓ ప్రకటనలో తెలిపింది. పురాతనమైన రహస్యాలు, నాగబంధం సంప్రదాయంతో ముడిపడిన ఈ కథని ఒక అద్భుతమైన... 1750 నేపథ్యంలో భారీ హంగులతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు సినీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సౌందర్‌రాజన్.ఎస్, సంగీతం: అభే, జునైద్ కుమార్, ప్రొడక్షన్ డిజైన్: అశోక్‌కుమార్, కూర్పు: ఆర్.సి.ప్రణవ్.

"కొడుకులే కాదు.. కూతుర్లు కూడా వారసులే" అన్నారు నటుడు, దర్శక నిర్మాత అర్జున్ సర్జా. ఆడపిల్లల విషయంలో భేదాలు చూపించకూడదని.. వాళ్ల అభిరుచులకు తగ్గట్టు ప్రోత్సాహం అందించాలని చెప్పారు. ఇప్పుడాయన తన కూతురు ఐశ్వర్యను తెలుగు తెరకు నాయికగా పరిచయం చేస్తూ.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా 'సీతా పయనం'. ఇది ఈనెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం విలేకర్లతో ముచ్చటించారు అర్జున్.

ఇక్కడ కక్ష సాధింపులేమీ ఉండవు



అర్జున్

"ఇదొక పరిణతి నిండిన కథ. దీంట్లో ప్రేమ కథ మాత్రమే కాకుండా ఎన్నో రకాల భావోద్వేగాలు మిళితమై ఉన్నాయి. దీంట్లో తండ్రీ - కూతురు ఎమోషన్‌ను అద్భుతంగా చూపించాం. నాకు తెలుగు పరిశ్రమ ఎంతో ఇచ్చింది. ఇక్కడి ప్రేక్షకులు నన్నెంతో ప్రేమిస్తుంటారు. అందుకే ఇలాంటి మంచి కథతో.. మా అమ్మాయిని ఇక్కడి నుంచే తెరకు పరిచయం చేయాలనుకున్నా. ఈ కథకి నేను తొలుత విష్వక్ సేన్‌ని హీరోగా అనుకున్నా. కానీ, కొన్నిసార్లు మనం అనుకున్నట్లు జరగవు. ఆ తర్వాత ఆ స్థానంలోకి నిరంజన్‌ను హీరోగా తీసుకున్నా. విష్వక్‌తో సమస్యలేమీ లేవు. అన్నీ పరిష్కరించుకున్నాం. జీవితం ఓ చక్రం. ఇక్కడ కక్ష సాధింపులేమీ ఉండవు. మళ్లీ సెట్ అయితే భవిష్యత్తులో కలిసి సినిమా చేస్తాం".

● "మా సినిమా ప్రారంభోత్సవానికి పవన్ కల్యాణ్ అతిథిగా వచ్చారు. 'మీ కోసం మేము ఉన్నాం' అని చెప్పేందుకే ఈ వేడుకకు వచ్చానని ఆరోజు పవన్ నాతో అన్నారు. ఆయన ఎంతో నిజాయతీ గల వ్యక్తి. నాకు రాజకీయాలు పడవు. నటుడిగా నేను అన్ని రకాల పాత్రల్ని పోషించాలనుకుంటున్నా. ప్రస్తుతం నా దగ్గర ఆరేడు స్క్రిప్టులు సిద్ధంగా ఉన్నాయి. నటన కంటే దర్శకత్వం చేయాలనే ఉంది. ఎవరైనా మంచి కథతో వస్తే జగపతిబాబుతో కలిసి 'హనుమాన్ జంక్షన్ 2' చేయాలని ఉంది".

ఉగాది పచ్చడిలా..



వంశీ నందిపాటి, బన్నీవాస్, సాయిదుర్గా తేజ్, శివానీ నాగారం, సుహాస్, నరేశ్

"హే భగవాన్.. ప్రేక్షకుల్ని నవ్వించే సినిమాలా ఉంటుంద"న్నారు కథానాయకుడు సాయి దుర్గా తేజ్. సుహాస్, శివానీ నాగారం జంటగా నటించిన ఈ చిత్రాన్ని గోపీ అచ్చర తెరకెక్కించారు. బి.నరేంద్ర రెడ్డి నిర్మించారు. నరేశ్, స్రవంతి కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హీరో సాయి దుర్గా తేజ్ హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం వాలెంటైన్ వీక్‌లో భాగమైన హగ్ డే సందర్భంగా చిత్ర బృందంలోని పురుషుల్ని ఆలింగనం చేసుకుంటూ నటుడు నరేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలోనే శివాని, స్రవంతిల వస్త్రధారణపై స్పందించారు. 'నేను మిమ్మల్ని హగ్ చేసుకుందామనే వచ్చా. కాకపోతే మీరు చీరలు కట్టుకుని వచ్చారు. ఇటీవల జరిగిన ఓ ఘటన తర్వాత వేదికలపై చాలా మంది చీరల్లోనే కనిపిస్తున్నారు" అంటూ నవ్వులు పూయించారు. హీరో సుహాస్ మాట్లాడుతూ.. "ప్రేమ, వినోదం, ఎమోషన్.. ఇలా అన్ని రకాల అంశాలతో ఉగాది పచ్చడిలా ఉంటుంది" అన్నారు. "ఈ కథేంటన్నది ఊహించిన ఐదుగురికి ప్రీరిలీజ్ వేడుకలో రూ.20వేలు ప్రైజ్ మనీ ఇస్తాం" అని నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో గోపీ అచ్చర, బి.నరేంద్ర రెడ్డి, రామ్ అబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ విషయంలో ఓ పోరాటమే చేశా!



మానస

"ముద్దు సన్నివేశాల విషయంలో ముందు నేనూ సందేహించా. కానీ మా చిత్రబృందం ఆ సన్నివేశాల్ని ఎంతో కవితాత్మకంగా, నిజాయతీగా తెరకెక్కిస్తుందనే విషయం నాకు ముందే అర్థమైంది. దాంతో ధైర్యంగా నటించేందుకు అంగీకారం తెలిపా" అన్నారు మానస వారణాసి. అచ్చమైన ఈ తెలుగమ్మాయి మిస్ ఇండియాగా అందాల కిరీటాన్ని సొంతం చేసుకుని, ఆ తర్వాత సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. 'దేవకీ నందన వాసుదేవ' సినిమాతో పరిచయమైన ఆమె... ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో నటించింది. సంతోశ్ శోభన్ కథానాయకుడిగా యు.వి కాన్సెప్ట్స్ పతాకంపై రూపొందిన చిత్రమిది. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా కథానాయిక మానస వారణాసి గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది.

● "తొలి సినిమా తర్వాత మనసుకు నచ్చిన కథ చేయాలని ఎదురు చూస్తూ వచ్చా. ఓ చిన్న విరామం తర్వాత ఈ సినిమా ప్రయాణం మొదలైంది. ఇందులో మిత్ర అనే యువతిగా నేను కనిపిస్తా. తను సరదా అమ్మాయి, అనుకున్నది ఏదైనా సరే వెంటనే చేసేస్తుంది. కొత్తగా ఆలోచిస్తుంది. నేటి యువతరం చాలా తెలివిగా ఆలోచిస్తున్నారు. ఏది సరైందో, ఏది కాదో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. వాళ్ల జీవితాలకు అద్దం పట్టేలా ఉంటుంది. యువతరంతోపాటు, కుటుంబ ప్రేక్షకులకూ నచ్చేలా ఉంటుందీ చిత్రం".

● "ఇదొక విభిన్నమైన ప్రేమకథ, ఇందులో రెండు ముద్దు సన్నివేశాలు ఉంటాయని దర్శకనిర్మాతలు ముందే స్పష్టంగా చెప్పారు. కథ విన్నాక అందులో వాస్తవికత, చిత్రబృందంలో నిజాయతీ నాకు బాగా నచ్చింది. సెట్‌లో సౌకర్యవంతమైన వాతావరణాన్ని సృష్టించి ఆ సన్నివేశాల్ని కవితాత్మకంగా తెరకెక్కించారు. ఎక్కడా అసౌకర్యంగా అనిపించలేదు. తెరపైనా ఆ సన్నివేశాలు అందంగా ఉంటాయే తప్ప, అసభ్యంగా అనిపించవు. ట్రైలర్ విడుదలైన తర్వాత మాత్రం చాలా అభిప్రాయాలు వినిపించాయి (నవ్వుతూ). ఇలా ఎలా చేయగలిగావ్ అంటూ ఇంట్లోవాళ్లు కొంచెం అసంతృప్తిగానే మాట్లాడారు. కానీ ఆ తర్వాత వాళ్లే ఈ రంగం గురించి అర్థం చేసుకుని ప్రోత్సహించారు. స్నేహితులు, బంధువులు ఆ విషయంలో నాకు అండగా నిలిచారు. కథానాయకుడు సంతోశ్ శోభన్‌కు సినిమా అంటే ఎంతో తపన. అది నాకూ ఎంతో ప్రోత్సాహకరంగా అనిపించింది".

● "అందాల పోటీలకు సన్నద్ధమయ్యే సమయంలోనే మేకప్‌కీ, కెమెరాలకు అలవాటు పడిపోతాం. ఆ వెంటనే సినిమా రంగంవైపు ఆకర్షితులవుతాం. అయితే అందాల పోటీల్లో పాల్గొన్నవాళ్లంతా సినిమా రంగానికే రారు. బయట రకరకాల వృత్తుల్లో స్థిరపడినవాళ్లూ ఉన్నారు. మిస్ వరల్డ్ పోటీల నుంచి వచ్చాక నాకు సినిమాపై ఆసక్తి పెరిగింది. ఆ విషయం చెప్పినప్పుడు ఇంట్లోవాళ్లు భయపడ్డారు. తెలుగు కుటుంబాలే కాదు, మధ్య తరగతి కుటుంబాలన్నీ కూడా తమకు తెలియని సినీ రంగంలోకి తమ అమ్మాయి వెళుతోందంటే భయపడతారు. నా విషయంలోనూ అదే జరిగింది. కానీ ఆ విషయంలో నేను చాలా పోరాటమే చేశా. కొన్నాళ్లు ఉద్యోగం చేసి, ఆర్థికంగా నిలదొక్కుకుని, ఆ తర్వాత కుటుంబ సభ్యులకు నమ్మకం కలిగించి పరిశ్రమలోకి వచ్చా. తెలుగమ్మాయిలు మరింత ధైర్యంగా చిత్ర పరిశ్రమలోకి రావాలి. తదుపరి చిత్రాల కోసం తెలుగులో కొత్త కథలు వింటున్నా. ఇటీవలే ఓ తమిళ సినిమాలో నటించేందుకు ఒప్పుకున్నా".

ఎవర్నీ నిరుత్సాహపరచదు



అనుదీప్, కయాదు, విష్వక్ సేన్, నాగవంశీ

"రెండు గంటల పాటు హాయిగా నవ్వించే సినిమా 'ఫంకీ'" అన్నారు హీరో విష్వక్ సేన్. ఆయన.. కయాదు లోహర్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని అనుదీప్ కేవీ తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం ఈరోజు థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి చూసి ఎంజాయ్ చేసే చిత్రమిది. రెండు గంటలు ఎలా గడిచిపోయాయో తెలియనంతగా మీకిది వినోదాన్ని పంచుతుంది" అన్నారు. "ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. భీమ్స్ అద్భుతమైన సంగీతమందించారు" అన్నారు దర్శకుడు అనుదీప్. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "సినీ నేపథ్యంలో జరిగే కథ ఇది. దర్శకుడికి, నిర్మాత కూతురికి మధ్య జరిగే సరదా కథగా ఉంటుంది. అసలెవర్నీ నిరుత్సాహపరచదు" అన్నారు. ఓ ఇంటర్వ్యూలో తన గురించి నటుడు, దర్శకుడు అర్జున్ చెప్పిన మాటలు విన్నాక మంచిగా అనిపించిందని, ఆయన తెరకెక్కించిన 'సీతాపయనం'తో పాటు ఇతర చిత్రాలన్నీ ప్రేక్షకుల ఆదరణని సొంతం చేసుకోవాలన్నారు విష్వక్‌సేన్.

మిస్టిక్ థ్రిల్లర్.. 'మార్కండేయ'



విక్రాంత్, దిల్‌రాజు

"ఇతిహాసాల నుంచి తీసుకున్న కథతో రూపొందిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ చిత్రమే 'మార్కండేయ'" అన్నారు హీరో విక్రాంత్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమాని సిస్ట్లా వీఎంకే తెరకెక్కిస్తున్నారు. దిల్ రాజు డ్రీమ్స్ పతాకంపై నిర్మితమవుతున్న తొలి చిత్రమిది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది మహా శివరాత్రికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ కథ నచ్చి దీన్ని మా దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్‌లో తొలి చిత్రంగా ఎంచుకున్నాం. సీజీ వర్క్ ఎక్కువ ఉన్న చిత్రమిది. మా గ్లింప్స్‌కు అందరి నుంచి మంచి స్పందన లభించింది. మా చిత్ర బృందానికి ఇదే టానిక్. దేశంలో కొత్త వాళ్ల కోసం దిల్ రాజు డ్రీమ్స్ లాంటి మరో బ్యానర్ లేదు. అది మాకు గర్వంగా ఉంది. ప్రస్తుతం రెండు ఓటీటీ, మరో రెండు థియేట్రికల్ సినిమాలు సిద్ధం చేశాం. ఇక మా ఎస్వీసీ బ్యానర్‌లో 'రౌడీ జనార్దన', 'ఎల్లమ్మ', 'దేత్తడి' చిత్రాలు చేస్తున్నాం" అన్నారు. "ఇతిహాసాల నుంచి తీసుకున్న మార్కండేయుడి పాత్రకు ఆధునిక రూపమే ఈ సినిమా. ఆ పరమ శివుడి దయతో హీరో తన సమస్యలకు సమాధానాలు వెతికి ఆ చిక్కుల్లోంచి ఎలా బయట పడ్డాడన్నది దీంట్లో చూపిస్తాం" అన్నారు హీరో విక్రాంత్.

హుషార్ తెప్పించే చిత్రం




గణేశన్, అన్షు

"నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే సినిమా 'హుషార్ పిట్టలు'. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. అన్షు, వాసవి గణేశన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని బిక్షు తెరకెక్కించారు. వెంకట్ యాదవ్ నిర్మించారు. ఇది ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ సంస్థ ద్వారా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే నిర్మాత సురేశ్‌బాబు ఇటీవల హైదరాబాద్‌లో టీజర్‌ని విడుదల చేశారు. అనంతరం దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. "నేటి యువతకు హుషారు తెప్పించే చిత్రమిది. ఈ సమాజంలో నేను చూసిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని రూపొందించాం. యువతీ యువకులు, తల్లిదండ్రులు విడివిడిగా చూడాల్సిన కుటుంబ కథా చిత్రమిది" అన్నారు. "తల్లిదండ్రులకు, యువతకు ఓ మంచి సందేశమిచ్చే చిత్రమిది" అన్నారు నిర్మాత కె.వెంకట్. ఈ కార్యక్రమంలో బెక్కం వేణుగోపాల్, అన్షు, వాసవి గణేశన్, చిన్ని చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేరు మారిస్తేనే విడుదల

మనోజ్ బాజ్‌పేయీ సినిమాపై సుప్రీంకోర్టు ఆగ్రహం



మనోజ్ బాజ్‌పేయీ

మనోజ్ బాజ్‌పేయీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఘూస్‌ఖోర్ పండత్'. నీరజ్ పాండే, రితేశ్ షా రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా పేరు మార్చిన తర్వాతే విడుదలకు అనుమతి లభిస్తుందని చిత్రబృందంపై ఆగ్రహం వ్యక్తం చేసింది సుప్రీం కోర్టు. ఇటీవలే ఓ వర్గాన్ని కించపరిచేలా ఉందంటూ ఈ సినిమాపై పిటిషన్ దాఖలైన సంగతి తెలిసిందే. గురువారం దీన్ని విచారించింది సుప్రీం కోర్టు. "ఇలాంటి పేర్లు పెట్టి సమాజంలో ఒక వర్గాన్ని తక్కువ చేసి చూపే అధికారం ఎవరికీ లేదు. ఇది ఆమోదయోగ్యం కాదు. మీరు దీని పేరును మార్చాలి. కొత్త టైటిల్‌ను కోర్టుకు తెలిపిన తర్వాతే విడుదలకు అనుమతి లభిస్తుంది" అని ధర్మాసనం పేర్కొంది. ఈ సినిమాలో ఏ వర్గాన్నీ కించపరచడం లేదని అఫిడవిట్ దాఖలు చేయాలని దర్శకనిర్మాతలను ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది.

అదే మా నమ్మకానికి మరింత బలాన్నిచ్చింది!



శ్రీనాథ్ మాగంటి

శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీశ్ తెరకెక్కించిన చిత్రం మల్లేష్. రాజేశ్ నిర్మాత. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల కథానాయికలు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో టీజర్ విడుదల చేశారు. హీరో విష్వక్ సేన్, దర్శకుడు తరుణ్ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు తరుణ్ మాట్లాడుతూ.. "ఈ మధ్య ఇలాంటి రూటెడ్ కథలు తగ్గాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు అలాంటి కథతో రావడం ఆనందంగా ఉంది" అన్నారు. హీరో శ్రీనాథ్ మాట్లాడుతూ.. 'అందర్నీ అలరించే మంచి కథతో రూపొందిన చిత్రమిది. దీన్ని మైత్రీ వాళ్లు నైజాంలో.. ధీరజ్ ఆంధ్రాలో డిస్ట్రిబ్యూట్ చేస్తుండటం.. మా నమ్మకానికి మరింత బలాన్నిచ్చింది. ఇది కచ్చితంగా పెద్ద హిట్టవుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ధీరజ్ మొగిలినేని, గాయత్రి, బాల సతీశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

'భలే భలే...' తర్వాత ఆ స్థాయి నవ్వులు



లావణ్యా త్రిపాఠి

"నేను ఇదివరకు చేసిన 'భలే భలే మగాడివోయ్' తర్వాత మళ్లీ నన్ను అంతగా నవ్వించిన సినిమా ఇది. కథ వింటున్నప్పుడే ఎంతగానో ఆస్వాదించా" అన్నారు లావణ్య త్రిపాఠి. ఆమె, మలయాళ నటుడు దేవ్‌మోహన్ జంటగా నటించిన చిత్రం 'సతీ లీలావతి'. తాతినేని సత్య దర్శకత్వం వహించారు. నాగమోహన్ నిర్మాత. ఈ చిత్రం మార్చి 6న రానుంది. విడుదల తేదీ ప్రకటన కోసం ఇటీవల హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. లావణ్య మాట్లాడుతూ "ఈ సినిమా నాకు చిత్ర పరిశ్రమకు పునరాగమనంలా అనిపిస్తోంది. ఒకవైపు తల్లి బాధ్యతల్ని, మరోవైపు వృత్తి పరమైన బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నా. అంతా కొత్తగా ఉంది. ఈ సినిమా మొదలైనప్పుడు నేను గర్భవతిగా ఉన్నా. నా కెరీర్‌లో ఎక్కువ కష్టంగా, ఎక్కువ సులభంగా అనిపించిన సినిమా ఇదే. దేవ్ మోహన్, సప్తగిరి చాలా బాగా నటించారు. అందరి ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. అయితే కమల్‌హాసన్ 'సతీ లీలావతి'తో మాత్రం నా సినిమాని పోల్చను" అన్నారు.

ప్రాక్టీస్ బిట్స్

జనరల్ స్టడీస్ - అరిథ్‌మెటిక్

1. ఒక స్థూపం వ్యాసార్ధం, ఎత్తుల మొత్తం 19 మీ., సంపూర్ణతల వైశాల్యం 1672 $మీ^2$ అయితే ఆ స్తూపం ఘనపరిమాణం ఎంత ($మీ^3$.లలో)?
   1) 3080 2) 2992 3) 3220 4) 2660
2. ఒక స్తూపం ఎత్తును 6 రెట్లు, భూ వైశాల్యం $\frac{1}{9}$వ వంతు చేస్తే.. ఆ స్తూపం పక్కతల వైశాల్యం ఎన్నో వంతు అవుతుంది?
   1) 2వ 2) $\frac{1}{2}$వ 3) $\frac{2}{3}$వ 4) $\frac{3}{2}$వ
3. ఒక స్తూపం వ్యాసం 7 సెం.మీ., ఎత్తు 16 సెం.మీ.గా తీసుకుంటే, దాని పక్కతల వైశాల్యం ఎంత (సెం.$మీ.^2$లలో)?
   1) 350 2) 374 3) 348 4) 352
4. రెండు స్తూపాల వ్యాసార్ధాలు 3 : 4 నిష్పత్తిలో, వాటి ఎత్తులు 5 : 2 నిష్పత్తిలోనూ ఉన్నాయి. అయితే వాటి ఘనపరిమాణాల నిష్పత్తి ఎంత?
   1) 45 : 32 2) 27 : 20 3) 35 : 32 4) 32 :45
5. 2 సెం.మీ. వ్యాసం, 7 మీ. పొడవు ఉన్న తీగ ఘనపరిమాణం ఎంత?
   1) 2400 2) 1200 3) 1100 4) 2200

జవాబులు 1-1, 2-1, 3-4, 4-1, 5-4.

జనరల్ స్టడీస్ — విపత్తు నిర్వహణ

జారిపడే కొండంత ముప్పు!



పర్వతాలు, కనుమలు ఉన్న ప్రాంతాల్లో సంభవించే తీవ్రమైన ప్రకృతి విపత్తులే భూపాతాలు. అధిక వర్షాలు, భూకంపాలు, అగ్నిపర్వత పేలుళ్లు మొదలైన ప్రకృతి కారకాలతో పాటు అడవుల నరికివేత, ఏటవాలు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం, గనుల తవ్వకం తరహా మానవకారక చర్యలు ఇందుకు కారణమవుతున్నాయి. కొండచరియలు విరిగిపడటంతో నేల, రాళ్లు, మంచు మీదపడి, అందులో కూరుకుపోవడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగుతున్నాయి. దేశంలో హిమాలయాలు, ఈశాన్య రాష్ట్రాలతో పాటు పశ్చిమ కనుమల్లో తరచూ ఏర్పడుతున్న భూపాతాల స్వభావం, అందులో రకాలు, అవి కలిగించే నష్టాలు, ప్రభావం ఉండే ఇతర ప్రాంతాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వడగాలులు, శీతలగాలులు కూడా ప్రాణాంతకంగా మారుతున్న తీరు, ప్రపంచవ్యాప్తంగా అగ్నిపర్వత పేలుళ్ల ముప్పు తీవ్రత లాంటి అంశాలపైనా అవగాహన కలిగి ఉండాలి.



భూపాతాలు

శిలలు, మృత్తికలు, వాటితో నింపిన కృత్రిమ ప్రదేశాలు లేదా ఇవన్నీ కలిసిన పదార్థాలు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వేగంగా లేదా నెమ్మదిగా పడిపోవడం, జారిపోవడాన్ని 'భూపాతం' అంటారు.

భూపాత వైపరీత్యం: ఒక నిర్దిష్ట ప్రాంతంలో నష్టం కలిగించే భూపాతం సంభవించడాన్ని 'భూపాత వైపరీత్యం' అంటారు.


భూపాత దుర్బలత్వం: వైపరీత్యం వల్ల ప్రభావితమైన ప్రాంతంలో నిర్దిష్ట అంశాలకు లేదా అంశాల సమూహానికి జరిగే నష్టసామర్థ్యాన్ని తెలియజేస్తుంది. ఈ దుర్బలత్వాన్ని స్కేలుపై 0 (ఎలాంటి నష్టం లేకపోవడం) నుంచి 1 (పూర్తి నష్టం) మేరకు సూచిస్తారు. ◆ భూకంపాలు, వరదలు సంభవించినప్పుడు; అగ్నిపర్వతాలు పేలినప్పుడు కూడా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉంటుంది. ◆ భూపాతాలు ఎక్కువగా హిమాలయ పర్వత ప్రాంతాల్లో, ఈశాన్య రాష్ట్రాల్లో సంభవిస్తుంటాయి. వీటి తర్వాత పశ్చిమ కనుమలు, వింధ్య పర్వతాల్లో ఏర్పడుతున్నాయి. ◆ దేశ భౌగోళిక విస్తీర్ణంలో 15% భూభాగంలో భూపాతాలకు ఆస్కారం ఉంది. ◆ దేశంలో దాదాపు 20 రాష్ట్రాలు పలు తీవ్రతలున్న భూపాతాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. ◆ 1980 నుంచి భారతదేశంలో భూపాత ముప్పు ప్రాంతాలను గుర్తించేందుకు 'ల్యాండ్ స్లైడ్స్ జోనేషన్ మ్యాపింగ్' పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ◆ కొండచరియలు విరిగిపడే విపత్తులకు సంబంధించి 'జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' 2004 నుంచి నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. ◆ 1968, అక్టోబరు 2, 5 తేదీల మధ్య పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని డార్జిలింగ్ ప్రాంతం కుర్సియాంగ్ పట్టణం చుట్టూ ఉన్న తేయాకు తోటల్లో సంభవించిన అంబూటియా భూపాతాన్ని ఆసియాలో సంభవించిన అతిపెద్ద భూపాతంగా పరిగణిస్తారు.

భూపాతాలు - రకాలు




▲ జారిపడటం, ఎగరడం, దొర్లడం ద్వారా లోతైన వాలులు లేదా శిఖరాల నుంచి వేరుపడిన పదార్థాల అనూహ్య చలనాలను 'ప్రపాతం' అంటారు. ▲ మట్టి లేదా శిలలు నెమ్మదిగా, నిటారుగా కిందకు జారడాన్ని 'సర్పణం' లేదా 'పాకడం' అంటారు. ఇవి వంపు తిరిగిన చెట్ల కాండాలు, వంగిన కంచెలు లేదా రిటైనింగ్ గోడలు, పడిపోయిన స్తంభాలు లేదా కంచెలను తలపిస్తాయి. ▲ మట్టి, రాళ్లు, సేంద్రియ పదార్థం లాంటివి గాలి, నీటితో కలిసి ముద్దగా ఏర్పడి, వేగంగా దిగువకు ప్రవహిస్తాయి. సాధారణంగా, లోతైన అవనాళికలతో కూడిన శిథిల ప్రవాహం ఏర్పడుతుంది. ▲ అతివేగం నుంచి అసాధారణ వేగంతో కూడిన శిథిల ప్రవాహం. ▲ అగ్నిపర్వత వాలు నుంచి ఏర్పడే బురద ప్రవాహం లేదా శిథిల ప్రవాహాన్ని 'లహర్' అంటారు. ▲ ఆకస్మికంగా మంచు కరగడం లేదా హిమానీనదాల నుంచి నీరు పొంగిపొర్లడం, అగ్నిపర్వత విస్ఫోటాల వల్ల, జ్వాలాబిలం, సరస్సులు విచ్ఛిన్నమవడం వల్ల 'లహర్' ఏర్పడుతుంది. ▲ కనీసం 50% ఇసుక, పోడు, బురద మట్టి ఉన్న తడి పదార్థం వేగంగా ప్రవహించడాన్ని 'పంకప్రవాహం' అంటారు.
▲ పలు రకాల ద్రవ్యరాశి చలనాలన్నింటినీ 'భూపాతం' అంటారు. ఇది రెండు రకాలు. 1) భ్రమణ శీఘ్రపాతాలు 2) స్థలాంతర భూపాతాలు ▲ ఒక రాతి ఖండం ముందుకు దొర్లడం లేదా తిరిగి వాలు నుంచి కిందకు జారడాన్ని 'కూలిపోవడం' అంటారు.

భూపాతాలకు కారణాలు



▲ శిలలు లేదా మృత్తికా కూర్పు, నిర్మాణంలో బలహీనత కూడా భూపాతాలకు కారణమవుతోంది. ▲ చెట్ల నరికివేత, రోడ్ల నిర్మాణం వల్ల పర్వత వాలుల అంచులు క్రమక్షయం చెంది, ఆ ప్రాంతాలు భూపాతాలకు గురయ్యే అవకాశం పెరుగుతుంది. ▲ తీవ్రమైన వర్షపాతం వల్ల భూపాతాలు ఏర్పడతాయి. ఇవి ఎక్కువగా పశ్చిమ కనుమల్లో సంభవిస్తాయి. ▲ భూకంపాల వల్ల భూపాతాలు ఏర్పడుతున్నాయి. ఇవి అధికంగా హిమాలయాలు, ఈశాన్య పర్వత ప్రాంతాలు, పశ్చిమ కనుమల్లో సంభవిస్తున్నాయి. ▲ అగ్నిపర్వత విస్ఫోటం వల్ల భూపాతాలు ఏర్పడతాయి.



హిమపాతం: మంచు పర్వతం విరిగిపడటాన్ని 'హిమపాతం' (ఎవలాంచ్) అంటారు. ప్రపంచ భూపాతాల్లో 30% హిమాలయ పర్వత శ్రేణుల్లో సంభవిస్తున్నాయి. ● భారతదేశ విస్తీర్ణంలో దాదాపు 85% భూభాగం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వైపరీత్యాల ముప్పును ఎదుర్కొంటోంది.



వడగాలి: వడదెబ్బ వల్ల మృతుల సంఖ్య పెరుగుతుండటంతో దీనిని కూడా ప్రధానమైన ప్రకృతి విపత్తుగా గుర్తించాలనే డిమాండ్ వస్తోంది. వడగళ్లు అస్సాం లోయలో అత్యధికంగా వస్తుంటాయి. ఆ తర్వాత ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతాల్లో ఎక్కువగా వస్తాయి. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలో ఇసుక తుపాన్లు అత్యధికంగా సంభవిస్తాయి ● శీతల పవనాల వల్ల ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. ● కేంద్రం నిర్దేశించిన విపత్తుల జాబితాల్లో పిడుగుపాటుకు స్థానం లేనప్పటికీ, దానిని విపత్తుల జాబితాలో చేర్చడం ద్వారా మృతుల కుటుంబాలకు ఆర్థికపరమైన భరోసా ఇవ్వాలని 2015, మే 30న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ● ప్రపంచంలో ప్రస్తుతం 500 అగ్నిపర్వతాలు చురుగ్గా ఉన్నట్లు అంచనా. వీటిలో చాలాభాగం 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'లో ఉన్నాయి. వాటిలో 50 ఏటా బద్ధలవుతూనే ఉంటాయి. జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, మెక్సికో లాంటి దేశాలతో కూడిన వలయాన్ని 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'గా వ్యవహరిస్తారు. ఒక్క అమెరికాలోనే 50 క్రియాశీల అగ్నిపర్వతాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా శక్తిమంతమైన అగ్నిపర్వతాలు దాదాపు 1500 వరకు ఉండగా, వాటి పరిసరాల్లో 50 కోట్ల మంది నివసిస్తున్నారు.



● అండమాన్ దీవుల్లోని బారన్ అగ్నిపర్వతం దేశంలోని ఏకైక క్రియాశీల అగ్నిపర్వతం. రికార్డుల ప్రకారం 1787లో దీని పేలుడును తొలిసారిగా గుర్తించారు. ఇటీవల కాలంలో 2010, సెప్టెంబరులో మరోసారి బద్దలై నాలుగు నెలల పాటు నిప్పులు కక్కుతూనే ఉంది.



రచయిత: సక్కరి జయకర్

పదో తరగతి — తెలుగు



జలియన్ వాలాబాగ్



ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు

1. జలియన్ వాలాబాగ్ పాఠాన్ని రచించిన కవి గురించి రాయండి. **4 మార్కులు**

జ: కవి పేరు: కవి శేఖర డాక్టర్ ఉమర్ అలీషా.
జననం: తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో.
తల్లిదండ్రులు: చాంద్ బీబీ, మోహియుద్దీన్ బాద్‌షా.
రచనలు: మణిమాల, అనసూయా దేవి, చంద్రగుప్త, విషాద సౌందర్యం మొదలైన నాటకాలు రాశారు. ఖండకావ్యాలు, బ్రహ్మవిద్యా విలాసం, సూఫీ వేదాంత దర్శనం, మహమ్మద్ రసూల్ వారి చరిత్ర మొదలైన పద్య గ్రంథాలు రచించారు. ఈశ్వరుడు, మహమ్మద్ వారి చరిత్ర, సాధనాపథం మొదలైనవి వీరి గద్య రచనలు. ఏకాంకికలు, ప్రహసనాలు, నవలలు, కథల సంగ్రహం, అనువాదాలు మొదలైన రచనలు చేశారు.
బిరుదులు: పండిట్, మౌల్వి, ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ అమెరికా గౌరవ డాక్టరేట్.
ప్రత్యేకతలు: మహాకవిగా, వక్తగా, అవధానిగా, ఆధ్యాత్మికవేత్తగా, బహుభాషా పండితుడిగా, పార్లమెంటు సభ్యుడిగా ప్రసిద్ధి చెందారు. వీరి గురుపీఠం 'జ్ఞాన సభ' పేరిట ప్రసిద్ధి చెందింది.

1. ఆంగ్లేయుల నిరంకుశత్వ పాలనలో భారతీయుల పరిస్థితిని మీ సొంత మాటల్లో రాయండి. **8 మార్కులు**

జ: జలియన్ వాలాబాగ్ పాఠాన్ని కవిశేఖర డాక్టర్ ఉమర్ అలీషా రచించారు. ఆంగ్లేయుల నిరంకుశ పాలనలో భారతీయుల పరిస్థితిని కళ్లకు కట్టేలా వర్ణించారు. భారతీయుల శౌర్య పరాక్రమాలను చాటి చెప్పడంతోపాటు ఆంగ్లేయులు భారతీయులను ఏ విధంగా చిత్రహింసలకు గురిచేశారో దానిలో వర్ణించారు. భారతీయులు సాధుస్వభావం ఉన్నవారు. వారిని జనరల్ డయ్యర్ తన సైనికులతో కాల్పించాడు. దుర్మార్గంగా ఎంతోమంది అమాయకుల ప్రాణాలను తీశాడు. భారతీయులకు బానిసత్వాన్ని ఉగ్గుపాలతో పోసి, అన్న వస్త్రాలను దోచుకున్నారు. కరవు రక్కసికి ఆహ్వానం పలికారు. భారతదేశంలో ఆకలి చావులకు అవకాశం కల్పించారు. భారతీయుల మధ్య కక్షలను పెంచి పోషించారు. తిరుగుబాటులను అణచడానికి బ్రిటిష్‌వారు భారతీయుల మీద కఠిన చట్టాలు అనే ఉక్కుపాదం మోపారు. భారతీయులపై భరించలేని అనవసరపు పన్నులు విధించారు. మత్తు పదార్థాలను అలవాటు చేశారు. మన సంపదలను దోచుకున్నారు. మన మధ్య కలతలను సృష్టించారు. భారతీయులను విభజించి పాలించారు. లేత తమలపాకులు లాంటి పసిపిల్లలను ఎండలో నడిపించారు. నడుచుకుంటూ వెళ్లేవారిని కిందకు తోశారు. వారిని పొట్టలపై పాకించారు. అతి క్రూరంగా పదునైన ఆయుధాలతో పొడిచారు. ఎలాంటి తప్పులు చేయనివారిని కూడా కొట్టారు. స్త్రీలపై అత్యాచారాలు చేశారు. తలలు తెగిన శరీరాలతో, నిలిచిన ప్రాణాలతో పోరాడుతున్న వారి ఆర్తనాదాలకు ప్రకృతి చలించింది. ఆంగ్లేయుల దురాగతాలు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ


ఆ రాష్ట్రానికి ఉందో అధికారిక సూక్ష్మజీవి!



దీర్ఘకాలిక వృద్ధి వ్యూహం, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తూ తాజా బడ్జెట్‌ను కేంద్రం తీసుకొచ్చింది. గ్రామీ అవార్డు విజేతగా బౌద్ధ గురువు దలైలామా వార్తల్లో నిలిచారు. జాతుల మధ్య కల్లోలంతో రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపుర్‌లో నూతన ప్రభుత్వం కొలువుతీరింది. గణతంత్ర వేడుకల్లో మహారాష్ట్ర ప్రదర్శించిన గణేశోత్సవ్ శకటానికి మొదటి స్థానం దక్కింది. భారత్- కిర్గిజిస్థాన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు అస్సాంలో జరిగాయి. మనుషుల ఆరోగ్యానికి మేలు చేస్తున్న ఒక వైరస్‌ను కేరళ ప్రభుత్వం తన అధికారిక సూక్ష్మజీవిగా ఎంపిక చేసుకుంది. ఈ విధంగా దేశంలో, ప్రపంచవ్యాప్తంగా జరిగే ప్రధాన రాజకీయ, సైనిక, శాస్త్రీయ పరిణామాలను, వర్తమానాంశాలను పోటీ పరీక్షార్థులు నిరంతరం అధ్యయనం చేయాలి. ఇటీవలి కాలంలో విడుదలైన ముఖ్యమైన నివేదికలు, చేసిన నియామకాలు, అవార్డు గ్రహీతలు, క్రీడల్లో విజేతలు, కేంద్ర బడ్జెట్ విశేషాలను, పన్నుల్లో హెచ్చుతగ్గులను, వివిధ పథకాలకు చేసిన కేటాయింపులను, ప్రకటించిన ప్రోత్సాహకాలను తెలుసుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

1. ప్రముఖ బౌద్ధ గురువు దలైలామాకు ఇటీవల మెడిటేషన్స్: ది రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిజ్ హోలీనెస్ ద దలైలామా' పేరుతో ఆయన చేసిన ప్రసంగ ఆల్బమ్‌కు గ్రామీ అవార్డు వచ్చింది. అయితే దలైలామాకు ఏ సంవత్సరంలో నోబెల్ శాంతి బహుమతి లభించింది?



   1) 1999 2) 2000 3) 1986 4) 1989

నోట్: * ఫ్రీడం ఇన్ ఎక్సైల్: ద ఆటోబయోగ్రఫీ ఆఫ్ ద దలైలామా', 'ద ఆర్ట్ ఆఫ్ హ్యాపీనెస్', 'ద ఫోర్ నోబెల్ ట్రూత్స్', 'వాయిస్ ఫర్ ద వాయిస్‌లెస్'... దలైలామా పుస్తకాలు

2. రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం– 2025 ఎవరికి లభించింది?
   1) బి.సుదర్శన్ రెడ్డి 2) గోరటి వెంకన్న 3) యశోద రెడ్డి 4) బి.ఎస్.రాములు
3. అమెరికా ఫెడ్ రిజర్వ్ కొత్త గవర్నర్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) పిట్ హెగ్సేత్ 2) జె.డి.వాన్స్ 3) కెవిన్ వార్ష్ 4) సూసీ వైల్స్
4. కింది వాటిలో సరైంది?



   ఎ) 6వ ఎడిషన్ ఖేలో ఇండియా వింటర్ గేమ్స్ లద్దాఖ్‌లోని లేహ్‌లో జనవరి 20 - 26 (2026) మధ్య నిర్వహించారు.
   బి) 4 స్వర్ణాలు, ఒక రజతం, 2 కాంస్యాలు మొత్తం 8 పతకాలతో హరియాణా మొదటి స్థానంలో నిలిచింది.
   సి) 2 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్యాలు మొత్తం 11 పతకాలతో లద్దాఖ్ రెండో స్థానంలో నిలిచింది.
   డి) 2 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలు మొత్తం 7 పతకాలతో మహారాష్ట్ర మూడో స్థానంలో నిలిచింది.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
5. 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సంబంధించి సరికానిది?
   ఎ) 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ మెన్ సింగిల్స్ విజేత కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్).
   బి) 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఉమెన్ సింగిల్స్ విజేత ఎలెనా రిబకినా (అమెరికా).
   సి) 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ మెన్ సింగిల్స్ రన్నర్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా).
   డి) 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఉమెన్ సింగిల్స్ రన్నర్ అరీనా సబలెంకా (బెలారస్).
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి

నోట్: ఎలెనా రిబకినా కజకిస్థాన్‌కు చెందినవారు.

6. కార్లోస్ అల్కరాస్ ఇప్పటివరకు 7 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించాడు. అయితే అతడు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఎన్నిసార్లు నెగ్గాడు?
   1) 2 2) 3 3) 4 4) 1

నోట్: ఆస్ట్రేలియన్ ఓపెన్ ఒకసారి, ఫ్రెంచ్ ఓపెన్ రెండుసార్లు, వింబుల్డన్ రెండుసార్లు, యూఎస్ ఓపెన్ రెండుసార్లు నెగ్గాడు.

7. థాయ్‌లాండ్ మాస్టర్స్‌లో తొలి సూపర్ 300 టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు?
   1) గాయత్రి వర్తక్ 2) గోజిన్ వీ 3) దేవికాసి హాగ్ 4) నేహా పండిత్
8. జలంధర్ (పంజాబ్)లోని ఆదంపుర్ విమానాశ్రయం పేరును ఏమని మార్చు చేశారు?



   1) శ్రీ గురునానక్ విమానాశ్రయం
   2) శ్రీ గురు అంగద్ విమానాశ్రయం
   3) శ్రీ గురు రవిదాస్ మహారాజ్‌జీ విమానాశ్రయం
   4) శ్రీ గురు రాందాస్ విమానాశ్రయం
9. కింది వాటిలో సరైంది?
   ఎ) 2026, ఫిబ్రవరి 2న వరల్డ్ వెట్‌ల్యాండ్స్ డే థీమ్: వెట్‌ల్యాండ్స్ అండ్ ట్రెడిషనల్ నాలెడ్జ్: సెలబ్రేటింగ్ కల్చరల్ హెరిటేజ్ (చిత్తడి నేలలు, సాంప్రదాయ జ్ఞానం, సాంస్కృతిక వారసత్వాన్ని నిర్వహించుకోవడం)
   బి) భారతదేశంలో ప్రస్తుతం 98 రామ్‌సర్ సైట్స్ ఉన్నాయి.
   సి) భారత్‌లో 97వ రామ్‌సర్ సైట్ పట్నా బర్డ్ సాంక్చురీ (ఉత్తర్‌ప్రదేశ్)
   డి) భారత్‌లో 98వ రామ్‌సర్ సైట్ ఛారీ-ధండ్ (గుజరాత్)
   1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

నోట్: తమిళనాడులో 20 రామ్‌సర్ సైట్స్ ఉన్నాయి.

10. 2026–27 కేంద్ర బడ్జెట్‌లో 7 హై-స్పీడ్ రైలు కారిడార్లు ప్రకటించారు. కింది వాటిలో ఆ కారిడార్లలో లేనిదాన్ని గుర్తించండి.
    1) ముంబయి - పుణె 2) హైదరాబాద్ - చెన్నై 3) దిల్లీ - వారణాసి 4) కోల్‌కతా - చెన్నై
11. 2026–27 కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి సరైంది?



కరెంట్ అఫైర్స్

    ఎ) మన దేశాన్ని వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ఐదు ప్రాంతీయ వైద్యకేంద్రాల ఏర్పాటు.
    బి) మూడు అఖిలభారత ఆయుర్వేద సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదన.
    సి) ప్రధాన పారిశ్రామిక, లాజిస్టిక్ కారిడార్ల సమీపంలో ఐదు విశ్వవిద్యాలయాల టౌన్‌షిప్పులు నెలకొల్పాలని నిర్ణయం.
    డి) వ్యవసాయదారుల ఆదాయాన్ని పెంచే కార్యక్రమాల్లో భాగంగా 500 రిజర్వాయర్లు అమృత్ సరోవర్ల అభివృద్ధి.
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
12. 2026–27 కేంద్రబడ్జెట్‌కు సంబంధించి సరికానిది?
    ఎ) బుద్దిస్ట్ సర్క్యూట్స్ అభివృద్ధిలో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపుర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల కోసం ప్రత్యేక పథకం.
    బి) 2047 నాటికి జీడీపీలో 50% వాటా కలిగి ఉండేలా సేవల రంగాన్ని వృద్ధి చేయడానికి ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ.
    సి) వచ్చే ఐదేళ్లలో కొత్తగా 100 జాతీయ జలమార్గాల నిర్మాణం.
    డి) సరకు రవాణా కోసం తూర్పున డాంకునీ నుంచి పడమర సూరత్ వరకు ప్రత్యేక రైల్వేమార్గం.
    1) ఎ, డి 2) బి, సి 3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి

నోట్: 1) 2047 నాటికి జీడీపీలో 10% వాటా కలిగి ఉండేలా సేవల రంగాన్ని వృద్ధి చేయడానికి ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ.
2) వచ్చే ఐదేళ్లలో కొత్తగా 20 జాతీయ జలమార్గాల నిర్మాణం.

13. ఫ్యూచర్స్‌పై సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) 0.02 శాతం నుంచి 2026–27 బడ్జెట్‌లో ఎంతకు పెంచారు?
    1) 0.10% 2) 0.05% 3) 2% 4) 1%
14. గ్లోబల్ సాఫ్ట్ పవర్ ఇండెక్స్ 2026లో ఇండియా స్థానం ఎంత? (48.0 స్కోరుతో)
    1) 64వ 2) 26వ 3) 32వ 4) 29వ


నోట్: 1వ స్థానం - యూఎస్ఏ (74.9)
2వ స్థానం - చైనా (73.5)
3వ స్థానం - జపాన్ (70.6)
4వ స్థానం - యునైటెడ్ కింగ్‌డమ్ (69.2)

* సాఫ్ట్ పవర్ అంటే సైనిక బలం లేదా ఆర్థిక ఒత్తిడి కాకుండా సంస్కృతి, దౌత్యం, విలువలు, ఆవిష్కరణల ద్వారా ఇతరులను ప్రభావితం చేసే ఒక దేశ సామర్థ్యం.

15. మణిపుర్ నూతన ముఖ్యమంత్రిగా ఎవరు నియమితులయ్యారు?
    1) హెచ్.లాల్జిర్లియానా 2) లాల్దూమ్కిమా 3) యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ 4) కె.సప్దన్గా

నోట్: 2017 నుంచి 2022 వరకు మణిపుర్ అసెంబ్లీ స్పీకర్.

16. 'భూశాస్త్రాల నోబెల్'గా పిలిచే క్రాఫోర్డ్ బహుమతి– 2026 భారత సంతతికి చెందిన ఏ శాస్త్రవేత్తకు వచ్చింది?



    1) వీరభద్రన్ రామనాథన్
    2) సావిత్రి కిరణ్
    3) రఘునాథన్ సుబ్రమణ్యం
    4) అరవింద్ సాత్విక్

నోట్: 1) క్రాఫోర్డ్ బహుమతిని 1980లో హోల్గర్, అన్నా - గ్రేటా క్రాఫోర్డ్ స్థాపించారు.
2) మొదటి బహుమతిని 1982లో ప్రదానం చేశారు.
3) రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ద్వారా నిర్వహిస్తున్న ఈ బహుమతి గణితం, ఖగోళ శాస్త్రం, భూవిజ్ఞాన శాస్త్రం, జీవశాస్త్రాలు లాంటి నోబెల్ బహుమతులకు అనుబంధంగా ఉన్న విభాగాల్లో అత్యుత్తమ విజయాలను గుర్తిస్తుంది.
4) 2025 విజేతలు క్రిస్టోఫర్ గుడ్‌నో (ఆస్ట్రేలియా), డేవిడ్ నెమాజీ (యూఎస్ఏ).

17. నిఫా వైరస్ కారణంగా ఇండియా నుంచి జంతువులు, జంతు ఉత్పత్తుల దిగుమతిని ఇటీవల ఏ దేశం నిషేధించింది?
    1) అఫ్గానిస్థాన్ 2) కిర్గిజిస్థాన్ 3) బెల్జియం 4) సింగపూర్
18. ప్రో రెజ్లింగ్ లీగ్–2026 ఎవరు గెలుచుకున్నారు?
    1) నాగాలాండ్ థండర్ 2) గోవా థండర్ 3) హరియాణా థండర్ 4) పంజాబ్ థండర్
19. వింగ్స్ ఇండియా 2026లో విమానయానం, పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడంలో ఉత్తమ రాష్ట్రంగా దేనికి జాతీయ అవార్డు లభించింది?
    1) ఉత్తరాఖండ్ 2) ఉత్తర్‌ప్రదేశ్ 3) హరియాణా 4) పంజాబ్
20. 2026 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఉత్తమ శకటాల విభాగంలో ఏ రాష్ట్రం మొదటి స్థానాన్ని దక్కించుకుంది?
    1) తెలంగాణ 2) ఆంధ్రప్రదేశ్ 3) మహారాష్ట్ర 4) కేరళ

నోట్: 1) 'గణేశోత్సవ్ ఆత్మ నిర్భరత' చిహ్నానికి మొదటి స్థానం.
2) జమ్ము-కశ్మీర్‌కు రెండో స్థానం.
3) కేరళ మూడో స్థానం.

21. బాసిల్లస్ సబ్టిలిస్‌ను తమ రాష్ట్ర సూక్ష్మజీవిగా అధికారికంగా ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది?
    1) గుజరాత్ 2) రాజస్థాన్ 3) ఉత్తరాఖండ్ 4) కేరళ

నోట్: రాజస్థాన్ ప్రభుత్వం అల్వార్ జిల్లాలో కొత్త బయోలాజికల్ పార్కును అభివృద్ధి చేస్తోంది.

22. కింది వాటిలో సరైంది?
    ఎ) కిర్గిజిస్థాన్, ఇండియా మధ్య 13వ ఎడిషన్ ఖంజర్ సైనిక విన్యాసాలు ఇటీవల అస్సాంలో జరిగాయి.
    బి) ఆసియా రైఫిల్, పిస్టల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్-2026 వేదిక న్యూదిల్లీ.
    సి) భారతదేశపు మొదటి ఎల్ఎన్‌జీ - డీజిల్ డ్యూయల్ - ఫ్యూయల్ డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) రైలు ఇటీవల అహ్మదాబాద్‌లో ప్రారంభమైంది.
    డి) ఫ్యూచర్ వార్‌ఫేర్ కోర్సు (సైన్యం, నౌకాదళం, వైమానిక దళానికి చెందిన అధికారులు, రక్షణ పరిశ్రమ నిపుణులు పాల్గొంటారు) మూడో ఎడిషన్ వేదిక దిల్లీ.
    1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి




రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-4, 2-1, 3-3, 4-4, 5-2, 6-4, 7-3, 8-3, 9-4, 10-4, 11-3, 12-2, 13-2, 14-3, 15-3, 16-1, 17-2, 18-3, 19-1, 20-3, 21-4, 22-3.

ఆమ్లాలు, క్షారాలు రసాయనశాస్త్రంలో అత్యంత ముఖ్యమైన పదార్థాలు. ఇవి ప్రయోగశాలలు, పరిశ్రమలు, వైద్య రంగం, దైనందిన జీవితంలో విస్తృతంగా వినియోగించే రసాయన పదార్థాలు. పదార్థాల ఆమ్ల, క్షార స్వభావాన్ని తెలుసుకోవడానికి సూచికలను ఉపయోగిస్తారు. నీలి లిట్మస్ సూచికను ఎరుపు రంగులోకి మార్చే పదార్థాలు ఆమ్ల స్వభావాన్ని, ఎరుపు లిట్మస్ సూచికను నీలి రంగులోకి మార్చే పదార్థాలు క్షార స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఈ రెండు సూచికలతో రంగు మార్పును సూచించని పదార్థాలు తటస్థ స్వభావాన్ని కలిగి ఉంటాయి.



ఆ ఆమ్ల ప్రభావంతోనే.. చీమ కుట్టినప్పుడు మంట!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ

లూయిస్ సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని 1923లో గిల్బర్ట్ లూయిస్ అనే అమెరికన్ శాస్త్రవేత్త ప్రతిపాదించారు. ఇది ఎలక్ట్రాన్ జంటల మార్పిడిపై ఆధారపడి ఉంటుంది. ఇది మిగతావాటి కంటే విస్తృతమైన సిద్ధాంతం, సమన్వయ బంధాలను వివరిస్తుంది.

▲ ఈ సిద్ధాంతం ప్రోటాన్లు లేని పదార్థాలను కూడా ఆమ్లాలు లేదా క్షారాలుగా వర్గీకరిస్తుంది.

లూయిస్ ఆమ్లం: ఈ సిద్ధాంతం ప్రకారం ఒక ఎలక్ట్రాన్ జంటను స్వీకరించగలిగే పదార్థాన్ని లూయిస్ ఆమ్లం అంటారు.

ఉదా: అసంపూర్ణ అష్టక విన్యాసం (Incomplete octet) ఉన్న అణువులు (ఉదా: BF_3, $AlCl_3$)

ధనావేశ అయాన్లు (కేటయాన్లు) (ఉదా: Ag^+, Cu^{2+}, Fe^{2+}, Fe^{3+})

లూయిస్ క్షారం: ఈ సిద్ధాంతం ప్రకారం ఒక ఎలక్ట్రాన్ జంటను దానం చేయగలిగే పదార్థాన్ని లూయిస్ క్షారం అంటారు.

ఉదా: ఒంటరి ఎలక్ట్రాన్ జంట ఉన్న అణువులు (ఉదా: NH_3, H_2O)

ఋణావేశ అయాన్లు (ఆనయాన్లు) (ఉదా: Cl^-, OH^-, CN^-)

✦ లూయిస్ ఆమ్లం, లూయిస్ క్షారం మధ్య చర్య జరిగి సమన్వయ సమయోజనీయ బంధం ఏర్పడుతుంది. ఇది ఒక సంకలితాన్ని (Adduct) ఏర్పరుస్తుంది.

ఆమ్లాలు - క్షారాలు

ఆమ్లాలు

ఆమ్లం అనే పదం లాటిన్ భాషలోని Acidus నుంచి వచ్చింది. దీనికి అర్థం పులుపు. నిమ్మకాయ, చింతపండు, వెనిగర్, పెరుగు లాంటి సహజ పదార్థాల్లో ఆమ్లాలు ఉంటాయి. చీమ కుట్టినప్పుడు ఫార్మిక్ ఆమ్లాన్ని విడుదల చేయడం వల్ల కుట్టిన చోట మంటగా, నొప్పిగా ఉంటుంది.

ఉదా: నిమ్మ, నారింజ (సిట్రిక్ ఆమ్లం), చింతపండు, ద్రాక్ష (టార్టారిక్ ఆమ్లం), పెరుగు, మజ్జిగ (లాక్టిక్ ఆమ్లం), పాలకూర, టమాటా (ఆక్జాలిక్ ఆమ్లం)

క్షారాలు

క్షారాలు రుచికి చేదుగా ఉంటాయి. వీటిని తాకినప్పుడు సబ్బు లాంటి జారుడు స్వభావాన్ని (Slippery) కలిగి ఉంటాయి.

ఉదా: కాస్టిక్ సోడా ద్రావణం (సోడియం హైడ్రాక్సైడ్)
సున్నపు నీరు (కాల్షియం హైడ్రాక్సైడ్)
మిల్క్ ఆఫ్ మెగ్నీషియా (మెగ్నీషియం హైడ్రాక్సైడ్)
వంట సోడా (సోడియం బైకార్బోనేట్)

ఆమ్లాలు, క్షారాల సిద్ధాంతాలు

ఆమ్లాలు, క్షారాలను వివరించడానికి రసాయన శాస్త్రంలో మూడు ముఖ్యమైన సిద్ధాంతాలు ఉన్నాయి. అవి:

అర్హీనియస్ సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని 1887లో స్వాంటే అర్హీనియస్ అనే స్వీడన్ శాస్త్రవేత్త ప్రతిపాదించారు.

✦ దీని ప్రకారం, పదార్థం నీటిలో కరిగినప్పుడు విడుదల చేసే అయాన్ల ఆధారంగా అది ఆమ్లమా లేదా క్షారమా అనేది నిర్ణయిస్తారు. నీటిలో కరిగినప్పుడు హైడ్రోజన్ అయాన్లు (H^+) లేదా ప్రోటాన్లను విడుదల చేసే పదార్థాలను ఆమ్లాలు అంటారు.

ఉదా: హైడ్రోక్లోరిక్ ఆమ్లం: HCl (జ.ద్రా.) $\longrightarrow$ H^+ (జ.ద్రా.) + Cl^- (జ.ద్రా.)

సల్ఫ్యూరిక్ ఆమ్లం: H_2SO_4 (జ.ద్రా.) $\longrightarrow$ $2H^+$ (జ.ద్రా.) + SO_4^{-2} (జ.ద్రా.)

నైట్రిక్ ఆమ్లం: HNO_3 (జ.ద్రా.) $\longrightarrow$ H^+ (జ.ద్రా.) + NO_3^- (జ.ద్రా.)

◗ వాస్తవానికి, H^+ అయాన్లు నీటి అణువులతో చర్య జరిపి హైడ్రోనియం అయాన్‌గా (H_3O^+) ఉంటాయి.

◗ ఈ సిద్ధాంతం ప్రకారం, నీటిలో కరిగినప్పుడు హైడ్రాక్సైడ్ అయాన్లు (OH^-) ఉత్పత్తి చేసే పదార్థాలను క్షారాలు అంటారు.

ఉదా: సోడియం హైడ్రాక్సైడ్: $NaOH$ (జ.ద్రా.) $\longrightarrow$ Na^+ (జ.ద్రా.) + OH^- (జ.ద్రా.)

పొటాషియం హైడ్రాక్సైడ్: KOH (జ.ద్రా.) $\longrightarrow$ K^+ (జ.ద్రా.) + OH^- (జ.ద్రా.)

మెగ్నీషియం హైడ్రాక్సైడ్: $Mg(OH)_2$ (జ.ద్రా) $\longrightarrow$ Mg^{+2} (జ.ద్రా.) + $2OH^-$ (జ.ద్రా.)

పరిమితులు: ఈ సిద్ధాంతం కేవలం జల ద్రావణాలకు మాత్రమే వర్తిస్తుంది. నీరు కాకుండా ఇతర ద్రావణాల్లో (ఉదా: ఆల్కహాల్, బెంజీన్) లేదా వాయుస్థితిలో జరిగే ఆమ్ల, క్షార చర్యలను ఇది వివరించలేదు.

▮ అమ్మోనియా (NH_3) లాంటి పదార్థాలు OH^- అయాన్లను విడుదల చేయకపోయినా అవి క్షారాలుగా పనిచేస్తాయి. కానీ ఈ సిద్ధాంతం వాటి క్షార స్వభావాన్ని సరిగ్గా వివరించలేదు.

ఆమ్లాలు, క్షారాల సిద్ధాంతాల మధ్య పోలిక

సిద్ధాంతం	ఆమ్లం	క్షారం
అర్హీనియస్	H^+ ఇచ్చేది	OH^- ఇచ్చేది
బ్రాన్‌స్టెడ్-లౌరీ	H^+ (ప్రోటాన్) దాత	H^+ (ప్రోటాన్) గ్రహీత
లూయిస్	ఎలక్ట్రాన్ జంట గ్రహీత	ఎలక్ట్రాన్ జంట దాత

బ్రాన్‌స్టెడ్ - లౌరీ సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని 1923లో జోహెన్నెస్ బ్రాన్‌స్టెడ్, లౌరీ ప్రతిపాదించారు. ఇది ప్రోటాన్ (H^+) మార్పిడిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి దీన్ని 'ప్రోటాన్ సిద్ధాంతం' అని కూడా అంటారు.

◆ ఈ సిద్ధాంతం ప్రకారం ఆమ్లం అంటే ప్రోటాన్ (H^+) దానం చేసే పదార్థం. క్షారం అంటే ప్రోటాన్ (H^+) స్వీకరించే పదార్థం.

ఉదా: $HCl + H_2O \longrightarrow H_3O^+ + Cl^-$
(హైడ్రోక్లోరిక్ ఆమ్లం) (నీరు)

(ఇక్కడ, HCl ప్రోటాన్‌ను ఇచ్చింది కాబట్టి ఆమ్లం, H_2O ప్రోటాన్‌ను తీసుకుంది కాబట్టి క్షారం.)

$NH_3 + H_2O \rightleftharpoons NH_4^+ + OH^-$
(అమ్మోనియా) (నీరు)

(ఇక్కడ, H_2O ప్రోటాన్‌ను ఇచ్చింది కాబట్టి ఆమ్లం, NH_3 ప్రోటాన్‌ను తీసుకుంది కాబట్టి క్షారం.)

సంయుగ్మ ఆమ్ల-క్షార జంటలు:

ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతి ఆమ్లానికి ఒక సంయుగ్మ క్షారం ఉంటుంది. ప్రతి క్షారానికి ఒక సంయుగ్మ ఆమ్లం ఉంటుంది.

▼ ఒక ఆమ్లం ప్రోటాన్ (H^+)ను దానం చేయడం ద్వారా సంయుగ్మ క్షారం ఏర్పడుతుంది.

ఉదా: HCl (ఆమ్లం) $\rightleftharpoons$ Cl^- (సంయుగ్మ క్షారం)

❖ ఒక క్షారం ప్రోటాన్ (H^+)ను స్వీకరించడం ద్వారా సంయుగ్మ ఆమ్లం ఏర్పడుతుంది.

ఉదా: NH_3 (క్షారం) $\rightleftharpoons$ NH_4^+ (సంయుగ్మ ఆమ్లం)

❖ HCl (ఆమ్లం) + H_2O (క్షారం) $\rightleftharpoons$ Cl^- (సంయుగ్మ క్షారం) + H_3O^+ (సంయుగ్మ ఆమ్లం)

ద్విస్వభావయుత పదార్థాలు:

కొన్ని పదార్థాలు ఆమ్లంగానూ, క్షారంగానూ ప్రవర్తిస్తాయి. అలాంటి వాటిని ద్విస్వభావయుత పదార్థాలు అంటారు.

పరిమితులు: ఈ సిద్ధాంతం జల ద్రావణాలకు మాత్రమే పరిమితం కాదు. ఇది అన్ని ద్రావణాలకు వర్తిస్తుంది. కానీ ఈ సిద్ధాంతం ప్రోటాన్లు లేని BF_3, $AlCl_3$ లాంటి పదార్థాలు పాల్గొనే ఆమ్ల, క్షార చర్యలను వివరించలేదు.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

Word of the Day

920

Overrated

Telugu meaning: అతిగా అంచనా వేసిన, ఎక్కువగా ఊహించిన

English meaning: The word overrated (ఓవర్‌రేటెడ్) is an adjective that describes something that is considered better or more important than it really deserves.

Synonyms: Overvalued, Exaggerated

Antonyms: Underrated, Underestimated

Usage: **1.** Many critics felt that the movie was overrated because the storyline was weak despite heavy promotion.

2. He realized that expensive coaching institutes are often overrated and that selfstudy can be equally effective.

నోటిఫికేషన్స్

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ అండ్ ఐఎఫ్ఎస్ నోటిఫికేషన్స్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ)/ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) ఎగ్జామినేషన్ 2026 నోటిఫికేషన్‌లను విడుదల చేసింది. వీటి ద్వారా వివిధ సివిల్, ఫారెస్టు సర్వీసులకు సంబంధించిన ఉద్యోగాలు భర్తీ చేయనుంది. మొత్తం పోస్టుల సంఖ్య 1013. దరఖాస్తు ఫీజు రూ.100. అర్హులైన అభ్యర్థులు 2026, ఫిబ్రవరి 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

తెలుగు వర్సిటీలో పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్

తెలంగాణ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో దూర విద్యాకేంద్రం ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ 31 మార్చి 2026.

ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉద్యోగాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గువాహటి ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 9. అర్హులైన అభ్యర్థులు 2026, ఫిబ్రవరి 25న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 13) చివరి తేదీ

☛ టీఎంసీ ముంబయిలో కన్సల్టెంట్ ఉద్యోగాలు. ఎండీ/ ఎంఎస్/ ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీఏఎంఎస్/ బీఈ/ బీటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఐఐటీ హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్ ఉద్యోగాలు. ఇంటర్, ఐటీఐ, బీఈ/ బీటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఐఐటీ జమ్మూలో జూనియర్ రిసెర్చ్ ఫెలో ఉద్యోగాలు. ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు యూజీసీ/సీఎస్ఐఆర్ గేట్/నెట్‌లో అర్హత సాధించినవారు అర్హులు.

☛ తెలంగాణ జిల్లా కోర్టుల్లో 859 ఉద్యోగాలు. 7వ తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ మహిళా దినోత్సవం

ఫిబ్రవరి 13
చరిత్రలో ఈనాడు

ప్రపంచవ్యాప్తంగా మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం కాకుండా మన దేశంలోనూ ప్రత్యేకంగా మహిళల కోసం ఒక రోజును కేటాయించారు. ప్రముఖ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలైన సరోజినీ నాయుడు మహిళా చైతన్యానికి, స్వతంత్ర వ్యక్తిత్వానికి ప్రతీక. 'నైటింగేల్ ఆఫ్ ఇండియా'గానూ ఆమె ప్రసిద్ధి. మహిళా సాధికారతకు సరోజినీ నాయుడు చేసిన కృషికి గుర్తుగా ఆమె జయంతి రోజైన ఫిబ్రవరి 13న 'జాతీయ మహిళా దినోత్సవం'గా (National Women's Day) నిర్వహిస్తారు. సాంస్కృతిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తించడంతోపాటు దేశ భవిష్యత్తును రూపొందించడంలో కీలకమైన వారి పాత్ర గురించి తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

చారిత్రక నేపథ్యం

స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడటంతోపాటు స్త్రీ సమానత్వం, హక్కులపై నినదించిన మహోన్నత వ్యక్తుల్లో సరోజినీ నాయుడు ఒకరు. మహిళలను చిన్నచూపు చూసేలా నాటి సమాజంలో పేరుకుపోయిన అంధవిశ్వాసాలను ఆమె ప్రశ్నించారు.

▮ దేశమంతా తిరిగి ప్రజల్లో చైతన్యం నింపారు. తన రచనలతో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. మహిళా సాధికారత, సామాజిక న్యాయం కోసం సరోజిని చేసిన కృషికి గుర్తుగా ఏటా ఆమె జయంతి రోజున మన దేశంలో 'జాతీయ మహిళా దినోత్సవం'గా జరపాలని 2014లో ప్రభుత్వం తీర్మానించింది. ఆ ఏడాది ఆమె 135వ పుట్టిన రోజు కూడా. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న దీన్ని నిర్వహిస్తున్నారు.

▮ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏటా మార్చి 8న జరుపుతారు.




సరోజినీ నాయుడు రాజకీయ ప్రస్థానం, ఇతర ముఖ్యాంశాలతోపాటు గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

ఖాయిలాపడ్డ పరిశ్రమలు

ఏదైనా పరిశ్రమ పేలవమైన ఆర్థిక స్థితిని ప్రదర్శిస్తూ, నష్టాల్లో ఉండటాన్ని ఇండస్ట్రియల్ సిక్‌నెస్‌తో సూచిస్తారు. సమర్థవంతంగా పనిచేయని లేదా నిర్వహణ ఖర్చులకు తగిన ఆదాయాన్ని సమకూర్చుకోలేని పరిశ్రమలు దీని కిందకు వస్తాయి. ఈ స్థితిలో కంపెనీలు స్థిరంగా మిగులును సంపాదించలేక మనుగడ కోసం ఫైనాన్సింగ్, ఇతర మార్గాలపై ఆధారపడాల్సి ఉంటుంది.



నిర్వచనాలు

కంపెనీ సవరణల చట్టం ప్రకారం రుణదాత (ఫైనాన్షియర్) అడిగిన తొమ్మిది నెలలలోపు రుణం చెల్లించలేని కంపెనీలను ఖాయిలాపడ్డ సంస్థలుగా చెప్పొచ్చు.

✦ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం, ఒక సంస్థ నిరంతరాయంగా మిగులును సృష్టించడంలో విఫలమై, మనుగడ కోసం బయటి నిధులపై ఆధారపడితే అది ఖాయిలాపడ్డ సంస్థ.

ఖాయిలాపడ్డ పరిశ్రమల విత్త సహాయానికి 1971లో ఇండస్ట్రియల్ రీకన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఐఆర్‌సీఐ)ను ఏర్పాటు చేశారు.

ఖాయిలాకు కారణాలు, ప్రభావాలు, బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్ (బీఐఎఫ్ఆర్) మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Pulicat Lake is situated in...

Current Affairs

1. Which of the following correctly highlights the key points of the Economic Survey 2025-26?
A) The Economic Survey 2025-26 notes a fragile global economy, while India remains the fastest-growing major economy with FY26 real GDP growth estimated at 7.4% and GVA growth at 7.3%
B) The Survey projects India's GDP growth below 5% due to weak domestic demand
C) It states that global trade integration has fully stabilised and risks have declined
D) The Survey was presented by NITI Aayog and focuses only on the agricultural sector

2. Which of the following statements is correct regarding the 16th Finance Commission of India?
A) The 16th Finance Commission was constituted in 2025 to give recommendations for the period 2030-35
B) It was chaired by NITI Aayog and its recommendations apply only to Union Territories
C) The Commission's recommendations were rejected by the Government due to fiscal constraints
D) The 16th Finance Commission, constituted in 2023 under the chairmanship of Dr. Arvind Panagariya, has had its key recommendations accepted for implementation during 2026-27 to 2030-31.

3. Which of the following statements is correct regarding the Solid Fuel Ducted Ramjet (SFDR) technology?
A) DRDO successfully demonstrated SFDR technology from the Integrated Test Range, Chandipur, enhancing India's long-range air-to-air missile capability
B) SFDR technology was tested for naval cruise missiles from Kochi
C) The technology relates only to short-range surface-to-surface missiles
D) The test was conducted jointly with a foreign country outside India

4. Which of the following statements is correct regarding the end of President's Rule in Manipur and Article 356?
A) President's Rule was revoked in Manipur without appointing a new Chief Minister
B) President's Rule in Manipur was revoked and Yumnam Khemchand Singh was sworn in as Chief Minister; Article 356 allows the President to impose President's Rule when constitutional machinery in a state fails
C) Article 356 can be invoked only during a National Emergency
D) President's Rule is imposed directly by the Supreme Court without the Governor's report

SSC Exams Special
General Awareness

Geography

5. Which of the following correctly describes Pulicat Lake in India?
A) Pulicat Lake is the largest freshwater lake in Andhra Pradesh
B) Pulicat Lake is the largest brackish water lagoon in India
C) Pulicat Lake is located entirely in Tamil Nadu and is a saltwater lake
D) Pulicat Lake in Andhra Pradesh is the second largest brackish water lagoon in India, after Chilika Lake

6. Which of the following correctly describes the Tropical Zone of the Earth?
A) The Tropical Zone lies roughly around the middle of the Earth, experiences high temperatures throughout the year, and does not have a marked winter season.
B) The Tropical Zone is found near the poles and experiences extremely low temperatures.
C) The Tropical Zone has severe winters and mild summers.
D) The Tropical Zone lies beyond the Arctic Circle and Antarctic Circle.

7. Which of the following correctly describes the habitat and population of lions and tigers in India?
A) Indian lions are found in Kaziranga, while tigers are mainly confined to Gir forest
B) The natural habitat of the Indian lion is the Gir Forest in Gujarat; India had about 674 lions and 3,682 tigers as per recent counts
C) Tigers are found only in Gujarat, while lions are spread across central India
D) The tiger population in India is lower than the lion population as per 2023 data

History

8. Which of the following statements correctly relates to revolutionary activities during India's freedom struggle?
A) Surya Sen, popularly known as Master Da, founded the Indian Republican Army and led the Chittagong Armoury Raid on 18 April 1930, while Ras Bihari Bose founded the Indian Independence League
B) Ras Bihari Bose led the Chittagong Armoury Raid and was known as Master Da
C) The Chittagong Armoury Raid was carried out in 1925 under the leadership of Bhagat Singh
D) Surya Sen founded the Indian Independence League after the Second World War

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

ఒప్పందానికి అంగీకరిస్తే మంచిది

• ఇరాన్‌పై ట్రంప్ వ్యాఖ్య



వాషింగ్టన్: ఇరాన్‌తో చర్చలు కొనసాగి ఒక ఒప్పందం కుదిరితే మంచిదని, అది సాధ్యం కాకపోతే తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం సాధ్యమని భావిస్తున్నట్లు చెప్పారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో బుధవారం శ్వేతసౌధంలో సమావేశమైన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. సమావేశ వివరాలను ఆయన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఇజ్రాయెల్‌తో తమ సంబంధాలు అత్యంత బలంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌పై చర్చలు జరపాల్సిందిగా నెతన్యాహును కోరానని వివరించారు.

సల్మాన్ ఖాన్ బావమరిది ఆయుష్ శర్మకు బెదిరింపులు

• బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో ఈ-మెయిల్

ముంబయి: బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ బావమరిది, నటుడు ఆయుష్ శర్మకు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చినట్లు ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈ-మెయిల్ పంపిన వ్యక్తి తనను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడిగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు నమోదు కాకపోయినా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవలే నటుడు రణ్‌వీర్ సింగ్‌కు వాట్సప్ వాయిస్ నోట్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. ఆ ఘటన వెనుక కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుల ప్రమేయం ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అంతకుముందు జుహూలోని దర్శకుడు రోహిత్ శెట్టి నివాసంపై గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు జరిపిన ఘటన కలకలం రేపింది.

సీఎంఎఫ్ శిక్షణ కార్యదళ నాయకత్వ బాధ్యతలు భారత్ చేతికి

దిల్లీ: హిందూ మహాసముద్రంతో పాటు దాని అవతల కూడా సముద్ర జలాల్లో భద్రతను ఉమ్మడిగా పరిరక్షించడంపై చిత్తశుద్ధిని చాటుకుంటూ.. సంయుక్త నౌకాదళాల (సీఎంఎఫ్)కు చెందిన ఓ కీలక శిక్షణ కార్యదళ నాయకత్వ బాధ్యతలను భారత నౌకాదళం తాజాగా చేపట్టింది. సీఎంఎఫ్‌లో 47 సభ్యదేశాలు ఉన్నాయి. వాటి బలగాల శిక్షణ, రక్షణ సామర్థ్యం పెంపు బాధ్యతలను చూసుకునే 'ఉమ్మడి కార్యదళం (సీటీఎఫ్) 154' కమాండ్ స్థానాన్ని మన దేశం చేపట్టినట్లు రక్షణ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. బహ్రెయిన్ రాజధాని మనామాలోని సీఎంఎఫ్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగినట్లు తెలిపింది.

చైనా నుంచి రెండో భూ పరిశీలన ఉపగ్రహాన్ని ప్రయోగించిన పాక్

ఇస్లామాబాద్: దేశీయంగా తయారుచేసిన రెండో భూ పరిశీలన ఉపగ్రహాన్ని (ఈవో-2) పాకిస్థాన్ విజయవంతంగా ప్రయోగించింది. చైనాలోని యాంగ్జియాంగ్ సీషోర్ లాంచ్ సెంటర్ నుంచి గురువారం దాన్ని నింగిలోకి పంపింది. భూ పరిశీలన, హై రిజల్యూషన్ చిత్రాల సేకరణ సామర్థ్యాలను గణనీయంగా మెరుగుపరుచుకునేందుకు పాక్ ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. నిరుడు చైనా నుంచే పాక్ తమ తొలి స్వదేశీ ఎలక్ట్రో-ఆప్టికల్ (ఈవో-1) ఉపగ్రహ ప్రయోగాన్ని చేపట్టిన సంగతి గమనార్హం.

భూమి దిశగా దూసుకొస్తున్న స్విఫ్ట్ అబ్జర్వేటరీ

• సైన్స్ ఆపరేషన్లను నిలిపేసిన నాసా

ఇంటర్నెట్ డెస్క్: విశ్వంలో చోటుచేసుకునే గామా కిరణాల పేలుళ్లను (జీఆర్‌బీ) గుర్తించి, అధ్యయనం చేసేందుకు 2004లో నాసా ప్రయోగించిన 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి దిశగా దూసుకొస్తోంది. వాతావరణ రాపిడివల్ల ఇది 585 కి.మీ. ఎత్తు నుంచి 400 కి.మీ. కిందకు దిగింది. దీంతో అట్లాస్ యన్ డ్రాగన్ (స్పేస్‌క్రాఫ్ట్ శక్తిని కల్పించేలా) చేస్తున్న (ప్రయోగాన్ని) తగ్గించేందుకు నాసా తాత్కాలికంగా సైన్స్ ఆపరేషన్లను నిలిపేసింది. మళ్లీ దానిని యథాస్థితికి చేర్చేందుకు రీబూస్ట్ మిషన్‌ను చేపట్టింది. సోలార్ యాక్టివిటీవల్ల భూ ఎగువ వాతావరణం వేడెక్కి ఈ అబ్జర్వేటరీ.. కక్ష్య నుంచి కిందకి రావడం ప్రారంభమైంది. దీనిని అలాగే వదిలేస్తే.. 2026 చివరి నాటికి భూవాతావరణంలోకి ప్రవేశించి కాలిపోతుంది. దానివల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు.

18 నుంచి భారత్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు లులా పర్యటన

దిల్లీ: బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా ఈ నెల 18 నుంచి ఐదు రోజుల పాటు మన దేశంలో పర్యటించనున్నారు. 19, 20 తేదీల్లో కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావ సదస్సులో ఆయన పాల్గొంటారు. 21న ప్రధాని మోదీతో సమావేశమై.. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చిస్తారు.

ఐటీ రాబడి పెరగడమంటే భారం మోపినట్లు కాదు: నిర్మల




దిల్లీ: వ్యక్తిగత ఆదాయపు పన్ను (ఐటీ) రాబడి పెరగడాన్ని మధ్యతరగతిపై భారం మోపుతున్నట్లు భావించరాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. 'దేశంలో మధ్యతరగతి వర్గం విస్తరిస్తోంది. వారిపై భారం మోపుతున్నామనడానికి ఆధారాల్లేవు. కార్పొరేట్ల కంటే వ్యక్తుల నుంచి ఎక్కువ ఐటీ వస్తున్నంతమాత్రాన ప్రజలపై అధిక భారం పడుతున్నట్లు కాదు. మధ్యతరగతి విస్తరిస్తోంది. పన్నులు చెల్లించడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. గత 11 ఏళ్లలో ఐటీ చెల్లింపుదారులు 5.26 కోట్ల నుంచి 12.13 కోట్లకు పెరిగారు. రూ.12 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్నవారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక అణచివేత ఎక్కడుంది?" అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. సంక్షేమ పథకాల కోసం రాష్ట్రాలకు ఇచ్చే నిధులను నిలిపివేయట్లేదని, ఏ రాష్ట్రంపైనా ఎలాంటి పక్షపాతం లేదని స్పష్టంచేశారు. నిధుల కేటాయింపుల్లేకుండానే వివిధ పథకాలను ప్రకటిస్తున్నామనే విమర్శల్ని తోసిపుచ్చారు. రుణభారంపై కాంగ్రెస్‌ది మొసలి కన్నీరేనని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు కేంద్రం కోత పెడుతోందన్న విమర్శల్ని మంత్రి తోసిపుచ్చారు. కేంద్ర నిధులంటే ఇష్టానుసారం వాడుకునే వీలున్న ఉచిత డబ్బు నిల్వలేమీ కాదని, అవసరం మేరకు వాటిని ఆచితూచి వినియోగించాలని చెప్పారు. దేశంలో ప్రస్తుతం ద్రవ్యోల్బణం చరిత్రాత్మక స్వల్పస్థాయిలో ఉందని, యూపీఏలో మాత్రం 'ఉద్యోగాల్లేని వృద్ధి' ఉండేదని చెప్పారు.

మేం ఎవరినీ దూషించలేదు: ప్రియాంక



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను ఆయన ఛాంబర్‌లోనే కాంగ్రెస్ ఎంపీలు దూషించారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ ఖండించారు. తాను ఎవరినీ రెచ్చగొట్టలేదని, దూషించలేదని గురువారం విలేకరులకు స్పష్టం చేశారు.

అది ట్రేడ్ బిల్లు కాదు ట్రాప్ బిల్లు



అమెరికాతో కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద (ట్రేడ్) బిల్లును బోనులో బంధించే (ట్రాప్) బిల్లుగా విపక్షం అభివర్ణించింది. దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్నారని విమర్శించింది. పార్లమెంటు మకరద్వారం వద్ద ఈ మేరకు నిరసన తెలిపింది. దీనిలో రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, వివిధ పార్టీలకు చెందిన టి.ఆర్.బాలు, ధర్మేంద్ర యాదవ్, జయాబచ్చన్ తదితరులు పాల్గొన్నారు. 'కార్మిక సంఘాల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం తదితరాల స్థానంలో రూపొందించిన 'పారిశ్రామిక సంబంధాల కోడ్ (సవరణ) బిల్లు'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో విపక్ష సభ్యులు మాట్లాడుతూ.. కార్మికుల కంటే పారిశ్రామికవేత్తలకే ప్రభుత్వం అనుకూలంగా ఉంటోందని విమర్శించారు. కార్మికులకు రక్షణ కొరవడుతోందన్నారు. ఇదొక చరిత్రాత్మక బిల్లు అని అధికారపక్షం పేర్కొంది.

కమిటీ నివేదికలకు గడువు పెంపు

'వికసిత భారత్ శిక్షా అధిష్ఠాన్' (వీబీఎస్ఏ) బిల్లుపై నివేదిక సమర్పణకు జేపీసీకి గడువును పెంచుతూ లోక్‌సభ తీర్మానించింది. వర్షాకాల సమావేశాల చివరి రోజు వరకు గడువు ఇవ్వాలని జేపీసీ ఛైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి ప్రతిపాదించిన తీర్మానానికి ఆమోదం లభించింది. జనవిశ్వాస్ సవరణ బిల్లుపై సెలెక్ట్ కమిటీ నివేదిక సమర్పణకు గడువును మార్చి 13 వరకు పెంచింది.

✦ కూడంకుళం అణువిద్యుత్తు కర్మాగారంలో మూడో యూనిట్ ఈ ఏడాది, నాలుగోది వచ్చే ఏడాది పూర్తవుతాయని, భద్రతపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కేంద్రం రాజ్యసభలో తెలిపింది. 2031-32 నాటికి అణు విద్యుత్తు సామర్థ్యం మూడింతలు (22,380 మె.వా.) అవుతుందని, 2047కి 100 గిగావాట్లకు చేరుతుందని వెల్లడించింది.

✦ మూడు కీలక పార్లమెంటరీ కమిటీలకు సభ్యుల్ని నామినేట్ చేసే తీర్మానాలను రాజ్యసభ ఆమోదించింది. వీటి పదవీకాలం ఈ ఏడాది మే 1 నుంచి మొదలవుతుంది. ప్రజా పద్దుల సంఘంలో ఏడుగురు సభ్యుల్ని ఛైర్మన్ నామినేట్ చేస్తారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, ఎస్సీ-ఎస్టీల సంక్షేమ కమిటీలకు కూడా సభ్యుల్ని నియమించనున్నారు.

నిర్మలను అభినందించిన ప్రధాని

బడ్జెట్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రసంగం సమగ్రంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. ఆర్థిక వ్యవస్థ మారుతున్న తీరును ఆమె ఆవిష్కరించారని 'ఎక్స్'లో కితాబిచ్చారు.

విదేశీ విద్యపై మక్కువ రెండేళ్లలో 31% తగ్గుదల

ఇంటర్నెట్ డెస్క్: ఉన్నతవిద్య కోసం విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. గత రెండేళ్లలో ఈ సంఖ్యలో 31 శాతం తగ్గుదల కనిపించింది. కేంద్ర విద్యాశాఖ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. రాజ్యసభలో ఓ ప్రశ్నకు విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. 2023లో ఉన్నతవిద్య కోసం 9.08 లక్షలమంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళ్లారు. 2024లో ఈ సంఖ్య 7.7 లక్షలకు తగ్గింది. 2025లో ఇంకా తగ్గి 6.26 లక్షలకు చేరింది. "విదేశాల్లో చదువు అనేది వ్యక్తిగత ఆసక్తి. ఆర్థికస్తోమత, బ్యాంకు రుణాలు పొందడం, ఏదైనా ప్రత్యేక విభాగం అధ్యయనం చేయాలనే అభిరుచిపై ఇది ఆధారపడి ఉంటుంది. విజయవంతమైన ప్రవాస భారతీయులు మనకు ఓ ఆస్తి. వారి సామర్థ్యాన్ని వినియోగించుకునేలా ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి" అని మంత్రి వెల్లడించారు. అలాగే భారత్‌లో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020 కింద కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అంతర్జాతీయ స్థాయి విద్యను స్థానికంగా అందించాలని విదేశీ యూనివర్సిటీలు తమ క్యాంపస్‌లను ఏర్పాటుచేసుకోడానికి అనుమతులు ఇస్తున్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ఇప్పటివరకు 14 విదేశీ విద్యాసంస్థలు ఈ అనుమతులు అందుకున్నట్లు చెప్పారు.

తుర్కియే పార్లమెంటులో నేతల బాహాబాహీ



ఇంటర్నెట్ డెస్క్: తుర్కియే పార్లమెంటులో సభ్యులు గందరగోళం సృష్టించారు. కొత్త న్యాయశాఖ మంత్రి నియామకానికి వ్యతిరేకంగా నేతలు పరస్పరం దాడి చేసుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు బయటకు వచ్చాయి. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్ అయిన అకిన్ గుర్లెక్‌ను కొత్త న్యాయశాఖ మంత్రిగా నియమించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. గుర్లెక్ బుధవారం ప్రమాణ స్వీకారానికి సిద్ధమవగా.. దాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు పోడియం వద్దకు దూసుకొచ్చాయి. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ చెలరేగింది. నేతలు పరస్పరం తోసుకుంటూ.. దాడి చేసుకున్నారు. పార్లమెంటులో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో స్పీకర్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. కొంతసేపటి తర్వాత తిరిగి సమావేశం ప్రారంభమైంది. అధికార పార్టీ నేతలు గుర్లెక్ చుట్టూ రక్షణగా నిల్చుని ఆయనతో ప్రమాణం చేయించారు.

అత్యధిక ఆర్టీఐ దరఖాస్తులు తిరస్కరించిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద 2024-25లో వచ్చిన దరఖాస్తులను అత్యధికంగా తిరస్కరించిన ప్రభుత్వ సంస్థల్లో సుప్రీంకోర్టు, దిల్లీ హైకోర్టు, కేంద్ర హోంశాఖ, కేంద్ర ఆర్థిక శాఖలు ఉన్నాయి. కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) ఈ మేరకు వార్షిక నివేదికను గురువారం విడుదల చేసింది. జాతీయ భద్రత, ఇతర రక్షణ ప్రయోజనాలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వకుండా మినహాయింపులను ఇచ్చేలా ఆర్టీఐలో ఉన్న సెక్షన్ 8(1)ను ఆ సంస్థలు వినియోగించినట్లు వెల్లడించింది. దీని ప్రకారం.. ఏడాదిలో వచ్చిన దరఖాస్తులన్నింటికి మొత్తం 28,924 సార్లు ఈ సెక్షన్‌ను వినియోగించినట్లు తెలిపింది. తిరస్కరించేందుకు చూపిన కారణాన్నింటిలో ఇది దాదాపు 49.8 శాతం. దిల్లీ హైకోర్టు అందుకున్న 2,089 ఆర్టీఐ దరఖాస్తుల్లో 22.8 శాతం తిరస్కరణకు గురయ్యాయి. మొదటి 20 మంత్రిత్వ శాఖలు, విభాగాలు, స్వతంత్ర ప్రభుత్వ సంస్థల్లో ఇదే అత్యధిక తిరస్కరణ రేటు. సుప్రీంకోర్టు 5,017 దరఖాస్తుల్లో 689(13.7శాతం), కేంద్ర హోంశాఖ 58,130 అభ్యర్థనల్లో 7,750(13.3శాతం) దరఖాస్తులను తిరస్కరించింది. అత్యధిక దరఖాస్తులను స్వీకరించిన అధికార సంస్థల్లో కేంద్ర ఆర్థిక శాఖ ఒకటి. మొత్తం 2,20,283 దరఖాస్తుల్లో 18,734(8.50)లను నిరాకరించింది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం 7.98 శాతం, కేంద్ర న్యాయశాఖ విభాగం 7.4 శాతం దరఖాస్తులను తిరస్కరించాయి. దీనికి విరుద్ధంగా కొన్ని సంస్థలు అత్యల్ప తిరస్కరణ రేటును నివేదించాయి. అత్యధికంగా 2,25,657 దరఖాస్తులను అందుకున్న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో 351(0.14) తిరస్కరణ రేటు నమోదైంది. కేంద్ర విద్యాశాఖ 1,34,025లో 0.74 శాతం, కేంద్ర రవాణా శాఖ 35,481లో 0.70 శాతం అభ్యర్థనలను నిరాకరించాయి.

జైరాం రమేశ్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

దిల్లీ: దేశంలోని పలు ప్రాజెక్టులకు పాత తేదీతో పర్యావరణ అనుమతులను సవాల్‌చేస్తూ దాఖలైన కాంగ్రెస్ పార్టీ నేత జైరాం రమేశ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇప్పటికే త్రిసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పును రిట్ పిటిషన్ ద్వారా పునఃసమీక్షించాలని ఎలా కోరుతారంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్‌కు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. దీంతో జైరాం రమేశ్ తరఫు న్యాయవాది పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నామని తెలుపగా ధర్మాసనం సమ్మతించింది. రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉందని చెబుతూ అప్పటి సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం పూర్వాన్వయంతో ప్రాజెక్టులకు అనుమతివ్వాలంటూ 2:1 మెజారిటీతో గత ఏడాది నవంబరులో తీర్పు వెలువరించింది. అంతకుముందు ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన తీర్పును వెనక్కి తీసుకుంది.

రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన జర్నలిస్టు సంఘాలు

దిల్లీ: మీడియా ప్రతినిధులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను రెండు జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. జర్నలిస్టుల పట్ల రాజకీయ నాయకులు గౌరవప్రదమైన భాష వాడాలని హితవు పలికాయి. 'మీరు భాజపా నియమించిన జర్నలిస్టులు కాదు. కనీసం.. కొంతైనా వాస్తవాలను రాయడానికి ప్రయత్నించండి. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయం. ఇది మరీ అతిగా ఉందని మీకు అనిపించడం లేదా. మీరు బాధ్యతాయుతమైన వ్యక్తులు. మీడియా ప్రతినిధులు. వాస్తవిక కోణంలో ఆలోచించాల్సిన బాధ్యత మీపై ఉంది. వారు ఏది ఇస్తే అది తీసుకోవడానికి కాదు మీరుంది. మీరు ఈ దేశానికి అన్యాయం చేస్తున్నారు' అని పార్లమెంటు ఆవరణలో రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాహుల్ వాఖ్యలను నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్‌యూజే), దిల్లీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (డీజేఏ) ఖండించాయి. పార్లమెంటులాంటి చోట్ల బహిరంగ ప్రదేశాల్లో నేతలు గౌరవప్రదమైన భాషను వాడాలని సూచించాయి. జర్నలిజం ప్రాథమిక విధి.. అధికారాన్ని ప్రశ్నించడం.. ప్రజలకు కచ్చితమైన సమాచారాన్ని అందించడమేనని స్పష్టం చేశాయి.

పాక్షికంగా తెరిస్తే టోల్ రుసుం తగ్గింపు

• జాతీయ రహదారులపై కేంద్రం నిర్ణయం

దిల్లీ: పాక్షికంగా తెరిచిన జాతీయ రహదారులపై (ఎక్స్‌ప్రెస్ వే) టోల్ రుసుమును తగ్గించే చర్యలను కేంద్రం చేపట్టింది. ఇందులో భాగంగా జాతీయ రహదారుల ఫీజు నిబంధనలను సవరించింది. కొత్త నిబంధనలు ఈ నెల 15వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. ✦ కొత్త నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారులను ఎంత దూరం తెరిస్తే అంతవరకే టోల్ రుసుమును వసూలు చేస్తారు.

బ్రిటన్ రాయల్ ఎయిర్‌ఫోర్స్ పైలట్లకు శిక్షణ ఇవ్వనున్న ఐఏఎఫ్

దిల్లీ: బ్రిటన్‌కు చెందిన రాయల్ ఎయిర్‌ఫోర్స్ (ఆర్ఏఎఫ్) పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు భారత వాయుసేన (ఐఏఎఫ్) తొలిసారి సిద్ధమైంది. దిల్లీ వేదికగా గురువారం జరిగిన 19వ బ్రిటన్-భారత్ వైమానిక సిబ్బంది చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. ఇందులో భాగంగా బ్రిటన్‌లోని ఆర్ఏఎఫ్ వ్యాలీలో ముగ్గురు క్వాలిఫైడ్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్లను ఐఏఎఫ్ ప్రాథమికంగా రెండేళ్ల పాటు విధుల్లో ఉంచనుంది.

మిన్నెసోటాలో త్వరలోనే ఆపరేషన్ మెట్రో సర్జ్ ముగింపు

మినియాపొలిస్: అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రంలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపేందుకు నిరుడు డిసెంబరు 1న ప్రారంభించిన ఆపరేషన్ మెట్రో సర్జ్‌ను త్వరలోనే ముగించనున్నట్లు అధికారులు గురువారం ప్రకటించారు. ఈ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. ఘర్షణల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు కూడా. ఆపరేషన్ మెట్రో సర్జ్‌తో 4 వేలమందికి పైగా అరెస్టయ్యారని అధికారులు తెలిపారు. ఇంకొన్ని రోజుల్లోనే ఈ ఆపరేషన్‌ను ముగిస్తామని చెప్పారు.



కేరళ స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం దిల్లీలోని తన నివాసంలో తేనీరు సేవిస్తున్న ప్రధాని మోదీ

సైకిళ్లు, గుర్రాలపై వెళ్లే పరిస్థితి వస్తుంది

• రహదారుల ఆక్రమణపై బాంబే హైకోర్టు ఆవేదన

ఇంటర్నెట్ డెస్క్: ముంబయిలో రహదారుల ఆక్రమణలు చాలా దారుణంగా ఉన్నాయంటూ బాంబే హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నగరవాసులు సైకిళ్లు, గుర్రాలపై వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందేమోనని తెలిపింది. ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఓ పాఠశాల దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేసింది. "బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఈ నగరాన్ని ఆక్రమణదారులకు అప్పగిస్తోంది. ఈ కట్టడాలను తొలగించే ఉద్దేశం, ధైర్యం బీఎంసీకి లేనట్లు కనిపిస్తోంది. చర్యలు తీసుకోలేనంత బలహీనంగా అధికార యంత్రాంగం ఉందా?" అని హైకోర్టు ప్రశ్నించింది. పవయి ప్రాంతంలో అక్రమార్కులకు నీళ్లు, టాయిలెట్ సౌకర్యాలు కల్పించడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇటువంటి పనులతో ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నట్లు కనిపించడం లేదా? అని బీఎంసీని నిలదీసింది. రహదారులపై అనధికార నిర్మాణాలు ఎలా పుట్టుకొస్తాయని ప్రశ్నిస్తూ.. సంబంధిత డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌ను శుక్రవారం తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది.

దేశానికి తిరిగి వచ్చే వరకూ మాల్యా పిటిషన్‌పై విచారణ జరపం: బాంబే హైకోర్టు

ముంబయి: పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్‌మాల్యా భారత్‌కు తిరిగివచ్చే వరకూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టబోమని బాంబే హైకోర్టు పునరుద్ఘాటించింది. పరారైన ఆర్థిక నేరగాళ్ల చట్టంలోని నిబంధనలను సవాల్ చేస్తూ మాల్యా ఈ పిటిషన్ వేశారు. స్వదేశానికి తిరిగి వస్తున్నారో లేదో విజయ్‌మాల్యా తొలుత స్పష్టం చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీచంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ ఆదేశించారు. తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది.

హిమంతపై అప్రతిష్ఠాకర వ్యాఖ్యలు చేయొద్దు

• కాంగ్రెస్ నేతలకు గువాహటి కోర్టు ఆదేశం

గువాహటి: అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎటువంటి ప్రకటనలు చేయరాదని కాంగ్రెస్ నేతలు గౌరవ్ గొగొయ్, భూపేశ్ బఘేల్, జితేంద్ర సింగ్‌లను గువాహటి కోర్టు ఆదేశించింది. భారీగా భూములు సొంతం చేసుకున్నారంటూ ఆరోపించిన కాంగ్రెస్ నేతలపై రూ.500 కోట్లకు పరువునష్టం కేసును హిమంత బిశ్వ శర్మ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా సీనియర్ డివిజన్ నం.1 సివిల్ జడ్జి నయన్‌జ్యోతి శర్మ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతివాదులైన కాంగ్రెస్ నేతలు మార్చి 9న కోర్టుకు హాజరయ్యే వరకూ ముఖ్యమంత్రికి ప్రతికూలమైన ప్రకటనలు చేయరాదని, వాటిని వ్యాప్తి చేయరాదని జడ్జి స్పష్టం చేశారు.

మతం మార్చుకున్నా కులం మారదు

• ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్: ఓ వ్యక్తి తన మత విశ్వాసాలను మార్చుకున్నప్పటికీ అతని/ఆమె పుట్టుకతో వచ్చిన కులం మారిపోదని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. వివాహమైనప్పటికీ ఆ వ్యక్తి కులం మారదని స్పష్టం చేసింది. మహిళపై వేధింపులకు, కుల దూషణకు పాల్పడ్డారనే కేసులో ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద తమకు స్పెషల్ జడ్జి సమన్లు జారీ చేయడాన్ని దినేశ్, మరో 8 మంది అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేశారు. ఎస్సీ/ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఆ మహిళ...జాట్ సామాజిక వర్గీయుడిని వివాహమాడినందున ఆమెకు ఆ చట్టం వర్తించదన్న నిందితుల వాదనను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్ కుమార్ తోసిపుచ్చారు. వివాహమైనా, మతం మారినా వ్యక్తి జన్మతః వచ్చే కులం మారదని పేర్కొన్నారు.

వాంగ్‌చుక్ అరెస్టుతో హింస ఆగిపోయింది

• సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

దిల్లీ: గత ఏడాది సెప్టెంబరు 24న లేహ్‌లో హింసాత్మక ఘటనలకు ప్రజలను రెచ్చగొట్టడంలో ప్రధాన పాత్రవహించింది పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌యేనని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. ఆయన అరెస్టు తర్వాతే ఆందోళనలు, దాడులు ఆగిపోయాయని సుప్రీంకోర్టుకు గురువారం తెలిపింది. వాంగ్‌చుక్ ప్రస్తుతం రాజస్థాన్‌లోని జోద్‌పుర్ జైలులో ఉన్నారని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి.వరాలే ధర్మాసనానికి అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ వివరించారు. వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై కొనసాగుతున్న విచారణ ఈ నెల 16వ తేదీకి వాయిదాపడింది.

మాజీ సైనికుడికి దివ్యాంగ పింఛను హక్కే

• సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: దేశం కోసం త్యాగాలు చేసిన మాజీ సైనికులకు దివ్యాంగ పింఛను పొందడం హక్కేనని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశంలో ప్రభుత్వం ఎంపిక చేసిన కొందరికే లేదా అసమానంగా దివ్యాంగ పింఛను మంజూరుచేయడం తగదని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. మాజీ సైనికుడికి దివ్యాంగ పింఛను చెల్లించాలంటూ సాయుధ దళాల ట్రైబ్యునల్ ఉత్తర్వు ఇవ్వగా కేంద్రం సవాల్ చేసింది. కేంద్రం అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

భారత్‌లో 13% మధుమేహుల్లో హృద్రోగ సమస్యలు

దిల్లీ: శారీరక శ్రమ లేకపోవడం వల్ల భారత్‌లోని మధుమేహుల్లో 13 శాతం కన్నా ఎక్కువ మంది గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నట్లు ఓ అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా మధుమేహ బాధితుల్లో నమోదయ్యే ప్రతి పది రక్తనాళ సమస్యల్లో ఒకటి శారీరక శ్రమ లేకపోవడం వల్లేనని జర్నల్ ఆఫ్ స్పోర్ట్ అండ్ హెల్త్ సైన్స్ నివేదిక పేర్కొంది. దక్షిణాసియాతోపాటు ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో 23లక్షల మందికిపైగా మధుమేహుల సమాచారాన్ని పరిశోధకులు ఇందులో విశ్లేషించారు. శారీరక శ్రమ లేకపోవడం వల్ల వీరిలో పది శాతం కన్నా ఎక్కువ మంది స్ట్రోక్, 9.7 శాతం మంది డయాబెటిస్ రెటినోపతి, 7.3శాతం మందిలో గుండె వైఫల్యాలు, ఐదు నుంచి ఏడు శాతం మందిలో హృదయ సంబంధ జబ్బులు సంభవిస్తున్నట్లు గుర్తించారు.

అమర్‌నాథ్ యాత్రికులకు ప్రమాద బీమా పెంపు

జమ్మూ: అమర్‌నాథ్ యాత్రకు సంబంధించి ఆలయ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్టర్ చేసుకున్న యాత్రికులతోపాటు పూజారులు, అధికారులు తదితరులకు ప్రమాద బీమా కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఈ ఏడాది యాత్రకు సంబంధించి ప్రథమ పూజను జూన్ 29 జ్యేష్ఠ పౌర్ణమి రోజున నిర్వహించనున్నట్లు శ్రీఅమర్‌నాథ్ ఆలయ బోర్డు (ఎస్ఏఎస్‌బీ) ప్రకటించింది. యాత్ర అధికారిక ప్రారంభ తేదీని త్వరలో ఖరారు చేయనున్నట్లు తెలిపింది.

నిఫా వైరస్ నుంచి కోలుకున్నాక ఆగిన గుండె

కోల్‌కతా: నిఫా వైరస్ నుంచి కోలుకున్నాక గుండె ఆగి మరణించారు ఓ నర్సు. పశ్చిమ బెంగాల్‌లోని బరాసత్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. నిఫా వైరస్ కారణంగా ఆమె సుదీర్ఘకాలంగా కోమాలో ఉన్నారు. ఆమె ఇమ్యూనిటీ తీవ్రంగా దెబ్బతింది. ఆ తర్వాత ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకింది. దీంతో జనవరి నుంచి ఆమెను వెంటిలేటర్‌పై ఉంచారు. అయితే గురువారం మధ్యాహ్నం ఆమె కార్డియాక్ అరెస్టుతో మరణించారని వైద్యులు తెలిపారు.

తుపాకులు పట్టిన చేతుల్లో.. ఢోలక్‌లు, హార్మోనియంలు!

ఒకప్పుడు తుపాకులు పట్టుకున్న చేతులు ఇప్పుడు కుట్టుమిషన్లు నడుపుతున్నాయి. బాంబులు చుట్టిన వేళ్లు ఢోలక్‌లు, హార్మోనియంలపై విన్యాసాలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా భానుప్రతాప్‌పుర్ బ్లాకులో గల



చౌగెల్ గ్రామంలో ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన 40 మంది మాజీ నక్సలైట్లకు పునరావాస పథకం కింద ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. స్వయం ఉపాధికి వీలుగా టైలరింగు, డ్రైవింగు, వడ్రంగి పని, ఎలక్ట్రీషియన్ వర్క్ లాంటి వాటిని నేర్పుతున్నారు. మరోవైపు విద్యాబోధన కూడా జరుగుతోంది. వినోదం కోసం సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. బీఎస్ఎఫ్ శిబిరంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ ముగిశాక ఆయా వృత్తుల్లో నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అండగా కూడా నిలువనుంది. భవిష్యత్తులో పుట్టగొడుగుల పెంపకం, వివిధ సృజనాత్మక, స్వయం ఉపాధి ఆధారిత కోర్సుల్లోనూ శిక్షణ అందిస్తామని నక్సల్స్ పునరావాస శిబిరం నోడల్ అధికారి వినోద్ అహిర్వార్ తెలిపారు.

నవజాత శిశువుకు చికెన్ పాక్స్.. కాపాడిన యువవైద్యుల బృందం

నవజాత శిశువుల్లో ప్రీనేటల్ చికెన్ పాక్స్ (తల్లి గర్భంలో ఉన్నపుడే సోకే ఇన్ఫెక్షను) అరుదుగా కనిపిస్తూ ఉంటుంది. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా గౌర్‌ఝామార్ పట్టణ సమీప గ్రామానికి చెందిన దంపతులు తమ బిడ్డకు సాధారణమైన ఆటలమ్మ సోకి ఉంటుందని భావించారు. అసలు విషయం తెలియక చాలా ఆసుపత్రుల చుట్టూ తిరిగి, పలు మందులు వాడినా ఫలితం లేకపోయింది. చివరకు బిడ్డ ఆరోగ్యం విషమించి శ్వాస తీసుకోవడమూ కష్టమైంది. ఈ దశలో.. సాగర్‌లో ఉన్న బుందేల్‌ఖండ్ వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకువచ్చారు. పసికందుకు చికిత్స చేసే బాధ్యతను డాక్టర్ అజిత్, డాక్టర్ మహేంద్రసింగ్ చౌహాన్‌లతో కూడిన యువవైద్యుల బృందానికి పీడియాట్రిక్స్ విభాగం అధిపతి డాక్టర్ ఆశిష్ జైన్ అప్పగించారు. వెంటిలేటరు సాయంతో చికిత్స ప్రారంభించిన వైద్యులు శిశువు ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడేలా చేశారు. చికిత్స సమయంలో వైద్య సిబ్బందికీ చికెన్ పాక్స్ సోకే ముప్పు ఉన్నా వెనకడుగు వేయలేదు. "బాబు చక్కగా శ్వాస తీసుకొంటూ, తల్లి పాలు తాగుతున్నాడు. డిశ్చార్జ్ కూడా చేశాం" అని డాక్టర్ అజిత్ తెలిపారు.



శిశువుకు చికిత్స చేసిన వైద్యులు

పోలీసు తుపాకీ లాక్కొని.. స్కూలులో టీనేజర్ కాల్పులు

హట్ యాయ్: దక్షిణ థాయ్‌లాండ్‌లో ఓ టీనేజరు (17) పోలీసు నుంచి తుపాకీ లాక్కొని, పబ్లిక్ స్కూలులో రెండు గంటల పాటు హంగామా సృష్టించాడు. అతడు జరిపిన కాల్పుల్లో స్కూలు డైరెక్టరు మృతిచెందగా.. ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. బుధవారం సాయంత్రం సాంగ్‌ఖ్లా ప్రావిన్సులో జరిగిన ఈ ఘటనలో దుండగుడిని అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో గాయపడిన దుండగుడిని ఎట్టకేలకు అరెస్టు చేశారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన అతడికి మానసికంగా ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మొదట నిందితుడు స్కూలు వద్దకు వచ్చి గొడవ చేస్తున్నాడని పోలీసులకు ఫోను వచ్చింది. విచారణకు వెళ్లిన పోలీసు అధికారిపై అతడు దాడికి పాల్పడి తుపాకీ లాక్కొని స్కూలు లోపలకు చొరబడ్డాడు.



పోలీసుల అదుపులో నిందితుడు



సభా సమయం

గవర్నర్ ప్రసంగంపై.. మండలిలో వైకాపా రచ్చ

- ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టిన చీఫ్ విప్ అనురాధ
- అంకెల గారడీ అంటూ వైకాపా విమర్శలు
- లెక్కలతో వివరించిన అధికార పార్టీ సభ్యులు
- మండలి శుక్రవారానికి వాయిదా

ఈనాడు, అమరావతి: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా వైకాపా రాజకీయ విమర్శలకు దిగడంతో గురువారం శాసనమండలిలో తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ చర్యలను స్పష్టంగా ప్రస్తావించాని అధికారపక్ష ఎమ్మెల్సీలు.. అంకెల గారడీలా ఉందని విపక్ష ఎమ్మెల్సీలు పేర్కొన్నారు. వైకాపా ఎమ్మెల్సీలు తప్పుడు గణాంకాలు చెబుతున్నారంటూ కూటమి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సభ నియంత్రణలోకి రాకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ మోసేనురాజు మధ్యాహ్నం 2.18 గంటలకు ప్రకటించారు.

హామీల అమలు దిశగా పాలన

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని మండలిలో గురువారం ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి ప్రవేశపెట్టారు. '20 లక్షల ఉద్యోగాల కల్పన రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ప్రపంచ దిగ్గజ కంపెనీలు రాష్ట్రానికి పెట్టుబడులతో వస్తున్నాయి. రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తాం. విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా పాలన సాగుతోంది. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా ఏటా రూ.33 వేల కోట్ల నగదు పేదలకు బదిలీ అవుతోంది. అన్ని హామీలు 19 నెలల్లోనే అమలు చేశాం. తల్లికి వందనం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు జమ చేస్తున్నాం. మెగా డీఎస్సీ నిర్వహించి, టీచర్ పోస్టులు భర్తీ చేశామ'ని వివరించారు.

బీసీల ఉన్నతికి పెద్దపీట

బీసీల ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని, నామినేటెడ్ పదవుల్లో ఆయా వర్గాలకు సముచిత ప్రాధాన్యమిచ్చిందని ఎమ్మెల్సీ అనురాధ పేర్కొన్నారు. 'గత ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించగా, దాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నాం. బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తున్నాం. జగన్ హయాంలో రద్దుచేసిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి, బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించాం. గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపులో 10 శాతం ఇస్తున్నాం. ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీ అమలు చేశాం. పీ-4 ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోంది' అని ఆమె వివరించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తిరోగమనంలో ఉన్న రాష్ట్ర పాలనను కూటమి ప్రభుత్వం పురోగమనంలోకి తీసుకొచ్చిందని తెదేపా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. 'గవర్నర్ ప్రసంగించే సమయంలో వైకాపా సభ్యులు వ్యవహరించిన తీరు అభ్యంతరకరం. ఉత్తరాంధ్రలో పారిశ్రామికాభివృద్ధి, కోస్తా జిల్లాలో పోర్టుల నిర్మాణం, రాయలసీమలో సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేసి ఉద్యాన పంటల కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యం' అని అన్నారు.

ఆర్థిక సంపదపై తప్పుడు లెక్కలు

గవర్నర్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీసేలా ఆయన ప్రసంగం సాగిందని వైకాపా ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. 'తల్లికి వందనం కింద ఏటా రూ.15 వేలు తల్లుల ఖాతాలో జమ చేస్తున్నట్లు గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించారు. దీనికి సంబంధించిన గణాంకాల్లో తప్పులున్నాయి. అన్నదాతా సుఖీభవ కింద ఒక్క రైతు ఖాతాలోనూ పూర్తిమొత్తం జమ చేయలేదు. రాష్ట్ర ఆర్థిక సంపద 2047 నాటికి రూ.308 లక్షల కోట్లకు చేరుస్తామని చెప్పడం అంకెల గారడీ మాత్రమే'నని విమర్శించారు.

కళాశాలల అనుబంధ గుర్తింపునకు ఏకీకృత విధానం

- వర్సిటీకో విధానానికి స్వస్తి
- గుర్తింపు పొందిన విద్యాసంస్థల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇవ్వడంలో రాష్ట్రంలో ఒక్కో విశ్వవిద్యాలయం ఒక్కో విధానం పాటిస్తున్నాయని, వీటి స్థానంలో ఏకీకృత విధానం తీసుకురానున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. డిగ్రీ కళాశాలలతోపాటు, జూనియర్ కళాశాలలు, పాఠశాలలకు సంబంధించిన గుర్తింపు వివరాలన్నీ డిజిటలైజ్ చేసి, జియో ట్యాగింగ్, ఫొటోలు, వీడియోలతోసహా ఆన్‌లైన్‌లో ఉంచేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాలలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్స్‌లర్ల మార్పుచేర్పులు చేశామని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోనూ మార్పులు చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ.. నన్నయ్య వర్సిటీ కుంభకోణాలకు అడ్డాగా మారిందని, సరైన వసతులు, అధ్యాపకులు లేకుండానే కళాశాలలకు గుర్తింపు ఇస్తున్నారని, వర్సిటీ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో మాజీ ఎమ్మెల్యే మామ, ఓ మాజీ మంత్రి అనుచరుడిని నియమించుకున్నారని, వీరంతా కలిసి బినామీ కంపెనీలకే టెండర్లు దక్కేలా నిబంధనలు ఇష్టానుసారం మారుస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై విచారణ చేయాలని కోరారు. ఈ వివరాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ బదులిచ్చారు.

సాస్కీ నిధులతో ట్రిపుల్ ఐటీల్లో శాశ్వత వసతులు: లోకేశ్

ట్రిపుల్ ఐటీల్లో చదివే విద్యార్థులు కోర్సంతా అదే క్యాంపస్‌లో పూర్తిచేసేలా చూడాలని పుట్టపర్తి ఎమ్మెల్యే



పల్లె సింధూరా రెడ్డి కోరారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేస్తే ఆరు జిల్లాల్లోని విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. తాత్కాలిక వసతి కోసం విద్యార్థులను ఓ క్యాంపస్ నుంచి మరో క్యాంపస్‌కు పంపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన సాస్కీ నిధులతో రాష్ట్రంలోని నాలుగు ఆర్జేయూకేటీ (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌లలో శాశ్వత వసతులు కల్పించనున్నామన్నారు. ఇందుకోసం నూజివీడు క్యాంపస్‌కు రూ.60 కోట్లు, ఆర్కే వ్యాలీకి రూ.40 కోట్లు, ఒంగోలుకు రెండు విడతల్లో రూ.600 కోట్లు, శ్రీకాకుళానికి రూ.300 కోట్లు అవసరమవుతాయని మంత్రి తెలిపారు.

గిరిజనులకు మేలు జరిగేలా చట్టం తెస్తాం: మంత్రి సంధ్యారాణి

గత ప్రభుత్వ వైఫల్యంతో జీవో 3 రద్దు చేశారని, దీనిని పునరుద్ధరించి గిరిజనులకు న్యాయం చేయాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు. దీనికి గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమాధానమిచ్చారు. 'గిరిజనులకు మేలు చేసేలా 2000వ సంవత్సరంలో చంద్రబాబు జీవో 3 తీసుకొచ్చారు. స్థానిక ఎస్టీలకు 100 శాతం రిజర్వేషన్ కల్పించారు. దానిప్రకారం బదిలీలు, నియామకాలు జరిగాయి. 2020లో సుప్రీంకోర్టు ఈ జీవోను రద్దు చేసినా గత ప్రభుత్వం కనీసం న్యాయవాదిని పెట్టి వాదించలేకపోయింది. దీంతో 40 లక్షల మంది గిరిజనులకు అన్యాయం జరిగింది. తాజాగా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు.. అన్ని ఐటీడీఏల పరిధిలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజల అభిప్రాయం తీసుకొని ఓ చట్టం తీసుకొచ్చే ఉద్దేశంతో ఉన్నాం' అని వివరించారు.

ఎత్తిపోతల టెండర్లు రద్దు చేసిన వైకాపా ప్రభుత్వం

వైకాపా ప్రభుత్వం లోచెర్ల, శివడవలస ఎత్తిపోతల పథకాల పనుల టెండర్లను రద్దు చేసి, అక్కడి రైతుల ఆకాంక్షలను తుంగలో తొక్కిందని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) పేర్కొన్నారు. ఆ రెండు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేసి, వైకాపాకు గుణపాఠం చెప్పాలని కోరారు. తోటపల్లి కాల్వ ఎర్త్ వర్క్, లైనింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బదులిస్తూ.. రెండు ఎత్తిపోతలకు అధికారులతో అంచనాలు తెప్పించుకొని, ఆర్థిక శాఖకు పంపుతామని తెలిపారు. తోటపల్లి కాల్వలో పూడిక తొలగింపునకు రూ.21 కోట్లు, సీసీ లైనింగ్‌కు రూ.99 కోట్లతో ప్రతిపాదనలను ఆమోదించి, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

కళ్యాణి, బాలాజీ డ్యామ్‌లతో తిరుమల, తిరుపతికి పూర్తిస్థాయిలో నీరు

తితిదేకు 20 ఎంఎల్‌డీ నీటిని అందజేసేందుకు రూ.40 కోట్లు మంజూరు చేశారని, ఇందులో మూడేళ్లలో రూ.5 కోట్ల పనులు జరిగాయని రూ.35 కోట్ల పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు కోరారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిస్తూ.. 'కళ్యాణి, బాలాజీ డ్యామ్‌ల నుంచి తిరుమల, తిరుపతిలకు పూర్తిస్థాయిలో నీరిచ్చేలా పనులు చేపడుతున్నాం. నీవా బ్రాంచి కాల్వ ద్వారా మూలపల్లి చెరువు నుంచి నాలుగు చెరువులు నింపుతూ, కళ్యాణి డ్యామ్‌కు నీరు తీసుకెళ్లేలా రూ.126 కోట్లు నిధులు మంజూరు చేశాం. ఈ పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. టెండర్లు పిలిచి, త్వరలో పనులు చేపట్టనున్నాం. గాలేరు- నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) రెండో దశలో అటవీ భూముల సమస్య ఉన్నందున ఎస్ఎస్‌సీ. కెనాల్‌లో 34వ కి.మీ. నుంచి ఆల్తూరుపాడు లిఫ్ట్, ఆల్తూరుపాడు రిజర్వాయర్, మర్లపాక ట్యాంక్, మల్లిమడుగు రిజర్వాయర్‌లను పూర్తిచేసి బాలాజీ రిజర్వాయర్‌కు నీరు తీసుకెళతాం' అని చెప్పారు.

హస్టళ్లలో మెస్‌ఛార్జీల పెంపుపై పరిశీలన: మంత్రి సవిత

బీసీ వసతిగృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మెనూ అందించేలా మెస్‌ఛార్జీల పెంపుపై పరిశీలన చేస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. 2014-19లో అప్పటి సీఎం చంద్రబాబు మెస్ ఛార్జీలను 66 శాతం పెంచారని, మళ్లీ ఇప్పుడు పెంచనున్నట్లు వెల్లడించారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు కోరినప్పుడు మంత్రి ఈ విధంగా స్పందించారు.

జగన్ బకాయి పెడితే.. చంద్రబాబు చెల్లించారు

వైకాపా ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు 11 నెలల డైట్ బిల్లులు పెండింగ్ పెట్టిందని, చంద్రబాబు సీఎం అయ్యాక తొలి సమీక్ష చేయగానే రూ.110 కోట్లు విడుదల చేశారని మంత్రి సవిత తెలిపారు. జగన్ ప్రభుత్వంలో ఆరు నెలలపాటు డైట్ ఛార్జీలను ఆపారా అని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అడగ్గా మంత్రి పై విధంగా స్పందించారు. రాష్ట్రంలో కొత్తగా 10 గురుకుల పాఠశాలలు మంజూరు చేయనున్నామన్నారు.

నిలిచిపోయిన గురుకుల పాఠశాల భవనాల పనులకు రూ.80 కోట్లు, పాత గురుకుల పాఠశాలల భవనాలకు రూ.800 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

ఎస్సీ హస్టళ్లకు రూ.360 కోట్లు వెచ్చించాం: మంత్రి డోలా

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నరలో సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతులు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాట్లు, తదితరాలకు కలిపి రూ.360 కోట్లు ఖర్చు చేసినట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు.

మద్యం కుంభకోణం వెనకున్నది జగనే

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం వెనుక ఉన్నది అప్పటి సీఎం జగన్‌రెడ్డేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కుంభకోణంపై సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలతో జగన్ నేర తీవ్రత తెలుస్తోందని ధ్వజమెత్తారు. ఇంతటి పాపానికి ఒడిగట్టిన జగన్ తలదించుకొని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలగాలని గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. "ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ నాయకులతో పాటు అధికారుల అండతోనే ఈ భారీ కుంభకోణం జరిగిందని. ...ఇందులో పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉందని పేర్కొంది. ఆ పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ జగన్‌రెడ్డే. ఇది రూ.3,500 కోట్ల కుంభకోణం మాత్రమే కాదు. వేల మంది ప్రాణాలు పోయాయి. ఆ కుటుంబాలు రోడ్డునపడ్డాయి. లక్షల మంది ఆరోగ్యం దెబ్బతింది" అని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దయ్యాక.. అందులోని అంశాలు ఎలా అమలవుతాయి?

- మండలిలో మంత్రి అనగాని ప్రశ్న

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేశామని, ఇక అందులోని నిబంధనలు ఎలా అమలవుతాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మండలిలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తొలుత వైకాపా ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ 'గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంలో ఎలాంటి మార్పులూ చేయకుండా, కేవలం పేరు మార్చి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. అందులోని కంటెంట్‌ను మార్చలేదు. కేవలం పైనున్న ఫొటోలు మాత్రమే తీసేశార'ని పేర్కొన్నారు. దీనిపై సత్యప్రసాద్ స్పందించారు. 'వైకాపా సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని తప్పు పట్టాలన్న ఉద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఎక్కడైనా తప్పు ఉంటే సంబంధిత అధికారిపై చర్య తీసుకుంటాం. అదే మీరు చెప్పిన గణాంకాల్లో తప్పులుంటే ఏం చేస్తారు?' అని ప్రశ్నించారు. వైకాపా తెచ్చిన చట్టాన్ని పూర్తిగా రద్దు చేశామని, భూ యజమానుల హక్కులు కాపాడే లక్ష్యంతో పని చేస్తున్నామని వివరించారు.

20 వేల కార్నియాల సేకరణతో ఎల్వీపీఈఐ రికార్డు

ఈనాడు, హైదరాబాద్: కార్నియాల సేకరణలో హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రికార్డు సృష్టించింది. దాదాపు 20 వేల మంది దాతల నుంచి సేకరించి దృష్టి సమస్య ఉన్న ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపింది. దృష్టి దాన్ కార్యక్రమంలో భాగంగా ఈ మహాక్రతువు పూర్తి చేసినట్లు ఎల్వీపీఈఐ గురువారం ప్రకటించింది. 'నేత్రదానానికి ముందుకు వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉంటోంది. ఈ కారణంగా తగిన కార్నియాలు లభించక చాలామంది దృష్టిలోపంతో ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా నేత్రదానం హామీపత్రం ఇచ్చిన వారు మరణించాక కార్నియా సేకరిస్తున్నాం. మృతుల కుటుంబసభ్యులు కోరితే హామీపత్రం లేకున్నా తీసుకుంటాం. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు నేత్రదాతగా నమోదు చేసుకోవాలి' అని కోరింది.

ఉపాధి పోయిందని.. ఉసురు తీసుకున్నాడు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉపాధి పోయిందని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సంగారెడ్డి జిల్లా మానూరు మండలం కమలాపూర్‌కు చెందిన సంగోబ సంతోష్ యాదవ్ అలియాస్ శివ (29) కొన్నాళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చాడు. శంషీగూడలోని ఇందిరాహిల్స్‌లో అద్దె ఇంట్లో ఉంటూ ప్రగతినగర్ రోడ్డులోని అంబీర్‌చెరువు కట్ట మీద పానీపూరి బండి నిర్వహిస్తున్నాడు. ఇటీవల హైడ్రా అధికారులు చెరువు పరిరక్షణలో భాగంగా ఆయా దుకాణాలను తొలగించి తటాకం చుట్టూరా కంచె నిర్మిస్తున్నారు. దీంతో తనకు ఉపాధి కరవైందని భావించిన సంతోష్ నాలుగు రోజులుగా తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో మిత్రుడు శివాజీరావు గురువారం పలుమార్లు సంతోష్‌కు ఫోన్ చేసినా తీయలేదు. అతడు సంతోష్ గదికి వెళ్లి చూడగా. . అప్పటికే ఉరి వేసుకుని విగతజీవిగా కన్పించాడు.

మాటల్లోనే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్!

- పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికీ ఎన్నో రకాల అనుమతులు
- ఆన్‌లైన్ విధానం ఉన్నా.. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే
- వివిధ శాఖల అనుమతులు పొందేందుకే 6 నెలల వ్యవధి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని చెబుతున్నా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు సులువుగా అందడం లేదు. ఇప్పటికీ కంపెనీ ఏర్పాటు చేయాలన్నా.. చిన్న మిల్లు ఏర్పాటు చేయాలన్నా సవాలక్ష నిబంధనలు, వివిధ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. ఇందుకే కనీసం 6 నెలల నుంచి ఏడాది వ్యవధి పడుతోంది. సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు అందిన తర్వాత 15 రోజుల్లో అనుమతులు ఇస్తే.. పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వంతో వివిధ సంస్థలు కుదుర్చుకున్న ఎంవోయూలు వేగంగా గ్రౌండింగ్ చేసేందుకు.. ప్రతి ప్రాజెక్టుకు ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేస్తోంది. కానీ, ఒక చిన్న రైస్ మిల్లు ఏర్పాటు చేసేందుకే వివిధ శాఖల నుంచి 37 రకాల అనుమతులు పొందాల్సి వస్తోంది. మారిన పరిస్థితులకు అనుగుణంగా అనవసర అనుమతులు తొలగించకపోవడమే ఇందుకు కారణం. దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసినా.. కార్యాలయానికి వెళ్లి 'కలిసిన తర్వాతే' అది ముందుకు కదిలే పరిస్థితి నెలకొంది.

పుణ్యకాలం గడిచిపోతోంది

రైస్ మిల్లు ఏర్పాటుకు నిర్మాణం పూర్తయినప్పటి నుంచి.. దాన్ని ప్రారంభించేందుకు కనీసం 5-6 నెలల సమయం పడుతోంది. రైస్ మిల్లు ఏర్పాటుకే ఇన్ని రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉండటం సమస్యగా మారిందని ఇటీవల జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఒక ఉన్నతాధికారి ప్రస్తావించారు.

◆ మిల్లు ఏర్పాటుకు పంచాయతీ /మున్సిపాలిటీ, ఆర్డీవో కార్యాలయం, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్, జీఎస్టీ, ఆదాయపన్ను శాఖ, బాయిలర్ డిపార్ట్‌మెంట్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ, వ్యవసాయ మార్కెటింగ్, ఫ్యాక్టరీస్, కార్మిక, ఎఫ్‌సీఐ, ఈఎస్ఐ, పీఎఫ్, విద్యుత్తు, ఎక్స్‌పోర్ట్, ఫుడ్ లైసెన్స్, ఉద్యోగ్ ఆధార్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వంటి వాటితో పాటు.. మరికొన్ని శాఖల నుంచి అనుమతులు పొందాలి. వాటన్నింటికీ వేరువేరుగా దరఖాస్తు చేయాలి.

◆ వివిధ శాఖలకు నిబంధనల మేరకు సుమారు రూ.60 వేల వరకు ఫీజుల కింద చెల్లించాలి. దరఖాస్తుతోపాటు అన్ని రకాల పత్రాలు సమర్పించినా.. అనుమతులు వాటంతట అవే సులువుగా వచ్చే పరిస్థితి లేదు. తనిఖీల పేరుతో అధికారుల వేధింపులు దాటి.. అనుమతులు రావడానికి 'మామూళ్ల' పర్వం పూర్తి చేయాలి. ఎలా లేదన్నా.. అన్ని శాఖలకు కలిపి రూ.5 లక్షల వరకు ముడుపుల కింద చెల్లించాల్సి వస్తోంది. ఇక ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ పాలసీ కింద ప్రోత్సాహకాలు పొందాలంటే.. అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా) అనుమతులు తప్పనిసరి. ఇలా అన్ని రకాల అనుమతులు పొందాలంటే అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినా.. కనీసం ఐదారు నెలలు పరిశ్రమల నిర్వాహకులు వేచి చూడాల్సి వస్తోంది.

'ఆ రెండు సారస్వత పరిషత్తులు ఒకటి కాదు'

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో వెలిసిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు హైదరాబాద్‌లో నిజాం కాలంలో ఏర్పడిన ఆనాటి ఆంధ్ర సారస్వత పరిషత్తు (నేటి తెలంగాణ సారస్వత పరిషత్తు)కు ఎటువంటి సంబంధం లేదని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, జుర్రు చెన్నయ్యలు గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో తెలుగు భాషా దీపం కొడిగట్టుతున్న కాలంలో 1943లో నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడింది. 1948లో హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్‌లో కలిసిన తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తుగా పేరు మార్చుకుంది. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ సారస్వత పరిషత్తుగా మారింది. గత 83 ఏళ్లుగా తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ కోసం నిరంతర కార్యక్రమాలు కొనసాగిస్తోంది. నాటి ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలంగాణ సారస్వత పరిషత్తుగా పేరు మారిన తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో వెలసిన ఆంధ్ర సారస్వత పరిషత్తు.. అలనాటి సారస్వత పరిషత్తుగా ప్రచారం చేసుకోవడం సరికాదు. అందరూ ఈ విషయం గమనించాలి' అని వారు స్పష్టం చేశారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

ఐటీ కంపెనీలకిచ్చే ప్రతి అంగుళం యువత భవిత కోసమే

-పంచుమర్తి అనురాధ, శాసనమండలి చీఫ్‌విప్

"ఐటీ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రతి అంగుళం భూమి యువత భవిత కోసం, ఆ రంగం ద్వారా నాలుగు లక్షల ఉద్యోగాల కల్పన కోసం. దీనిపైనా వైకాపా వాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. వారిలాగా మేం రుషికొండ మీద ప్యాలెస్‌లు కట్టలేదు. జగన్ ప్రభుత్వంలో అమరరాజా, జాకీ, లులు, జువారీ సిమెంట్స్ ఇలా ఎన్నో సంస్థల్ని తరలించారు. గంజాయిని పెంచి పోషించి యువతను దానికి బానిసలుగా మార్చారు"

తాడేపల్లి ఇంట్లో సెట్ వేసుకోండి

– సుందరపు విజయ్‌కుమార్, ఎలమంచిలి ఎమ్మెల్యే, జనసేన

"ప్రశ్నలు ప్రవేశపెడితే, ఆందోళనలు చేసేనా వైకాపాకు ప్రతిపక్ష హోదా రాదు. జగన్‌ను ప్రతిపక్ష నాయకుడిగా చూడాలని ఆ పార్టీ వారికి ఉంటే.. తాడేపల్లి ఇంట్లో అసెంబ్లీ సెట్ వేసుకోండి. బొత్స సత్యనారాయణను స్పీకర్‌గా పెట్టుకోండి. జీతాల కోసమే వైకాపా ఎమ్మెల్యేలు బుధవారం సభకు హాజరై 11 నిమిషాల్లో వెళ్లిపోయారు. పీపీపీ విధానంపై రాద్ధాంతం చేస్తున్న జగన్.. అసెంబ్లీకి వచ్చి దాని గురించి ఎందుకు మాట్లాడరు? వైకాపా ఎమ్మెల్యేల్ని గెలిపించిన ఆయా నియోజకవర్గాల ప్రజల సమస్యలు సభలో ప్రస్తావించాల్సిన బాధ్యత వారికి లేదా?"

జగన్‌కు ఇంకా ఆ లక్షణాలు పోలేదు

–లోకం మాధవి, నెల్లిమర్ల ఎమ్మెల్యే, జనసేన

"జగన్‌కు ఇంకా విపరీత లక్షణాలు పోలేదు. గవర్నర్ ప్రసంగం సమయంలో పేపర్లు చింపాల్సిందిగా వైకాపా సభ్యులకు సూచిస్తూ సభా సంప్రదాయాల్ని ఆయన దెబ్బతీశారు. జగన్ నిజంగా రాష్ట్ర ప్రగతిని కాంక్షిస్తే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి.

కూటమి ప్రభుత్వంలో 20 మంది సలహాదారుల నియామకం

వైకాపా సభ్యుల ప్రశ్నకు సభలో సమాధానం

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వంలో ఎంత మంది సలహాదారులు, కన్సల్టెంట్లను నియమించారంటూ వైకాపా సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు అడిగిన ప్రశ్న గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావనకు వచ్చింది. అయితే ఆ సమయంలో ప్రశ్న అడిగిన సభ్యులెవరూ సభకు రాకపోవడంతో ఆ ప్రశ్నకు సమాధానం ఇచ్చినట్లే (డీమ్డ్ టు బి ఆన్సర్) అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈ ప్రశ్నపై ప్రభుత్వం సభకు సమర్పించిన సమాధానంలో 20 మంది ప్రభుత్వ సలహాదారులు, 12 మంది కన్సల్టెంట్లను నియమించినట్లు వివరాలు ఉన్నాయి.

'తెలుగు భాషాభివృద్ధి'పై ప్రత్యేకంగా చర్చించాలి'

శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒక రోజంతా 'తెలుగు భాష అమలు, తెలుగు భాషాభివృద్ధి' అంశంపై సభ్యులతో ప్రత్యేక చర్చ నిర్వహించాలని మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.త్రివిక్రమరావు (విక్రమ్ పూల) గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రుడిని ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ చర్చలో సభ్యులు వెలిబుచ్చే విలువైన సూచనలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. సభలో ప్రతి సభ్యుడూ తెలుగులోనే మాట్లాడేలా ప్రోత్సహించాలని, శాసనసభ జారీ చేసే ఉత్తర్వులు, పాలనా వ్యవహారాలన్నీ మాతృభాషలో సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని ఆయన స్పీకర్‌కు సమర్పించారు.

కారు వరకు వచ్చి.. స్పీకర్ అయ్యన్నకు వీడ్కోలు పలికిన మంత్రి లోకేశ్

అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. సభ వాయిదా పడ్డాక ఇంటికి బయల్దేరేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన కార్యాలయం నుంచి బయటకొస్తుండగా.. లాబీలో వస్తున్న మంత్రి లోకేశ్ ఆయన్ను చూసి, ఆగి నమస్కారం పెట్టి మాట్లాడారు. అక్కడ నుంచి బయట పోర్టికో వరకు స్పీకర్‌తో పాటుగా వచ్చి, ఆయన కారు ఎక్కేంత వరకు ఉండి.. మంత్రి వీడ్కోలు పలికారు.

ప్యానెల్ స్పీకర్లుగా ఆరుగురు

ఈనాడు-అమరావతి: ఈ శాసనసభ సమావేశాల్లో ప్యానెల్ స్పీకర్లుగా ఆరుగురు వ్యవహరిస్తారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం ప్రకటించారు. మండలి బుద్ధప్రసాద్, వరదరాజులురెడ్డి, జ్యోతుల నెహ్రూ, కోళ్ల లలిత కుమారి, దాసరి సుధ, విష్ణుకుమార్‌రాజులు అవసరాన్ని బట్టి ప్యానెల్ స్పీకర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

సకాలంలో ప్రశ్నోత్తరాలు ముగియడం మంచి పరిణామం

శాసనసభలో ప్రశ్నోత్తరాలకు గంట సమయం కేటాయించగా, దాదాపు 45 నిమిషాలకే ముగిసింది. దీనిపై స్పీకర్ స్పందిస్తూ ..ఇది చాలా మంచి పరిణామన్నారు. సగటున ఒక ప్రశ్నకు 5 నిమిషాలు వెచ్చించారని, 8 ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారని తెలిపారు. గురువారం నుంచి ఒక్కో ప్రశ్నకు 6-7 నిమిషాలు వరకు వెళ్లొచ్చని పేర్కొన్నారు.

శాసనసభలో చర్చ

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం శాసనసభలో చర్చ సందర్భంగా కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడారు.

గోదావరి డెల్టాను ఆధునికీకరించాలి

–అరిమిల్లి రాధాకృష్ణ, తణుకు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు గోదావరి డెల్టా వెన్నెముకలాంటిది. సాగు, తాగునీరు, ఆక్వా రంగానికి నదే ఆధారం. డెల్టా ప్రాంతాన్ని ఆధునికీకరించి 30 ఏళ్లు దాటింది. మరోసారి ఆ పనులు చేపట్టాలి. డెల్టా పరిధిలోని గ్రామాల్లో కొత్త సాంకేతికతతో రోడ్లు వేయాలి. రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించాలి.

శరవేగంగా అమరావతి నిర్మాణం

–తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే, తాడికొండ

వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అరాచకంగా మార్చేశారు. మూడు రాజధానులని చెప్పి, ఒక్కటీ కట్టకుండా, ఉన్న అమరావతిని దెబ్బతీశారు. నేడు నిత్యం 25 వేల మంది కార్మికులతో రాజధాని నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. క్వాంటమ్ వ్యాలీ రాజధాని అభివృద్ధిలో గ్రోత్ ఇంజిన్ కానుంది.

హార్బర్లు, విమానాశ్రయాలకు ప్రాధాన్యం

–ఎన్.ఈశ్వరరావు, ఎచ్చెర్ల

వైకాపా ప్రభుత్వం నిలిపివేసిన ఫిషింగ్ హార్బర్లు, విమానాశ్రయాల నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం వేగంగా పూర్తిచేస్తోంది. రాష్ట్రంలో ఆరు హార్బర్ల నిర్మాణానికి కేంద్రం అనుమతించినా, నాటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. 2014-19 మధ్యకాలంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిందన్న కారణంగా కొత్త విమానాశ్రయాలపై నిర్లక్ష్యం చూపారు. నేడు కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిచేస్తోంది.

క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అందిపుచ్చుకోవాలి

–మహమ్మద్ నసీర్, గుంటూరు తూర్పు

గవర్నర్ ప్రసంగం రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వ సంకల్పానికి ప్రతిబింబంగా ఉంది. వైకాపా పాలనతో గతి తప్పిన వ్యవస్థలు ఎలా గాడిన పడ్డాయో కళ్లకుకట్టింది. క్వాంటమ్ కంప్యూటింగ్‌ను యువత అందిపుచ్చుకోవాలి.

20 నెలల్లోనే స్పష్టమైన మార్పు

–బూర్ల రామాంజనేయులు, ప్రత్తిపాడు

రాష్ట్రాన్ని మరణశయ్యపై చేర్చి జగన్ అధికారం నుంచి దిగిపోగా, చంద్రబాబు సీఎం అయ్యాక తిరిగి ఊపిరిపోశారు. ప్రజల ఆకాంక్షలు పాలనలో ప్రతిబింబిస్తున్నాయి. రాష్ట్ర జీడీపీ, తలసరి ఆదాయాన్ని 20 నెలల్లోనే పెంచారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగం.. ఇలా అన్నింటా స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

కిమ్ కుమార్తెకే వారసత్వ పగ్గాలు!

- దక్షిణ కొరియా నిఘా సంస్థ ఎన్ఐఎస్ అంచనా



కుమార్తె కిమ్ జు యేతో ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్

సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన వారసత్వ పగ్గాలను కుమార్తె కిమ్ జు యే(13)కు అప్పగించే అవకాశముందని దక్షిణ కొరియా నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్(ఎన్ఐఎస్) అంచనా వేసింది. ఈ విషయాన్ని చట్టసభ సభ్యులకు తెలిపింది. కిమ్ జు యేను మొదటిసారిగా 2022లో ప్రపంచానికి కిమ్ పరిచయం చేశారు. నాటి నుంచి పలు అధికారిక కార్యక్రమాలకు ఆమె హాజరవుతోంది. ఇవన్నీ ఆమె కిమ్ వారసురాలన్న వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. ఉత్తర కొరియా పగ్గాలు ఆమెకు అప్పగించకపోవచ్చని దక్షిణ కొరియా నిఘా సంస్థ మొదట్లో భావించింది. ఆ దేశ పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ అంచనాకు వచ్చింది. అయితే, మీడియాలో కిమ్ జు యే ప్రముఖంగా కనిపిస్తుండటంతో పునఃసమీక్ష చేసి, ఆమె.. కిమ్ వారసురాలు అయ్యే అవకాశం కీలక దశలో ఉన్నట్లు తాజాగా తెలిపింది. కిమ్ కూడా వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చారు. ఈ నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలను పార్టీ పరంగా ఆమోదముద్ర వేసుకునేందుకు అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇమ్రాన్ ఖాన్ వైద్య పరీక్షలకు మెడికల్ బోర్డు

- పాకిస్థాన్ సుప్రీం కోర్టు ఆదేశం



ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు వైద్య పరీక్షలు నిర్వహించడానికి మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఆయన కంటి చూపు పోయిందని ఇటీవల నివేదిక అందిన నేపథ్యంలో గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. 'తన కంటి చూపు పోతోందని ఇమ్రాన్‌ఖాన్ 6 నెలల నుంచి మొత్తుకుంటున్నా జైలు అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆయన కుడి కన్ను సామర్థ్యం 15 శాతానికి తగ్గిపోయింది' అని నివేదికలో పేర్కొన్నారు. దీంతో స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆయన ఆరోగ్యం ముఖ్యమంటూ ఈ ఆదేశాలిచ్చింది. దీంతోపాటు ఇమ్రాన్‌ఖాన్‌కు ఆయన పిల్లలతో ఫోన్లో మాట్లాడే అవకాశం ఇవ్వాలని పేర్కొంది. అవినీతి ఆరోపణలపై 2023 ఆగస్టు 5న ఇమ్రాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన కట్టుదిట్టమైన భద్రత ఉండే రావల్పిండిలోని అడియాలా జైలులోనే ఉంటున్నారు.

కుటుంబసభ్యులను చంపి విద్యార్థులపై కాల్పులు

- కెనడా ఘటనలో నిందితురాలి వివరాలు వెల్లడి

ఇంటర్నెట్‌డెస్క్: కెనడాలోని బ్రిటిష్ కొలంబియా ప్రాంతంలో ఉన్న సెకండరీ పాఠశాలలో కాల్పులు జరిగిన ఘటనలో నిందితురాలి వివరాలను అధికారులు గురువారం వెల్లడించారు. కాల్పులకు పాల్పడిన మహిళ ఓ ట్రాన్స్‌జెండర్ అని, ఆమెను జెస్సీవాన్ రూట్ సెలార్ (18)గా గుర్తించామన్నారు. ఇదే పాఠశాలకు చెందిన మాజీ విద్యార్థిని అయిన జెస్సీవాన్ ఒంటరిగానే కాల్పులకు పాల్పడిందని కెనడియన్ మౌంటెడ్ పోలీస్ కమాండర్ పేర్కొన్నారు. "కొంత కాలంగా జెస్సీవాన్ అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె దగ్గర తుపాకీ లైసెన్స్ ఉన్నప్పటికీ గత ఏడాదే దాని గడువు ముగిసింది. జెస్సీవాన్ తొలుత తన సొంత కుటుంబసభ్యులపై కాల్పులకు పాల్పడింది. ఈ ఘటనలో ఆమె తల్లి, 11 ఏళ్ల సవతి సోదరుడు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత పాఠశాల వద్దకు వచ్చి కాల్పులు జరిపింది. కాల్పుల వెనుక ఆమె ఉద్దేశం తెలియరాలేదు" అని తెలిపారు. టంబ్లర్ రిడ్జ్ సెకండరీ పాఠశాలలో జరిగిన కాల్పుల్లో నిందితురాలు సహా 10 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

కేరళ పాఠశాలల్లో ఏఐతో ప్రవేశ పరీక్షల శిక్షణ

తిరువనంతపురం: కేరళలోని పాఠశాలల విద్యార్థులకు ఏఐ సాయంతో ప్రవేశ పరీక్షల శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ ఫర్ ఎడ్యుకేషన్ (కైట్) ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా సైన్స్, కామర్స్, హ్యూమనిటీస్ విభాగాల్లో చదువుకుంటున్న దాదాపు 8 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షల్లో శిక్షణ ఇవ్వనుంది. ఈ సమగ్ర ఏఐ లెర్నింగ్ తరగతి గది.. ఒక విద్యార్థి నేర్చుకునే వేగం, ఆయా పరీక్షల పని తీరు ఆధారంగా వ్యక్తిగత ప్రణాళికను రూపొందిస్తుందని, వారి స్థాయికి తగిన ప్రశ్నలనే సంధిస్తుందని కైట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి కె.అన్వర్ సాదత్ పేర్కొన్నారు.

దిల్లీ పేలుడు ఘటనలో జైషే హస్తం ఉంది...

ఐరాస నివేదిక

ఇంటర్నెట్ డెస్క్: గతేడాది దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై ఐక్యరాజ్య సమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుకు పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మొహమ్మద్ ఉగ్ర ముఠాతో సంబంధం ఉందని పేర్కొంది. జైషే సహా పలు ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలంగా ఉన్నట్లు పేర్కొంది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ ఈ ముఠాలు తమ నేర కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ఐరాస భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలను ప్రస్తావించింది. "ఆంక్షలు ఉన్నప్పటికీ జైషే ముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐరాస సభ్య దేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటుచేసుకుంది. ఇది చాలా ఆందోళనకర పరిణామం' ' అని ఐరాస తన నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఘటనను కూడా ప్రస్తావించింది.

దూరదర్శన్ మాజీ న్యూస్ రీడర్ సరళా మహేశ్వరి కన్నుమూత



దిల్లీ: దూరదర్శన్ మాజీ న్యూస్ రీడర్, 1980, 90లలో వార్తలు చూసిన వారికి సుపరిచితురాలైన సరళా మహేశ్వరి (71) గురువారం కన్నుమూశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆమె తుది శ్వాస విడిచినట్లు ఆమె స్నేహితురాలు, సహ యాంకర్ షమ్మీ నారంగ్ ప్రకటించారు. 1976 నుంచి 2005 వరకూ సరళా మహేశ్వరి టీవీ వార్తలకు ప్రయోక్తగా వ్యవహరించారు.

పరీక్షల్లో చిట్టీలు.. డ్రోన్ నిఘాలో బట్టబయలు

బీడ్: కాపీ కొట్టడాన్ని అరికట్టాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులకు చిట్టీలు అందించారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో జరుగుతున్న 12వ తరగతి బోర్డు పరీక్షల్లో మొదటి రోజే సామూహికంగా కాపీ కొట్టడం డ్రోన్ కంటికి చిక్కింది. దీంతో పరీక్షా కేంద్ర ప్రధానాధికారి సహా 17 మంది ఉపాధ్యాయులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన చౌసాలా ప్రాంతంలోని 224 పరీక్షా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది.

విదేశీ మార్కెట్‌లో అమ్మకానికి నరవణె పుస్తకం

పక్కా ప్రణాళికతోనే లీక్ చేశారన్న దిల్లీ పోలీసుల బృందం

ఇంటర్నెట్‌డెస్క్: భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం రక్షణశాఖ అనుమతుల కంటే ముందే గ్లోబల్ మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు దిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇదంతా కుట్రపూరితంగానే జరిగినట్లు పేర్కొన్నాయి. ప్రచురణకు ముందే లీకైన ఈ పుస్తకం. . అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ దేశాల్లోని ఆన్‌లైన్ వేదికల్లో విక్రయానికి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ లీకైన కాపీకి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నంబరు (ఐఎస్‌బీఎన్) ఉండటం చూసి దర్యాప్తు బృందం అవాక్కయింది. 13 అంకెల ఈ నంబరును సాధారణంగా అన్ని అనుమతులు పొంది పబ్లిష్, విక్రయాలకు పంపించే పుస్తకాలకు కేటాయిస్తారు. 'ఇది కేవలం పైరసీ చర్య మాత్రమే కాదు. రక్షణశాఖ అనుమతులు లేకుండా పుస్తకం మార్కెట్‌లోకి వచ్చేలా పక్కా ప్రణాళికతో, సమన్వయంతో ఈ లీక్ ఆపరేషన్ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది' అని దిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. దీనిపై పబ్లిషర్ పెంగ్విన్ ఇండియాను ప్రశ్నించేందుకు దర్యాప్తు బృందం సిద్ధమైంది. విదేశీ మార్కెట్లకు ఈ పుస్తకాన్ని పంపించడానికి సంబంధించి డిజిటల్, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. తాజా పరిణామాలపై రక్షణ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు.

వందేమాతరంపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మతస్వేచ్ఛపై దాడే

- జమీయత్ ఉలామా-ఏ-హింద్ వ్యాఖ్య

దిల్లీ: అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం ఆదేశించడాన్ని ప్రముఖ ముస్లిం సంస్థ జమీయత్ ఉలామా-ఏ-హింద్ ఖండించింది. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలనూ పాడాలంటూ జారీ చేసిన ఉత్తర్వులు ఏకపక్షం, నిర్హేతుకమని గురువారం వ్యాఖ్యానించింది. ఇది రాజ్యాంగం కల్పించిన మతస్వేచ్ఛపై దాడి అని జమీయత్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. "వందేమాతరం పాడకుండా ముస్లింలు ఎవరినీ నిరోధించరు. కానీ గేయంలోని కొన్ని చరణాలు మాతృభూమిని ఓ దేవతలా స్తుతించేలా ఉన్నాయి. ఇది ఇస్లాం లాంటి ఏకధర్మ మతాల ప్రాథమిక విశ్వాసానికి విరుద్ధం. ఆర్టికల్ 25తో పాటు సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పులను ఇది ఉల్లంఘిస్తోంది. కేంద్రం ఆదేశాలు మైనార్టీల రాజ్యాంగ హక్కులను హరించే యత్నం" అని మౌలానా పేర్కొన్నారు. కేంద్ర నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు డిమాండ్ చేసింది. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపింది. మరోవైపు సీపీఎం ఈ వ్యవహారంపై స్పందించింది. 'జాతీయ గీతం కన్నా జాతీయ గేయానికి ప్రాముఖ్యతనిచ్చేలా కేంద్రం ఆదేశాలిచ్చింది. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిబింబించదు. భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దురుద్దేశంతో, అనవసర వివాదాన్ని సృష్టిస్తోంది. ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి' అని సీపీఎం ప్రకటన విడుదల చేసింది.

పొద్దున అరెస్టు.. మధ్యాహ్నానికి విడుదల

లంబోర్గిని కారు ప్రమాద నిందితుడికి గంటల్లోనే బెయిల్



శివమ్‌ను కోర్టుకు తీసుకు వెళ్తున్న పోలీసులు

కాన్పుర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌లో పాదచారులపైకి లంబోర్గిని కారు దూసుకెళ్లిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన నిందితుడు, ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్ర కుమారుడు శివమ్‌ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత నిందితుడిని అరెస్టు చేయగా.. కొన్ని గంటల్లోనే అతడికి బెయిల్ వచ్చింది. నిందితుడిని 14 రోజుల రిమాండ్‌కు అప్పగించాలని పోలీసులు కోరగా.. న్యాయస్థానం అందుకు నిరాకరించింది. రూ.20 వేల పూచీకత్తు మీద బెయిల్ మంజూరు చేసినట్లు శివమ్ తరపు న్యాయవాది తెలిపారు. అయితే, అంతకుముందు ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. ఘటన సమయంలో శివమ్ డ్రైవింగ్ చేయలేదని అతడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ప్రమాద సమయంలో కారును నడిపింది శివమ్ కాదు.. తానే అంటూ మోహన్ అనే వ్యక్తి కాన్పుర్ కోర్టులో లొంగిపోవడానికి వచ్చాడు. అయితే, ప్రత్యక్ష సాక్షులతోపాటు ఆ సమయంలో తీసిన వీడియోలు, సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. శివమ్ డ్రైవింగ్ చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

నేడు ప్రధాని కొత్త కార్యాలయం ప్రారంభం

దిల్లీ: కొత్తగా నిర్మించిన ప్రధాన మంత్రి కార్యాలయం సేవా తీర్థ్‌తోపాటు కర్తవ్య భవన్‌లు 1,2 లను శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. సేవా తీర్థ్‌లో ప్రధాని కార్యాలయంతోపాటు జాతీయ భద్రత మండలి సెక్రటేరియట్, క్యాబినెట్ సెక్రటేరియట్ ఉంటాయి. కర్తవ్య భవన్‌లు 1, 2లలో న్యాయ, రక్షణ, ఆర్థిక, ఆరోగ్య, వ్యవసాయశాఖలతోపాటు పలు శాఖల కార్యాలయాలుంటాయి. ఈ రెండు భవనాలు డిజిటల్లీ ఇంటిగ్రేటెడ్‌గా ఉంటాయి.

- 4 స్టార్ సౌకర్యాలతో నిర్మించిన ఈ కార్యాలయాల్లో పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను వినియోగించారు. నీటి పొదుపునకు ఏర్పాట్లున్నాయి.
- అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. స్మార్ట్ యాక్సెస్ వ్యవస్థను అమర్చారు. భారతీయ పాలనా వ్యవస్థలో ఇదో మైలురాయని, ఆధునిక, సమర్థ వ్యవస్థలతోపాటు పౌర సేవల కేంద్రంగా పని చేసే భవనాల నిర్మాణాలపై ప్రధాని సంకల్పానికి ప్రతీక అని గురువారం ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది.

ఆరావళిని ఎవరినీ తాకనివ్వం

హరియాణా ప్రభుత్వ జంగిల్ సఫారీ ప్రణాళికను తోసిపుచ్చుతూ సుప్రీం వ్యాఖ్య

దిల్లీ: భౌగోళికంగా, పర్యావరణ పరంగా ఎంతో కీలకమైన 'ఆరావళి పర్వత శ్రేణి' నిర్వచనంపై నిపుణులు స్పష్టతనిచ్చే వరకూ ఆ ప్రాంతంపై ఎవరి చేయి పడనివ్వబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జంగిల్ సఫారీ ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) సమర్పణకు అనుమతించాలన్న హరియాణా ప్రభుత్వ అభ్యర్థనను తోసిపుచ్చుతూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆరావళి నిర్వచనం ఖరారైన తర్వాతే జంగిల్ సఫారీ అంశాన్ని విచారణకు చేపడతామని తెలిపింది. సఫారీ ప్రాజెక్టు పరిధిని పది వేల ఎకరాల నుంచి 3,300 ఎకరాలకు కుదించామని, ఆ మేరకు సవరించిన డీపీఆర్‌ను కేంద్ర సాధికార కమిటీ పరిశీలనకు అందజేయడానికి అనుమతించాలని హరియాణా తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఆ వినతిని ధర్మాసనం తోసిపుచ్చింది. హరియాణా, రాజస్థాన్‌లకే ఆరావళి పరిమితమై లేదని, చాలా రాష్ట్రాలకు విస్తరించి ఉందని పేర్కొంది. నిపుణుల కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే జంగిల్ సఫారీ అంశాన్ని పరిశీలిస్తామని పునరుద్ఘాటించింది.

ప్రసన్నకుమార్‌కు కలిశెట్టి అభినందనలు



ఈనాడు, దిల్లీ: అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఏఐ) అధ్యక్షుడిగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ప్రసన్నకుమార్‌ను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలిసి అభినందించారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

మాతృశాఖకు దీవాన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ఏపీ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీఈడబ్ల్యూఐడీసీ) ఎండీ సీఎన్ దీవాన్‌రెడ్డిని మాతృశాఖకు పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఐఆర్‌పీఎస్ అధికారి అయిన ఆయన డిప్యుటేషన్ ఈ నెల 28వ తేదీతో ముగియనుండటంతో రైల్వేశాఖకు వెళ్లనున్నారు. పాఠశాల విద్యాశాఖ తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు ఇచ్చారు.

అధికారుల అండతో వైకాపా నేత భూ కబ్జా


తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: కొందరు రెవెన్యూ అధికారుల సహకారంలో వైకాపా నేత తన భూమిని కబ్జా చేశాడని పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం చిట్టిపోతులవారిపాలేనికి చెందిన రమేశ్‌కుమార్ వాపోయారు. గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో తమ భూమిని ఆయన పేరుపై నమోదు చేయించుకున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నాని, ఏపీ నూర్‌బాషా/దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరా గురువారం వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థలో బోధన సిబ్బంది నియామకానికి కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థలో కీలకమైన బోధన పోస్టుల నియామకానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. బోధన సిబ్బంది ఎంపిక, నియామక విధానం, అర్హతలు, పారితోషికం తదితర అంశాలపై కమిటీ నివేదిక రూపొందించనుంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కమిటీ ఛైర్మన్‌గా, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ డైరెక్టర్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి మరో అధికారి సభ్యులుగా ఉంటారు. బోధన సిబ్బంది పారితోషికాలను కేంద్ర ప్రభుత్వం సమకూర్చనుంది.

జాతీయ స్థాయికి విశాఖ తేజం!!



- ఐసీఏఐ అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్ బాధ్యతల స్వీకరణ
- నాలుగు దశాబ్దాల నుంచి సీఏగా సేవలు

ఈనాడు, విశాఖపట్నం: 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)' అధ్యక్షుడిగా విశాఖకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ డి. ప్రసన్న కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. చిన్న గ్రామంలో జన్మించి, ఐసీఏఐ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన ప్రయాణం ఎందరికో ప్రేరణ. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా నెడంబరం అనే గ్రామంలో 1960 జులై 22న ప్రసన్నకుమార్ జన్మించారు. ఆ ప్రాంతం ఏపీలోని చిత్తూరు జిల్లాకు సరిహద్దులో ఉంది. తండ్రి మోహన రంగయ్య ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేయగా తల్లి కుట్టెమ్మ వ్యవసాయం చూసుకునేవారు. సీఏలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత 1985లో విశాఖలో స్థిరపడ్డారు. ఆయన భార్య నవభారతి చిన్న పరిశ్రమను నడుపుతున్నారు. కుమార్తె లక్ష్మీ సింధు హైదరాబాద్‌లో సీనియర్ డిజైన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు, కోడలు తేజ సాగర్, సుజాత సీఏ ప్రాక్టీస్ చేస్తున్నారు.

విద్యార్థి దశలోనే దక్షిణ భారత సీఏ విద్యార్థి సంఘంలో ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేశారు. నాలుగు దశాబ్దాలుగా ఈ వృత్తిలో ఉన్న ఆయన వివిధ స్థాయిల్లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. 2001-02లో ఐసీఏఐ విశాఖ బ్రాంచ్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో తొలిసారి బ్రాంచ్‌కు దక్షిణ భారత దేశంలో ఉత్తమ అవార్డు, అఖిల భారత స్థాయిలో 'ఎక్సలెంట్ పెర్ఫార్మెన్స్' ధ్రువపత్రం వచ్చాయి. 2013-14లో ఐసీఏఐకు చెందిన దక్షిణ భారత ప్రాంతీయ మండలి (ఎస్ఐఆర్‌సీ)కి ఛైర్మన్‌గా పనిచేసిన తొలి విశాఖ వ్యక్తిగా గుర్తింపు పొందారు. 2019-22, 2022-25, 2025-29 సంవత్సరాలకు సంబంధించి వరుసగా మూడు సార్లు ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. సంస్థకు చెందిన యూడీఐఎన్ అమలు, ఈఆర్పీ వ్యవస్థ అభివృద్ధి, పీర్ రివ్యూ బోర్డు, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ తదితర కమిటీలకు నాయకత్వం వహించారు. కార్పొరేట్ న్యాయం, బ్యాంక్ ఆడిట్ వంటి అంశాలపై వందలాది ఐసీఏఐ సెమినార్లలో ప్రసంగించారు.

3 సార్లు సెంట్రల్ కౌన్సిల్‌కు ఎన్నిక

క్రీడల్లోనూ ప్రవేశం

పాఠశాల దశలో వాలీబాల్, క్రికెట్, సైక్లింగ్, ఈత పోటీల్లో చురుకుగా పాల్గొన్నారు. విశాఖలో 2003లో జరిగిన ఏషియన్ యూత్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్, 2005లో జరిగిన వరల్డ్ అండర్-19 వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లకు చీఫ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఉపాధ్యక్షుడు, కోశాధికారిగా, ఏపీ ట్రయథ్లాన్ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా, విశాఖ ఒలింపిక్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు.

రుణ రికవరీ ఏజెంట్ల కాల్స్ రికార్డ్ చేయాలి

- వారికి శిక్షణ తప్పనిసరి: ఆర్‌బీఐ

దిల్లీ: రుణ రికవరీ వ్యవస్థలను మెరుగు పరచేందుకు ముసాయిదా మార్గదర్శకాలను ఆర్‌బీఐ గురువారం విడుదల చేసింది. తన నియంత్రణలోని బ్యాంకులన్నింటినీ ఏకరీతి, సమగ్ర నిబంధనావళి కిందకు తేవాలని ప్రతిపాదించింది. ఆర్‌బీఐ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగానే రికవరీ ఏజెంట్ల నియామక ప్రక్రియను బ్యాంకులు చేపట్టాలి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ఐఐబీఎఫ్) నిర్వహించే రుణ రికవరీ శిక్షణ, ఏజెంట్లకు తప్పనిసరి. వీరంతాఐఐబీఎఫ్ సర్టిఫికేట్‌ను కలిగి ఉండాలి. రుణ వసూలు కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎంత అవసరమో, అంత వరకే రుణ గ్రహీతల సమాచారాన్ని రికవరీ ఏజెంట్లతో బ్యాంకులు పంచుకోవాలి. రుణ వసూలు పూర్తయ్యేవరకు రుణ గ్రహీతలతో సరైన రీతిలో రికవరీ ఏజెంట్లు నడుచుకోవాలి. రుణ గ్రహీతలతో ఏజెంట్ల కాల్స్ రికార్డ్ చేయాలనీ ప్రతిపాదించింది. ఇందువల్ల రుణస్వీకర్తతో 'గౌరవ, మర్యాదలతో'నే ఏజెంట్లు మాట్లాడుతున్నారా లేదా అన్నది తెలుసుకోవచ్చని పేర్కొంది. రుణ స్వీకర్త కుటుంబంలో విషాదం చోటు చేసుకున్నప్పుడు లేదా శుభకార్యాలు, పండగల సమయంలో రికవరీ ప్రక్రియ చేపట్టరాదనీ పేర్కొంది. ఏజెంట్లు/ఉద్యోగుల వద్ద ఉన్న ఖాతాదార్ల సమాచారం దుర్వినియోగం కాకుండా చూడాలనీ బ్యాంకులను కోరింది. లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వడం, ఫోన్ చేయడం, రుణ గ్రహీత ఇంటికి బ్యాంకు ప్రతినిధి వెళ్లడం లాంటివి.. రుణ వసూలు ప్రక్రియకు ఫాలో-అప్ చర్యలుగా చేపట్టొచ్చు అని పేర్కొంది.

ఎస్‌వీవీయూ ఉద్యోగుల జీతాల కోసం రూ.15కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు రూ.15.60 కోట్ల అదనపు నిధుల మంజూరుకు ప్రభుత్వం గురువారం పాలనాపరమైన అనుమతి ఇచ్చింది. అలాగే ప్యాపిలిలో ఉన్న షెపర్డ్ ట్రైనింగ్ సెంటర్(ఎస్‌టీసీ)లో సివిల్ పనుల పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం రూ.99.98లక్షల మంజూరుకు కూడా అనుమతినిచ్చింది.

స్వర్ణ గ్రామం/వార్డు శాఖగా మార్పు

ఈనాడు-అమరావతి: గ్రామ/వార్డు వాలంటీర్లు, గ్రామ సచివాలయాలు/వార్డు సచివాలయాల శాఖను స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు శాఖగా మార్చారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్థిక దీనావస్థలో గ్రంథాలయాలు

- సిబ్బంది జీతభత్యాలకూ చాలని ప్రభుత్వ కేటాయింపులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విజ్ఞాన భాండాగారాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించకపోవడం, స్థానిక సంస్థలు పన్నుల రూపేణా వసూలు చేసిన మొత్తాన్ని సకాలంలో గ్రంథాలయాలకు జమ చేయకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నాయి. గత ఐదేళ్లుగా పుస్తకాల కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లకు సైతం పన్నుల సొమ్మునే వాడుకోవాలని ప్రభుత్వం చెబుతుండటంతో అభివృద్ధి పనుల మాటే లేదు. గ్రంథాలయాల్లో పనిచేసే సిబ్బంది జీతాలు, పెన్షన్లకు ఏటా రూ.152 కోట్లు అవసరం కాగా, 2025-26 బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ.36.30 కోట్లు మాత్రమే. మరోపక్క, ప్రజల నుంచి స్థానిక సంస్థలు లైబ్రరీ సెస్సు కింద ఎంత వసూలు చేస్తున్నాయి? గ్రంథాలయాలకు ఎంతివ్వాలి? అన్నది జిల్లా గ్రంథాలయ సంస్థల వద్ద లెక్కల్లేవు. పన్నుల డబ్బులు అందకపోవడంతో ఉమ్మడి శ్రీకాకుళం, కృష్ణా, కర్నూలు జిల్లాల్లో సిబ్బందికి జనవరి నెల జీతాలు, పెన్షన్లు చెల్లించలేదు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం కొన్నిచోట్ల దాతల సాయంతో పుస్తకాలు కొంటుంటే.. మరికొన్నిచోట్ల రూ.15 వేలు, రూ.20 వేలు వెచ్చించి ఏవో కొన్ని పుస్తకాలు తెప్పిస్తున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్-1, 2 పరీక్షల్లో ఎంపికైన 23 మంది అభ్యర్థులు తాము గ్రంథాలయాల్లోనే పోటీ పరీక్షలకు సన్నద్ధమైనట్లు చెప్పిన సంగతి ప్రస్తావనార్హం. చిన్నారులు, యువతలో పఠనాసక్తి పెంచేందుకు కృషి చేయాల్సిన ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోవడం లేదు.

నిధులు సరిగ్గా బదలాయిస్తే..

రాష్ట్రవ్యాప్తంగా 120 గ్రంథాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చాలాచోట్ల అవి శిథిలావస్థకు చేరాయి. కొన్నిచోట్ల ఫర్నిచర్ లేక పాఠకులకు నేలపాట్లు తప్పడం లేదు. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ పన్ను సొమ్మును సకాలంలో పారదర్శకంగా బదలాయిస్తే, లైబ్రరీలను తిరిగి నిలబెట్టవచ్చు. కొత్త పాఠకులు, యువత కోసం మోడల్ లైబ్రరీలను అందుబాటులోకి తేవొచ్చు. ప్రజలు పన్ను చెల్లించిన వెంటనే గ్రంథాలయ పన్ను వాటా నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థలకు జమయ్యే విధానం 2016-17 వరకు ఉండేది. తర్వాత స్థానిక సంస్థలు ఈ విధానాన్ని మార్చేశాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పన్ను చెల్లించిన వెంటనే గ్రంథాలయాలకు చేరేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తే, నిధులు పక్కాగా సమకూరే వీలుంది. తద్వారా లైబ్రరీల్లో మౌలిక సదుపాయాల కల్పన, కొత్త పుస్తకాల కొనుగోళ్లకు అవకాశం ఉంటుంది.

అవసరాలకు, కేటాయింపులకు మధ్య ఎంత అంతరమో!

- ఈ ఏడాది బడ్జెట్ అవసరాలు (రూ.152 కోట్లు), కేటాయింపు (36.30 కోట్లు)ల మధ్య వ్యత్యాసం: రూ.115.7 కోట్లు.
- రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు: రూ.30 కోట్లు
- ఏటా స్థానిక సంస్థల నుంచి రావాల్సిన గ్రంథాలయ పన్ను: రూ.350 కోట్లు
- 2025-26 ఇప్పటి వరకు వచ్చింది: రూ.90 కోట్లు
- పాత బకాయిలతో కలిపితే రావాల్సిన మొత్తం: రూ.500 కోట్లకు పైనే
- 2018-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం జీతాల గ్రాంట్ కింద బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించగా, వైకాపా ప్రభుత్వం 2022-23లో దీన్ని రూ.40 కోట్లకు తగ్గించింది. అప్పటి నుంచి కేటాయింపులు పెరగడం లేదు.
- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ జీతభత్యాలు, కార్యాలయ నిర్వహణకు సైతం నిధులు రావడం లేదు.

రాష్ట్రం.. పునరుత్పాదక విద్యుత్ కేంద్రం!

- ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ బలోపేతానికి రూ.3.40 లక్షల కోట్లు
- పునరుత్పాదక ఎగుమతి హబ్ ఏర్పాటుకు రూ.4.20 లక్షల కోట్లు
- ముసాయిదా బ్లూప్రింట్ తయారుచేసిన నీతి ఆయోగ్

ఈనాడు, అమరావతి: దేశంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు నీతి ఆయోగ్ ముసాయిదా బ్లూప్రింట్ తయారుచేసింది. దేశంలో మూడు పునరుత్పాదక విద్యుత్ కేంద్రాల్లో ఒకటిగా ఏపీని అభివృద్ధి చేయడానికి స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు విశ్వసనీయ, చౌక, పరిశుభ్ర ఇంధనాన్ని అందించడమే బ్లూప్రింట్ ప్రధాన లక్ష్యం. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఇటీవల నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం కలిసి విద్యుత్ సరఫరా బ్లూప్రింట్‌ను అందించారు. ఈ ఏడాది మార్చిలో బ్లూప్రింట్‌ను పూర్తిస్థాయిలో రూపొందించి.. కేంద్ర స్టీరింగ్ కమిటీకి నీతి ఆయోగ్ అందించనుంది.

అదనపు పునరుత్పాదక ప్రాజెక్టుల ఏర్పాటు

'రాష్ట్రంలో ప్రస్తుతం పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల నుంచి 47% విద్యుత్ అందుతోంది. 2035 నాటికి రాష్ట్ర అవసరాల కోసం 35 గిగావాట్ సోలార్, 12 గిగావాట్ పవన, 60 గిగావాట్ అవర్ ఎనర్జీ స్టోరేజ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలన్నది లక్ష్యం. దేశవ్యాప్త విద్యుత్ ఎగుమతుల కోసం అదనంగా 30 గిగావాట్ సోలార్, 25-30 గిగావాట్‌ల పవన, 10-12 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు ఏర్పాటుచేయాలి' అని బ్లూప్రింట్‌లో ప్రతిపాదించింది.

యూనిట్ విద్యుత్ రూ.4కు తగ్గించే లక్ష్యం

'2035 నాటికి యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయం రూ.3.90-4.00కు తగ్గే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరా ఖర్చు యూనిట్‌కు రూ.6లోపు ఉండేలా చూడాలన్నది లక్ష్యం. దీనివల్ల గృహవిద్యుత్ వినియోగదారులు, రైతులతో పాటు పరిశ్రమలూ గణనీయంగా లబ్ధి పొందుతాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ కోసం రూ.3.40 లక్షల కోట్ల పెట్టుబడి అవసరం ఉంటే.. దేశవ్యాప్తంగా పునరుత్పాదక విద్యుత్ ఎగుమతి హబ్ నిర్మాణానికి రూ.4.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇందులో 90% ప్రైవేటు రంగం నుంచే రావచ్చు. వాటిద్వారా రాష్ట్రంలో 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని అంచనా' అని నీతి ఆయోగ్ పేర్కొంది.

నెట్‌వర్క్ బలోపేతం

'మౌలిక వసతుల అభివృద్ధి, సంస్కరణల్లో భాగంగా పంపిణీ రంగంలో 2035 నాటికి రూ.70వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. గ్రీన్ ఎనర్జీ కారిడార్, జీఐఎస్ సబ్‌స్టేషన్లు, హెచ్‌వీడీఎస్ కారిడార్‌ల వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించి ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసే అవకాశం ఉంది. విద్యుత్ పంపిణీ రంగంలో రూ.40వేల కోట్ల పెట్టుబడితో నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, నష్టాలను తగ్గించడం, విద్యుత్ పంపిణీ నాణ్యత పెంచాలన్నది లక్ష్యం. సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా వ్యవసాయ రంగానికి పగటివేళ విద్యుత్ అందించాలి. ప్రభుత్వంపై సబ్సిడీ భారాన్ని తగ్గించడమే ముఖ్య ఉద్దేశం' అని నీతి ఆయోగ్ ముసాయిదాలో పేర్కొంది.



బలా.. బాలకా

భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎం.సంధ్యారాణి అనే గర్భిణి గురువారం 5.2 కిలోల మగ శిశువుకు జన్మనిచ్చారు. తెలంగాణలోని ములుగు జిల్లా నూగూరుకు చెందిన ఆమె రెండో కాన్పునకు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ప్రత్యేక పర్యవేక్షణలో వైద్యులు కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

– న్యూస్‌టుడే, భద్రాచలం పట్టణం